

www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI
పేజీలు: 14 + 28 పేజీల ఆదివారం అనుబంధం
సంపుటి (Volume) : 65
సంచిక (Issue) : 96
ఆదివారం | 21-7-2024 | వెల (Price) : Rs. 8.00 | హైదరాబాద్ సిటీ *
శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, గ్రీష్మరుతువు, ఆషాఢమాసం, శుక్లపక్షం; తిథి: పౌర్ణమి మ. 3.47 తదుపరి పాడ్యమి; నక్షత్రం: ఉత్తరాషాఢ రా. 12.14 తదుపరి శ్రవణం; వర్జ్యం: ఉ.9.17-10.47, తె.3.55-5.23; దుర్ముహూర్తం: సా.5.05-5.56; అమృతఘడియలు: సా.6.15-7.45; రాహుకాలం: సా.4.30-6.00; సూర్యోదయం: 5.54; సూర్యాస్తమయం: 6.48
Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

హైస్కూల్ వేళల్లో మార్పు
ఉదయం 9 నుంచి సాయంత్రం 4:15 దాకా
ఇక ప్రాథమిక పాఠశాలల మాదిరిగానే..
జంట నగరాల పరిధిలో పాత వేళలే
ఉత్తర్వులు జారీ చేసిన విద్యాశాఖ 13


ఆదిలాబాద్ జిల్లాలో వ్యవసాయ అధికారికి రైతుల ఫిర్యాదు

రుణమాఫీ ఫిర్యాదుల బాధ్యత
ఏఈవోలకు!
వ్యవసాయ కమిషనరేట్ ఆదేశాలు
ఆన్‌లైన్ సదుపాయం లేకపోవడంతో రిజిస్టర్లలో ఫిర్యాదుల నమోదు
ఆగస్టు 15 తర్వాతే సమస్యల పరిష్కారం
ఇంకా మాఫీ కాలే.. పైసలు తక్కువొచ్చాయ్!
ఆదిలాబాద్ జిల్లాలో రైతుల ఫిర్యాదులు

హైదరాబాద్, తలమడుగు, జూలై 20 (ఆంధ్రజ్యోతి): రుణమాఫీ పథకంలో తొలి జాబితాలో పేర్లులేని రైతులు ఇచ్చే ఫిర్యాదులు స్వీకరించే బాధ్యతలను వ్యవసాయ విస్తరణ అధికారుల (ఏఈవో)కు అప్పగించారు. ఫిర్యాదుల స్వీకరణకు సంబంధించి ఆన్‌లైన్ పోర్టల్‌లో ఎలాంటి కాలమ్ ఏర్పాటుచేయకపోవటంతో ఏఈవోలు రిజిస్టర్లలో నమోదు చేస్తున్నారు. రేషన్ కార్డు, ఆధార్ కార్డు, పట్టాదారు పాస్‌పుస్తకం, బ్యాంకు ఖాతా వివరాలన్నీ సక్రమంగా ఉన్నప్పటికీ రుణమాఫీ కాకపోతే స్థానికంగా ఉండే

మిగతా 3వ పేజీలో...

మాఫీపై ఆందోళనొద్దు!
ప్రతి రైతు కుటుంబాన్ని రుణ విముక్తి చేస్తాం
కొన్ని బ్యాంకులు 2018కు ముందున్న జాబితా ఇవ్వడంతోనే తేడాలు 3
రుణమాఫీ తర్వాతే వరంగల్‌లో సభ: తుమ్మల


శనివారం ప్రజాభవన్‌లో యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్-2023 విజేతలతో సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు జూపల్లి, పొంగులేటి, కోమటిరెడ్డి, తుమ్మల, సీతక్క, సీఎస్ శాంతికుమారి తదితరులు

జూన్‌లో జాబ్ మేళా
ఏటా ఆ నెలలో నోటిఫికేషన్లు.. డిసెంబరులోపు ఉద్యోగాల భర్తీ
జాబ్ క్యాలెండర్‌పై అసెంబ్లీ సమావేశాల్లో నిర్ణయం
లోపాల్లేకుండా పరీక్షలు, నియామకాలు చేపడతాం
రాష్ట్రం నుంచి ఎక్కువ మంది సివిల్స్‌కు ఎంపిక కావాలి
అభ్యర్థులకు ప్రభుత్వం అండగా నిలుస్తుంది: రేవంత్
'రాజీవ్‌గాంధీ సివిల్స్ అభయహస్తం' ప్రారంభించిన సీఎం
సివిల్స్ మెయిన్స్ రాసే అభ్యర్థులకు రూ.లక్ష సహాయం
నేడు ఢిల్లీకి రేవంత్.. వరంగల్ సభకు రాహుల్‌కు ఆహ్వానం


హైదరాబాద్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రతి ఏటా జూన్ నెలలో ఉద్యోగాలకు నోటిఫికేషన్లు జారీ చేసి, డిసెంబరులోపు నియామక ప్రక్రియలు పూర్తి చేస్తామని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి ప్రకటించారు. ఈ మేరకు జాబ్ క్యాలెండర్‌పై రానున్న అసెంబ్లీ సమావేశాల్లో చర్చించి నిర్ణయం తీసుకుంటామన్నారు. కష్టపడితే తెలంగాణ ప్రభుత్వం నిరుద్యోగుల వెన్నుతట్టి

మిగతా 13వ పేజీలో...

మీ కష్టానికి గుర్తింపు
హైదరాబాద్ అభివృద్ధిలో భాగస్వాములవ్వండి
కమ్మవారికి అవకాశాలిచ్చి, నైపుణ్యాలను ప్రోత్సహిస్తాం
మన కులాన్ని ప్రేమిద్దాం.. ఇతరులను గౌరవిద్దాం
ఢిల్లీలో తెలుగు వారికి కీలక నాయకత్వం లేదు
కమ్మ గ్లోబల్ ఫెడరేషన్ సదస్సులో ముఖ్యమంత్రి రేవంత్ 13

ఉద్యోగుల బదిలీలకు మరో
10 రోజుల గడువు
31 వరకు చాన్స్ 14

మూసీ అభివృద్ధి లక్షన్నర కోట్లతో..
ప్రపంచ స్థాయి పర్యాటక ప్రాంతంగా చేస్తాం.. హైదరాబాద్‌ను విశ్వనగరంగా తీర్చిదిద్దుతాం
టూరిజం, వ్యాపారం, ఐటీకి అనువుగా ప్రణాళికలు.. ప్రజా ప్రభుత్వం గుర్తుకొచ్చేలా చర్యలు
ఎక్కడి నుంచి ఎవరు వచ్చినా ఆదరిస్తాం.. గోపనపల్లి ఫ్లైఓవర్‌ను ప్రారంభించిన సీఎం 13



నీట్ ఫలితాల్లో.. రాజ్‌కోట్ రహస్యం!
ఈ ఒక్క నగరంలో 85% మందికి అర్హత
ఒకే కేంద్రంలో 789 మందికి 550 పైనే
రాజస్థాన్‌లోనూ అనూహ్య ఫలితాలు
సీకర్‌లో 2,037 మందికి 650కిపైనే, 15% మందికి ప్రభుత్వ సీట్లు!
అప్పట్లో హరియాణాలో ఏడుగురికి 720.. ప్రస్తుతం అత్యధిక స్కోరు 682
కేంద్రాల వారీగా నీట్ ఫలితాల వెల్లడి
ప్రిలిమ్స్, ఫైనల్స్.. నీట్‌లో మార్పులు?

న్యూఢిల్లీ, జూలై 20: గుజరాత్‌లోని రాజ్‌కోట్..! ఆ నగరంలోని వేర్వేరు పరీక్ష కేంద్రాల్లో 22,701 మంది నీట్-యూజీ పరీక్ష రాశారు. వారిలో కనీవినీ ఎరగని రీతిలో.. రికార్డు స్థాయిలో 85% మంది ఎంబీబీఎస్‌లో చేరేందుకు అర్హత మార్కులను సాధించారు..! ఈ నగరంలోని ఆర్కే యూనివర్సిటీ అనుబంధ కళాశాల– స్కూల్ ఆఫ్ ఇంజనీరింగ్ కేంద్రంలో పరీక్ష రాసినవారి ఫలితాలను పరిశీలిస్తే.. 700-720 మధ్య స్కోరు వచ్చిన వారు 12 మంది ఉన్నారు. 115 మందికి 650-699 మధ్య, 259 మందికి 600-649 మధ్య, 403 మందికి 550-599 మధ్య స్కోర్లు వచ్చాయి..! రాజ్‌కోట్‌లోని మిగతా కేంద్రాల్లోనూ ఇలాంటి ఫలితాలే

మిగతా 2వ పేజీలో...

యూపీఎస్సీ చైర్మన్ రాజీనామా 2
వ్యక్తిగత కారణాలతో వైదొలగిన మనోజ్
మరో ఐదేళ్లు పదవీకాలం ఉండగానే..

రోజంతా వాన
జల్లులతో తడిసిముద్దయిన రాష్ట్రం
స్తంభించిన జన జీవనం
చెరువులు, కుంటలకు జల కళ
జూరాల 17 గేట్లు ఎత్తివేత
శ్రీశైలానికి 48 వేల క్యూసెక్కులు
నారాయణపూర్, తుంగభద్రకు లక్ష క్యూసెక్కుల ఇన్‌ఫ్లో
మేడిగడ్డకు కొనసాగుతున్న వరద



ఆసిఫాబాద్ జిల్లా దహెగాంలో లో లెవల్ వంతెన పై నుంచి ఉధృతంగా ప్రవహిస్తున్న వాగు

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

ఎడతెరిపిలేని వాన..! శుక్రవారం రాత్రి మొదలై శనివారం అంతా కురుస్తూనే ఉంది..! కొన్నిచోట్ల జల్లులుగా.. ఇంకొన్నిచోట్ల భారీ వర్షంగా..! దీంతో రాష్ట్రం తడిసి ముద్దయింది..! జన జీవనం స్తంభించింది..! ఎటుచూసినా చెరువులు, వాగులు జల కళ సంతరించుకున్నాయి. చాలాచోట్ల భూగర్భ జల మట్టం పెరిగింది. వర్షాలు మెట్ట పంటలకు ఊపిరి పోశాయి. వరి నాట్లు ఊపందుకోనుండగా పత్తి సాగుకు మేలు చేస్తుందని రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాను వర్షం వీడడం లేదు. చర్ల మండలంలో అత్యధికంగా 15 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. దుమ్ముగూడెంలో 9, మణుగూరు, జూలూరుపాడు, వేంసూరు, కామేపల్లిలో 7, సింగరేణి, పినపాకలో 6 సెంటీమీటర్లకు పైగా వర్షం కురిసింది. ఖమ్మం జిల్లాలో సగటున 4.9, భద్రాద్రి కొత్తగూడెంలో 4.5 సెంటీమీటర్ల వాన పడింది. ఖమ్మం జిల్లాలో

మిగతా 12వ పేజీలో...

'పెద్ద వాగు' వైఫల్యంపై 12
నివేదికివ్వండి
సర్కారుకు జాతీయ డ్యామ్ సేఫ్టీ అథారిటీ ఆదేశం
నలుగురు అధికారులకు మెమోలు ఇచ్చిన సీఈ
15 ఏళ్ల క్రితమే ప్రాజెక్టు సామర్థ్యంపై అనుమానాలు
రాష్ట్ర విభజన తర్వాత నిర్వహణపై తీవ్ర నిర్లక్ష్యం

రూ. 7 కోట్ల హెరాయిన్ పట్టివేత
రాజస్థాన్ నుంచి బస్సుల్లో హైదరాబాద్‌కు
జైలులో ఉంటూనే.. కింగ్‌పిన్ దందా
అంతర్రాష్ట్ర ముఠా ఆటకట్టు 14

'రైతుబీమా'లోకి కొత్త రైతులు
వివరాల నమోదుకు ఆగస్టు 5 గడువు 3
సంతకం చేసి, నామినీ పేరుతో ఏఈవోకివ్వాలి
ఆగస్టు పదో తేదీనాటికి ఎల్‌ఐసీకి జాబితా

విద్యా కమిషన్ చైర్మన్‌గా ఆకునూరి మురళి? 13
మాజీ ఐఏఎస్ పేరును పరిశీలిస్తున్న ప్రభుత్వం

బడ్జెట్ 2.90 లక్షల కోట్లు?
25న క్యాబినెట్ భేటీ.. బడ్జెట్‌కు ఆమోదం.. అదే రోజు అసెంబ్లీలో
22న ఆర్థిక శాఖ అధికారులతో సీఎం రేవంత్‌రెడ్డి భేటీ
శాఖలు, పథకాల వారీగా బడ్జెట్ పద్దుకు తుది మెరుగులు
వ్యవసాయం, నీటి పారుదల శాఖలకే ఎక్కువ కేటాయింపులు



హైదరాబాద్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం 2024-25 ఆర్థిక సంవత్సరానికి పూర్తి స్థాయి బడ్జెట్‌ను ప్రవేశపెట్టనుంది. రుణ మాఫీ, ఆరు గ్యారెంటీలు సహా అన్ని పథకాలను పరిగణనలోకి తీసుకుని రూ.2.90లక్షల కోట్లతో బడ్జెట్‌ను రూపొందించినట్లు విశ్వసనీయ వర్గాల ద్వారా తెలిసింది. ఏప్రిల్ నుంచి జూలై వరకు నాలుగు నెలల

మిగతా 14వ పేజీలో...

నిరుద్యోగులకు కాంగ్రెస్ దగా
- రెండు లక్షల ప్రభుత్వ కొలువులు, జాబ్ క్యాలెండర్ ఏమయ్యాయి? 12
- గ్యారెంటీలు ప్రజలకు గుదిబండలు
- బీజేవైఎం నిరుద్యోగ ధర్నాలో కిషన్‌రెడ్డి



హరియాణాకు కేజ్రీవాల్ ఐదు గ్యారెంటీలు

- ఉచిత విద్య, వైద్యం, విద్యుత్తు.. ప్రతి మహిళకు రూ.1000
- ప్రకటించిన కేజ్రీవాల్ సతీమణి



పంచకుల(హరియాణా), జూలై 20 : ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ సతీమణి సునీత కేజ్రీవాల్ హరియాణాలో రానున్న అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని కేజ్రీవాల్ ఐదు గ్యారెంటీలను శనివారం ప్రకటించారు. బాలబాలికలకు ఉచిత విద్య, అందరికీ ఉచిత వైద్యం, 24 గంటలు ఉచిత విద్యుత్తు, రాష్ట్రంలో 18 ఏళ్లు నిండిన ప్రతి మహిళకు నెలకు రూ.1000, యువత ప్రతి ఒక్కరికి ఉపాధి కల్పన ఈ ఐదు గ్యారెంటీల్లో ఉన్నాయి. హరియాణా అసెంబ్లీకి ఈ ఏడాది అక్టోబరులో ఎన్నికలు జరగనున్నాయి. పంచకులలో ఈ ఐదు గ్యారెంటీల ప్రకటన కార్యక్రమానికి కేజ్రీవాల్ సతీమణితోపాటు పంజాబ్ ముఖ్యమంత్రి భగ్వంత్ మాన్, ఆప్ సీనియర్ నేతలు సంజయ్ సింగ్, సందీప్ పాఠక్ హాజరయ్యారు. ఈ సందర్భంగా సునీత మాట్లాడుతూ... కేజ్రీవాల్ చేపడుతోన్న కార్యక్రమాలను చూసి ఓర్వలేకే ఆయన్ను ప్రధాని మోదీ జైలు పాలు చేశారని ఆరోపించారు. కేజ్రీవాల్ హరియాణా బిడ్డ అని, బీజేపీకి ఒక్క సీటు కూడా దక్కకూడదని ప్రజలను కోరారు. ఇది కేజ్రీవాల్ సమస్య కాదని... హరియాణా గౌరవానికి సంబంధించిన విషయమన్నారు. తాము గెలిస్తే గృహాలకు ఉచితంగా విద్యుత్తు ఇస్తామని, 24 గంటలూ విద్యుత్తు సరఫరా ఉంటుందని చెప్పారు.

పూరీ రత్నభాండాగారంలో పురాతన ఆయుధాలు

భువనేశ్వర్, జూలై 20: పూరీ జగన్నాథ ఆలయంలోని రత్నభాండాగారం నుంచి విలువైన వస్తువుల తరలింపు సందర్భంగా గత యుద్ధాల్లో ఉపయోగించిన కత్తులు, ఈటెలు, బరిశెలు వంటి పురాతన ఆయుధాలు బయటపడ్డాయి. లోపలి గదిలోని చెక్కపెట్టెల వద్ద ఈ ఆయుధాలు కనిపించాయని, అవన్నీ చాలా బరువుగా ఉండి నలుపు రంగులోకి మారాయని ట్రెజరీలోకి ప్రవేశించిన కమిటీ సభ్యుడు ఒకరు తెలిపారు. యుద్ధ సామగ్రిని తాత్కాలిక స్ట్రాంగ్‌రూంలో భద్రపరిచామని కమిటీ చైర్మన్ జస్టిస్ బిశ్వనాథ్ రథ్ చెప్పారు. ఆలయ సేవకుడు శ్యామ మహాపాత్ర మాట్లాడుతూ, జగన్నాథ ఆలయంపై దుండగులు 18సార్లు దాడులు జరిపి, ఇక్కడి సంపదను దోచుకున్నారని చెప్పారు. ప్రస్తుతం లభించిన పురాతాన ఆయుధాలను అప్పటి రాజులు రత్నభాండాగారంలో దాచి ఉండవచ్చని అభిప్రాయం వ్యక్తం చేశారు.

దావూద్ మాత్రమే ఉగ్రవాది.. అతని గ్యాంగ్ కాదు

ముంబయి, జూలై 20: పరారీలో ఉన్న ఆర్థిక నేరగాడు, గ్యాంగ్‌స్టర్ దావూద్ ఇబ్రహీంపై వ్యక్తిగత హోదాలో మాత్రమే ఉగ్రవాది అన్న ముద్ర ఉందని బాంబే హైకోర్టు స్పష్టం చేసింది. అందువల్ల అతని గ్యాంగ్‌లో ఉన్న అనుచరులను ఉపా చట్టం కింద అరెస్టు చేయలేరని తెలిపింది. ఉగ్రవాద నిరోధక చట్టం కింద అరెస్టయిన అతని అనుచరులు ఫయాజ్ భివాండీవాలా, పర్వేజ్ వైద్ అనే నిందితులకు బెయిల్ మంజూరు చేస్తూ జస్టిస్ భారతి డాంగ్రే, జస్టిస్ మంజూషా దేశ్‌పాండేల ధర్మాసనం ఈ వ్యాఖ్యలు చేసింది. గంజాయి ఉందన్న కారణంతో వారిద్దరిపై పోలీసులు ఉపా, ఇతర ఉగ్రవాద నిరోధక చట్టాల కింద కేసు నమోదు చేశారు. ఉగ్రవాద ముఠాలో ఉంటూ బలవంతంగా సొమ్ము గుంజడం వంటి అరాచకాలకు పాల్పడుతున్నట్టు ఆరోపించారు. వాదనలు విన్న ధర్మాసనం డి-గ్యాంగ్‌ను ఉపా చట్టంలోని సెక్షన్ 20 కింద ఉగ్రవాద ముఠాగా ప్రకటించలేదని తెలిపింది. ఈ కారణాలతో బెయిల్ ఇస్తున్నట్టు తెలిపింది.

వీధి వ్యాపారుల రిజిస్ట్రేషన్ ఫీజు రద్దు చేయండి: నడ్డా

న్యూఢిల్లీ, జూలై 20: వీధుల్లో ఆహార పదార్థాలు విక్రయించే చిరు వ్యాపారులకు కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జె.పి.నడ్డా శుభవార్త చెప్పారు. వారు ప్రతి ఏటా ఆహార సురక్ష, ప్రమాణాల ప్రాధికార సంస్థ (ఎఫ్ఎస్ఎస్ఏఐ)కి చెల్లించాల్సిన నూరు రూపాయల రిజిస్ట్రేషన్ ఫీజును రద్దు చేయాలని ఆ సంస్థకు సూచించారు. శనివారం ఇక్కడి విజ్ఞాన్ భవన్‌లో జరిగిన 1,350 మంది వీధి ఆహార వ్యాపారుల సమావేశంలో ఈ విషయాన్ని ప్రకటించారు. ఏటా రూ.12 లక్షలలోపు టర్నోవర్ ఉన్నవారు వంద రూపాయల రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించాల్సి ఉండగా దాన్ని మాఫీ చేయాలని సూచించారు. కాగా, దేశ వ్యాప్యంగా స్ట్రీట్ ఫుడ్ వెండర్స్ హబ్‌లను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని నడ్డా తెలిపారు. యువత పీఎం స్ట్రీట్ వెండర్స్ ఆత్మనిర్భర్ నిధి (పీఎం స్వానిధి) పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఏమైంది నీకు.. మతి చెడిందా?

- కర్ణాటక ఎమ్మెల్యే ప్రదీప్‌పై స్పీకర్ తీవ్ర ఆగ్రహం

బెంగళూరు, జూలై 20(ఆంధ్రజ్యోతి): కర్ణాటకలో వాల్మీకి అభివృద్ధి కార్పొరేషన్‌లో అవినీతి ఆరోపణలపై శాసనసభలో శనివారం చర్చ జరిగింది. ఈ సందర్భంగా కాంగ్రెస్ ఎమ్మెల్యే ప్రదీప్ ఈశ్వర్.. బీజేపీ ప్రభుత్వంలో జరిగిన పలు అవినీతి అంశాలను ప్రస్తావించారు. ఒకానొక దశలో ఆవేశానికి లోనై ఏం మాట్లాడుతున్నారో అర్థం కాకుండా కేకలు వేస్తూ ఊగిపోయారు. స్పీకర్ యూటీ ఖాదర్ నాలుగైదుసార్లు జోక్యం చేసుకుని అలా మాట్లాడరాదని హితవు పలికారు. అయినా ప్రదీప్ వినకపోవడంతో తీవ్రంగా మందలించారు. 'నీకు ఏమైంది, మతి చెడిందా..? ఎవరైనా అతని చేతిలో ఇనుప ముక్క పెట్టండి' (మూర్ఛ వచ్చిన వారికి ఇచ్చిన తరహాలో) అంటూ ఆగ్రహం వ్యక్తంచేశారు. అయినా పట్టించుకోకుని ప్రదీప్ ఈశ్వర్ అలా మాట్లాడుతూనే ఉన్నారు. చీఫ్ విప్ అక్కడికి వెళ్లి నమస్కరించి మాట్లాడవద్దని సూచించారు. ఆ తర్వాత ఐటీబీటీల శాఖ మంత్రి ప్రియాంక ఖర్గే జోక్యం చేసుకొని ప్రదీప్‌ను శాంతపర్చారు.

రేప్- హత్య కేసులో మరణశిక్షను నిలిపేసిన సుప్రీం

న్యూఢిల్లీ, జూలై 20: యువతిపై అత్యాచారానికి పాల్పడి, ఆపై హత్య చేసిన కేసులో కింది కోర్టులు నిందితునికి విధించిన మరణ శిక్ష అమలును సుప్రీంకోర్టు నిలుపుదల చేసింది. నిందితుడు ప్రస్తుతం దాఖలు చేసిన తుది అప్పీలుపై నిర్ణయం వెలువడే వరకు స్టే ఇస్తున్నట్టు ధర్మాసనం తెలిపింది. 2016లో ఓ న్యాయవిద్యార్థి (30 ఏళ్ల)నిపై అత్యాచారం జరిపి, ఆపై హత్య చేసిన కేసులో అస్సాంకు చెందిన వలస కూలీ మహమ్మద్ అమీర్ ఉల్ ఇస్లాంకు ట్రయల్ కోర్టు మరణశిక్ష విధించింది. హైకోర్టు కూడా దీన్ని సమర్థించింది. దీనిపై నిందితుడు సుప్రీంకోర్టులో అప్పీలు చేశాడు. పరిశీలించిన త్రిసభ్య ధర్మాసనం...జైలులో అతని ప్రవర్తన, మానసిక పరిస్థితి ఎలా ఉందో తేల్చడానికి నిపుణుల బృందాన్ని ఏర్పాటు చేయాలని త్రిస్సూర్ ప్రభుత్వ వైద్య కళాశాలను ఆదేశించింది. తదుపరి విచారణను 12 వారాలకు వాయిదా వేసింది.

నీట్ ఫలితాల్లో.. రాజ్‌కోట్ రహస్యం!

(మొదటి పేజీ తరువాయి)

కనిపించాయి. సుప్రీంకోర్టు ఆదేశాలతో కేంద్రాలు, నగరాల వారీగా జాతీయ పరీక్షల నిర్వహణ సంస్థ(ఎన్‌టీఏ) శనివారం నీట్ ఫలితాలను విడుదల చేసింది. ఈ ఫలితాల్లో.. గుజరాత్‌లోని రాజ్‌కోట్, రాజస్థాన్‌లోని సీకర్ నగరాల్లోని కేంద్రాల్లో దిమ్మదిరిగే ఫలితాలు కనిపించాయి. సీకర్ నగరంలోని విద్యాభారతి సీకర్ కేంద్రంలో 8 మంది 700-720 మధ్య, 69 మంది 650-699 మధ్య, 155 మంది 600-649 మధ్య, 241 మంది 500-599 మధ్య మార్కులను సాధించారు. సీకర్‌లోని మిగతా కేంద్రాల్లోనూ దాదాపు ఇలాంటి ఫలితాలే కనిపించాయి. ఎంతలా అంటే.. ఈ నగరంలోని కేంద్రాల్లో పరీక్షలు రాసిన వారిలో 650-720 మధ్య స్కోరును ఏకంగా 2,037 మంది సాధించారు. ఇక్కడ ఫలితాలు జాతీయ సగటు కంటే చాలా ఎక్కువగా ఉన్నాయి. నీట్‌లో ప్రభుత్వ వైద్య కళాశాలల్లో సీట్లు సాధించాలంటే.. 720 స్కోరుకు గాను.. 650కి పైనే సాధించాల్సి ఉంటుంది. ఈ కోవలో దేశవ్యాప్తంగా టాప్ 30 వేల ర్యాంకులు ఉంటాయి. ఒక్క సీకర్ నగరంలోనే 15 శాతం(2,037 మంది) అభ్యర్థులు ప్రభుత్వ వైద్య కళాశాలల్లో సీటుకు అర్హత సాధించడం గమనార్హం..! ప్రభుత్వ వైద్య కళాశాలల్లో ఎంబీబీఎస్‌కు అర్హులయ్యే మిగతా 85% మంది దేశవ్యాప్తంగా అన్ని కేంద్రాలకు చెందినవారని భావిస్తే.. తప్పులో కాలేసినట్లే..! హరియాణా, రాజస్థాన్, గుజరాత్ రాష్ట్రాల్లోని విద్యార్థులు ఆ స్థాయిలో మార్కులను సాధించారని తాజా ఫలితాలు చెబుతున్నాయి. గతంలో విడుదలైన ఫలితాల్లో హరియాణాలోని హర్‌దయాళ్ పబ్లిక్ స్కూల్‌లో ఏర్పాటు చేసిన కేంద్రంలో ఏడుగురికి ఏకంగా 100 పర్సంటైల్ వచ్చిన విషయం తెలిసిందే..! గత నెల నిర్వహించిన రీటెస్ట్ తర్వాత.. తాజా ఫలితాల్లో మాత్రం ఆ కేంద్రంలో అత్యధిక స్కోరు 682 మాత్రమే..! అది కూడా కేవలం ఒక్క విద్యార్థి ఈ ఘనతను సాధించారు. మరో 13 మంది 600కుపైగా మార్కులు తెచ్చుకున్నారు. హర్‌దయాళ్ పబ్లిక్ స్కూల్‌లో గతంలో నీట్ పరీక్ష రాసిన ఏడుగురు విద్యార్థులు 720 స్కోరు సాధించటం, మరో ఇద్దరికి 718, 719 స్కోర్లు రావడం(నీట్ మూల్యాంకనం ప్రకారం ఈ స్కోర్లు సాధ్యం కానేకాదు) పలు అనుమానాలు రేకెత్తించిన విషయం తెలిసిందే. పలు రాష్ట్రాల్లో పేపర్‌లీక్ అయిందని వార్తలు రావటం, కొందరు విద్యార్థులకు వివాదాస్పద రీతిలో అదనపు



మార్కులు కలపటం వంటి చర్యల నేపథ్యంలో.. నీట్ అంశం మీద సుప్రీంకోర్టు విచారణ చేపట్టింది. 1,563 విద్యార్థులకు మళ్లీ పరీక్ష నిర్వహించాలని ఆదేశించింది. ఈ మేరకు గత నెల 24న నిర్వహించిన నీట్ రీటెస్ట్‌లో 1,563 మందికిగాను దాదాపు 800 మంది మాత్రమే హాజరయ్యారు. సుప్రీంకోర్టు తదుపరి విచారణ సోమవారం జరగనుంది. కాగా.. మే 5న నీట్ పరీక్షకు 24 లక్షల మంది విద్యార్థులు హాజరయ్యారు.

ఇకపై రెండంచెలుగా నీట్?

ఎంబీబీఎస్, బీడీఎస్, ఆయుష్ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే నీట్ పలు వివాదాలకు కేంద్రంగా మారుతుండటంతో.. ఆ పరీక్ష నిర్వహణలో కీలకమార్పులు చేపట్టాలని కేంద్రప్రభుత్వం భావిస్తున్నట్లు సమాచారం. ఇక మీదట ప్రిలిమ్స్, ఫైనల్స్ పద్ధతిలో రెండంచెలుగా ఈ పరీక్షను నిర్వహించటం, రెండింటినీ ఒకే సంస్థకు అప్పగించకుండా.. వేర్వేరు సంస్థలకు బాధ్యతలు ఇవ్వటం వంటి ఆలోచనలు జరుగుతున్నట్లుగా తెలుస్తోంది. దీనిపై కేంద్రానికి చెందిన ఓ సీనియర్ అధికారి మాట్లాడుతూ, "సీట్ల సంఖ్య, ప్రిలిమినరీ స్కోరు ఆధారంగా కటాఫ్‌ను నిర్ణయించటం, సీట్ల సంఖ్యకు నాలుగైదు రెట్ల సంఖ్యలో ఫైనల్‌కు అభ్యర్థులను ఎంపిక చేయటం వంటి అంశాలపై కసరత్తు జరుగుతోంది. ప్రిలిమ్స్‌ను రాతపరీక్షలాగే నిర్వహించినా, ఫైనల్స్‌ను కంప్యూటర్ ఆధారితంగా (సీబీటీ) జరపటం వంటి ప్రత్యామ్నాయాలూ చర్చకు వస్తున్నాయి. ప్రిలిమ్స్‌ను ఎన్టీఏకు అప్పగిస్తే ఫైనల్స్‌ను సీబీఎస్ఈ, ఎయిమ్స్ వంటి ఇతర సంస్థలకు అప్పగించటాన్నీ పరిశీలిస్తున్నారు" అని వెల్లడించారు. దీనివల్ల అక్రమాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవటానికి అవకాశం ఉంటుందన్నారు.

యూపీఎస్సీ చైర్మన్ రాజీనామా


- పూజ ఉదంతంతో సంబంధం లేదని యూపీఎస్సీ ప్రకటన

న్యూఢిల్లీ, జూలై 20: యూపీఎస్సీ చైర్మన్ మనోజ్ సోనీ అనూహ్య నిర్ణయం తీసుకున్నారు. మరో ఐదేళ్ల పదవీ కాలం ఉండగానే ఆయన బాధ్యతల నుంచి తప్పుకొన్నారు. వ్యక్తిగత కారణాలతో పదవికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. నకిలీ పత్రాలతో ఉద్యోగానికి ఎంపికైనట్లుగా మహారాష్ట్రకు చెందిన ప్రొబేషనరీ ఐఏఎస్ పూజా ఖేద్కర్‌పై పెద్దఎత్తున ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో.. మనోజ్ సోనీ రాజీనామా చర్చనీయాంశం అయింది. అయితే, పూజా ఉదంతంతో చైర్మన్ నిర్ణయానికి ఏ సంబంధమూ లేదని అధికార వర్గాలు



పేర్కొన్నాయి. మనోజ్ 15 రోజుల కిందటనే నిర్ణయం తీసుకున్నారని, రాష్ట్రపతికి రాజీనామా లేఖ పంపారని, అది ఇంకా ఆమోదం పొందలేదని చెప్పాయి. 59 ఏళ్ల సోనీకి ప్రముఖ విద్యావేత్తగా పేరుంది. 2005-08 మధ్యన గుజరాత్ బరోడాలోని మహరాజా శాయాజీరావ్ యూనివర్సిటీకి, 2009-15 కాలంలో అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీకి ఉప కులపతిగా వ్యవహరించారు. దేశంలో అత్యంత చిన్న వయసులో ఉప కులపతి అయిన వ్యక్తిగా రికార్డు సృష్టించారు. 2017లో యూపీఎస్సీ సభ్యుడిగా నియమితులయ్యారు. గత ఏడాది మే 16న చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టారు. అయితే, సోనీ బాధ్యతల పట్ల సంతృప్తిగా లేరని, తనను రిలీవ్ చేయాలని కోరినట్లు సమాచారం. ఇకపై ఆయన సమాజ సేవ, ఆధ్యాత్మిక బాటలో పయనించాలని నిర్ణయించుకున్నట్లు చెబుతున్నారు. కానీ, వరుస కుంభకోణాలతో యూపీఎస్సీ ప్రతిష్ఠ దెబ్బతిన్నదని.. ఇటీవలి కుంభకోణాలలో కమిషన్ ప్రమేయం ఉండడంతో ఆయనను బలవంతంగా తప్పించారని కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే ఆరోపించారు. సోనీ ఎప్పుడో రాజీనామా చేస్తే ఇప్పుడా బయటపెట్టేదని ప్రశ్నించారు.

లోకం తీరు



శంషాబాద్‌లో రెండో రోజూ.. 24 విమానాల రద్దు

- విశాఖలో మరో 9 విమానాలు
- మైక్రోసాఫ్ట్ ఎర్రర్‌కు పరిష్కారం లభించినా.. మారని పరిస్థితి

శంషాబాద్ రూరల్/విశాఖపట్నం, న్యూఢిల్లీ, జూలై 20 (ఆంధ్రజ్యోతి): మైక్రోసాఫ్ట్ విండోస్ 'బ్లూస్ర్కీన్ ఎర్రర్' సమస్యకు పరిష్కారం లభించినా.. శంషాబాద్ విమానాశ్రయంలో రెండో రోజు కూడా పలు విమాన సర్వీసులకు అంతరాయమేర్పడింది. 24 దేశీయ విమానాలు రద్దయ్యాయి. శుక్రవారం ఇదే సమస్యతో 36 దేశీయ, అంతర్జాతీయ విమానాలు రద్దయిన విషయం తెలిసిందే. శుక్రవారం రాత్రే మైక్రోసాఫ్ట్ సమస్య పరిష్కారమైనా.. శనివారం శంషాబాద్‌లో పలు విమానాలు రద్దుకావడం గమనార్హం..! ఇందుకు కొన్ని విమానయాన సంస్థలే కారణమని ఎయిర్‌పోర్ట్ అధికారులు వివరించారు. హైదరాబాద్ రావాల్సిన పలు దేశీయ విమానాలు కూడా రద్దవ్వడంతో ప్రయాణికులు ఆందోళనకు దిగారు. అటు విశాఖపట్నంలో కూడా 9 విమానాలు రద్దయ్యాయి. మరోవైపు దేశవ్యాప్తంగా విమాన సర్వీసుల సేవల పునరుద్ధరణ పూర్తిస్థాయిలో జరిగినట్లు కేంద్ర పౌర విమానయాన శాఖ ప్రకటించింది.

క్రౌడ్‌స్ట్రైక్ నకిలీ ఉద్యోగి హల్‌చల్

మైక్రోసాఫ్ట్ బ్లూస్క్రీన్ ఎర్రర్‌కు తానే కారణమంటూ విన్సెంట్ ఫ్లిబస్టియర్ అనే యువకుడు నెట్టింట హల్‌చల్ చేశాడు. తనను తాను క్రౌడ్‌స్ట్రైక్ సైబర్ సెక్యూరిటీ సంస్థ ఉద్యోగిగా పేర్కొంటూ.. ఆ సంస్థ ముందు దిగిన ఓ ఫొటోను ఎక్స్‌లో షేర్ చేశాడు. అతని పోస్టుకు గంటల వ్యవధిలో 4 లక్షలకు పైగా లైకులు వచ్చాయి. ఆ తర్వాత కాసేపటికే.. తనను క్రౌడ్‌స్ట్రైక్ విధుల్లోంచి తొలగించిందని పేర్కొన్నాడు. అయితే.. అతను నకిలీ ఉద్యోగి అని క్రౌడ్‌స్ట్రైక్ సంస్థ వర్గాలు పేర్కొన్నాయి.

బంగ్లాదేశ్‌లో కర్ఫ్యూ

- వెయ్యి మంది భారత విద్యార్థుల వెనక్కి
- చిక్కుకున్న మరో 4 వేల మంది

న్యూఢిల్లీ, జూలై 20: బంగ్లాదేశ్.. ఆందోళనలు, నిరసనలతో అట్టుడుకుతోంది. ప్రభుత్వ ఉద్యోగాల్లో స్వాతంత్ర్య సమరయోధుల వారసులకు కల్పించిన 30 శాతం రిజర్వేషన్లను వ్యతిరేకిస్తూ అక్కడి ప్రజలు చేస్తున్న పోరాటం తీవ్ర ఉద్రిక్తతలకు దారి తీస్తోంది. ఆందోళనకారులు, అధికార అవామీ లీగ్



త్రిపురలోని ఓ చెక్‌పోస్టు దగ్గర భారత విద్యార్థులు

విద్యార్థి సంఘం కార్యకర్తలు బాహాబాహీకి దిగడంతో ఘర్షణలు హింసాత్మకంగా మారాయి. అల్లర్లలో శనివారం వరకు 115 మంది మరణించినట్లు తెలుస్తోంది. ఘర్షణలు హింసాత్మకంగా మారడంతో షేక్ హసీనా ప్రభుత్వం శుక్రవారం అర్ధరాత్రి నుంచి దేశం మొత్తం కర్ఫ్యూ విధించింది. ఆర్మీని రంగంలోకి దించింది. అటూ బంగ్లా నుంచి శనివారం నాటికి వెయ్యి మంది భారతీయ విద్యార్థులు స్వదేశానికి వచ్చారని, మరో నాలుగు వేల మంది వివిధ వర్సిటీ హాస్టల్స్‌లో చిక్కుకుపోయారని భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ తెలిపింది. "విద్యార్థులు తిరిగి రావడానికి ఢాకాలోని భారత హై కమిషన్ అన్ని ఏర్పాట్లు చేస్తోంది" అని భారత విదేశాంగ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ తెలిపారు.

2020లో భారత్‌లో కొవిడ్ కల్లోలం!

- అదనంగా 11.9 లక్షలమంది మృతి
- అంతర్జాతీయ నివేదిక వెల్లడి

న్యూఢిల్లీ, జూలై 20: కొవిడ్ మహమ్మారి కారణంగా 2020లో భారత్‌లో లక్షలాది మంది మరణించారని అంతర్జాతీయ పరిశోధన నివేదిక వెల్లడించింది. 2019తో పోలిస్తే 2020 కొవిడ్ సమయంలో భారత్‌లో 17% ఎక్కువగా అంటే.. 11.9 లక్షల మంది అధికంగా చనిపోయారని తెలిపింది. ఆ ఏడాది దేశంలో అధికారిక కొవిడ్ మరణాల సంఖ్య కంటే 8 రెట్లు, ప్రపంచ ఆరోగ్య సంస్థ అంచనా కంటే 1.5 రెట్లు ఈ సంఖ్య ఎక్కువని పేర్కొంది. బ్రిటన్‌లోని ఆక్స్‌ఫర్డ్ వర్సిటీతో పాటు పలు యూనివర్సిటీలకు చెందిన పరిశోధకులు అధ్యయనం చేశారు. జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే-5 డేటాను విశ్లేషించి పరిశోధకులు నివేదిక రూపొందించారు. అయితే కేంద్ర ఆరోగ్య శాఖ దీన్ని కొట్టి పారేసింది. లోపభూయిష్టమైన పద్ధతిలో చేసిన ఈ అధ్యయనం ఆమోదయోగ్యం కాదని పేర్కొంది. జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే నుంచి సేకరించిన సమాచారాన్ని మొత్తం దేశానికి ఆపాదించలేమంది. దేశంలో సివిల్ రిజిస్ట్రేషన్ సిస్టమ్ విశ్వసనీయమైనదని, దీనిప్రకారం 2019లో కంటే 2020లో 4,74,000 మరణాలు ఎక్కువగా నమోదయ్యాయని తెలిపింది.

ఉగ్ర వేటకు పారా కమాండోలు

- 500మందితో ప్రత్యేక కమాండో దళం
- జమ్మూలోని ముష్కరులపై ముట్టడికి సిద్ధం
- 50మంది ఉగ్రవాదులు ఉన్నట్టు గుర్తింపు

జమ్ము, జూలై 20: ఒక్క నెలలోనే ఆరు ఉగ్ర దాడులు జమ్మును కుదిపేశాయి. 20 మందికిపైగా ఆర్మీ జవాన్లను పొట్టనబెట్టుకున్న ఈ దాడులను రక్షణ శాఖ సవాల్‌గా తీసుకుంది. జమ్ము పరిధిలోని దట్టమైన అడవుల్లో దాగి, ఆర్మీపై దొంగ దాడులు చేస్తున్న ముష్కరుల పని పట్టేందుకు 500 మందితో కూడిన పారా కమాండో దళాన్ని రంగంలోకి దించింది. జమ్ములో యాభైమంది ఉగ్రవాదులు చురుగ్గా ఉన్నట్టు రక్షణ శాఖ ఇప్పటికే గుర్తించింది. వారిని ఏరివేసే ఆపరేషన్‌ను మొదలుపెట్టింది. ముఖ్యంగా ఉగ్రవాదులకు అందుతున్న సహకారంపై దృష్టి పెట్టింది. నిర్మాణ పనులు చేసే కూలీల ద్వారా నెట్‌వర్క్‌ను పెంచుకున్న ఉగ్రవాదులకు ఏఏ మార్గాల్లో ఆహారం, వసతి సౌకర్యాలు లభిస్తున్నాయనేది గుర్తించే పనిలో పడింది. మరోవైపు తాజా ఉగ్ర దాడుల వెనుక ఎవరు ఉన్నారనేదీ రక్షణ శాఖ కూపీ లాగుతోంది. ఈ క్రమంలో...ఉగ్ర కార్యకలాపాల ప్రధాన కేంద్రం కశ్మీర్ నుంచి జమ్ముకు మారిన వి



షయం బయటపడింది. జమ్ము, ఆ ప్రాంత పరిధిలోని రజౌరీ, పూంచ్, రేసీ, కఠువా పాకిస్థాన్ కేంద్రంగా పనిచేస్తున్న ఉగ్రవాద సంస్థలకు ప్రధాన లక్ష్యాలుగా మారాయి. ఉగ్ర దాడుల్లో కశ్మీర్‌లో గత ఏడాది ఏడుగురు జవాన్లు చనిపోగా, రజౌరీ, పూంచ్‌లో ఇరవై మంది మరణించడం.. జమ్ముకు పెరిగిన ఉగ్ర తాకిడికి నిదర్శనం. పాక్ రెగ్యులర్ విభాగంలో పనిచేసిన ఓ అధికారి శిక్షణలోనే దాడులకు ముష్కరులు తెగబడ్డారని నిఘా విభాగం నివేదికలు వెల్లడిస్తున్నాయి.

ముష్కరుల చేతికి ఆధునిక ఆయుధాలు

తాజా దాడుల్లో అమెరికా తయారీ ఆయుధాలను ఉగ్రవాదులు వాడినట్టు నిఘా వర్గాలు గుర్తించాయి. అఫ్ఘానిస్థాన్‌ను వదిలి వెళ్లేటప్పుడు అక్కడ అమెరికా వదిలిపెట్టిన ఆయుధాలు పాకిస్థాన్ సరిహద్దుల గుండా జమ్మూకశ్మీర్‌లోకి ప్రవేశిస్తున్నాయి. కఠువా సహా కొన్ని ప్రాంతాల్లో జరిపిన దాడుల్లో ఉగ్రవాదులు బైనక్యూలర్ సహిత ఎమ్-4 యూఎస్ కార్బన్‌లు, చైనీస్ స్టీల్ కోర్ బుల్లెట్లు వాడారు. దీన్నిబట్టి పాక్ రెగ్యులర్ ఆర్మీలో పనిచేసిన మాజీ అధికారి వద్ద తర్ఫీదు పొందినవారే ఈ దాడుల్లో పాల్గొన్నారని నిఘా వర్గాలు చెబుతున్నాయి. "ఎమ్-4 కార్బన్‌లు, చైనీస్ స్టీల్ కోర్ బుల్లెట్లను వాడి గత ఏడాది ఏప్రిల్ 20న పూంచ్‌లోని టోటాగలీలో జరిపిన అంబుష్‌లో ఐదుగురు జవాన్లు చనిపోయారు. ఉగ్ర దాడులకు వీటిని వాడటం అదే మొదటిసారి. జమ్ములో దాడులు చేసిన ఉగ్రవాదుల వెనుక పాక్ మాజీ ఆర్మీ అధికారులు ఉన్నారని స్పష్టంగా చెప్పలేం. కానీ, ఈ దాడులకు వాడిన ఆయుధాలుగానీ, ఉపయోగించిన గెరిల్లా యుద్ధ పద్ధతులుగానీ మామూలు శిక్షణ ఉన్న ఉగ్రవాదులకు సాధ్యమయ్యే విషయం మాత్రం కాదు. దట్టమైన అడవుల్లో పొంచి ఉండి.. అత్యాధునిక ఆయుధాలతో దాడులు చేస్తుండటం వల్లనే.. ముష్కరులను కట్టడి చేయడం కష్టంగా మారింది" అని ఓ సీనియర్ పోలీసు అధికారి విశ్లేషించారు.

దేశ వ్యాప్తంగా కులగణన అవసరం

- కానీ సమాచారాన్ని బహిర్గతం చెయ్యకూడదు: చిరాగ్ పాశ్వాన్

న్యూఢిల్లీ, జూలై 20: దేశ వ్యాప్తంగా కులగుణన చేపట్టాల్సిన అవసరముందని కేంద్ర మంత్రి, ఎల్‌జేపీ(రామ్ విలాస్) అధ్యక్షుడు చిరాగ్ పాశ్వాన్ అభిప్రాయపడ్డారు. ప్రజలకు అవసరమైన సంక్షేమ పథకాల రూపకల్పనలో ఈ కులగణన ప్రభుత్వానికి ఉపయోగపడుతుందని అన్నారు. అయితే, ప్రజల్లో అసమానతలు చెలరేగే అవకాశం ఉన్న నేపథ్యంలో కులగణన వివరాలను ప్రభుత్వం బహిర్గతం చేయకూడదని సూచన చేశారు. బిహార్‌లో తాము ఇప్పటికే కుల గణన చేపట్టామని, దేశ వ్యాప్తంగా ఆ కార్యక్రమం చేపట్టాల్సిన అవసరం ఉందని పాశ్వాన్ చెప్పారు. కులాల ప్రాతిపదికన కేంద్ర, రాష్ట్రాల ప్రభుత్వాలు ఇప్పటికే అనేక పథకాలు అమలు చేస్తున్నాయన్నారు. అందువల్ల ఏ కులానికి చెందిన వారు ఎంతమంది ఉన్నారనే సమాచారం తెలుసుకోవాల్సిన ఆవశ్యకత ఉందని పేర్కొన్నారు.

మోదీకి మస్క్ అభినందనలు!

న్యూయార్క్, జూలై 20: ప్రముఖ సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో 10 కోట్ల మంది ఫాలోవర్లను సంపాదించుకున్న సందర్భంగా ప్రధాని మోదీకి ఆ సంస్థ అధిపతి, ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ శుభాకాంక్షలు తెలిపారు. "అత్యధికులు అనుసరించే ప్రపంచ నాయకుడిగా నిలిచిన నరేంద్రమోదీకి అభినందనలు" అంటూ శుక్రవారం 'ఎక్స్'లో పోస్టు చేశారు. గతవారమే మోదీ ఈ మైలురాయిని చేరుకోగా తాజాగా మస్క్ శుభాకాంక్షలు చెప్పారు. కాగా, మోదీ తర్వాత ఎక్స్‌లో అత్యధికులు అనుసరిస్తున్న దేశాధినేతల జాబితాలో... అమెరికా అధ్యక్షుడు జో బైడెన్(38 లక్షలు) ఉన్నారు.

రేపటి నుంచి పార్లమెంటు

- తొలిరోజు ఆర్థిక సర్వే.. ఎల్లుండి కేంద్ర బడ్జెట్ ప్రవేశపెట్టనున్న ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్

న్యూఢిల్లీ, జూలై 20: పార్లమెంటు వర్షాకాల సమావేశాలు సోమవారం ప్రారంభం కానున్నాయి. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ మంగళవారం కేంద్ర బడ్జెట్‌ను పార్లమెంటులో ప్రవేశపెట్టనున్నారు. దానికి ముందురోజు(సోమవారం) ఆర్థిక సర్వేను నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టనున్నారు. వివిధ రంగాల ఆర్థిక స్థితిగతులకు సంబంధించిన గణాంక సమాచారం, విశ్లేషణలతోపాటు ఉపాధి, జీడీపీ వృద్ధి, ద్రవ్యోల్బణం, బడ్జెట్‌లోటు తదితరాలను ఆర్థిక సర్వే వెల్లడించనుంది. ముఖ్య ఆర్థిక సలహాదారు వి.అనంత నాగేశ్వరన్ నేతృత్వంలోని బృందం ఆర్థిక సర్వేను రూపొందించింది. మరోవైపు నీట్ ప్రశ్నపత్రం లీకైన కేసు, రైల్వే భద్రత తదితర అంశాలపై ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టేందుకు ప్రతిపక్షాలు సిద్ధమయ్యాయి. ఆగస్టు 12వ తేదీ వరకు కొనసాగే ఈ సమావేశాలలో 90 ఏళ్ల నాటి పౌర విమానయాన చట్టం స్థానంలో కొత్త చట్టాన్ని తీసుకురావడం సహా ఆరు బిల్లులను ప్రవేశపెట్టే అవకాశం ఉంది. దీంతోపాటు ప్రస్తుతం కేంద్ర పాలనలో ఉన్న జమ్మూకశ్మీర్ బడ్జెట్‌కు పార్లమెంటు ఆమోదం తెలిపే అవకాశం ఉంది. ఈ సమావేశాలలో రాజకీయ పార్టీలు ఏఏ అంశాలను లేవనెత్తాలనుకుంటున్నాయో తెలుసుకునేందుకు ఆయా పార్టీల ఫ్లోర్‌లీడర్లతో పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరెణ్ రిజిజు సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో ప్రభుత్వ వాటా 51 శాతం కంటే తక్కువగా ఉండేలా బ్యాంకింగ్ చట్టాలకు ప్రభుత్వం ఈ సమావేశాలలో సవరణలు తీసుకొచ్చే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వ రంగ బ్యాంకులను నిర్వీర్యం చేసే చర్యలను అడ్డుకుంటామని కాంగ్రెస్ నేత జైరామ్ రమేశ్ స్పష్టం చేశారు. విపత్తుల నిర్వహణ సవరణ బిల్లు, బాయిలర్స్ బిల్లు, కాఫీ(ప్రచారం, అభివృద్ధి) బిల్లు, రబ్బర్(ప్రచారం, అభివృద్ధి) బిల్లులను కూడా ఈ సమావేశాల్లోనే ప్రవేశపెట్టనున్నారు.



సభలో నినాదాలు వద్దు..

సభాధ్యక్షుడు ఇచ్చే రూలింగ్‌లను ప్రత్యక్షంగాగానీ, పరోక్షంగాగానీ, సభలోగానీ, బయటగానీ విమర్శించకూడదని పార్లమెంటు సమావేశాల ప్రారంభానికి ముందు ఎంపీలకు స్పష్టం చేశారు. అలాగే, సభలో వందే మాతరం, జైహింద్ సహా నినాదాలేమీ చేయకూడదని తేల్చిచెప్పారు. సభలో ప్లకార్డులు తదితరాలు ప్రదర్శించడమూ పద్ధతి కాదంటూ.. పార్లమెంటరీ ఆచారాలు, సాంప్రదాయాలు, ఎథిక్స్‌పై సభ్యులు దృష్టిపెట్టేలా 'రాజ్యసభ సభ్యుల కోసం హేండ్ బుక్'ను రాజ్యసభ సెక్రెటేరియట్ తీసుకొచ్చింది. ఈనెల 15న జారీ చేసిన రాజ్యసభ బులెటిన్‌లో ఈ అంశాలను ప్రచురించారు. సభా కార్యకలాపాలను హుందాగా, గంభీరంగా నిర్వర్తించేందుకు థ్యాంక్స్, థ్యాంక్యూ, జైహింద్, వందేమాతరం తదితర నినాదాలేమీ సభలో చేయకూడదని బులెటిన్‌లో స్పష్టం చేశారు. సభ పూర్వాపరాలను అనుసరించి సభాపతి రూలింగ్‌లు ఇస్తారని, పూర్వాపరాలు లేనిచోట సాధారణ పార్లమెంటరీ పద్ధతిని అనుసరిస్తారని తెలిపారు. దూషణలు, అభ్యంతరకరమైన, అన్‌పార్లమెంటరీ పదాలు, లేదా వ్యక్తీకరణలను కచ్చితంగా నివారించాలంటూ పార్లమెంటరీ ఎథిక్స్‌ను బులెటిన్‌లో ప్రస్తావించారు. ఏదైనా పదం, లేదా వ్యక్తీకరణ అన్‌పార్లమెంటరీ అని సభాధ్యక్షుడు పేర్కొన్నప్పుడు.. దానిపై ఏ విధమైన చర్చనూ లేవనెత్తే ప్రయత్నం చేయకుండా వెంటనే ఉపసంహరించుకోవాలని స్పష్టంచేశారు.

జీవిత భాగస్వాములను కలిపే బ్రెయిన్ వేవ్!

- బ్రెయిన్ మ్యాపింగ్‌తో నేర పరిశోధన సులువు
- భవిష్యత్తులో నాడీ వైద్య రంగంలో అద్భుతాలు!
- ఏపీ న్యూరోకాన్ సదస్సులో విజయ అధ్యక్షోపన్యాసం



సదస్సులో ప్రసంగిస్తున్న న్యూరాలజిస్ట్ డాక్టర్ విజయ

గుంటూరు (మెడికల్) జూలై 20: సమీప భవిష్యత్తులో న్యూరాలజీ వైద్య రంగంలో మనిషి ఊహించలేని అద్భుతాలు సృష్టించే అవకాశం ఉందని ఆంధ్రప్రదేశ్ న్యూరో సైంటిస్ట్స్ అసోసియేషన్ (ఏపీ ఎస్ఎన్ఏ) రాష్ట్ర అధ్యక్షురాలు, గుంటూరుకు చెందిన ప్రముఖ న్యూరాలజిస్ట్ డాక్టర్ పి. విజయ తెలిపారు. గుంటూరులో జరుగుతున్న ఏపీ న్యూరోకాన్ 2024 రాష్ట్ర సదస్సులో శనివారం ఆమె 'బ్రెయిన్ నౌ అండ్ ఫ్యూచర్' అనే అంశంపై స్మారక అధ్యక్షోపన్యాసం చేశారు. తన ప్రసంగంలో ఆమె అనేక ఆసక్తికర అంశాలను ప్రస్తావించారు.

- శంకర్‌దాదా ఎంబీబీఎస్ సినిమాలో హీరో చిరంజీవి, తన వైపు చూడాలంటూ మనసులో హీరోయిన్‌ను పిలుస్తాడు! ఆ మాట వినిపించినట్లుగా భ్రమపడిన హీరోయిన్ సోనాలి బింద్రే 'పిలిచావా శంకర్?' అని అడుగుతుంది. దీంతో హీరో ఉబ్బితబ్బిబ్బవుతాడు. ఇది సినిమాలో కేవలం సరదా సన్నివేశమే కావచ్చు.. కానీ సమీప భవిష్యత్తులో 'బ్రెయిన్ వేవ్ మ్యాచ్' అనే టెక్నాలజీ ద్వారా వాస్తవ రూపం దాల్చే అవకాశముంది. బ్రెయిన్ వేవ్ టెక్నాలజీ ద్వారా వివాహానికి ముందే యువతీ యువకులు తమ కాబోయే భాగస్వామి ఆలోచనలు, అభిరుచులు మెదడు సంకేతాల ద్వారానే తెలుసుకొని, తమ ఆలోచనకు 90 శాతం మ్యాచ్ అయ్యే వారిని పెళ్లికి ఎంచుకోవచ్చు. దాంపత్యంలో వీరి మధ్య ఎలాంటి గొడవలూ రావు!
- ఆదిత్య 369 సినిమాలో.. హీరో, ఇతర క్యారెక్టర్లు భవిష్యత్తు కాలానికి వెళతాయి. అక్కడ వారు మనస్సులో అనుకొనే మాటలు లౌడ్ స్పీకర్ ద్వారా బయటకు వినిపిస్తాయి. భవిష్యత్తులో బ్రెయిన్ సంక్రోని అనే వినూత్న ప్రక్రియ ద్వారా మనసులో మాట బయటకు తెలుస్తుంది. ఇది నేర పరిశోధనలో కీలక అంశంగా మారే అవకాశం ఉంటుంది. కోకిల సినిమాలో ఒక స్వామిజీ హత్యకు గురవుతాడు. అతడి కళ్లను హీరోకు అమరుస్తారు. దీంతో హీరోకు ఆ హంతకుడు కళ్లల్లో కనిపిస్తుంటాడు. ఇది సినిమాటిక్ సన్నివేశమే అయినా భవిష్యత్తులో బ్రెయిన్ మ్యాపింగ్ టెక్నాలజీ ద్వారా నిజమయ్యే అవకాశం ఉంది. కాగా, భవిష్యత్తులో న్యూరాలజీ వైద్య రంగంలో కొన్ని పరిశోధనలు మానవ జీవితాలను మలుపు తిప్పే గొప్ప ఆవిష్కరణలుగా నిలుస్తాయని డాక్టర్ విజయ వెల్లడించారు. మన ఆలోచనలు మెదడును నియంత్రిస్తాయని, మెదడు నియంత్రణలో ఉంటే శారీరక, మానసిక ఆరోగ్యం బాగుంటుందని ఆమె తెలిపారు. తన ప్రసంగం అనంతరం డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య వర్సిటీ డాక్టర్ కోరుకొండ బాబ్జీ సూచనలతో హాజరైన వైద్యులందరూ స్టాండింగ్ ఒవేషన్‌తో అభినందనలు తెలిపారు.

రైతుబీమాలోకి కొత్త రైతులు

- నమోదుకు ఆగస్టు 5 గడువు.. పదో తేదీకి ఎల్‌ఐసీకి జాబితా
- కొత్తగా పట్టా బుక్కులు పొందిన రైతులు 3,22,582 మంది
- ఆగస్టు 14తో ముగియనున్న 2023-24 పాలసీ గడువు



హైదరాబాద్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): రైతుబీమా పథకంలో కొత్త రైతుల నమోదుకు రాష్ట్ర ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. కొత్తగా పట్టాదారు పాస్ పుస్తకాలు తీసుకొని, పథకంలో లేని వారి పేర్లను నమోదు చేయాలని రాష్ట్ర వ్యవసాయశాఖ డైరెక్టర్ డాక్టర్ గోపి శనివారం సర్క్యులర్ జారీచేశారు. 2024-25 ఫార్మర్ గ్రూప్ ఇన్సురెన్స్ స్కీమ్‌లో కొత్త రైతులను చేర్చటానికి ఆగస్టు 5నాటికి గడువు విధించారు. అలాగే ఐదెకరాల విస్తీర్ణంలోపున్న పాత పట్టాదారులు, గతంలో పట్టాదారు పాస్‌పుస్తకాలు ఉన్నప్పటికీ నమోదుచేసుకోని 5 ఎకరాలకు మించి ఉన్న పట్టాదారుల వివరాలను నమోదుచేయటానికి ఆగస్టు ఐదో తేదీని డెడ్‌లైన్‌గా ప్రకటించారు. ఎల్‌ఐసీకి ఆగస్టు 10వ తేదీ నాటికి అర్హులైన రైతుల జాబితాను ప్రభుత్వం ఇవ్వాల్సి ఉంది. ఫలితంగా ఆగస్టు ఐదో తేదీ నాటికి నమోదు ప్రక్రియ పూర్తిచేయాలని డీఏవోలు, ఏడీఏలు, ఎంఏవోలు, ఏఈవోలకు ఆదేశాలు జారీ అయ్యాయి. రైతుబీమా పథకం 2018-19లో ప్రారంభమైంది. రైతుల తరఫున ఎల్‌ఐసీకి రాష్ట్ర ప్రభుత్వమే ప్రీమియం చెల్లిస్తోంది. పథకంలో 59 ఏళ్లలోపు వయసున్న రైతులకే అవకాశం కల్పించారు. రైతులు ఏ కారణంతో చనిపోయినా కూడా నామినీకి రూ.5 లక్షలు చెల్లించేలా పథకానికి రూపకల్పన చేశారు. 2018-19లో 31.25 లక్షలు, 2019-20లో 30.73 లక్షలు, 2020-21లో 32.73 లక్షలు, 2021-22లో 35.64 లక్షలు, 2022-23 లో రూ. 37.77 లక్షలు, 2023- 24 లో 41.03 లక్షల మంది రైతులు రైతుబీమా పథకంలో నమోదు చేసుకున్నారు. ఈ సారి(2024- 25) రాష్ట్ర వ్యాప్తంగా 3,22,582 మంది కొత్తగా పట్టాదారు పాస్ పుస్తకాలు తీసుకున్నారు. వీరిని జిల్లాల వారీగా రైతుబీమా పథకంలో నమోదు చేయించాలని ఆదేశాలు జారీ అయ్యాయి. ధరణి నుంచి వచ్చిన సమాచారంతోపాటు.. రైతుల నుంచి పట్టాదారు పాస్ పుస్తకం, ఆధార్, నామినీ ఆధార్ కార్డు జిరాక్సు కాపీలు తీసుకోవాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. పట్టాదారులు దరఖాస్తుపై సంతకం చేసి స్వయంగా ఏఈవోకు ఇవ్వాలని, నామినీని కూడా వారే సూచించాలని నిబంధన విధించారు. ఈ ధ్రువపత్రాలు ఏఈవోలకు ఇస్తే.. రైతుబీమా పోర్టల్‌లో నమోదుచేస్తారు. రైతుల వయస్సును ఆధార్ కార్డు ప్రకారమే లెక్కిస్తారు. 59 ఏళ్లు దాటిన రైతులను పథకం నుంచి తొలగిస్తారు. 2023-24కు సంబంధించి పాలసీ గడువు ఆగస్టు 14 తేదీన ముగుస్తుంది. ఆ వెంటనే కొత్త పాలసీ అమల్లోకి వస్తుంది. ఆమేరకు సర్కారు ప్రీమియం చెల్లిస్తుంది. గత ఆరేళ్లలో రైతుబీమాలో నమోదుచేసుకొని, ఎల్‌ఐసీ ఐడీ నంబరు కలిగి ఉన్న రైతుల వివరాల సేకరణను మాత్రం ఈనెల 30 తేదీ నాటికి పూర్తిచేయాలని ఏఈవోలకు ఆదేశాలు జారీ చేశారు. కాగా 2023-24 సంవత్సరానికి ఒక్కో రైతు పేరుమీద రాష్ట్ర ప్రభుత్వం రూ.3,600 చొప్పున ఎల్‌ఐసీకి ప్రీమియం చెల్లించింది. ఈసారి ఫార్మర్ గ్రూప్ లైఫ్ ఇన్సురెన్స్‌లో నమోదుచేసే రైతుల సంఖ్య సుమారు 45 లక్షలకు దగ్గరగా ఉంటుందనే అంచనాలు ఉన్నాయి.

రుణమాఫీ ఫిర్యాదుల బాధ్యత ఏఈవోలకు!

(మొదటి పేజీ తరువాయి)

వ్యవసాయ విస్తరణాధికారులకు ఫిర్యాదులు చేయాలని వ్యవసాయ కమిషనరేట్ నుంచి ఆదేశాలు వెళ్లాయి. ఈ మేరకు ఏఈవోలు రిజిస్టర్‌లో ఫిర్యాదులను నమోదుచేస్తున్నారు. ఈ నెల 15న రుణమాఫీ మార్గదర్శకాలను విడుదలచేసినప్పుడే వ్యవసాయ శాఖ డైరెక్టర్, నేషనల్ ఇన్ఫర్మేటిక్ సెంటర్ (ఎన్‌ఐసీ) కలిసి ప్రత్యేక ఐటీ పోర్టల్ నిర్వహిస్తాయని జీవో (నం.567)లో పేర్కొన్నారు. రైతులు తమ సమస్యలను ఐటీ పోర్టల్‌లోగానీ, మండలస్థాయిలో ఏర్పాటుచేసిన సహాయ కేంద్రాల వద్ద తెలపాలని సూచించారు. ప్రతి అభ్యర్థనను అధికారులు 30రోజుల లోపు పరిష్కరించి, దరఖాస్తుదారులకు తెలపాలని జీవోలో పేర్కొన్నారు. ఐటీ పోర్టల్‌లో ప్రతి రైతు కుటుంబానికి సంబంధించిన లోన్ అకౌంట్ డేటా సేకరణ, డేటా వాలిడేషన్, అర్హత మొత్తాన్ని నిర్వహించే సౌకర్యాన్ని పొందుపరిచారు. అదేక్రమంలో రైతులిచ్చే ఫిర్యాదులు పరిష్కరించటానికి ప్రత్యేకమైన మాడ్యూల్స్ ఉంటాయని జీవోలో పేర్కొన్నారు. ఇప్పటిదాకా పోర్టల్‌లో మాడ్యూల్స్ ఏవీ పొందుపరచలేదు. ఏఈవోలు, ఏవోలకు ఎలాంటి మాడ్యూల్స్ పంపలేదు. వ్యవసాయశాఖ డైరెక్టరేట్, జిల్లా వ్యవసాయశాఖ కార్యాలయాల నుంచి వచ్చిన మౌఖిక ఆదేశాలమేరకు ఏఈవోలు ప్రతి క్లస్టర్‌లో ఒక రిజిస్టర్ తీసుకొని మాన్యువల్‌గా నమోదుచేస్తున్నారు. రైతు పేరు, ఆధార్ నంబరు, పాస్‌బుక్కు, బ్యాంకు ఖాతా వివరాలు రిజిస్టర్‌లో నమోదుచేసి పెడుతున్నారు. రైతులిచ్చిన ఫిర్యాదులు మాత్రం క్లస్టర్ పరిధిలోనే ఉంటున్నాయి. డీఏవో, డైరెక్టర్ కార్యాలయానికి పంపాలని ఆదేశాలు రాకపోవటంతో ఏఈవోలు రిజిస్టర్‌లో రాసి తమవద్దే పెట్టుకుంటున్నారు. ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలొస్తే పంపిస్తామని చెబుతున్నారు. అధికారవర్గాల సమాచారం మేరకు ఫిర్యాదులపై ఆగస్టు 15 తర్వాతే దృష్టిసారించే అవకాశాలున్నాయి. ప్రస్తుతం రూ.లక్ష వరకు విడుదలచేసిన నిధులు రైతుల ఖాతాల్లో పడుతున్నాయా? బ్యాంకుల్లో సమస్యలు ఎదురవుతున్నాయా? చిన్న చిన్న సాంకేతిక సమస్యలను ఎలా పరిష్కరించాలి? తొలి విడత జాబితాలో పేర్లు వచ్చిన రైతుల ఖాతాల్లోకి డబ్బులు ఎలా చేర్చాలి? అనే అంశంపైనే దృష్టిసారిస్తున్నారు. కాగా ప్రతిబ్యాంకులో ఒక అధికారిని బ్యాంకు నోడల్ అధికారి(బీఎన్‌వో)గా నియమించాలని, ఎన్‌ఐసీకి, వ్యవసాయశాఖ డైరెక్టరేట్‌కు సమన్వయకర్తగా బీఎన్‌వో వ్యవహరించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. బ్యాంకు పంట రుణాల డేటాపై బీఎన్‌వోతో డిజిటల్ సంతకంచేయించారు. కానీ, బ్యాంకులో ఉండే బీఎన్‌వోలు రైతుల ఫిర్యాదులను మాత్రం స్వీకరించటంలేదు. తమకు రూ.లక్షలోపు లోను ఉన్నదని, అయినా మాఫీ రాలేదని, కారణాలేంటో తెలపాలని రైతులు బ్యాంకులను సంప్రదిస్తే... వ్యవసాయ అధికారుల వద్దకే వెళ్లాలని చెబుతున్నారు. కాగా, మండల వ్యవసాయఅధికారి రుణమాఫీ అమలుకు నోడల్ ఆఫీసర్‌గా వ్యవహరించాలని ఈనెల 18న డీఏవోలు ఉత్తర్వులు జారీచేశారు. కానీ ఏవోలు ఈ సమస్యలపై దృష్టిపెట్టడంలేదనే విమర్శలొస్తున్నాయి. కొన్నిజిల్లాల్లో కలెక్టర్లు చొరవతీసుకొని కలెక్టరేట్లలో టోల్ ఫ్రీ నంబర్లు ఏర్పాటుచేశారు. జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్‌కు ఈ ఫిర్యాదులు పంపించి, సమీక్షిస్తామని, రాష్ట్ర స్థాయిలో పరిష్కరించేటివి ఉంటే ఎస్‌ఎల్‌బీసీకి పంపిస్తామని కలెక్టర్లు చెబుతున్నారు.

కొందరు రైతుల్లో ఆందోళన

తమకు ఇంకా రుణమాఫీ కాలేదని కొందరు.. ఉన్న రుణం కన్నా తక్కువ మాఫీ అయిందని ఇంకొందరు ఇలా ఆదిలాబాద్ జిల్లాలో రైతుల్లో ఆందోళన నెలకొంది. ఈ మేరకు వారు జిల్లాలోని తలమడుగు గ్రామానికి చెందిన రైతులు శనివారం బ్యాంకు వచ్చిన జిల్లా వ్యవసాయ అధికారి పుల్లయ్యకు ఫిర్యాదు చేశారు. తమకు న్యాయం చేయలని విన్నవించుకున్నారు. రైతులెవ్వరూ ఆందోళన చెందొద్దని, బ్యాంకర్ల సహకారంతో జరిగిన తప్పులను సరిదిద్ది రైతులకు న్యాయం జరిగే విధంగా చర్యలు చేపడతామని పుల్లయ్య పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ దృష్టికి విషయాన్ని తీసుకెళ్లి అర్హులైన రైతులందరికీ రుణమాఫీ జరిగే విధంగా చర్యలు చేపడతామని చెప్పారు.

మాఫీపై ఆందోళనొద్దు!

ప్రతి రైతు కుటుంబాన్ని రుణ విముక్తి చేస్తాం: తుమ్మల



హైదరాబాద్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): రుణమాఫీపై రైతులెవ్వరూ ఆందోళన చెందొద్దని, రూ.2లక్షల రుణమాఫీ అందరికీ అవుతుందని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. రాష్ట్రంలోని రైతుల ఖాతా నంబర్లన్నీ ప్రభుత్వం దగ్గర ఉన్నాయని, రుణమాఫీ కానివారికి ఎందుకు కాలేదు? ఎప్పుడు వస్తుందో కూడా స్పష్టతనిస్తామని చెప్పారు. రేషన్‌కార్డు లేకున్నా పాస్‌బుక్ ఆధారంగా రుణమాఫీ ప్రక్రియ చేస్తామని, ప్రతి రైతు కుటుంబానికి రుణవిముక్తి కల్పిస్తామని స్పష్టం చేశారు. ప్రభుత్వానికి వచ్చే ఆదాయానికి అనుగుణంగా రుణమాఫీ ప్రక్రియ నిర్ణీత సమయంలోగా పూర్తి చేస్తామన్నారు. రైతు రుణమాఫీ పూర్తయ్యాకే వరంగల్‌లో సభ ఉంటుందని చెప్పారు. శనివారం సచివాలయంలో మంత్రి తుమ్మల మీడియాతో మాట్లాడారు. రుణామాఫీపై రైతులు అపోహలు పెట్టుకోవొద్దని, ఎవరికి.. ఎలాంటి అనుమానాలున్నా నివృత్తి చేస్తామని స్పష్టం చేశారు. గతంలో జరిగిన పద్ధతిలోనే రుణమాఫీ ప్రక్రియ జరుగుతోందని, మెరుగైన పద్ధతిలో డేటా తీసుకొని రుణమాఫీ చేస్తున్నామని, దీనిపై రాజకీయం చేయొద్దని విపక్షాలకు సూచించారు. గత బీఆర్‌ఎస్ సర్కారు హయంలో రుణమాఫీ పేరిట రూ.25 వేల చొప్పున ఇవ్వడంతో అవన్నీ బ్యాంకు వడ్డీలకే సరిపోయాయని ఎద్దేవా చేశారు. రెండోసారి బీఆర్‌ఎస్ సర్కారు ఎన్నికల ముందు సగమే ఇచ్చి చేతులు దులుపుకొందని విమర్శించారు. ఇటువంటి పార్టీలు కూడా తమను విమర్శిస్తాయా? అని ప్రశ్నించారు. రూ.2 లక్షల రుణాలున్న రైతుల వివరాలివ్వాలని బ్యాంకర్లను తాము అడిగామన్నారు. మొత్తం 32 బ్యాంకులు నుంచి 44 లక్షల ఖాతాల వివరాలను ఇచ్చాయన్నారు. కొన్ని బ్యాంకులు 2018కు ముందున్న రుణాలను కూడా ఇందులో చేర్చే ప్రయత్నం చేస్తున్నాయని, అందుకే తేడాలొస్తున్నాయని వివరించారు. కొన్ని సహకార సొసైటీలపై అడిటింగ్ చేశామని, వాటిలో లోపాలు బయటపడ్డాయన్నారు. అందుకే అక్కడ రుణమాఫీని తాత్కాలికంగా ఆపివేశామని చెప్పారు. ఆరు సొసైటీల్లో అడిటింగ్ చేస్తే 2 వేల ఖాతాల్లో లోసుగులున్నాయన్నారు. వ్యాపారస్థులకు రుణమాఫీ చేయబోమని స్పష్టం చేశారు. రైతుభరోసాపై అసెంబ్లీలో చర్చించి నిర్ణయం తీసుకుంటామని చెప్పారు.

రెండో విడత మాఫీకి 7 వేల కోట్లు!

ఈనెల 31న నిధులు విడుదలచేసే అవకాశం

హైదరాబాద్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): తొలి విడత రుణమాఫీ నిధులను ఈనెల 18 తేదీన విడుదల చేసిన రాష్ట్ర ప్రభుత్వం... రెండో విడత నిధులను ఈనెల 31వ తేదీన విడుదలచేసే అవకాశాలున్నాయి. రూ.లక్ష వరకు అప్పున్న రైతులకు రూ. 6,099 కోట్లు విడుదలచేయగా లక్షన్నర వరకున్న అప్పులు మాఫీ చేయటానికి మరో రూ.7 వేల కోట్ల నిధులు అవసరమవుతున్నాయి. రెండు లక్షల రుణమాఫీ పథకానికి రాష్ట్ర ప్రభుత్వం ఆగస్టు 15వ తేదీని గడువుగా పెట్టుకున్న విషయం విదితమే! ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వ ఖజానాలో రుణమాఫీ కోసం సేకరించిన నిధులు మరో రూ. 4 వేల కోట్లు ఉన్నాయి. అంటే రెండో విడత అవసరాల కోసం రూ. 3 వేల కోట్లు సమకూర్చాల్సి ఉంది. ఇందుకుగాను ఆర్బీఐ నుంచి రూ. 3 వేల కోట్లు అప్పు తీసుకోవటానికి సర్కారు ఇండెంటు పెట్టింది. ఈ మొత్తం ఈనెల 23న ఆర్బీఐ నుంచి రాష్ట్ర ఖజానాకు రానుంది. మూడో విడతకు మాత్రం పెద్ద ఎత్తున నిధులు సమకూర్చాల్సి ఉంటుంది. రూ.2లక్షల కేటగిరీలో ఉండే రైతులకు రుణమాఫీ చేయటానికి సుమారు రూ. 18 వేల కోట్ల నిధులు అవసరమవుతాయనే అంచనాలున్నాయి. ఆగస్టులో వీటి పూలింగ్‌పై ప్రభుత్వం దృష్టిపెట్టే అవకాశాలున్నాయి. కాగా ఈనెల 23 తేదీన అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ప్రారంభమవుతున్నాయి. 25వ తేదీన ప్రభుత్వం బడ్జెట్ ప్రవేశపెట్టనుంది. ఆ తర్వాత రెండో విడత రుణమాఫీ పూర్తిచేయాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు విశ్వసనీయంగా తెలిసింది.

ఈసీజీ విశ్లేషణతో గుండె గుట్టును పట్టేయొచ్చు

- చికిత్సలకు అనవసర వ్యయాన్ని తగ్గించొచ్చు
- కిమ్స్ సింపోజియంలో డాక్టర్ బి.హయగ్రీవరావు

హైదరాబాద్ సిటీ, జూలై 20 (ఆంధ్రజ్యోతి): ఈసీజీని సరిగా విశ్లేషించగలిగితే గుండె పనితీరుకు సంబంధించి పలు విషయాలు తెలుస్తాయని, రోగికి ఏ సమస్య ఉంది, ఎలాంటి చికిత్స అవసరం వంటి కీలక అంశాలపైనా అవగాహన వస్తుందని కిమ్స్ ఆస్పత్రికి చెందిన ఎలక్ట్రోఫిజియాలజీ, పేసింగ్ విభాగం అధిపతి డాక్టర్ బి.హయగ్రీవరావు తెలిపారు. శనివారం 'అరీథిమియా రీసెర్చ్ అండ్ ట్రైనింగ్ సెంటర్ (ఆర్ట్), కిమ్స్ ఆస్పత్రి సంయుక్తంగా నిర్వహించిన అరీథిమియా సింపోజియంలో ఆయన మాట్లాడారు. ఏపీ, తెలంగాణల నుంచి 250 మందికి పైగా కార్డియాలజిస్టులు, ఇతర వైద్యులు, చెన్నై, బెంగళూరు, కోల్‌కతా, ఢిల్లీ తదితర నగరాల నుంచి దాదాపు 50 మంది ఎలక్ట్రో ఫిజియాలజిస్టులు ఈ సదస్సుకు హాజరయ్యారు. గుండె వైఫల్యం కేసుల్లో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి హఠాన్మరణాలను నివారించగలమని డాక్టర్ బి.హయగ్రీవరావు తెలిపారు. ముఖ్యంగా గుండె చికిత్సల్లో కార్డియాక్ రీసింక్రనైజేషన్ థెరపీ చాలా ముఖ్యమైనదన్నారు. దీనికి ఒక్కో రోగికి రూ.15 లక్షల వరకు ఖర్చవుతుందని, అయితే, ఇది 70 శాతం మంది రోగులకే ఉపయోగపడుతుందదన్నారు. ఈసీజీని వైద్యులు సరిగ్గా విశ్లేషించగలిగితే ఆ 30 శాతం మందికి ఈ చికిత్స అవసరం లేదని, తద్వారా వారి డబ్బును ఆదా చేయవచ్చని వెల్లడించారు. సింపోజియంను ప్రారంభించిన కిమ్స్ సీఈఓ డాక్టర్ అభినయ్ మాట్లాడుతూ, కార్డియాలజీ విభాగంలో ఎలక్ట్రోఫిజియాలజిస్టులు ఉండటం వల్ల రోగుల సంరక్షణ ప్రమాణాలు గణనీయంగా పెరిగాయని చెప్పారు.

దేశాభివృద్ధిలో ఐఐటీలు కీలకం

- నీతి ఆయోగ్ సీఈవో సుబ్రహ్మణ్యం

కంది, జూలై 20: అత్యున్నత సాంకేతిక నిపుణులు, పారిశ్రామికవేత్తలను తయారు చేయడం ద్వారా దేశాభివృద్ధిలో ఐఐటీలు కీలకపాత్ర పోషిస్తున్నాయని నీతి ఆయోగ్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (సీఈవో) బీవీఆర్ సుబ్రహ్మణ్యం అన్నారు. మేటి విద్యాసంస్థల్లో చదివిన వారు తమ నైపుణ్యాలను సమర్థవంతంగా ఉపయోగిస్తే దేశం ఆర్థికంగా మరింత పురోగమిస్తుందని పేర్కొన్నారు. శనివారం సంగారెడ్డి జిల్లా కంది పరిధిలోని ఐఐటీ హైదరాబాద్ 13వ స్నాతకోత్సవ వేడుకలకు సుబ్రహ్మణ్యం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఐఐటీ-హెచ్‌లో బీటెక్, ఎంటెక్, ఎంబీఏ, పీహెచ్‌డీ, వివిధ విభాగాల్లో డిగ్రీలు పూర్తి చేసుకున్న 1,103 మంది విద్యార్థులకు ఐఐటీ-హెచ్ బోర్డ్ ఆఫ్ గవర్నెన్స్ చైర్మన్ డాక్టర్ బీవీఆర్ మోహన్ రెడ్డి, ఐఐటీ-హెచ్ డైరెక్టర్ బీఎస్ మూర్తిలతో కలిసి డిగ్రీ పట్టాలను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ..దేశంలోని వందకు పైగా యూనికార్న్ కంపెనీల్లో అధిక శాతం ఐఐటీ పూర్వ విద్యార్థులవేనని తెలిపారు. 5జీ, 6జీ టెక్నాలజీతో పాటు పలు రంగాల పరిశోధనల్లో ఐఐటీ-హెచ్ కీలకపాత్ర పోషిస్తోందన్నారు. ఐఐటీ హైదరాబాద్ అతి తక్కువ కాలంలో దేశ సాంకేతిక విద్యలో అత్యున్నత ప్రమాణాలను నెలకొల్పిందని పేర్కొన్నారు. 2047నాటికి అభివృద్ధి చెందిన దేశంగా మారేందుకు యువశాస్త్రవేత్తలు కీలకపాత్ర పోషించాలని ఆయన పిలుపునిచ్చారు. విద్య భూమి అయితే, విద్యా సంస్థలు బీజాలని.. వీటి సహకారంతోనే వికసిత భారత్ సాధ్యమవుతుందని తెలిపారు. ఇన్నోవేషన్, ఎక్సలెన్స్‌కు నిలువెత్తు నిదర్శనమని బీవీఆర్ మోహన్‌రెడ్డి కొనియాడారు. ఐఐటీ-హెచ్ గ్లోబల్ నాలెడ్జ్ సెంటర్‌గా ఉండాలని ఆకాంక్షిస్తున్నామని బీఎస్ మూర్తి పేర్కొన్నారు.

సినీ నటి శ్రీరెడ్డిపై కేసు నమోదు

కర్నూలు, జూలై 20: వివాదాస్పద సినీ నటి శ్రీరెడ్డిపై కర్నూలు త్రీటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. టీడీపీ బీసీ సెల్ నాయకుడు నాగరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. శ్రీరెడ్డి ఇటీవల సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్, హోంమంత్రి అనితలపై అనుచిత వ్యాఖ్యలు చేసినట్టు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఎన్నికలకు ముందు, తర్వాత ఆమె సోషల్ మీడియా వేదికగా పలు సందర్భాల్లో వ్యక్తిగత దూషణలకు పాల్పడ్డారని వివరించారు. ఈ నేపథ్యంలో ఆయా అంశాలకు సంబంధించిన సోషల్ మీడియా క్లిప్పింగులు, వీడియోలతో పాటు పలు ఆధారాలను పోలీసులకు సమర్పించారు. దీంతో శ్రీరెడ్డిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మురళీధర్ రెడ్డి తెలిపారు.

ఆకార్ పటేల్ : 'నియంత అంతం'

వర్తమానంతో సరిపోలిన ఊహాచిత్రం

> ఈ నవలలో పెద్దాయన పాలన ప్రజల వ్యతిరేకత వల్ల పోలేదు. మీరాను ప్రజలు ఎన్నుకోలేదు. రెండు పరిణామాలూ ప్రమాదవశాత్తూ జరిగినవే. అయితే, ప్రధానమంత్రి స్థానంలో ఒక కొత్త వ్యక్తి, ఆదర్శాలు మాత్రమే తెలిసిన వ్యక్తి రావడం వల్ల, ఆమె వైపునుంచి అధికారకేంద్రాల సందర్శన పాఠకులకు సాధ్యమైంది. అప్పటి దాకా ఉన్న ఒక స్వాతిశయమూ స్వీయ ఆరాధకుడూ అయిన జనరంజక నియంత వ్యవహార సరళి ఎట్లా ఉన్నది, ఆయన చుట్టూ ఎటువంటి వ్యవస్థ పనిచేస్తున్నది చెప్పడానికి కూడా ఆస్కారం కలిగించింది.

భవిష్య పురాణం అని ఒకటుంది. అందులో విక్టోరియా అనే రాణి భవిష్యత్తులో భారతదేశాన్ని పాలిస్తుందని రాశారట. అది నిజం అనుకునేవాళ్లు విక్టోరియా మహారాణి గురించి ఎప్పుడో చెప్పారని పౌరాణికులను మెచ్చుకుంటారు. అనుమానం ఉన్న వాళ్లు, ఆ పురాణంలోని అటువంటి ఆధునిక విశేషాలన్నీ తరువాత చేర్చినవని తెలుసుకుంటారు. వర్తమానాన్ని గతంలోకి పంపి, దాన్ని భవిష్యత్తుగా జోస్యం చెప్పగలగడం అమోఘమైన విద్య. మన 'ఘనత' నంతటినీ మూటగట్టి దాచిపెట్టిన గతకాలాన్ని మరింత గొప్ప చేయడానికి అది పనికివస్తుంది.

ఆకార్ పటేల్ రాసిన 'ఆఫ్టర్ మెస్సయ్య' నవలలో కూడా భవిష్య పురాణాన్ని పోలిన చమత్కారం కొంత ఉన్నది. విషయం మాత్రం పూర్తి భిన్నం. నవలలో స్థలకాలాలు ఏవీ నిర్దిష్టంగా చెప్పలేదు కానీ, ఇది రేపటి కాలాన్ని, సమాజాన్ని ఊహిస్తూ చేసిన ఫ్యూచరిస్టు రచన లాగా కనిపిస్తుంది. కానీ, కాల్పనిక భవిష్యత్తు పేరుతో రచయిత చెప్పింది మాత్రం పచ్చి వర్తమానాన్నే. ఎవరి తదనంతరాన్ని నవల చర్చించిందో, వారు పీఠం మీద కొనసాగుతున్నారు. సృజనాత్మకరచనలో ఊహలకు ఉండే అపరిమితత్వాన్ని రాజకీయ వివేకంతో ఆకార్ పటేల్ ఉపయోగించుకున్నారు. అధికార కేంద్రాన్ని ఆవరించుకుని ఉన్న హింసాబీభత్సాలను వ్యంగ్యంగా, గుంభనంగా, కొంటెగా, సాహసంగా చిత్రించే కథనాన్ని ఇందులో రచయిత ఆశ్రయించారు. దాదాపు ఏడాది కిందట ఆయన ఈ రచన చేశారు కాబట్టి, దీనిపై 2024 ఎన్నికల ఫలితాల, పర్యవసానాల ప్రభావం లేదు.

'నియంత అంతం' పేరుతో ఈ నవల 'మలుపు బుక్స్' ప్రచురణగా ఈ మధ్యే తెలుగులో వచ్చింది. 'వీక్షణం' సంపాదకులు, ప్రసిద్ధ రచయిత ఎన్. వేణుగోపాల్ దీనిని సమర్థంగా, సరళంగా అనువదించారు. తెలుగు పాఠకులకు అంతగా పరిచయం కాని రాజకీయ వాతావరణాన్ని, సన్నివేశాలను అనువదించడంలోను, మూలరచయిత ఉద్దేశించిన ధ్వని, వ్యంగ్యాలు తగ్గకుండా చూడడంలోను వేణుగోపాల్ నైపుణ్యం ప్రస్ఫుటంగా కనిపిస్తుంది.

ఈ నవల పఠనానుభవం ప్రత్యేకమైనది. నవలలోని పాత్రలు, వాటి స్వభావాలు పరిచయం అవుతున్న క్రమంలో రచయిత ఉద్దేశించిన వాస్తవ వ్యక్తులు స్ఫురించి, రెండో అర్థాన్ని కనిపెడుతున్న రహస్యానుభూతి మొదట కలుగుతుంది. తరువాత తరువాత, కథాగమనంలోను, పాత్రల సంభాషణల్లోనూ వ్యక్తమయ్యే దేశ అధికార వ్యవస్థల ప్రక్రియలను, వాటి లోగుట్టులను చదువుతున్నపుడు భయం వేస్తుంది. మనం వార్తల ద్వారా, ఇతరత్రా తెలుసుకున్న సంఘటనలు ఆయా సన్నివేశాలలోకి పొడుచుకువచ్చి, మనకు ఒక జలదరింపు కలుగుతుంది. మొత్తంగా ఏదో ఒక అవగాహన కలుగుతుంది కానీ, ఆ తెలివిడి చాలా విచారాన్ని కూడా కలిగిస్తుంది.

పెద్దాయన చనిపోవడంతో కథ మొదలవుతుంది. ఆయన ఆకస్మిక మరణంతో ఉత్పన్నమయిన పరిస్థితితో తొలి అధ్యాయాలు కొనసాగుతాయి. జయేష్ షా, స్వామి అనే ఇద్దరు పెద్దాయన స్థానం కోసం పోటీపడతారు. వారిలో జయేష్ షా, పెద్దాయనకు కుడిభుజంగా ఉండేవాడు. కొంతకాలం అంతరంగిక భద్రతాశాఖ నిర్వహించాడు కూడా. మనుషులను, పరిణామాలను నియంత్రించడంలో ఆయనకు తనదైన నిర్దాక్షిణ్యమైన పద్ధతులున్నాయి. రాష్ట్రాలలో పనిచేస్తూ ఉండిన స్వామి కూడా కొంత బలం పుంజుకుంటున్న నాయకుడు. ఈ ఇద్దరి తగవు తెగక, తాత్కాలిక ఏర్పాటుగా మీరా అనే సామాజిక కార్యకర్తను ప్రధాని చేయాలనుకుంటారు. చనిపోయిన సీనియర్ నాయకుని కూతురు ఆమె. మీరా ఆదివాసులలో వారి హక్కుల కోసం పనిచేస్తూ ఉంటుంది. పదవిని స్వీకరించడానికి తటపటాయిస్తున్న మీరా మీద ఒత్తిడి తేవడానికి, ఆమె లాయర్ కూతురును జయేష్ షా అరెస్ట్ చేయిస్తాడు. పదవి స్వీకరించి ఏదన్నా చేయవచ్చునేమో అన్న చిన్న ఆశతో మీరా ప్రధాని అవుతుంది. ఆదివాసుల నుంచి భూమిని ప్రభుత్వం తీసుకోవడానికి వీలులేకుండా ఒక బిల్లు తెద్దామనుకుంటుంది. దానికి అన్ని వైపుల నుంచి, చివరకు ప్రతిపక్షం నుంచి కూడా వ్యతిరేకత వస్తుంది. ఏకుమేకైన మీరాను దింపడానికి రిసార్టు రాజకీయం మొదలవుతుంది. చివరకు, పదవి నుంచి మీరా దిగిపోయి, తిరిగి ఆదివాసీ సమాజంలో పని చేయాలని నిర్ణయించుకుంటుంది.

నిజానికి ఈ కథలోని ఇతివృత్తం తప్ప, కథాగమనం ఏమంత గొప్పది కాదు. ఆకార్ పటేల్ ఈ నవల ద్వారా ప్రధానంగా చేసినవి రెండు. ఒకటి, పెద్దాయన చేసిన విధ్వంసం ఏమిటో ఆయన మరణానంతర సన్నివేశాల ద్వారా చెప్పదలచుకున్నారు. రెండు, సంకోచిస్తూనే ప్రధాని పదవి స్వీకరించిన మీరా పాత్ర ద్వారా, కీలక అధికార స్థానాల్లోకి మంచి వ్యక్తులు వచ్చినా వారు తీవ్ర ప్రతిఘటనను ఎదుర్కొంటారనీ సూచించదలచారు. మొదటి అంశం ద్వారా, వర్తమానంలో చూస్తున్న దేశస్థితిగతులను తీవ్ర విమర్శనాత్మకంగా చిత్రించారు. రెండో అంశం ద్వారా, రాజ్యం, ప్రభుత్వం అధికారికంగానూ, అనధికారికంగానూ పనిచేసే విధానం, అందులో ప్రాబల్యాలు, ప్రయోజనాలు వ్యక్తమయ్యే తీరు పటేల్ చెప్పారు.



> నవలలో స్థలకాలాలు ఏవీ నిర్దిష్టంగా చెప్పలేదు కానీ, ఇది రేపటి కాలాన్ని, సమాజాన్ని ఊహిస్తూ చేసిన ఫ్యూచరిస్టు రచనలాగా కనిపిస్తుంది. కానీ, కాల్పనిక భవిష్యత్తు పేరుతో రచయిత చెప్పింది మాత్రం పచ్చి వర్తమానాన్నే. ఎవరి తదనంతరాన్ని నవల చర్చించిందో, వారు పీఠం మీద కొనసాగుతున్నారు. సృజనాత్మకరచనలో ఊహలకు ఉండే అపరిమితత్వాన్ని రాజకీయ వివేకంతో ఆకార్ పటేల్ ఉపయోగించుకున్నారు. అధికార కేంద్రాన్ని ఆవరించుకుని ఉన్న హింసాబీభత్సాలను వ్యంగ్యంగా, గుంభనంగా, కొంటెగా, సాహసంగా చిత్రించే కథనాన్ని ఇందులో రచయిత ఆశ్రయించారు.


కథాసారాంశాన్ని చదివినవారికి, ఆయా పాత్రలు ఎవరెవరిని పోలి ఉన్నాయో తెలుసుకోవడం కష్టమేమీ కాదు. రచయిత, తన మూలపాత్రల గురించిన స్ఫురణలను ఏ మాత్రం నియంత్రించాలనుకోలేదు. కథారంభంలో, చనిపోవడానికి ముందు, ఒక ప్రభుత్వాస్పత్రి ప్రారంభోత్సవానికి పెద్దాయన అతిథిగా వస్తారు. అక్కడి సన్నివేశాన్ని రచయిత ఇట్లా వర్ణించారు. "...అక్కడ రెండు పెద్ద తెరల మీద జాతికి, ప్రత్యేకంగా వైద్య ఆరోగ్యరంగాలకు పెద్దాయన అందించిన కానుకల దృశ్యాలున్నాయి. ఆయన గతానికి సంబంధించిన కల్పనతో కూడిన సమాచారం ఉంది. ఒక చిన్న పిల్లవాడు ఒక పనికిరాని ఆస్పత్రి సిబ్బందిని మందలిస్తున్న నలుపు తెలుపు చిత్రాన్ని ప్రదర్శిస్తున్నారు. మరొక చిత్రంలో పెద్దాయన పోలికలతో ఉన్న యువకుడు కొవ్వొత్తి వెలుగులో వైద్యశాస్త్రగ్రంథాలను శ్రద్ధగాచదువుతున్నాడు. ఈ చిత్రాలకుతోడుగా సైనికుల కవాతు శబ్దం వినిపిస్తోంది." పెద్దాయన చరిత్రను "నిర్మించడానికి" యంత్రాంగం పడుతున్న పాట్లు అవి. బాల్యంలోను, యవ్వనంలోనూ వైద్య శాస్త్రాన్ని ఆ పెద్దాయన అధ్యయనం చేశాడట. ఆ వేడుకలో ఆయన ఆహార్యం కూడా వైద్యులదే. మరి సైనికుల కవాతు శబ్దం ఎందుకు? అదే ఆకార్ పటేల్ ప్రత్యేకత!

పెద్దాయన హయాంలో ప్రధానమంత్రి కార్యాలయం (ప్రమంకా) సమూలంగా మారిపోయింది. అన్ని మంత్రిత్వశాఖలూ ఆయన ఆఫీసునుంచే పనిచేసేవి. "పెద్దాయన నేతృత్వంలో జరిగే భారీ ఘటనలూ, ఉత్సవాలూ రూపొందించడం మీదనే మంత్రిత్వ శాఖలు దృష్టి పెట్టేవి." "అప్పటికే పూర్తిగా తయారై, వేలు పెట్టడానికి అవకాశం లేని స్థితిలో మాత్రమే ఫైళ్లు మంత్రుల సంతకాల కోసం వాళ్ల దగ్గరికి వచ్చేవి." "పెద్దాయనకు వీలయినప్పుడు, లేదా ఆయనకు చెయ్యడానికి మరే పనీ లేనప్పుడు మంత్రివర్గ సమావేశాలు అనేవి జరుగుతుండేవి." ఇక ప్రజల అనుభవంలోకి వచ్చిన పెద్దాయన పాలనలో "అసమ్మతి అనే మాటకూ దేశద్రోహం అనే మాటకూ మధ్య విభజనరేఖ చెరిపివేయబడింది. పెద్దాయన అనే వ్యక్తికి అతీతంగా, బైట రాజ్యం అనేదే లేదనే పరిస్థితి తలెత్తింది". మరి, జయేష్ షా ఎట్లా ఉంటాడు? "..ఆయన మనుషులను పిలిచి కూచోబెట్టి మాట్లాడుతాడు. ఒత్తిడి చేస్తాడు. బలవంతపెడతాడు. సరే ఎట్లాగూ బెదిరింపులూ సాగుతాయి. ఆ గదిలో పుస్తకమనేది లేదు". అవసరమైన మనుషులందరి వ్యక్తిగత విశేషాలను, సామాజిక మాధ్యమాలలో నడవడిని నిశితంగా పసిగట్టి, వాటి ఆధారంగా చర్యలు తీసుకునే చాణక్యుడు జయేష్ షా. ప్రశాంతంగా ఎంతటి కర్కశమైన పనులైన చేయగల వ్యక్తిగా ఆ పాత్రను పటేల్ చిత్రించారు.

ప్రధానమంత్రి పదవి స్వీకరించే క్రమంలోను, ఆ తరువాత బాధ్యతలను నెరవేర్చడం మొదలుపెట్టిన కొత్తలోను మీరా, ప్రమంకా సిబ్బందితో సంభాషిస్తుంది. రిటైర్ కాబోతున్న ఉన్నతోద్యోగి జోషి, ఆ స్థానంలోకి రాబోతున్న ఆయేషా, ఆమె సహాయకుడు ప్రభు, మేనేజర్ మీరాతో ఎక్కువ సంభాషణలు చేస్తారు. ఒక సందర్భంలో అటార్నీ జనరల్ మీరాతో సంభాషిస్తారు. ఈ మాటల్లో అధికార స్వభావం గురించిన అనేక అనుభవ సత్యాలు వ్యక్తమవుతాయి. రాజ్యం ఎప్పుడూ ఎవరో తన మీద దాడి చేయబోతున్నట్టు, తాను బలహీనంగా ఉన్నట్టు భావించుకుంటుందని, ఆదర్శానికీ పాలనకూ ఘర్షణ ఏర్పడిందని, పాలనను పటిష్ఠం చేసుకోవడం కోసం రాజ్యం అధికారాలు పెంచుకుంటూ పోయిందని అటార్నీ జనరల్ ఒక విశ్లేషణ ఇస్తాడు. "రాజ్యం అనేది హింసాత్మక సాధనం. అదేమీ ఆదర్శ సాధనం కాదు. అది ఎన్జీవో కాదు... రాజ్యం అంటే హింస మీద గుత్తాధిపత్య అధికారం ఉన్న సంస్థ అని ఎవరో వర్ణించారు. దాన్ని అలాగే నిర్వచించాలి. హింస ద్వారా నిర్వచించాలి. అది హింసాత్మకంగా ఉండడం మాత్రమే కాదు, హింసను తన చేతుల్లో గుత్తాధికారంగా మార్చుకుంటుంది. అంటే అర్థం, దాని గుత్తాధిపత్యాన్ని ప్రశ్నించే వాళ్ల మీద దాడి చేస్తుంది" అనుభవజ్ఞుడైన ప్రమంకా మేనేజర్ ఒక సంభాషణలో మీరాతో అంటాడు. "..రాజ్యం అనేది ఒక హింసాత్మక రాజకీయ జంతువు. అసలు అది అట్లా ఉన్నందుకు ఉన్నత వర్గాలు దాన్ని చాలా ప్రశంసిస్తాయి. ప్రత్యేకంగా పెద్దాయన వంటి వ్యక్తులు దానికి నాయకత్వం వహిస్తే ఇంకా మెచ్చుకుంటాయి... హింసను ఎంత విజయవంతంగా వాడితే అంతగా ప్రోత్సాహకరమైన ప్రశంస అందుతుంది" అని ఆ మేనేజర్ మీరాకు కీలకసందర్భంలో స్పష్టత ఇస్తాడు.

ఈ నవలలో పెద్దాయన పాలన ప్రజల వ్యతిరేకత వల్ల పోలేదు. మీరాను ప్రజలు ఎన్నుకోలేదు. రెండుపరిణామాలూ ప్రమాదవశాత్తూ జరిగినవే. అయితే, ప్రధానమంత్రి స్థానంలో ఒక కొత్త వ్యక్తి, ఆదర్శాలు మాత్రమే తెలిసిన వ్యక్తి రావడం వల్ల, ఆమె వైపు నుంచి అధికారకేంద్రాల సందర్శన పాఠకులకు సాధ్యమైంది. అప్పటి దాకా ఉన్న ఒక స్వాతిశయమూ స్వీయ ఆరాధకుడూ అయిన ఒక జనరంజక నియంత వ్యవహార సరళి ఎట్లా ఉన్నది, ఆయన చుట్టూ ఎటువంటి వ్యవస్థ పనిచేస్తున్నది చెప్పడానికి కూడా ఆస్కారం కలిగించింది. ఆకార్ పటేల్ రాజకీయ విశ్వాసాలేమిటో తెలియదు కానీ, ప్రస్తుత వ్యవస్థ మరమ్మత్తుకు, ఆదర్శ వ్యక్తుల చేతిలో సంస్కరణకు ఆస్కారం ఇవ్వదని ఆయన ఈ నవల ముగింపులో చెప్పదలచుకున్నారా? లేక, సాధికారతా సాధన అన్నది అట్టడుగు నుంచే మొదలు కావాలని కథానాయిక ద్వారా భావించారా?

• కె. శ్రీనివాస్



'నియంత అంతం'
రచయిత: ఆకార్ పటేల్
అనువాదం: ఎన్. వేణుగోపాల్
ప్రచురణ: మలుపు బుక్స్
ఫోన్: 63059 91831

ఎప్పుడో వందేళ్ళనాడు శరత్‌చంద్ర చటర్జీ రచించిన బెంగాలీ నవల 'దేవదాసు' ఆధారంగా బెంగాలీ, హిందీ, తెలుగు, తమిళం, మలయాళం భాషలలో సుమారు డజను చలన చిత్రాలు తయారైనాయి. 1928లో ఇంకా సినిమాలు మాటలు నేర్వకముందే– ఒక మూకీ చిత్రం కూడా దేవదాసు కథతో తయారయింది. 2002 సెప్టెంబరు 16 నుంచి 21 వరకు హైదరాబాద్ ఫిల్మ్ క్లబ్ వారు 'దేవదాసు' చలన చిత్రోత్సవం నిర్వహించి తమకు అందుబాటులో వున్న ఆరు 'దేవదాసు' చిత్రాలను ప్రదర్శించారు. వాటిలో అతి ముఖ్యమైనవని మేము అనుకున్న మూడు చిత్రాలను గురించి 2002 అక్టోబరు, నవంబరు, డిసెంబరు 'రసమయి' మాసపత్రికలో వ్యాసాలు, లేఖలు, ఫొటోలు వగైరా ప్రచురించాం– మొత్తం 40 పేజీలు. అయినా ఇంకొక్క వ్యాసం మిగిలిపోయింది. దాన్ని కూడా ప్రచురించాలని అనుకుంటుండగానే అది ఎలాగో మరుగున పడిపోయింది; తర్వాత మరపున పడిపోయింది. ఆకస్మికంగా, ఆశ్చర్యకరంగా అది ఇప్పుడు 'త్రవ్వకాలలో' బయల్పడింది. ఇది 2002లో రాసినది. – నం.పా.సా

శరత్ దేవదాసు... అసమర్థుడు కాదు, శీలవంతుడు

'దేవదాసు' గొప్పపాత్ర. దేశ భాష కాలావధులకు అతీతంగా అందరి సానుభూతినీ చూరగొనగలిగిన పాత్ర అది. దేవదాసు బలహీన వ్యక్తిత్వం కలిగినవాడనీ, చంచల స్వభావంగలవాడనీ, అసమర్థుడనీ, అతడి విషాదానికి ఆ లక్షణాలే కారణాలనీ, పార్వతి మాత్రం నిబ్బరంగా తట్టుకోగలిగిందనీ, ఆత్మాభిమానం గల స్త్రీ అనీ అనడం ఎంతవరకు న్యాయం? దేవదాసు కంటే ఆమె ఏ విధంగా ఉన్నతమైనది?

దేవదాసు తనను అసహ్యించుకున్నా 'ఆత్మాభిమానం' ప్రదర్శించక, పూర్తిగా ఆత్మార్పణం చేసుకుని, అతడి కోసం తన వృత్తిని, సంపాదనను, సుఖాన్ని త్యాగం చేసి, అతడికి సేవ చేసి జన్మధన్యమయిందనుకున్న చంద్రముఖి ఇంకా ఎంత ఉన్నత వ్యక్తిత్వంగలది? వరించి వచ్చిన సౌందర్యవతిని మైకంలో సైతం తాకని దేవదాసు ఎంత గొప్ప శీలవంతుడు? దేవదాసు చిన్నప్పుడు కోపం వస్తే పార్వతిని కొట్టేవాడు, తిట్టేవాడు. మళ్ళీ అంతలోనే తప్పును ఒప్పుకుని, ఆమెను సముదాయించేవాడు. తన మీద అతడికి ఎంత అభిమానమో ఆమెకు తెలుసు. అందుకే కదా ఆమెకెప్పుడూ అతని మీద కోపం రాలేదు. అప్పుడు లేని ఆత్మాభిమానం ఆమెకు అత్యంత ప్రమాదకరమైన, క్లిష్టమైన తరుణంలో ఎందుకొచ్చింది? తండ్రిని ఎదిరించమని అంతకు ముందు అతడికి సలహా ఇచ్చిన ఆమె, అతడు ఏదో తెగించడానికి సిద్ధపడి వచ్చినప్పుడు తను తన తండ్రిని ఎదిరించడానికి ఎందుకు సిద్ధపడలేక పోయింది? దేవదాసు జీవితం విషాదమయం కావడానికి ఆమె తొందరపాటుతనం, 'ఆత్మాభిమానం' కారణం కాదా? ఇవి ఇప్పటికి తొమ్మిది దశాబ్దాలుగా పాఠక, ప్రేక్షకలోకంలో చర్చించబడుతున్న అంశాలు. దేవదాసు, పార్వతి, చంద్రముఖి– ఈ మూడు పాత్రల మధ్య గల వైరుధ్యాల వల్లనే నవల అంతగా ఆకట్టుకొన్నది. ఆ నవలను, ఆ మూడు పాత్రలను మరచిపోవడానికి అవకాశం లేకుండా ప్రతి తరంలోనూ ఒక కొత్త సినిమాలో వారు దర్శనమిస్తూనే ఉన్నారు; పునర్జన్మిస్తున్నారు. దేవదాసు చిత్రాలేకాక, ఆ తరహా ప్రేమకథా చిత్రాలు కూడా ఎన్నో ఉన్నాయి. పాఠకులు, ప్రేక్షకులు ఆ మూడు పాత్రలను మరచిపోవడం అసంభవం. వారి మనస్సులో ఆ ముగ్గురూ చిరంజీవులు.

ఒకరి పట్ల ఒకరికి ఎంత ప్రేమ, గౌరవం ఉన్నా, ఒకరిని విడిచి ఒకరు ఉండలేనంత గాఢమైన బంధం ఉన్నా సరియైన తరుణంలో సరియైన నిర్ణయం తీసుకోలేకపోవడం వల్ల, ఆత్మార్పణం ఉండాల్సిన చోట 'ఆత్మాభిమానం' వచ్చి కూర్చోవడం వల్ల ఏది జరగకూడదో అది జరుగుతుంది. పార్వతి, దేవదాసుల కథలో అదే జరిగింది.

దేవదాసు పిరికివాడు, సంఘానికి వెరచేవాడు అయితే, చంద్రముఖి ఇంటికి తరచుగా ఎందుకు వెడతాడు? వేశ్యయింటికి పోవడం రసికత్వానికి చిహ్నంగా భావించి, మజా చేయడానికి వెళ్ళే జమీందార్లలాగా అతడు వెళ్ళలేదు. న్యూనతాభావంతో నెత్తిన చెంగేసుకుని, చీకట్లో రహస్యంగా వెళ్ళలేదు. తలఎత్తుకునే, బాహాటంగానే వెళ్ళినా చంద్రముఖిని తాకలేదు. తనను ఆమె తాకితే చీదరించుకున్నాడు. తాగిన మైకంలో కూడా అతడు ఆమెను ముట్టుకోనివ్వలేదు. పార్వతి తప్ప మరో స్త్రీ స్పర్శను అతను సహించలేకపోయాడు. పార్వతిని కూడా అతనెప్పుడూ కాముకదృష్టితో చూడలేదు. ఆమె తన భార్యకావాలన్న కోరికే అతడికి లేదు. అతడు అసాధారణ శీలవంతుడు, ధనకాంక్షలేనివాడు; చంద్రముఖి వృత్తిని అసహ్యించుకున్నాడు గాని వ్యక్తిగా ఆమె పట్ల అగౌరవం లేదు. స్వార్థబుద్ధిలేనివాడు. జేబులో డబ్బుంటే ఎంత అని చూసుకోకుండా ఇవ్వగలిగినవాడు. పిత్రార్జితం కూడా దబాయించి తీసుకోలేదు. తండ్రి పోయాక అంతా అన్నకే వదిలేసి తన తాగుడికి కొద్దిగా తెచ్చుకున్నాడు. చంద్రముఖికి కొంత డబ్బు ఇచ్చాడు– ఆమె నుంచి ఏ సుఖం ఆశించకుండా. దాదాపు సన్యాసిలాగా బతికాడు.

తండ్రిపోయాక తన వాటాకు వచ్చిన డబ్బుతోనే అన్నదానం చేశాడు. తన జీవితాన్ని నరకప్రాయం చేసిన తండ్రి మీద అతడికి ద్వేషం లేదు. తను బాధపడ్డాడు. బతకాలన్న కోరిక లేక, చనిపోవాలనే తాగాడు. అది తన ప్రాణం తీస్తుందని తెలిసే తాగాడు. తండ్రి మరణశయ్య మీద వున్నా అతడు వెళ్ళలేదు. తాగుబోతుగా మారిన తన మొహం ఆయనకి చూపించడం ఇష్టం లేక వెళ్ళలేదు. ఏ కారణాల వల్ల అతడిని బలహీనుడని అంటున్నారు? ఒకవేళ బలహీనుడనే అనుకున్నా ప్రపంచంలో బలహీనతలు లేనివాళ్ళవరైనా ఉన్నారా?



> దేవదాసు, పార్వతి, చంద్రముఖి– ఈ మూడు పాత్రల మధ్య గల వైరుధ్యాల వల్లనే నవల అంతగా ఆకట్టుకొన్నది. ఆ నవలను, ఆ మూడు పాత్రలను మరచిపోవడానికి అవకాశం లేకుండా ప్రతి తరంలోనూ ఒక కొత్త సినిమాలో వారు దర్శనమిస్తూనే ఉన్నారు; పునర్జన్మిస్తున్నారు. పాఠకులు, ప్రేక్షకులు ఆ మూడు పాత్రలను మరచిపోవడం అసంభవం. వారి మనస్సులో ఆ ముగ్గురూ చిరంజీవులు.

తండ్రిని ఎదిరించలేకపోవడం బలహీనతా? ఎదిరించి పార్వతిని చేసుకుందామనుకునే సరికి కాలాతీతమైంది. పార్వతిని బలం గల పాత్ర అని ఎలా అన్నారు? దేవదాసే తన సర్వస్వం అనుకున్న పార్వతి, అతను లేకుండా తను జీవించలేననుకున్న పార్వతి, నేను తల్లిదండ్రులను ఒప్పిస్తానని అతను అన్నప్పుడు ఎందుకు సరేననలేకపోయింది? అంత గాఢమైన ప్రేమలో 'ఆత్మాభిమానం' అనేది అడ్డం వస్తుందా? సర్వం అర్పించుకున్న ప్రేమా అది? ఆ కొద్ది నిమిషాలలో ఆమె అన్న మాటలు, ఆమె ప్రవర్తన ఇద్దరి జీవితాలను నరకం చేశాయి. తండ్రి నెదిరించలేని దేవదాసును పిరికివాడంటే, పార్వతి తన తండ్రిని ఎదిరించగలిగి ఉండేదా? 'నేను చేసింది ఒకే ఒక్క తప్పు. దానికి ఇంత శిక్షా' అని దేవదాసు అంటున్నప్పుడు ప్రతి పాఠకుని, ప్రేక్షకుని గుండె తరుక్కుపోతుంది. ఆమె లేకుండా తను జీవించలేడు, ఆమెపై తప్ప మరెవరిపైనా తను ఆధారపడలేడు అనే సంగతి తెలుసుకోవడంలో ఆలస్యం జరిగింది. తెలుసుకునే సరికి ఆమె అహంకారంతో, ఆత్మాభిమానంతో బిగదీసుకుంది. పరిస్థితి చేయిజారిపోయాక ఇద్దరూ నిస్సహాయ స్థితిలో పడిపోయారు.

ప్రేమ వైఫల్యం పొందినా పార్వతి నిబ్బరంగా నిలబడగలిగింది. భర్త సంసారాన్ని చక్కదిద్దింది కాబట్టి ఆమె వ్యక్తిత్వం బలమైనదనీ, వైఫల్యాన్ని తట్టుకోలేకపోయాడు కాబట్టి ఇతడు బలహీనుడనీ చాలా మంది అంటుంటారు. పార్వతిలాగే ఇతడూ ఒక జమీందారు కూతుర్ని పెళ్ళి చేసుకుని, కలకత్తాలో బంగళా కొనుక్కుని (లోపల పార్వతి కోసం ఎంత బెంగపడుతున్నప్పటికీ) నిబ్బరంగా కాపురం చేయగలిగితే అతడిని సమర్థుడైన, 'బలవంతుడైన' కథానాయకుడుగా అంగీకరించేవారా? పార్వతి మరొక పురుషుని స్పర్శని భరించగలిగింది. దేవదాసు మరొక స్త్రీ స్పర్శను భరించలేకపోయాడు. మరొక స్త్రీతో సంబంధం అతడి ఊహలోకి కూడా రాలేదెప్పుడూ. తనను ప్రేమించి, తన కోసం వేశ్యావృత్తిని మానుకుని, తన సేవకే జీవితాన్ని అంకితం చేసుకున్న చంద్రముఖి స్పర్శను తాగుడుమైకంలో సైతం భరించలేకపోయాడు. చంద్రముఖి నిస్వార్థ త్యాగాన్ని, నిష్కల్మషమైన ఆమె ప్రేమను అర్థం చేసుకున్నాక ఆమెపై అతడికి ఎంతో గౌరవం కలిగింది. అయినా, ఆమె పొందును కోరుకోలేదు. తన కోసం ఆదాయాన్ని వదులుకున్న ఆమెకు గౌరవంగా బతకడానికి డబ్బిచ్చాడు. అతడు బలహీనుడా? అతడు పండితుడు, మేధావి, మహాపురుషుడు కాదు. కాని అసాధారణ శీలవంతుడు. పల్లెటూరు నుంచి పట్నానికి పోయి, కాలేజీలో చదువుతూ, సూటూ, బూటూ వేసినా, దండిగా డబ్బున్నా, అడ్డుపెట్టేవాళ్ళెవరూ లేకపోయినా అతడికి చెడు అలవాట్లేవీ అబ్బలేదు సిగరెట్టు తప్ప.

○ నండూరి పార్థసారథి

(ఇటీవల కన్నుమూసిన రచయిత, జర్నలిస్టు నండూరి పార్థసారథి అముద్రిత రచన ఇది)

కట్టుబానిసత్వానికి కొత్తరూపం!

బ్రిటీష్ వారు మొదలు పెట్టిన ఒప్పంద కార్మిక వ్యవస్థ ఒకవిధంగా నిర్బంధ వలస కార్మిక వ్యవస్థ. బానిసత్వ వ్యవస్థను రద్దు చేసిన తరువాత దాని స్థానంలో 'ఇండెంచర్ (ఒప్పంద కార్మిక)వ్యవస్థ'ని వినియోగించాలని బ్రిటిష్ పార్లమెంట్ నిర్ణయించింది. ఈ వ్యవస్థను బ్రిటీష్ సామ్రాజ్యవాదులు తమకు అనుకూలంగా ఏర్పాటు చేసుకున్నారు. అన్ని విధాలుగా కార్మికులను వాడుకుంటూ తక్కువ ఖర్చుతో ఎక్కువ లాభాలను పొందడానికి ఈ వ్యవస్థను రూపొందించారు. ఆయా దేశాల్లో మంచి పని పరిస్థితులు, తగినంత వేతనాన్ని కల్పించే చట్టపరమైన ఒప్పందాల ఆధారంగా 5 నుంచి 10 సంవత్సరాల వరకూ పని చేయబోతున్నట్లుగా నమ్మించి భారతీయ కార్మికుల్ని వలసరాజ్య శక్తులు తీసుకుపోగలిగారు. బ్రిటీష్ వారి తోటల్లో పనిచేయడానికి తెలిసో తెలియకో, భారతీయులు చేసుకునే ఈ రాతపూర్వక ఒప్పందాన్ని గిర్మిట్ (అవధీ భాష) అన్నారు. అంటే ఖాయపర్చుకున్న వాళ్లు, లేదా న్యాయపరంగా కట్టుబడ్డవాళ్లు. కార్మికుల సంపూర్ణ శ్రమని వాడుకొనేందుకు, గమ్య స్థానంలోని దేశాల్లో సారవంతమైన నేలల్ని సిద్ధంగా ఉంచారు. ఆ నేలలో వచ్చిన వాణిజ్య పంటలతో లాభదాయక వ్యాపారానికి బాటలు వేసుకున్నారు.


ఒప్పంద కార్మిక విధానానికి అనువుగా భారతదేశంలో పరిస్థితులు అప్పట్లో బ్రిటిష్ వారికి కలిసొచ్చాయి. బ్రిటీష్ రెవెన్యూ విధానాల ప్రభావంతో, రైతులే కాదు, అగ్రకులాల వారు, వ్యాపారులు, చేతివృత్తులవారు, వ్యవసాయదారులు, కార్మికులు, గ్రామీణ భారతదేశంలో బ్రిటిష్ ప్రభుత్వపు తీవ్ర మార్పులకు బాధితులయారు. దానికి తోడు 1860– 1908ల మధ్య 20 కరువులు, ఒకదాని తరువాత ఒకటి ముంచెత్తాయి. అవి పేదరికానికి, విస్థాపనలకు, భూకబ్జాలకు దారితీసాయి. కరువులూ, పెరుగుతున్న గ్రామీణ దుస్థితి, వారి కష్టాలను భరించరానివిగా చేసాయి. ఫలితంగా ఉపాధి కోసం పురుషులు, స్త్రీలు సైతం పట్టణ కేంద్రాలకు వలసలు వెళ్లడం ప్రారంభమయింది. ఈ వలసల్లో భాగంగానే కష్టాలనుండి బయటపడాలనుకున్న జనసమూహం ఒప్పంద కార్మిక వలసదారులయ్యారు. కొందరు ఆర్కటీల (దళారుల) మోసపూరిత నియామక పద్ధతులకు బాధితులయ్యారు. ఆర్కటీలు ఒప్పందంతో దొరికే పనివాళ్ల అన్వేషణలో ఉండేవారు. అనాథల్లా సందేహాస్పదంగా తిరుగుతున్న మనుషులు మద్రాసు, బొంబాయి, కలకత్తా నగరాల్లో అనేకులు వారికి కనిపించేవారు. అటువంటి వారిని జీతభత్యాల ఆశ చూపించి తరలించుకుపోయేందుకు ఒప్పించగలిగేవారు.

ఏదోలా సమీకరించుకున్న వ్యక్తులను వారు వెళ్లాల్సిన ప్రాంతాన్ని బట్టి ఆర్కటీలు, మద్రాసు లేదా కలకత్తా దగ్గర లోని ఓడలెక్కించే ప్రదేశంలోని డిపోలకు తీసుకుపోయేవారు. డిపోలకు కొత్తగా వచ్చిన వ్యక్తులకు, ఒక భారతీయ వైద్యుడు పురుషులను తనిఖీ చేస్తే, ఒక భారతీయ నర్సు మహిళా కార్మికులను తనిఖీ చేసేది. దృష్టి, వినికిడి సామర్థ్యం తనిఖీ చేయబడేవి. కార్మికులకు సుఖరోగాలున్నాయేమోనని అతి జాగ్రత్తగా తనిఖీ చేసేవారు.

పొగ ఓడలు రాక ముందు సముద్రయానం 90 నుండి 120 రోజులు వరకూ పట్టేది. కలకత్తా నుంచి జమైకాకు 180 రోజులు పట్టేది, నాటాల్‌కు 84 రోజులు, మారిషస్ రీయూనియన్‌లకు 70 రోజులూనూ. సగటున 300 నుండి 550 మంది ప్రయాణికులు ఓడల్లో అంత కాలం గడపడం మూలాన రోగాలు వచ్చేవి, మరణాలు ఎక్కువగా ఉండేవి. పొగఓడల రాకతో మరణాల సంఖ్య కొంత తగ్గింది. ప్రయాణాలకు పట్టే సమయం కూడా 50 శాతం తగ్గింది. ఓడలో మనిషి ఏదైనా తినగలగాలి. ఓడ అనేది జగన్నాథుని దేవాలయం లాంటిదని, అక్కడ కుల ఆంక్షలకు తావులేదని వలసదారులు ఓడలో జీవితానికి సంబంధించి ఒక ఆసక్తికరమైన సిద్ధాంతాన్ని కనుగొన్నారు. ఇది అంతస్తులను సమంచేసే ఒక గొప్ప సాహస ప్రయాణంగా దానికి వివరణ ఇచ్చారు.

ఒక చేతిలో పాస్, మెడను అలంకరించే 'టిన్ టికెట్' అనే బిళ్లను పట్టుకుని, నియమించుకున్న కార్మికులు ఓడ ఎక్కేవారు. మెడకు తగిలించిన బిళ్లలోని సంఖ్య ప్రయాణంలో వారిని గుర్తించడానికి. ఆ సంఖ్య ఆయా దేశాల్లో చేరుతున్న ఒప్పంద కార్మికుల క్రమ సంఖ్య కూడా. ఆ సంఖ్యతోనే డిపోలలో భారతీయ కార్మికుల పేరు, తండ్రి పేరు, వయస్సు, ఆడా/మగా, బాలుడు/బాలిక, కులం, ఎత్తు, గ్రామం, థానా, జిల్లా, గుర్తులు, విశేషాంశాలు, యజమానిలాంటి అనేక వివరాలన్నీ నమోదు చేసుకునేవారు. అత్యంత ముఖ్యమైన జాబితా అది. ఆ సమాచార వివరాలే వెళ్లిన వారి మూలాలను వెలికితీసేందుకు ఇప్పటికీ ఎవరికైనా సహాయపడుతున్నాయి. ఇక్కడనుంచి వెళ్లిన వారి వివరాలు, నిజానికి ఇక్కడే ఉండాలి, దొరకాలి. ఆ వివరాలు ఎక్కడో ఇతర దేశాల జాబితాల్లో వెతుక్కోవలసిన దుస్థితి మనది. ఒప్పంద కార్మికుల వారసులు ఇప్పటికీ ఎందరో ఆ వెతుకులాటల్లోనే ఉన్నారు. అందులో వారు పడ్డ, పడుతున్న కష్టాల్ని నమోదు చేసుకుంటున్నారు. 'ఆరుగంటల ప్రయాణమే ట్రినిడాడ్ పోవడానికి అని చెప్పి ఓడ ఎక్కించారు. 103 రోజులు పట్టింది చేరుకోవడానికి. రోజులు గడుస్తున్నకొద్దీ ఓడల్లో ఉన్న వారందరిదీ అరణ్యరోదన అయింది.' అని అవసాన దశలో ఉన్న ఒకప్పటి ఒప్పంద కార్మికురాలు చెప్పుకుంది. సముద్ర కెరటాలకు, ఓడలోని వారి కన్నీటి కెరటాలకూ తేడా లేదు అనిపిస్తుంది. వారి దుఃఖసాగరాల ముందు వారు దాటుకుంటూ పోయిన సాగరాలే వెలవెలపోయి ఉంటాయి.

> మెడలో 'టిన్ టికెట్' బిళ్లతో ఒప్పంద కార్మికులు ఓడ ఎక్కేవారు. వారి దృష్టి, వినికిడి సామర్థ్యం, సుఖరోగాలు ఇత్యాదివి తనిఖీ చేసేవారు. మారిషస్ కోసం విశాఖపట్నం కార్మిక నియామకాలకు ముఖ్యమైన ప్రాంతంగా ఉండేది. దక్షిణాది జిల్లాల కోసం రాజమండ్రిలో సబ్‌డిపోలు స్థాపించారు. తెలుగు ప్రాంతాలన్నింటినుంచీ ఒప్పందకార్మికులు తరలిపోయారు. యానాం, పాండిచ్చేరీ నుండి కూడా తెలుగువారు వెళ్లారు. కొంతమంది భారతీయులు స్వదేశానికి తిరిగి వచ్చినా, కులవ్యవస్థను భరించలేక తిరిగి వెళ్లిపోవలసి వచ్చింది.



ఒప్పంద కార్మికులుగా వెళ్తున్న వారిలో ఎక్కువశాతం, ఒకే వ్యక్తి కాదు, కుటుంబం. తండ్రితో పిల్లలు, తల్లితో పిల్లలు, తల్లీ తండ్రితో పిల్లలు, భార్యా భర్త, అక్కా చెల్లెల్లు, అన్నదమ్ములు ఇలా ఎన్నో కలయికలతో ఉన్నవి. భార్య లేకుండా పిల్లల్ని తీసుకువెళ్లిన తండ్రులు, భర్త లేకుండా పిల్లల్ని తీసుకువెళ్లిన తల్లులూ ఉన్నారు. అందులో అనేక మతాలు, కులాలు, ప్రాంతాలు, భాషల వారున్నారు. కొన్ని కుటుంబాలే కాదు, కొన్ని గ్రామాలు సైతం అలా ఖాళీ అయిపోయాయి. ఒప్పంద కార్మికులు ఒప్పందం చేసుకున్నది, చేరాల్సిన ప్రదేశంలో ఐదేళ్ల పనికి మాత్రమే. వారు ఎక్కడికి వెళ్తున్నారో, ఎలా వెళ్తున్నారో, అక్కడి పరిస్థితులేమిటో, నిబంధనలేమిటో ఏవీ వారికి తెలియనిచ్చేవారు కాదు. కానీ చేరిన ప్రదేశంలో, తోటల యజమానులు ఏర్పర్చుకున్న నిబంధనలు అతిక్రమిస్తే, పడే శిక్షలు ఆయా దేశాల్లో చేరుకున్న తరువాతే తెలిసేది. పని చేయననడం, ఇచ్చిన పని పూర్తి చేయకపోవడం, ఆలస్యంగా రావడం, పనికి రాకపోవడం లాంటివన్నీ నేరాలు. వాటిని సరిచేయడం కోసం తిట్టడం, కొరడాలతో కొట్టడం, జీతంలో కోత, జైలుశిక్ష మొదలయినవి అధికారశాసనాలయ్యాయి. అనుమతులు లేకుండా గైర్హాజరుకు తీవ్రమైన శిక్ష పడేది. పర్యవేక్షకుడి అనుమతి లేకుండా తాను పని చేస్తున్న తోటకు రెండు మైళ్లకు మించి కార్మికుడు వెళ్లడానికి లేదు.

ఒప్పంద కార్మికులు ఎదుర్కొన్న ప్రధాన సమస్య వారి భాష. అధికారులతో మాట్లాడినప్పుడు దుబాసీల మీద ఆధారపడవలసి వచ్చేది. భారతీయ భాష–ఆంగ్లం రెండూ తెలిసినవారు దుబాసీలుగా వ్యవహరించేవారు. దుబాసీలు ఎక్కువగా అధికారంలో ఉన్నవారి అభిమానాన్ని పొందడానికే ప్రయత్నించేవారు.

1904లో గాంధీకి 35 సంవత్సరాలు. దక్షిణాఫ్రికాలో పదేళ్ల ఉన్నాడు. దక్షిణాఫ్రికాని వదిలి 1915లో భారతదేశానికి వచ్చాడు. అక్కడ ఉన్నప్పుడు, భారతీయ కార్మికుల్ని కళ్ళారా చూసిన వ్యక్తిగా, ఒప్పంద కార్మిక వ్యవస్థకు వ్యతిరేకంగా ప్రచారం చేయడంలో గాంధీ కీలకపాత్ర పోషించాడు. ఒప్పంద వ్యవస్థకు వ్యతిరేకంగా భారత జాతీయవాదులు కూడా ప్రచారంలో చేరడంతో ఆ ఉద్యమం పెరిగింది. బ్రిటిష్ ప్రభుత్వం చివరకు 1917లో ఒప్పంద కార్మిక విధానాన్ని రద్దు చేయవలసి వచ్చింది. ఒప్పందాల వ్యవస్థ 1919 చివరి వరకు లీజు/పరివర్తన మూలంగా కొనసాగి 1 జనవరి 1920 నుండి మాత్రమే, ఒప్పంద భారతీయ కార్మిక వ్యవస్థ పూర్తిగా నిలిచిపోయింది. కావున 1920 జనవరి 1వ తేదీని 'విమోచన దినం'గా పరిగణిస్తున్నారు. అన్ని దేశాల కాలనీల్లోని ఒప్పంద భారతీయుల కోసం అన్ని ఒప్పందాలు, ఆ తేదీతో ముగిశాయి. దానితో ఒప్పంద కార్మికులు తమ స్వీయ దేశాలకు తిరిగి వెళ్లడానికి అన్ని విధాలా వారికి స్వేచ్ఛ ఏర్పడింది. కొంతమంది భారతీయులు స్వదేశానికి తిరిగి వచ్చినా, కొన్ని ప్రాంతాల్లో కులవ్యవస్థ కారణంగా దుష్ప్రవర్తనని ఎదుర్కొన్నారు. అది భరించలేక చాలా మంది తిరిగి తమ ఒప్పంద దేశాలకు వెళ్లిపోవలసి వచ్చింది.

మారిషస్ కోసం, విశాఖపట్నం కార్మిక నియామకాలకు చాలా ముఖ్యమైన ప్రాంతంగా ఉండేది. అక్కడ 1871లో ఉపప్రతినిధి సంస్థ కూడా ప్రారంభించబడింది. తంజావూర్, తిరుచినాపల్లి వంటి దక్షిణాది జిల్లాల కోసం, మద్రాసు నగరానికి 300 మైళ్ల దూరంలో ఉన్న రాజమండ్రిలో సబ్‌డిపోలు స్థాపించబడ్డాయి. నాటాల్, మలయా, ఫిజీల కోసం కూడా డిపో సౌకర్యాలు ఏర్పర్చారు. మారిషస్, గయానా, ట్రినిడాడ్ & టొబాగో, సురినామ్, ఫిజీలకు, తూర్పు ఉత్తరప్రదేశ్, బిహార్‌ల నుండి పెద్ద సంఖ్యలో ప్రజలు వెళ్ళారు. బెంగాల్, దక్షిణ భారతదేశం నుండి కూడా కొంతమంది అక్కడకు వెళ్ళారు. దక్షిణాఫ్రికా, తూర్పు ఆఫ్రికాలకు గుజరాత్, పంజాబ్, దక్షిణ భారతదేశం నుండి ఎక్కువ మంది వెళ్లారు. అప్పటి ఫ్రెంచ్ కాలనీలైన యానాం, పాండిచ్చేరీ నుండి కూడా రీయూనియన్, ఫ్రెంచ్ గయానాకు తెలుగువారు ఒప్పందవలస కార్మికులుగా వెళ్లారు. మారిషస్ ఇప్పటికీ భారతీయ భాషలను సంరక్షించుకోగలుగుతోంది.

వలసకార్మికుల అధ్యయనంలో భాగంగా నేను, 1860–1911ల మధ్య ఒప్పంద కార్మికులుగా దక్షిణాఫ్రికాలోని నటాల్‌కు వెళ్లిన వారుగా నమోదుచేయబడ్డ 1,52,184 వ్యక్తుల సమాచారాన్ని సేకరించగలిగాను. తెలుగు ప్రాంతాలు, తతిమా దక్షిణ ప్రాంతాల కార్మికులే అందులో 66శాతం. మిగతా 34శాతం మిగిలిన భారతీయులు. తెలుగు ప్రాంతాల్లో అనంతపూర్, బళ్లారి, బాపట్ల, చిత్తూరు, గోదావరి, గుంటూరు, కడప, కళ్లికోట, గంజాం, కృష్ణ, కర్నూలు, కొత్తూరు, మచిలీపట్నం, నెల్లూరు, పాలకొండ, రాజమండ్రి, వైజాగపటం, విజయనగరం, కడలూరు, ఉత్తర ఆర్కాట్, హనుమకొండ, వరంగల్, భువనగిరి, హైదరాబాద్, సికిందరాబాద్, కరీంనగర్, నల్గొండ. వైజాగపటం, నెల్లూరు, గంజాం, కృష్ణ, గోదావరి, ఉత్తర ఆర్కాట్ లాంటి కొన్ని జిల్లాల నుండి అధికంగా వెళ్లారు.

తెలుగు ప్రాంతాల నుండి కుటుంబాలు కుటుంబాలు, పిల్లలతో సహా వలసపోతున్నా, గ్రామాలు ఖాళీ అవుతున్నా, వారి గురించి, మోసపోతున్న పరిస్థితుల గురించి, అక్కడి నాయకులు, కనీసం రచయితలు ఆ సమయాల్లో పట్టించుకోకపోవడం ఆశ్చర్యకరమైన విషయం. హిందీ ప్రాంతాల్లో ఆ స్పృహ మనకంటే ఎక్కువ. ఒప్పంద వలసకార్మికులు గణనీయమైన సంఖ్యలో విదేశాలలో ఉన్న మొట్టమొదటి భారతీయులు. వలసపోయిన వారిని గురించిన అధ్యయనంలో వారే అందరికంటే ముందు ఉన్న వాళ్లు. భారతీయుల జ్ఞాపకాలలో గౌరవప్రదమైన స్థానాన్ని తప్పకుండా పొందాల్సినవాళ్లు.

▪ ముకుంద రామారావు
99083 47273

శనివారం ఉష్ణోగ్రత గరిష్ఠం 24.4 కనిష్ఠం 22.2

కమ్మేసిన ముసురు

- రోజంతా జల్లులు.. జలమయమైన రహదారులు
- పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ జాం
- అప్రమత్తమైన డిజాస్టర్ బృందాలు

నగరాన్ని ముసురు కమ్మేసింది. శనివారం తెల్లవారుజాము నుంచి ఎడతెరిపి లేకుండా వాన కురుస్తుండడంతో జనం తడిసి ముద్దయ్యారు. పలుచోట్ల ట్రాఫిక్ స్తంభించింది. షేక్‌పేటలో అత్యధికంగా 3.2 సెం.మీ. వర్షపాతం నమోదైంది. చలిగాలుల తీవ్రత పెరిగిపోవడంతో ప్రజలు వణికిపోయారు.


షేక్‌పేటలో అత్యధికంగా 3.2 సెం.మీ

హైదరాబాద్ సిటీ, జూలై 20 (ఆంధ్రజ్యోతి): రోజంతా కురిసిన జల్లులతో నగరంలో జనజీవనం స్తంభించిపోయింది. నాలాల పక్కన నివసించే వారితో పాటు లోతట్టు ప్రాంత ప్రజలు వర్షాలతో వణికిపోతున్నారు. ఖైరతాబాద్, బేగంపేట, ఎంఎస్ మక్తా, ముషీరాబాద్, ఫిలింనగర్, కూకట్‌పల్లి, బోరబండ, యూసుఫ్‌గూడ, శ్రీకృష్ణానగర్, వెంగళ్‌రావునగర్, ఎల్‌బీనగర్, ఉప్పల్, మియాపూర్‌తో పాటు పలు ప్రాంతాల్లో కురిసిన వర్షంతో రహదారులు జలమయమయ్యాయి. కూకట్‌పల్లి బాలాజీనగర్‌లో వరదనీరు రోడ్లపై భారీగా

మిగతా 8వ పేజీలో..

జంట జలాశయాలకు రాని వరద 8

పలు ప్రాంతాల్లో కురిసిన వర్షపాతం (సెం.మీ)	
యూసుఫ్‌గూడ	3.0
గోల్కొండ	2.9
కుత్బుల్లాపూర్	2.8
బండ్లగూడ	2.7
కూకట్‌పల్లి	2.6
నాంపల్లి	2.5
ఆసిఫ్‌నగర్	2.5
రాజేంద్రనగర్	2.5
ఖైరతాబాద్	2.5
బీహెచ్ఈఎల్	2.4




వర్షంలోనూ చార్మినార్ వద్ద సందర్శకుల సందడి

హుస్సేన్‌సాగర్‌కు భారీగా వరద

శుక్రవారం రాత్రి నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షానికి హుస్సేన్‌సాగర్‌కు భారీగా వరద చేరింది. సాగర్ పూర్తిస్థాయి నీటిమట్టం 513.41 అడుగులు ఉండగా శనివారం సాయంత్రం 6 గంటల వరకు 513.23 అడుగులకు చేరింది. కాగా, ఇన్‌ఫ్లో 1517 క్యూసెక్కులుండగా.. ఔట్ ఫ్లో 998 క్యూసెక్కులుగా ఉంది.

సీఐ పురేందర్‌రెడ్డి పాడుబుద్ధి

- స్టేషన్‌కొచ్చిన మహిళకు లైంగిక వేధింపులు
- సీపీకి బాధితురాలి ఫిర్యాదు, సస్పెన్షన్

8

అక్షరాభ్యాసానికి వెళ్తూ అనంతలోకాలకు

- డివైడర్‌ను ఢీకొట్టి కారు బోల్తా
- ఇద్దరు మృతి, మెదక్ జిల్లాలో ఘటన

8

లష్కర్ బోనాలకు సర్వం సిద్ధం


లష్కర్ బోనాలకు ఉజ్జయినీ మహాకాళి అమ్మవారి ఆలయం సిద్ధమయింది. ఆదివారం తెల్లవారుజాము 3.30గంటలకే ఆలయ అనువంశిక ధర్మకర్తల కుటుంబ సభ్యులు అమ్మవారికి తొలిబోనం సమర్పిస్తారు. రెండురోజులపాటు జరిగే ఉత్సవాలకు సుమారు 10లక్షల మంది భక్తులు వస్తారని అధికారులు అంచనా వేస్తున్నారు. అందుకనుగుణంగా అధికారులు ఏర్పాట్లు చేశారు.

నేటినుంచి రెండురోజులు ఉత్సవాలు

- తెల్లవారుజామున 3.30లకు అమ్మవారికి తొలిబోనం
- ఉదయం 4 గంటల నుంచి భక్తులకు దర్శనం
- ప్రతి 60 అడుగులకు ఓ అత్యవసర ద్వారం
- 1500 మంది పోలీసులతో భద్రత

దర్శనానికి 7 లైన్లు

సికింద్రాబాద్, రాంగోపాల్‌పేట్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఆచార వ్యవహారాలు, సంస్కృతీ సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే లష్కర్ బోనాలకు ఉజ్జయినీ మహాకాళి ఆలయం సర్వాంగ సుందరంగా ముస్తాబయింది. ఈనెల 21, 22 తేదీల్లో అత్యంత వైభవంగా నిర్వహించే ఉత్సవాలకు ఉత్సవ కమిటీ, అధికార యంత్రాంగం ఏర్పాట్లను పూర్తిచేసింది. కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరిన తర్వాత జరుగుతున్న తొలిబోనాలు కావడంతో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం లష్కర్ బోనాలను సమర్థవంతంగా, వైభవోపేతంగా నిర్వహించాలన్న కృతనిశ్చయంతో ఉంది. ఈ నేపథ్యంలో ఉజ్జయినీ మహాకాళి ఆలయంతో పాటు లష్కర్‌లోని అమ్మవారి ఆలయాలను సుందరంగా తీర్చిదిద్దారు. దేవాదాయశాఖతో పాటు పోలీసు, జీహెచ్ఎంసీ, వాటర్‌బోర్డు, విద్యుత్, రెవెన్యూ, రోడ్లుభవనాలు, వైద్య ఆరోగ్య, సాంస్కృతిక, ఆర్టీసీ తదితర విభాగాల అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆలయ పరిసర ప్రాంతాల్లో ఏర్పాట్లను శనివారం జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి పరిశీలించారు. ఉజ్జయిని మహాకాళి ఆలయంతో పాటు పలు దేవాలయాలకు సంబంధించిన రూట్‌లను పరిశీలించారు. కమిషనర్ మాట్లాడుతూ భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. శానిటేషన్ మొబైల్ టాయిలెట్లను ఎక్కడికక్కడ

మిగతా 6వ పేజీలో..

జాతర ఏర్పాట్లు ఇలా

- మొత్తం 7 లైన్లు.
- బాటా నుంచి ఒక బోనాల లైన్
- రోచాబజార్ నుంచి ఒక బోనాల క్యూ, ఒక జనరల్ లైన్.
- అంజలి థియేటర్ నుంచి ఒక పాస్ లైన్, ఒక జనరల్ లైన్.
- కంచు బొమ్మ వైపునుంచి ఒక డోనర్ లైన్, బట్టలబజార్ నుంచి సర్వీస్ లైన్. సర్వీస్ లైన్‌లో కేవలం స్వచ్ఛంద సేవకుల రాకపోకలు, ప్రసాదాలను విక్రయ కేంద్రాలకు తరలించడానికి వినియోగిస్తారు.
- క్యూలో ప్రతి 60 అడుగుల దూరంలో ఓ అత్యవసర ద్వారం.
- జోగినులు, శివశక్తులకు మధ్యాహ్నం 1.30 గంటల నుంచి 4గంటల వరకు బాటా వైపు నుంచి అనుమతి.
- పోలీస్ స్టేషన్ ఆవరణలో అన్ని శాఖల అధికారులతో జాయింట్ కంట్రోల్ రూమ్ ఉంటుంది. భక్తులకు ఇబ్బందులు కలిగితే ఫిర్యాదు చేయవచ్చు.
- ఉచిత బస్సు పథకం నేపథ్యంలో ఈ ఏడాది 10లక్షలకు పైగా భక్తులు అమ్మవారిని దర్శించుకుంటారని అంచనా.
- పదిహేను వందల మంది పోలీసు సిబ్బందితో భద్రతా ఏర్పాట్లు
- మహిళల భద్రతకు ప్రత్యేక షీటీమ్స్.
- జేబుదొంగలను అదుపులోకి తీసుకోవడానికి క్రైమ్ టీమ్స్ ఏర్పాటు.

వీఐపీల దర్శనం..

- ఉదయం 9.30-11.30గంటల సమయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రాక
- అమ్మవారికి పట్టు వస్త్రాల సమర్పణ, ప్రత్యేక పూజ
- తెల్లవారుజామున 3.30 గంటలకు ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ అమ్మవారి దర్శనానికి రాక.


అమ్మవారికి సమర్పించేందుకు బోనంతో వస్తున్న యూఎస్.కాన్సులేట్ జనరల్ జెన్నిఫర్ ఎ.లార్సన్

అమ్మవారిని దర్శించుకున్న ప్రముఖులు

సికింద్రాబాద్, జూలై 20(ఆంధ్రజ్యోతి): ఉజ్జయినీ మహాకాళి అమ్మవారిని శనివారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్, పీసీసీ ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ, డాక్టర్ కోట నీలిమ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేకపూజలు జరిపారు. యూఎస్ కాన్సులేట్ జనరల్ జెన్నిఫర్ ఎ.లార్సన్ అమ్మవారికి బోనం సమర్పించారు. అనంతరం ప్రత్యేకపూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ చరిత్ర, విశిష్టత, బోనాల ప్రాముఖ్యత తదితర అంశాల గురించి మంత్రి పొన్నం ప్రభాకర్, కోట నీలిమ ఆమెకు వివరించారు. వారికి దేవాదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ రామకృష్ణమాచార్యులు, ఆలయ కార్యనిర్వహణాధికారి గుత్తా మనోహర్‌రెడ్డి ఘన స్వాగతం పలికారు.


అమ్మవారిని దర్శించుకున్న దీపాదాస్ మున్షీ, ఎంపీ అనిల్‌కుమార్

గోపనపల్లి తండా ఫ్లైఓవర్ ప్రారంభం


ఫ్లై ఓవర్ ప్రారంభోత్సవంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రులు, ఎమ్మెల్యే గాంధీ (ఇన్‌సెట్లో : జెండా ఊపుతున్న సీఎం)



రాయదుర్గం, జూలై20(ఆంధ్రజ్యోతి): గోపనపల్లితండా సర్కిల్‌లో సుమారు రూ.28.5 కోట్ల వ్యయంతో నిర్మించిన ఫ్లైఓవర్‌ను శనివారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ఎంపీ కొండా విశ్వేశ్వరరెడ్డి, ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ, ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి, డిప్యూటి మేయర్ శ్రీలతారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ర్యాపిడో యాప్‌తో మెట్రో టికెట్


హైదరాబాద్ సిటీ, జూలై 20 (ఆంధ్రజ్యోతి): మెట్రో రైలు టికెట్ తీసుకోవడం ఇక మరింత సులువు కానుంది. లైన్‌లో వెళ్లి సరైన చిల్లర ఇవ్వలేక సతమతమయ్యే ప్రయాణికుల కోసం మెట్రో యాజమాన్యం ర్యాపిడోతో కొత్త ఒప్పందాన్ని చేసుకుంది. ఇందుకనుగుణంగా నగరంలో స్టేషన్‌కు వెళ్లకుండానే ఎక్కడినుంచి ఎక్కడికైనా క్షణాల్లో మెట్రో టికెట్‌ను బుక్ చేసుకునేలా ర్యాపిడో యాప్‌లో వెసులుబాటును కల్పించింది. ఈ మేరకు శనివారం అమీర్‌పేట్ మెట్రో స్టేషన్‌లో ఎల్అండ్‌టీ ఎండీ కేవీబీ రెడ్డి సేవలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలో ప్రజారవాణాను మరింత మెరుగు పరిచేందుకు కృషి చేస్తున్నామన్నారు. మెట్రో ఎండీ ఎన్వీఎస్ రెడ్డి మాట్లాడుతూ ర్యాపిడోతో కొత్త భాగస్వామ్యం ఫస్ట్, లాస్ట్ మైల్ కనెక్టివిటీని పెంపొందిస్తుందన్నారు. ర్యాపిడో కో ఫౌండర్ పవన్ గుంటుపల్లి మాట్లాడారు. కార్యక్రమంలో ఎల్అండ్‌టీ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ సుధీర్ చిప్లుంకర్ తదితరులు పాల్గొన్నారు.


ర్యాపిడో మెట్రో టికెట్ యాప్‌ను ప్రారంభిస్తున్న దృశ్యం


రోడ్డు మీద వరి నాట్లు వేస్తున్న కౌన్సిలర్, స్థానిక మహిళలు

రోడ్డుపై వరినాట్లతో కౌన్సిలర్ నిరసన

దుండిగల్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): గుంతల మయంగా మారిన బౌరంపేట ప్రధాన రహదారికి మరమ్మతులు చేయడంలో అధికారులు, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు విఫలమయ్యారని ఆరోపిస్తూ శనివారం స్థానిక కౌన్సిలర్ బాలమణికృష్ణారెడ్డి స్థానిక మహిళలతో వచ్చి రోడ్డుపై నాట్లు వేసి నిరసన తెలిపారు. అభివృద్ధి కార్యక్రమాల్లో భాగంగా తవ్విన రోడ్డుకు మరమ్మతులు చేయకుండా వదిలివేశారని అన్నారు. ప్రస్తుత వర్షాలతో గుంతల్లో నీరు నిండడంతో వాహనదారులు అదుపుతప్పి కిందపడి గాయాలపాలవుతున్నారని తెలిపారు. ప్రజా సమస్యలు పట్టించుకోని నాయకులు తమ పదవులకు రాజీనామాలు చేయాలని డిమాండ్ చేశారు. కౌన్సిలర్‌కు మద్దతుగా గ్రామస్థులు, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.



ఓటర్ల జాబితా సిద్ధం చేయండి

● జర్నలిస్టు హౌసింగ్ సొసైటీ ఎన్నికలపై హైకోర్టు తీర్పు

హైదరాబాద్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): జర్నలిస్టు కోఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ లిమిటెడ్ (జూబ్లీహిల్స్)కు సంబంధించిన అన్ని రికార్డులు పరిశీలించి, చట్టబద్ధంగా తుది ఓటర్ల జాబితాను సిద్ధం చేయాలని హైకోర్టు స్పష్టంచేసింది. నిబంధనల ప్రకారం ఎన్నికల నోటిఫికేషన్ జారీచేసి నాలుగునెలల్లో ఎన్నికలు నిర్వహించాలని తెలిపింది. జర్నలిస్టు కోఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ (జూబ్లీహిల్స్)లో 2002 నుంచి 2020 వరకు చేరిన సభ్యులకు ఓటు హక్కు కల్పించడం లేదని.. తమను ఓటర్ల జాబితాలో చేర్చేలా ఆదేశాలు ఇవ్వాలని పేర్కొంటూ పీ జంగారెడ్డి సహా 238 మంది సభ్యులు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌లో వాదనలు విన్న జస్టిస్ సీవీ భాస్కర్‌రెడ్డి ధర్మాసనం ఇటీవల తీర్పు ఇచ్చింది. డిప్యూటీ రిజిస్ట్రార్ ఆఫ్ కోఆపరేటివ్ సొసైటీస్ సహాయంతో రికార్డుల ప్రకారం ఓటర్ల జాబితా రూపొందించాలని.. ఈ ప్రక్రియలో పర్సన్ ఇన్‌చార్జి కమిటీ గానీ, హౌసింగ్ సొసైటీ ప్రమేయంగానీ లేకుండా చూసుకోవాలని స్టేట్ కోఆపరేటివ్ ఎలక్షన్ అథారిటీకి ఆదేశాలు జారీ చేసింది. సహకార సంఘాల చట్టం ప్రకారం నోటిఫికేషన్ జారీచేసి నాలుగునెలల్లో ఎన్నికల ప్రక్రియ పూర్తిచేయాలని తుది తీర్పులో పేర్కొంది.

నగరవాసుల కోసం మెడిటేరియన్ రుచులు

● అందుబాటులోకి తెచ్చిన ఆలివ్ బిస్ట్రో అండ్ బార్



హైదరాబాద్ సిటీ, జూలై 20(ఆంధ్రజ్యోతి): వర్షాకాలంలో నగరవాసులకు వినూత్నమైన రుచులను అందించడం కోసం జూబ్లీహిల్స్‌లోని ఆలివ్ బిస్ట్రో అండ్ బార్ డిల్లీలోని ఆలివ్ బార్ అండ్ కిచెన్‌కు చెందిన సుప్రసిద్ధ చెఫ్ ధృవ్ ఒబెరాయ్‌తో పాటుగా పలు అవార్డులు గెలుచుకున్న మిక్సాలజిస్ట్ హరీశ్ ఛిమ్వాల్ తీర్చిదిద్దిన ప్రత్యేక మెనూను అందుబాటులోకి తీసుకువచ్చింది. ఈ నెల 22 నుంచి ఆగస్టు 31 వరకూ ఈ మెడిటేరియన్ రుచులతో పాటుగా విభిన్నమైన ఆల్కహాల్ రుచులను నగరవాసులకు అందించనున్నారు. ఈ మెడిటేరియన్ విందులో భాగంగా ట్యాంగీ అమ్లా, గ్రీన్ సలాడ్ మొదలు హిమాలయన్ చీజ్ సౌఫెల్ వంటి రుచులను అందిస్తున్నామని చెఫ్ విజయ్ డేవిడ్ నిరంజన్ తెలిపారు.

లష్కర్ బోనాలకు సర్వం సిద్ధం

(5వ పేజీ తరువాయి)

అందుబాటులో ఉంచాలని అధికారులను ఆదేశించారు. కమిషనర్ వెంట జోనల్ కమిషనర్ రవికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

తొలిరోజు జరిగే పూజలు

- ఉదయం 3.30 గంటలకు ఆలయ అనువంశిక ధర్మకర్తల కుటుంబసభ్యులు సురిటీ కామేశ్వర్, సురిటీ రామేశ్వర్ కుటుంబ సమేతంగా శ్రీ ఉజ్జయినీ మహాకాళి అమ్మవారిని దర్శించుకొని తొలి బోనం సమర్పిస్తారు.
- ఉదయం 4 గంటల నుంచి అర్ధరాత్రి వరకు నిరంతరాయంగా అమ్మవారికి బోనాల సమర్పణ, సాధారణ భక్తులకు అనుమతి ఉంటుంది.
- సాయంత్రం 4 గంటల నుంచి తొట్టెల ఊరేగింపులు
- సాయంత్రం 7 గంటల నుంచి ఫలహారం బండ్ల ఊరేగింపు
- రాత్రి 11 గంటలకు జల్ల కడువ రాక..

సోమవారం జరిగే పూజలు

- తెల్లవారుజామున 1.30 గంటలకు శివాజీనగర్‌లోని పీనుగుల మల్లన్న ఆలయం నుంచి పచ్చికుండ రాక..
- 2.30గంటలకు ఆర్పీ రోడ్డులోని చిత్ర దర్గ సమీపం నుంచి వెయ్యి కండ్ల కుండ రాక..
- 4గంటలకు గుమ్మడికాయ తీసుకు వస్తారు.
- 4.30కు బలి కార్యక్రమం
- గంట సేపు ఆలయ శుద్ధి
- ఉదయం 6గంటల నుంచి 7.30వరకు దర్శనాలు
- 9.30గంటలకు రంగం (భవిష్యవాణి)
- 10 గంటలకు గావు కార్యక్రమం
- 10.30 గంటలకు ఆలయం నుంచి మెట్టుగు డాకు ఘటం బయల్దేరుతుంది.
- 11 గంటలకు అంబారీ యాత్ర
- 11.30 గంటల నుంచి తెల్లవారుజాము వరకు దర్శనాలు
- సాయంత్రం7గంటల నుంచి తెల్లవారు జాము వరకు ఫలహారపు బండ్ల ఊరేగింపు

చలివేంద్రాలు

భక్తుల దాహార్తిని తీర్చడానికి జలమండలి 7 లక్షల వాటర్ ప్యాకెట్లు, 50 వేల వాటర్ బాటిళ్లను ఆలయం చుట్టుపక్కన 5 క్యాంపుల ద్వారా ఏర్పాటు చేస్తున్నారు. ఆలయం వెనుక వస్త్రాల బజార్‌లో, ఆలయం పక్కన, జనరల్ బజార్‌లో, మహాకాళి పోలీస్‌స్టేషన్ పక్కన, సుభాష్ రోడ్డు జామియా మసీద్ వద్ద వాటర్ క్యాంపులు ఏర్పాటు చేస్తున్నారు.

పార్కింగ్...

1. జింఖానా గ్రౌండ్. 2. తాజ్ ట్రిస్టార్ లేన్. 3. హరిహర కళాభవన్. 4. ఓల్డ్ జైల్‌ఖానా. 5. ఇస్లామియా హై స్కూల్. 6. అడవయ్య చౌరస్తా.

వైద్య శిబిరాలు

అమ్మవారిని దర్శించుకోవడానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం రెండు వైద్య శిబిరాలను ఏర్పాటు చేస్తున్నారు. అందులో ఒకటి పోలీస్‌స్టేషన్ వద్ద మరొకటి జనరల్ బజార్ వద్ద ఏర్పాటు చేస్తున్నారు. దీనికి తోడు పోలీస్‌స్టేషన్ వద్ద అత్యవసర సమయంలో ఉపయోగించడానికి ఓ అంబులెన్స్‌ను సిద్ధం చేశారు.

● జాతరలో 100 సీసీ కెమెరాలతో నిఘా ఏర్పాటు చేస్తున్నారు.

ఉజ్జయినీ మహాకాళి ఆలయ చరిత్ర



1850వ సంవత్సరంలో ఉజ్జయినీ మహాకాళి అమ్మవారు

1813లో బ్రిటీష్ ఇండియా ఆర్మీలో సిపాయిగా పనిచేసే సురిటీ అప్పయ్యకు మధ్యప్రదేశ్‌లోని ఉజ్జయినిలో పోస్టింగ్ ఇచ్చారు. సహచర సిపాయిలతో కలిసి ఉజ్జయిని వెళ్లిన అప్పయ్య విశ్రాంతి సమయంలో హిందీలో భక్తి పాటలు పాడేవారు. ఈ సమయంలోనే స్థానికుల ద్వారా అష్టాదశ శక్తి పీఠాలలో ఒకటైన శ్రీ ఉజ్జయినీ గడ్‌కాళీ (మహాకాళి) అమ్మవారి మహత్యం గురించి తెలుసుకున్నారు. ఆ రోజుల్లో ఆషాఢ మాసంలో ఉజ్జయినిలో కలరా వ్యాపించి అనేక మంది చనిపోయారు. దీంతో కలత చెందిన సురిటీ అప్పయ్య ఆ వ్యాధి సోకకుండా ప్రజలను కాపాడితే లష్కర్ (సికింద్రాబాద్)లో అమ్మవారి ఆలయం నిర్మిస్తానని మొక్కుకున్నారు. ఉజ్జయిని నుంచి తిరిగి వచ్చే సమయంలో ఆయన గురిగి (చిన్న మట్టి పాత్ర)లో కుంకుమ రూపంలో అమ్మవారిని సికింద్రాబాద్ తీసుకువచ్చారు. 36 ఇంచుల నారవేప కర్రను తీసుకొచ్చి దానిని రోజూ తొలుస్తూ ఓ రూపాన్ని కల్పించారు. ఆ రూపాన్ని 1815లో ఇప్పుడు ఉన్న ఆలయం వద్ద ప్రతిష్ఠించారు. 1815 నుంచి 1864 వరకు కలప విగ్రహానికే నిత్యపూజలు నిర్వహించేవారు. 1864లో అమ్మవారి శిలా విగ్రహాన్ని ప్రతిష్ఠించి నాటి నుంచి నేటి వరకు ఆగమశాస్త్ర ప్రకారం నిత్య పూజలు నిర్వహిస్తూ వస్తున్నారు.

మాణిక్యాల అమ్మవారు..

1815లో ఆలయ నిర్మాణ సమయంలో నిర్మాణానికి నీరు కోసం సమీపంలో ఓ బావి తవ్వారు. ఆ తవ్వకాల్లో మాణిక్యాల అమ్మవారి విగ్రహం బయటపడింది. ఆ విగ్రహాన్ని మహాకాళి అమ్మవారి విగ్రహం కుడివైపు నెలకొల్పి ప్రతి నిత్యం పూజలు నిర్వహిస్తున్నారు.

కరెంట్ పోయిందని ఫిర్యాదు చేస్తే.. అసభ్యంగా మాట్లాడిన సిబ్బంది

హైదరాబాద్ సిటీ, జూలై 20(ఆంధ్రజ్యోతి): కరెంట్ పోయిందని ఫిర్యాదు చేసిన నగరవాసికి ఓ వింత అనుభవం ఎదురైంది. నాంపల్లిలోని ఆగాపురా భీంరావు క్వార్టర్స్‌లో శుక్రవారం అర్ధరాత్రి కరెంట్ పోవడంతో స్థానికుడు శంకర్ ఫ్యూజ్ ఆఫ్ కాల్ నంబర్‌కు ఫోన్ చేసి పరిస్థితి వివరించాడు. ఆయన ఫిర్యాదును పట్టించుకోక పోగా సంబంధిత సిబ్బంది ఫోన్‌లో దుర్భాషలాడినట్లు శంకర్ తెలిపారు. శంకర్‌కు అసభ్యంగా సమాధానమిచ్చిన సిబ్బంది ఆడియో సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతోంది. ఈ విషయంపై ఉన్నతాధికారులను వివరణ కోరగా, పూర్తిస్థాయిలో విచారణ చేసి బాధ్యులపై చర్యలు తీసుకుంటామన్నారు.

మహిళలపై నేరాలకు పాల్పడితే కఠిన చర్యలు

● సీపీ సుధీర్ బాబు



ఇన్‌స్పెక్టర్‌ను అభినందిస్తున్న సీపీ సుధీర్‌బాబు

హైదరాబాద్ సిటీ, జూలై 20(ఆంధ్రజ్యోతి): మహిళలు, పిల్లలపై నేరాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని రాచకొండ సీపీ సుధీర్‌బాబు హెచ్చరించారు. శనివారం కమిషనరేట్ నుంచి కోర్టు సిబ్బంది, అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ త్వరితగతిన కేసుల దర్యాప్తు పూర్తి చేయాలని, నేరస్థులకు గరిష్ఠ శిక్ష పడేలా బలమైన సాక్ష్యాధారాలను సేకరించాలని సూచించారు. ఈ సందర్భంగా పహాడిషరీఫ్ వరకట్న హత్య కేసులో నిందితుడికి శిక్షపడేలా, ఘట్‌కేసర్ చిన్నారి అపహరణ కేసులో వేగంగా దర్యాప్తు జరిపిన ఇన్‌స్పెక్టర్‌లు లక్ష్మీకాంతరెడ్డి, మహేందర్‌రెడ్డితో పాటు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌లను సీపీ సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో సీసీఆర్‌బీ ఏసీపీ రమేష్, ఏసీపీ లక్ష్మీకాంతరెడ్డి, ఇన్‌స్పెక్టర్ మహేందర్‌రెడ్డితో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

సైబరాబాద్‌లో ఇన్‌స్పెక్టర్‌ల బదిలీలు

హైదరాబాద్ సిటీ, జూలై 20(ఆంధ్రజ్యోతి): సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో పలువురు ఇన్‌స్పెక్టర్‌లను బదిలీ చేస్తూ సీపీ అవినాష్ మహంతి ఆదేశాలు జారీ చేశారు. కూకట్‌పల్లి ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ కె.శ్రీనివాసులును సనత్‌నగర్ పోలీస్‌స్టేషన్‌కు, సెంట్రలైజ్‌డ్ కాల్‌డాటా అనాలసిస్‌లో పనిచేస్తున్న పి.సతీష్‌ను దుండిగల్ పోలీస్‌స్టేషన్‌కు, దుండిగల్ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ శంకరయ్యను సైబర్‌క్రైం పోలీస్‌స్టేషన్‌కు, సైబరాబాద్ వీఆర్‌లో పనిచేస్తున్న కె.ప్రదీప్ లింగంను ఉమన్ సేఫ్టీ వింగ్‌కు, ఉమన్ సేఫ్టీవింగ్‌లో పనిచేస్తున్న ముత్తుయాదవ్‌ను కూకట్‌పల్లి ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌కు, రాజేంద్రనగర్ డీఐ చంద్ర గంగాధర్‌ను బాలానగర్ సీసీఎస్‌కు, సీసీఎస్ బాలానగర్‌లో పనిచేస్తున్న సీహెచ్ రాజును సైబర్ క్రైం పోలీస్‌స్టేషన్‌కు, సైబరాబాద్ వీఆర్‌లో పనిచేస్తున్న పి.రాజేష్‌ను క్యాట్‌కు, సైబరాబాద్ వీఆర్‌లో పనిచేస్తున్న ఎస్.విజయ్‌ను రాయదుర్గం డీఐగా, సైబరాబాద్ వీఆర్‌లో పనిచేస్తున్న ఎస్.కనకయ్యను జీడిమెట్ల డీఐగా, మైలార్‌దేవ్‌పల్లి డీఐగా పనిచేస్తున్న గొల్ల తిమ్మన్నను బాచుపల్లి డీఐగా, సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న కటకం శ్రీనివాస్‌ను మైలార్‌దేవ్‌పల్లి డీఐగా బదిలీ చేస్తూ సీపీ ఆదేశాలు జారీ చేశారు.

మద్యం మత్తులో ఉన్న వ్యక్తిపై దాడి చేసి డబ్బులు వసూలు చేసిన కానిస్టేబుల్ సస్పెన్షన్


● నెల రోజుల క్రితం ఘటనపై సీపీ చర్యలు


యూసుఫ్‌గూడ, జూలై 20 (ఆంధ్రజ్యోతి): కారులో మద్యం తాగుతున్న వ్యక్తిని గాయపరిచి డబ్బులు వసూలు చేసిన కానిస్టేబుల్‌ను సీపీ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి సస్పెండ్ చేశారు. నెల రోజుల క్రితం జరిగిన సంఘటనలో బాధితుడు సీపీని ఆశ్రయించడంతో విచారణ అనంతరం మధురానగర్ కానిస్టేబుల్ నవీన్‌కుమార్‌ను సస్పెండ్ చేస్తూ సీపీ ఆదేశాలు జారీ చేశారు. నెల రోజుల క్రితం రహ్మత్‌నగర్ గాంధీ బొమ్మ సమీపంలో ఓ వ్యక్తి తన స్నేహితుడితో కలిసి కారులో మద్యం తాగుతున్నాడు. ఈ సమయంలో కానిస్టేబుల్ నవీన్‌కుమార్ కారు వద్దకు వెళ్లి బహిరంగ ప్రదేశంలో మద్యం తాగకూడదని వాగ్వాదానికి దిగాడు. ఈ సందర్భంగా జరిగిన తోపులాటలో మద్యంమత్తులో ఉన్న వ్యక్తి కిందపడడంతో చేయి విరిగింది. అయినా వారిని వదలని కానిస్టేబుల్ కారుతో సహా మధురానగర్ పోలీస్‌స్టేషన్‌కు తీసుకువచ్చాడు. కేసు నమోదు చేయకుండా ఉండేందుకు డబ్బులు డిమాండ్ చేశాడు. వారి వద్ద రూ.1000 మాత్రమే ఉండడంతో అవి తీసుకుని వారిని వదిలేశాడు. చేతికి గాయమైన బాధితుడు సీపీని కలిసి కానిస్టేబుల్‌పై ఫిర్యాదు చేశాడు. అంతర్గత విచారణ అనంతరం సీపీ కానిస్టేబుల్ నవీన్‌కుమార్‌ను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. సస్పెన్షన్ ఉత్తర్వులు వచ్చి మూడురోజులు అయినా ఈ విషయాన్ని పోలీసులు గోప్యంగా ఉంచడంతో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది.

పొలిమేర-2 డిస్ట్రిబ్యూటర్లపై పోలీసులకు ఫిర్యాదు

హైదర్‌నగర్, జూలై 20(ఆంధ్రజ్యోతి): పొలిమేర-2 చిత్ర లాభంలో వాటా ఇవ్వకుండా డిస్ట్రిబ్యూటర్లు తనను మోసం చేశారని వారిపై చిత్ర నిర్మాత గౌరు కృష్ణప్రసాద్ శనివారం కేపీహెచ్‌బీ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు, బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. బాచుపల్లి కేవీఆర్ ప్యారడైజ్ విల్లాస్‌లో నివాసం ఉండే గౌరు కృష్ణప్రసాద్ పొలిమేర-2 చిత్రానికి నిర్మాతగా వ్యవహరించి రూ.6కోట్లు పెట్టుబడి పెట్టారు. ఆ సినిమాను డిస్ట్రిబ్యూటర్స్ రైట్స్ వంశీ నందిపాటి, సుబ్బారెడ్డికి ఇచ్చారు. ఒప్పందం ప్రకారం లాభంలో 65శాతం నిర్మాతకు, 35శాతం డిస్ట్రిబ్యూటర్లకు చెందుతుంది. పొలిమేర-2 చిత్రం దాదాపు రూ.30కోట్లు వసూలు చేసిందని నిర్మాత కృష్ణప్రసాద్ డిస్ట్రిబ్యూటర్స్ వంశీ, సుబ్బారెడ్డిని సినిమా లాభంలో వాటా గురించి అడిగారు. దీంతో వారిద్దరు కృష్ణప్రసాద్‌తో గొడవ పడ్డారు. కృష్ణప్రసాద్‌పై ఫిలించాంబర్‌లో పంచాయతీ పెట్టి అగ్రిమెంట్ క్లియర్ అయినట్లుగా కాగితాలపై సంతకం చేయాలని ఒత్తిడి చేశారు. ఆ తర్వాత ఈనెల 9న రాత్రి 11.30గంటలకు వాట్సాప్‌కాల్ చేసి జేఎన్‌టీయూలోని ఫిస్తాహౌస్ వద్దకు రావాలని కృష్ణప్రసాద్‌ను పిలిచి దుర్భాషలాడి బెదిరించారని పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.















మంత్రి పొన్నం ప్రభాకర్‌ను ఆహ్వానిస్తున్న ఆలయ కమిటీ ప్రతినిధులు

బోనాల ఉత్సవాలకు

మంత్రి పొన్నం ప్రభాకర్‌కు ఆహ్వానం

చాంద్రాయణగుట్ట, జూలై 20 (ఆంధ్రజ్యోతి): ఉప్పుగూడ మహాకాళి బోనాల ఉత్సవాలకు రావాలని శనివారం మంత్రి పొన్నం ప్రభాకర్‌కు ఆలయ కమిటీ ప్రతినిధులు ఆహ్వాన పత్రిక అందజేశారు. ఈనెల 28వ తేదీన విచ్చేసి అమ్మవారి దర్శనం చేసుకోవాలని కోరారు. మంత్రి సానుకూలంగా స్పందించి తప్పకుండా వస్తానని హామీఇచ్చారని ప్రతినిధులు తెలిపారు. మంత్రిని కలిసినవారిలో ఆలయ కమిటీఅధ్యక్షుడు జనగామ మధుసూదన్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి కీర్తి నరేందర్‌ముదిరాజ్, కార్యదర్శులు సతీష్, ప్రదీప్, ఆనంద్ తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న తెలంగాణ రక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు సత్యనారాయణ

రాష్ట్రంలోని నిరుద్యోగులకు

తక్షణమే నిరుద్యోగ భృతి ఇవ్వాలి

బర్కత్‌పుర, జూలై 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని నిరుద్యోగులకు కాంగ్రెస్ ప్రభుత్వం తక్షణమే నిరుద్యోగ భృతి ఇవ్వాలని తెలంగాణ రక్షణ సమితి (టీఆర్ఎస్ డెమొక్రటిక్) వ్యవస్థాపక అధ్యక్షుడు నరాల సత్యనారాయణ డిమాండ్‌చేశారు. ఎన్నికల మ్యానిఫెస్టోలో పేర్కొన్న విధంగా వెంటనే నిరుద్యోగ జాబితాను రూపొందించి ఈనెల నుంచే నిరుద్యోగ భృతి ఇవ్వాలని ఆయన కోరారు. శనివారం బషీర్‌బాగ్ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన తర్వాత కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో పేర్కొన్న అనేక సమస్యలను విస్మరిస్తుందని ఆయన ఆరోపించారు. సమావేశంలో తెలంగాణ రక్షణ సమితి ప్రతినిధులు ఎం విజయ్‌కుమార్, బోయినపల్లి ప్రత్యూష, సంధ్య, అనిల్ తదితరులు పాల్గొన్నారు.



పూర్వ విద్యార్థులతో ఎంపీ జి.నగేశ్

సహ విద్యార్థి ఎంపీ కావడం గర్వకారణం

అఫ్జల్‌గంజ్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): ఒకప్పుడు తమతో కలిసి చదువుకున్న సహ విద్యార్థి ఎంపీ కావడం తమకు ఎంతో గర్వకారణమని 1989 బ్యాచ్ బీఈడీ పూర్వవిద్యార్థులు కె.సంపత్‌కుమార్, రత్నం, మశ్చేంద్ర, అమర్‌నాథ్ పేర్కొన్నారు. శనివారం ఫతేమైదాన్ క్లబ్‌లో ప్రభుత్వ కాంప్రిహేన్సివ్ కాలేజ్ ఆఫ్ ఎడ్యూకేషన్ బీఈడీ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పూర్వ విద్యార్థి, ఆదిలాబాద్ ఎంపీ జి.నగేశ్ పాల్గొన్నారు. తనతో చదువుకున్న వారితో మాట్లాడి యోగక్షేమాలు, ప్రస్తుత పరిస్థితులు, ఆరోగ్య విషయాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎంపీ నగేశ్‌ను పూర్వ విద్యార్థులు సత్కరించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు శాలిని, సీతా, నరహరి, రామనందయ్య, అమర్‌నాథ్, రాఘవయ్య, బాల్‌రెడ్డి, ఇంద్రసేనారావు తదితరులు పాల్గొన్నారు.



నూతన కార్యవర్గ సభ్యులు

చార్మినార్ జోనల్ ఐఎన్‌టీయూసీ నూతన కార్యవర్గం

మదీన, జూలై 20 (ఆంధ్రజ్యోతి): జీహెచ్‌ఎంసీ తెలంగాణ ఎంప్లాయీస్ యూనియన్ (ఐఎన్‌టీయూసీ) చార్మినార్ జోనల్ నూతన కార్యవర్గాన్ని శనివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఎం.నర్సింగ్‌రావు, కార్యదర్శిగా సి.సత్యనారాయణ, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా మీర్జా అక్బర్‌బేగ్, ఉపాధ్యక్షుడిగా ప్రకాశ్‌సింగ్, అదనపు కార్యదర్శిగా యాదగిరి, జాయింట్ సెక్రెటరీగా డి.విఠల్, ఆర్గనైజింగ్ సెక్రెటరీగా జి.నర్సింగ్‌రావు, 8 మందిని కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గసభ్యులు మాట్లాడుతూ, ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడానికి తమ వంతు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ తెలంగాణ ఎంప్లాయీస్ యూనియన్ గౌరవాధ్యక్షుడు బి.దిలీప్‌కుమార్, జనరల్ సెక్రెటరీ కె.రామాంజనేయులు, అధ్యక్షుడు జి.సంజీవ్‌రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ బి.నందకిశోర్, సలహాదారులు నాగన్న, మల్లికార్జున్, సెక్రెటరీ జనరల్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

'మహిళా సంఘాలకే చేపల మార్కెట్లు ఇవ్వాలి'

హైదరాబాద్ సిటీ, జూలై 20 (ఆంధ్రజ్యోతి): మత్స్యమహిళా సంఘాలకే చేపల మార్కెట్లు, క్యాంటీన్లను ఇవ్వాలని సభ్యులు ప్రభుత్వాన్ని కోరారు. హైదరాబాద్ జిల్లా మత్స్య సహకార సంఘాల సమాఖ్య సర్వసభ సమావేశం శనివారం మాసబ్‌ట్యాంక్‌లోని కార్యాలయంలో జరిగింది. మేనేజింగ్ డైరెక్టర్ చరిత, జిల్లా అధ్యక్షురాలు శ్రీమతి కొప్పు పద్మ అధ్యక్షతన జరిగిన సమావేశంలో పలు తీర్మానాలు చేశారు. మత్స్య సహకార సంఘాల మహిళలకు ప్రభుత్వం చేయూతనందించాలని వారు కోరారు. సమావేశంలో హైదరాబాద్ జిల్లా కార్యవర్గ సభ్యులు, మత్స్య సహకార సంఘాలు అధ్యక్షులు పాల్గొన్నారు.

ఆలయంలో చోరీ చేసిన నిందితుడి అరెస్ట్

చార్మినార్ జూలై 20 (ఆంధ్రజ్యోతి): ఆలయంలో దొంగతనం చేసిన వ్యక్తిని 24 గంటల్లోనే పోలీసులు అరెస్ట్ రిమాండ్‌కు తరలించారు. అతడి నుంచి వెండి కిరీటం, రాగి, ఇత్తడి సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. మొఘల్‌పురా ఇన్‌స్పెక్టర్ నాగదుర్గా ప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం. శుక్రవారం ఉదయం గౌలిపుర మురాద్ మహల్‌లోని మణి మాణిక్యశ్వరి దేవాలయం చోరీ జరిగిందని స్థానికులు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ నరేష్ ఆధ్వర్యంలో సీసీ కెమెరాలు పరిశీలించి అరుణ్ సింగ్, (47)అనే వ్యక్తిని అదుపులోకి తీసుకొని విచారించగ దొంగతనం చేసినట్టు అంగీకరించాడు. జనవరి నెలలో ఛత్రినాక పోలీసుస్టేషన్ పరిధిలోని ఓ ఆలయంలో కూడా దొంగతనం చేశాడని పోలీసులు తెలిపారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని యువకుడి మృతి



రాజేంద్రనగర్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): గుర్తుతెలియని వాహనం ఢీకొన్న ఘటనలో గుర్తుతెలియని యువకుడు మృతిచెందాడు. ఈ ఘటన రాజేంద్రనగర్ సర్కిల్ ఆరాంఘర్ చౌరస్తాలో చోటుచేసుకుంది. శనివారం తెల్లవారుజామున శివరాంపల్లి మార్గంలో నడుచుకుంటూ వెళుతున్న 28 ఏళ్ల యువకుడిని గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం అందుకున్న అత్తాపూర్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని ఉస్మానియా మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

స్తంభించిన జనజీవనం

- రాజేంద్రనగర్ సర్కిల్‌లో లోతట్టు ప్రాంతాల్లోకి వరద
- రోడ్లపై గుంతల్లో నిలిచిన వర్షపు నీరు



బుద్వేల్‌లోని ఓ రోడ్డుపై చేరిన వర్షపునీరు



గగన్‌పహాడ్ పాత కర్నూల్ రోడ్డు వద్ద రైల్వే అండర్ బ్రిడ్జి మార్గంలో నిలిచిన వర్షపు నీటిలో వాహనదారులు

రాజేంద్రనగర్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు లోతట్టు ప్రాంతాల్లో వర్షపు నీరు చేరడంతో రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలో జనజీవనం పూర్తిగా స్తంభించిపోయింది. బుద్వేల్ కామునికుంత నుంచి శ్రీశివసాయి కాలనీకి వెళ్లే మార్గంలో రోడ్లన్నీ గుంతలమయంగా ఉండడంతో, ఆ గుంతల్లో వరద నీరు చేరి చెరువులను తలపిస్తున్నాయి. దాంతో చిరు వ్యాపారులకు, కూలీ పనులు చేసుకునే వారికి ఉపాధి కరువైంది. లోతట్టు ప్రాంతాలలో వరద నీరు చేరడం వలన వాహదారులు, స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. వరదనీటిలోనే తల్లిదండ్రులు తమ పిల్లలను అవస్థలు పడుతూ స్కూళ్లకు పంపింతున్నారు. గుంతల రోడ్లను బాగుచేసి, వర్షపు నీరు నిల్వకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

బాబుల్‌రెడ్డినగర్‌లో..

బాబుల్‌రెడ్డినగర్‌లో నర్సబాయి కుంటను ఆనుకుని ఉండే నివాసాల ముందుకు మురుగునీటితో పాటు వర్షం నీరు వచ్చి చేరుతుంది. వరద నీరు నర్సబాయి కుంటలోకి వెళ్తున్న సమయంలో సరైన స్లోపు లేకపోవడంతో నర్సబాయి కుంటలో ఉండే మురుగునీరు కూడా రోడ్లపైకి వచ్చి చేరుతుంది. స్థానికుల ఫిర్యాదు మేరకు రాజేంద్రనగర్ జీహెచ్ఎంసీ ఇంజనీరింగ్ సిబ్బంది ఎక్స్‌కవేటర్ సాయంతో కాల్వను లోతుగా తవ్వి వర్షపు నీరు చెరువులోకి వెళ్లేటట్లు చేశారు.

రైల్వే బ్రిడ్జి కింద నిలిచిన వరద

ఇటీవల కురుస్తున్న వర్షాలకు కాటేదాన్ నుంచి గగన్‌పహాడ్ వైపునకు వెళ్లే మార్గం.. పాత కర్నూల్ రోడ్డు ఆనంద్‌నగర్ వద్ద రైల్వే బ్రిడ్జి కింద వరదనీరు చేరింది. దాంతో వాహనదారులు, పాదచారులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు.

జాగ్రత్తలు తీసుకుంటున్నాం: డీసీ

రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలో ప్రజల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని వరదనీటి సమస్యలు తలెత్తకుండా ఆయా ప్రాంతాలను పరిశీలించి జాగ్రత్తలు తీసుకుంటున్నాం. ఉప్పర్‌పల్లి మంత్రా మాల్ వద్ద వర్షం నీరు చేరకుండా పనులు చేపట్టాం. రోడ్డుపై ఉన్న బురదనూ తొలగించాం. రోడ్లపై నీరు నిల్వకుండా ఎనిమిది టీమ్‌లు పనిచేస్తున్నాయి. వాటిలో మూడు సమస్య ఎక్కువగా ఉన్న ప్రాంతం వద్దనే ఉండి పనులు చేస్తారు. మరో ఐదు టీమ్‌లు ఎక్కడ సమస్య ఉన్నా అక్కడికి వెళ్లి పనులు చేసేలా చర్యలు తీసుకుంటున్నాం.



ఉప్పర్‌పల్లిలో రోడ్డుపై బురదను శుభ్రం చేస్తున్న సిబ్బంది. పరిశీలిస్తున్న డీసీ కె. రవికుమార్

అక్రమాలకు పాల్పడుతున్న కాలేజీలపై చర్యలు తీసుకోవాలి

హైదరాబాద్ సిటీ, జూలై 20 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల నుంచి అధిక ఫీజులు వసూలు చేస్తూ అక్రమాలకు పాల్పడుతున్న ప్రైవేట్ ఇంజనీరింగ్ కాలేజీలపై చర్యలు తీసుకోవాలని ఓయూ రీసెర్చ్ స్కాలర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఆజాద్ ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు శనివారం సాంకేతిక విద్యా కమిషనర్ దేవసేనకు అసోసియేషన్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు.

అనంతరం ఆజాద్ మాట్లాడుతూ కోట్ల రూపాయల అక్రమ సంపాదన కోసం ప్రైవేట్ కాలేజీ యాజమాన్యాలు పేదవిద్యార్థులను ఇంజనీరింగ్ విద్యకు దూరం చేస్తున్నాయన్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఒక్కో ఇంజనీరింగ్ సీటును రూ. 16 లక్షల నుంచి రూ. 25 లక్షలకు అమ్ముకుంటూ విద్యా మాఫియాను కొనసాగిస్తున్నాయన్నారు. ఈఈఈ, సివిల్, మెకానిక్ కోర్సుల స్థానంలో సీఎస్ఈ అనుబంధ సెక్షన్ల పెంపు కోసం ప్రయత్నిస్తున్నారన్నారు. అటానమస్ పేరుతో విచ్చలవిడిగా ల్యాబ్, లైబ్రరీ, ప్లేస్‌మెంట్ ఫీజులు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. ఫిట్‌నెస్ లేని బస్సులను నడిపిస్తూ కాలేజీ ట్రాన్స్‌పోర్టు పేరిట ముందుగానే విద్యార్థుల నుంచి డబ్బులు దండుకుంటున్నారని, అక్రమాలకు పాల్పడుతున్న ఇంజనీరింగ్ కళాశాలలపై తక్షణమే చర్యలు తీసుకోవాలని, అటానమస్ వ్యవస్థను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రీసెర్చ్ స్కాలర్స్ పోగుల చిరంజీవి యాదవ్, భూక్య రవినాయక్, చేవెళ్ల యాదగిరి, తదితరులు పాల్గొన్నారు.



సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ దేవసేనకు వినతిపత్రం అందజేస్తున్న ఓయూ రీసెర్చ్ స్కాలర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఆజాద్

విద్యార్థి సంఘాల నాయకులపై చర్యలు తీసుకోవాలి

రాజేంద్రనగర్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): విద్యార్థి సంఘాల పేరుతో ప్రభుత్వ గుర్తింపు పొందిన ప్రైవేటు పాఠశాలలోకి వచ్చి దౌర్జన్యాలు చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని రాజేంద్రనగర్, గండిపేట మండలాలకు చెందిన గుర్తింపు పొందిన పాఠశాలల యాజమాన్య సంఘాల నాయకులు కోరారు. శనివారం రాజేంద్రనగర్ డీసీపీ చింతమనేని శ్రీనివాస్‌ను కలసి వారు వినతిపత్రం అందజేశారు. ఈ నెల 18న తెలంగాణ లీగల్ స్టూడెంట్స్ అసోసియేషన్ ప్రతినిధులమంటూ కొందరు కాటేదాన్ వెంకటేశ్వర కాలనీలోని ఆదిత్య టాలెంట్ హై స్కూల్‌లోకి చొరబడి ఇష్టానుసారంగా వ్యవహరించారని డీసీపీకి వివరించారు. తక్కువ ఫీజులతో నాణ్యమైన విద్యనందిస్తూ, పలువురికి ఉపాధినిస్తున్న ప్రైవేటు పాఠశాలలపై విద్యార్థి సంఘాలు దాడులు చేయకుండా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. డీసీపీ చింతమనేని శ్రీనివాస్ మాట్లాడుతూ, ప్రైవేటు పాఠశాలలకు వచ్చి ఎవరైనా బెదిరిస్తే వెంటనే 100 నెంబర్‌కు డయల్ సమాచారం ఇవ్వాలన్నారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడేవారు ఎవరైనా సహించేది లేదన్నారు. డీసీపీని కలసిన వారిలో ప్రభుత్వ గుర్తింపు పొందిన ప్రైవేటు పాఠశాలల యాజమాన్య సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.ఎన్ రెడ్డి, రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు జి.నారాయణరెడ్డి, రాజేంద్రనగర్, గండిపేట్ మండలాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం.ప్రభాకరాచారి, నర్సింహరెడ్డి, జి.శరవణ్‌కుమార్, ఆనంద్, ఆదిత్య టాలెంట్ స్కూల్ డైరెక్టర్ పి.సూర్యనారాయణతోపాటు ప్రైవేట్ పాఠశాలల నిర్వాహకులు పాల్గొన్నారు.



డీసీపీ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేస్తున్న ప్రభుత్వ గుర్తింపు పొందిన ప్రైవేటు పాఠశాలల యాజమాన్య సంఘాల నాయకులు

సాయికుమార్‌ది ఒకే పార్టీ.. ఒకే జెండా

సన్మానించిన ఎంపీలు కిరణ్‌కుమార్‌రెడ్డి, మల్లు రవి, ఎమ్మెల్సీ మహేశ్

కార్వాన్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): ఒకే పార్టీ, ఒకే జెండా, ఒకటే సిద్ధాంతం మెట్టు సాయి కుమార్‌ది అని ఎంపీలు చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, మల్లు రవి, ఎమ్మెల్యే మహేశ్ కుమార్‌గౌడ్ అన్నారు. కాంగ్రెస్ పార్టీలో ఎన్ని అవాంతారులు ఎదురైనా ఏనాడు అధైర్యపడకుండా తాను నమ్మిన సిద్ధాంతంతోనే ఆయనకు తెలంగాణ రాష్ట్ర ఫిషరీష్ కార్పొరేషన్ చైర్మన్ పదవి దక్కిందని వారన్నారు. శనివారం విజయనగర్ కాలనీలో ఆత్మీయ సమ్మేళనంలో మెట్టు సాయికుమార్ పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ఎంపీలు చామల కిరణ్ కుమార్‌రెడ్డి, మల్లు రవి, ఎమ్మెల్సీ మహేశ్ కుమార్‌గౌడ్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ డాక్టర్ రియాజ్, టీజీఐఐసీ చైర్మన్ నిర్మలా జగ్గారెడ్డి, కార్పొరేటర్లు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు, మత్స్యశాఖ ఉన్నతాధికారులు పాల్గొని మెట్టు సాయికుమార్‌ను సత్కరించారు. ఈ సందర్భంగా మెట్టు సాయికుమార్ మాట్లాడుతూ బలహీనవర్గాల పక్షపాతి సీఎం రేవంత్ రెడ్డి అని.. క్రమశిక్షణగల కాంగ్రెస్ కార్యకర్తలకు పార్టీలో ఎప్పుడూ సముచిత స్థానం లభిస్తుందన్నారు. మత్స్యవ్యాపారులు నాణ్యతతో కూడిన చేపలు, రొయ్యలు, పీతలు విక్రయించాలని.. మోసాలకు పాల్పడవద్దని.. దళారుల వ్యవస్థకు అడ్డుకట్ట వేయాలని ఆయన కోరారు.



సాయికుమార్‌ను సన్మానిస్తున్న కిరణ్‌కుమార్‌రెడ్డి, మల్లు రవి, ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్ గౌడ్.



మొక్కను నాటుతున్న చైర్మన్ అబ్దుల్లా సాధి

ప్రతీ ఒక్కరు ఓ మొక్కను నాటాలి

పహాడిషరీఫ్ జూలై 20 (ఆంధ్రజ్యోతి): ప్రతీ ఒక్కరు ఓ మొక్కను నాటి, దానిని పరిరక్షించాలని జల్‌పల్లి మున్సిపాలిటీ చైర్మన్ అబ్దుల్లా సాధి, కమిషనర్ వాణిరెడ్డి సూచించారు. వనమహోత్సవంలో భాగంగా మున్సిపల్ పరిధిలోని 16వార్డులో జామ, సీతాఫలం, తదితర మొక్కలను కౌన్సిలర్ బుడుమల యాదగిరి, అధికారులతో కలసి శనివారం నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మొక్కలు, మనిషికి ప్రాణవాయువును అందించడమే కాకుండా, వాతావరణంలో కాలుష్యాన్ని తొలగిస్తాయన్నారు. కార్యక్రమంలో మున్సిపాలిటీ, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు,

నిర్ణీత పార్కింగ్ ఫీజులే తీసుకోవాలి

- డిప్యూటీ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి

మదీన, జూలై 20 (ఆంధ్రజ్యోతి): షాపింగ్ కాంప్లెక్స్‌లు, సినిమా థియేటర్లలో ప్రభుత్వం నిర్ణయించిన మేరకే పార్కింగ్ ఫీజులు వసూలు చేయాలని ఫలక్‌నుమా సర్కిల్ డిప్యూటీ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. శనివారం పూల్‌బాగ్‌లోని తన కార్యాలయంలో వాణిజ్య సముదాయాల నిర్వాహకులు, అధికారులతో సమావేశం ఏర్పాటు చేసి పలు సూచనలు చేశారు. ప్రజల నుంచి ఇష్టానుసారంగా పార్కింగ్ ఫీజులు వసూలు చేయవద్దన్నారు. వాణిజ్య సముదాయాల వద్ద పార్కింగ్ ఫీజుల పట్టికను ప్రదర్శించాలన్నారు. నిబంధనలకు విరుద్ధంగా అధిక రుసుము వసూలు చేసినట్లయతే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

రోడ్లకు మరమ్మతులు చేయండి

కార్వాన్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): కార్వాన్ నియోజకవర్గం, లంగర్‌హౌజ్ తదితర ప్రాంతాల్లో పైపులైన్ కోసం అధికారులు రోడ్లను తవ్వి వదిలేశారు. లక్ష్మీనగర్, గాంధీనగర్, ప్రశాంత్‌నగర్ రోడ్లన్నీ బురదమయంగా మారాయి. రాకపోకలు ఇబ్బందులు పడుతున్నామని గుంతలకు మరమ్మతులు చేయాలని ఎన్నిసార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డు మరమ్మతు పనులను చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

26 నుంచి నల్లపోచమ్మ బోనాలు

గోషామహల్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): జియగూడ కురుమబస్తీలోని మహాకాళి నల్లపోచమ్మ ఆలయ బోనాల ఉత్సవాలను ఈ నెల 26,27,28వ తేదీల్లో నిర్వహించేందుకు ఏర్పాట్లను పూర్తి చేస్తున్నామని ఆలయ చైర్మన్ వి.శ్రీనివాస్, వైస్ చైర్మన్ టి.మహేశ్, జనరల్ సెక్రటరీ ఎల్.అమర్‌నాథ్, జాయింట్ సెక్రటరీ డి.శ్రీనివాస్ పేర్కొన్నారు. శనివారం ఆలయ ప్రాంగణంలో విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ.. మూడు రోజులపాటు బోనాల పండుగ కనులపండువగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. 26న 100 మంది మహిళలతో పట్టు వస్త్రాలు, ఒడిబియ్యం సమర్పణ, 27న తొట్టెల ఊరేగింపు, 28న బోనాల జాతర నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. కార్యక్రమంలో ఆలయ గౌరవ సలహాదారులు డోలక్ కృష్ణ, పోరే రాములు, ఎ.సంతోష్, టి.సురేశ్, వి.గోవింద్ రాజు, జి.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారి ఆలయాల వద్ద ఏర్పాట్లు చేపట్టాలి

- ప్రజాఏక్తా పార్టీ జాతీయ అధ్యక్షుడు శ్రీనివాస్

అఫ్జల్‌గంజ్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): బోనాలు ఉత్సవాలకు అమ్మవారి ఆలయాల వద్ద ఏర్పాట్లు చేపట్టాలని ప్రజా ఏక్తా పార్టీ జాతీయ అధ్యక్షుడు బోనాల శ్రీనివాస్ అన్నారు. శనివారం నగరంలో నిర్వహించిన అమ్మవారి ఘటాల ఊరేగింపునకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఘటం ముందు పోతరాజుల విన్యాసాలు, తొట్టెల ఊరేగింపుతో ఈ ప్రాంతంలో ఆధ్యాత్మిక వాతావరణం సంతరించుకుంది. కార్యక్రమంలో బోనాల జాతర నిర్వాహకులు ఇ.నరేందర్, రాజేశ్ గౌలీకర్, ఎం.శ్రీకాంత్, శ్యామ్ పోతురాజు, భక్తులు పాల్గొన్నారు.

మరిన్ని మెహిదీపట్నం జోన్ వార్తల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/pWhxTUmలో చదవండి.
Note: Andhrajyothi.com/editions/hyd/set-6 abids, mehadipatnam, charminarలో చూడగలరు.
నోట్: htpps://epaper.andhrajyothy.comలో లాగిన్ అయిన తరువాత క్యూఆర్‌కోడ్‌ని స్కాన్ చేయగలరు.

నేడు శ్రీరాం కాలనీలో బోనాల ఉత్సవాలు

పహాడిషరీఫ్ జూలై 20 (ఆంధ్రజ్యోతి): శ్రీరాం కాలనీలో ఆదివారం బోనాల ఉత్సవాలు నిర్వహించనున్నామని పోచమ్మ ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. శనివారం ఆయలంలో సమావేశమైన వారు మాట్లాడుతూ ఆషాడ మాసం బోనాల సందర్భంగా సికింద్రాబాద్ ఉజ్జయిని మహాకాళి బోనాల ఉత్సవాల రోజునే శ్రీరాం కాలనీలో బోనాల పండుగను నిర్వహిస్తున్నామన్నారు. అమ్మవారి ఆలయాన్ని రంగులతో అలంకరించామని, భక్తులకు ఎలాంటి తలెత్తకుండా ప్రత్యేక చరలు తీసుకున్నామన్నారు. సోమవారం ఫలహారం బండ్ల ఊరేగింపు ఉంటుందన్నారు

నేడు పాతబస్తీలో ఘట స్థాపనోత్సవాలు



చాంద్రాయణగుట్ట, జూలై 20 (ఆంధ్రజ్యోతి): పాతనగర బోనాల ఉత్సవాల్లో భాగంగా ఆదివారం సాయంత్రం అమ్మవారి ఘటాల ఊరేగింపు, ఘట స్థాపనోత్సవాలకు ఆలయాల కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో సన్నాహాలు చేస్తున్నారు. శాలిబండ కాశీవిశ్వనాథస్వామి దేవాలయం నుంచి ప్రారంభమై లాల్‌దర్వాజ మోడ్, లాల్‌దర్వాజ, బాలాగంజ్, గౌలిపురా మీదుగా ఘటాల ఊరేగింపు సాగనుంది. తొమ్మిది రోజులపాటు నిర్వహించే బోనాల ఉత్సవాలు ఘటోత్సవంతో ప్రారంభమవుతాయి. మొదట లాల్‌దర్వాజ సింహవాహిని శ్రీమహాకాళి అమ్మవారి ఘటం, చివరిగా శ్రీఅక్కన్న మాదన్న మహాకాళి అలయ ఘటం ఊరేగింపుగా బయలుదేరుతుంది. లాల్‌దర్వాజ మోడ్ వద్ద ఏర్పాటు చేసిన స్మారక వేదిక పైనుంచి ప్రముఖులు ఘటాలకు స్వాగతం పలకనున్నారు.

నేడు గురు పూర్ణిమ వేడుకలు

రాజేంద్రనగర్, జూలై 20(ఆంధ్రజ్యోతి) : ఈ నెల 21న రాజేంద్రనగర్ సర్కిల్ ఉప్పర్‌పల్లిలోని శ్రీసాయిబాబా గుడిలో గురు పూర్ణిమ మహోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు సామ ఇంద్రపాల్‌రెడ్డి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆదివారం ఉదయం 6:30 గంటల నుంచి ఆయలంలో అభిషేకాలు, పూజలు, విశేష పుష్పాలంకరణ, భగవద్గీత పారాయాణం ఉంటుందన్నారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం, సాయంత్రం 6:15 గంటలకు బాబాకు దూప్ హారతి, 7 గంటలకు విష్ణు సహస్రనామ సామూహిక పారాయణం ఉంటుందని తెలిపారు.

వెంకన్నగుట్టపై సత్యనారాయణస్వామి వ్రతం

కాటేదాన్ టీఎస్‌జీవోస్ కాలనీలో వెంకన్నగుట్టపై వెలసిన శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం వ్యాసపౌర్ణమి(గురు పౌర్ణమి) పురస్కరించుకుని సామూహిక సత్యనారాయణ వ్రతమహోత్సవాన్ని నిర్వహిస్తున్నామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. సత్యనారాయణ వ్రతం చేయించుకోవాలనుకునే భక్తులు 83672 84135 ఫోన్ నెంబర్‌లో సంప్రదించాలన్నారు.

వేంకటేశ్వరస్వామి ఆలయ

ధర్మకర్తల మండలి ప్రమాణస్వీకారం

చాంద్రాయణగుట్ట, జూలై 20 (ఆంధ్రజ్యోతి): లాల్‌దర్వాజ పూల్‌బాగ్ చారిత్రక శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయం ధర్మకర్తల మండలి నూతన కమిటీ సభ్యులు శనివారం ప్రమాణ స్వీకారం చేశారు. ధర్మకర్తల మండలి నూతన కమిటీ ట్రస్టీలుగా బి.లెనిన్‌బాబు, ముద్దం అమరేశ్వర్‌రెడ్డి, పట్లూరి వెంకటేశ్వర్‌రావు, బి.మధుసూదన్, ఆర్.మురళీధర్, ఎం.మోహన్‌రెడ్డి, పి.శైలజ, ఎక్స్‌అఫిషియో సభ్యుడిగా కె.మోహనాచారిలను రాష్ట్ర దేవాదాయశాఖ నియమించింది. ఈ మేరకు వారు సమావేశమై చాంద్రాయణగుట్ట కాంగ్రెస్ ఇన్‌చార్జి బోయ నగేశ్ సమక్షంలో బి.లెనిన్‌బాబును ఆలయచైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

దేవునికుంట వెంకన్న గుడికి నూతన కమిటీ..

కార్వాన్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): మెహిదీపట్నం దేవునికుంట వెంకటేశ్వరస్వామి దేవాలయానికి దేవాదాయ శాఖ అధికారులు ఏడుగురు సభ్యులతో నూతన కమిటీని శనివారం ప్రకటించారు. చైర్మన్‌గా కమిటీ సభ్యులు ఎ.సాయి సచిన్‌ను ఎన్నుకొన్నారు. కమిటీ సభ్యులుగా గాండ్ల సురేశ్, పి.రవికుమార్, దుర్గాపు నాగరాజు, బి.వనజ, ఎ.వెంకటసురేందర్, కె. వెంకటరమణారావు నియమితులయ్యారు. చైర్మన్, కమిటీ సభ్యులు శనివారం ప్రమాణ స్వీకారం చేశారు. ముఖ్య అతిథిగా నాంపల్లి కాంగ్రెస్ ఇన్‌చార్జి ఫిరోజ్‌ఖాన్ హాజరయ్యారు.

ఫలక్‌నుమా డిపో మేనేజర్‌గా రమేశ్



బాధ్యతలు స్వీకరిస్తున్న రమేశ్

చాంద్రాయణగుట్ట, జూలై 20 (ఆంధ్రజ్యోతి): ఫలక్‌నుమా ఆర్టీసీ డిపో మేనేజర్‌గా బి.రమేశ్ బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఇక్కడ పనిచేస్తున్న జాకిర్ హుస్సేన్ జహీరాబాద్ డిపోకు బదిలీ కావడంతో బండ్లగూడ డిపోలో పనిచేస్తున్న రమేశ్‌ను అధికారులు ఫలక్‌నుమా డిపోకు బదిలీ చేయగా శనివారం ఆయన బాధ్యతలను చేపట్టారు.

జేఎన్‌టీయూ షాన్‌దార్



● ఇంజనీరింగ్ విద్యలో వర్సిటీ మేటి ● టాప్‌టెన్‌లో ఒకరు..వెయ్యిలోపు 31 మంది
● మొత్తం 690 సీట్లలో ఒక్కటీ మిగల్లేదు ● మొదటి విడత కేటాయింపులోనే సీట్లన్నీ భర్తీ

హైదరాబాద్ సిటీ, జూలై 20 (ఆంధ్రజ్యోతి): నాణ్యమైన ఇంజనీరింగ్ విద్యకు కేరాఫ్‌గా నిలిచిన జేఎన్‌టీయూకు ఏటా క్రేజ్ పెరుగుతోంది. ప్రైవేటు కాలేజీలకు తీసిపోని విధంగా విద్య, చక్కటి వసతులు కల్పిస్తుండడంతో వర్సిటీలో అభ్యసించేందుకు విద్యార్థులు ఆసక్తి చూపిస్తున్నారు. ఎప్‌సెట్-2024 మొదటి విడత సీట్ల కేటాయింపులో టాపర్లు చూపంతా జేఎన్‌టీయూ వైపు మళ్లడమే ఇందుకు నిదర్శనం. రాష్ట్రంలోని ఏ ప్రభుత్వ, ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీల్లో లేని విధంగా హైదరాబాద్ జేఎన్‌టీయూ కాలేజీలో చదివేందుకు టాప్‌టెన్‌లో ఒకరు, వెయ్యిలోపు ర్యాంకర్లలో 31మంది ఆప్షన్లు ఎంచుకోవడం విశేషం. ఎప్‌సెట్‌లో 9వ ర్యాంకు సాధించిన కొణతం మణితేజ కంప్యూటర్ సైన్స్ చదివేందుకు ఆప్షన్ ఇచ్చుకోగా, సీటు లభించింది. మరోవైపు వెయ్యిలోపు ర్యాంకులు పొందిన మరో 31 మంది అభ్యర్థులు కూడా జేఎన్‌టీయూలో వివిధ కోర్సులు చదివేందుకు ఆసక్తి చూపడం పట్ల సీనియర్ విద్యార్థులు, ఆచార్యుల్లో సంతోషం వ్యక్తమవుతోంది.

మొదటి ప్రాధాన్యత సీఎస్‌ఈకే

జేఎన్‌టీయూ కాలేజీలో చదివేందుకు ఆసక్తి చూపిన టాప్ ర్యాంకర్లలో ఎక్కువశాతం తమ తొలి ఆప్షన్‌ను కంప్యూటర్ సైన్స్‌కే ఇచ్చారు. వెయ్యిలోపు ర్యాంకుల్లో జేఎన్‌టీయూ కాలేజీని ఎంచుకున్న అభ్యర్థులు మొత్తం 27మంది ఉండగా, ఇందులో సీఎస్‌ఈ కోర్సులో 24 మందికి సీట్లు లభించాయి. మరో ఐదుగురు సీఎస్‌ఈ అనుబంధంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మెషీన్‌లెర్నింగ్ కోర్సును ఎంచుకున్నారు. కాగా ఇద్దరు అభ్యర్థులు తమ తొలి ప్రాధాన్యతను ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్‌కు ఇవ్వగా, ఒకరికి సైబర్ సెక్యూరిటీ కోర్సులో సీటు లభించింది. గ్రేటర్ పరిధిలో ఉన్న మరొక ప్రభుత్వ ఇంజనీరింగ్ కళాశాల ఓయూ ఇంజనీరింగ్ కాలేజీకి ఈ ఏడాది వెయ్యిలోపు ర్యాంకర్లలో కేవలం ముగ్గురు మాత్రమే ఆప్షన్లు ఇవ్వడం గమనార్హం. ఈ ముగ్గురు అభ్యర్థులు కూడా సీఎస్‌ఈ కోర్సులోనే సీట్లు దక్కించుకున్నారు.

690 సీట్లలో ఒక్కటీ మిగల్లేదు

జేఎన్‌టీయూ హైదరాబాద్ కాలేజీలో మొత్తం 11 ఇంజనీరింగ్ కోర్సులు ఉండగా, ఫస్టియర్ బీటెక్‌లో సీఎస్‌ఈ, ఏఐఎంఎల్, సైబర్ సెక్యూరిటీ, ఈసీఈ, ఈఈఈ, సివిల్, మెకానికల్, మెటలర్జీ, కెమికల్ ఇంజనీరింగ్, బయోటెక్నాలజీ, జియో ఇన్ఫర్మేటిక్స్ కోర్సుల్లో 66 చొప్పున మొత్తం 690 సీట్లున్నాయి. ఏ బ్రాంచ్‌లోనూ ఒక్కసీటు కూడా మిగలకపోవడం విశేషమని ప్రిన్సిపాల్ డాక్టర్ జి.వి.నర్సింహారెడ్డి అన్నారు. ఐఐటీలతో సమానంగా జేఎన్‌టీయూ కాలేజీలోని కొన్ని విభాగాల్లో వరల్డ్‌క్లాస్ ల్యాబొరేటరీలు, ఇతర సదుపాయాలు ఉన్నాయని చెప్పారు. ఈ ఏడాది కంప్యూటర్ సైన్స్‌లో అత్యధికంగా ఒక విద్యార్థికి రూ.52 లక్షల ప్యాకేజీతో ప్లేస్‌మెంట్ లభించిందని వెల్లడించారు.

అక్షరాభ్యాసానికి వెళ్తూ అనంతలోకాలకు

● డివైడర్‌ను ఢీకొట్టి కారు బోల్తా
● ఇద్దరు మృతి, మెదక్ జిల్లాలో ఘటన


ఘటనా స్థలంలో బోల్తాపడిన కారు

మనోహరాబాద్, జూలై 20: చిన్నారి అక్షరాభ్యాసం కోసం బాసర జ్ఞాన సరస్వతీ క్షేత్రానికి వెళ్తూ జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు నగరవాసులు దుర్మరణం పాలయ్యారు. ఈ ఘటన మెదక్ జిల్లా మనోహరాబాద్ మండలం కాళ్లకల్ వద్ద జాతీయ రహదారిపై చోటుచేసుకుంది. మూసాపేటలో నివాసముంటున్న ఓ కుటుంబం 11 మందితో కలిసి శనివారం ఉదయం కారులో బాసరకు బయల్దేరారు. కాళ్లకల్ బంగారమ్మ ఆలయం వద్ద వారు ప్రయాణిస్తున్న కారు వేగంగా డివైడర్‌ను ఢీకొట్టి రోడ్డు పక్కన గుంతలో బోల్తాపడింది. ఈ ఘటనలో మంగవెల్లి ఆజారావు(55) అనే మహిళ అక్కడికక్కడే మృతిచెందగా, మరొకరు భాస్కర్‌రావు(57) హైదరాబాద్ ఈఎస్‌ఐ ఆస్పత్రిలో కన్నుమూశారు. పోలీసులు గాయపడిన వారిని తూప్రాన్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

మరో ఘటనలో ఇద్దరు

సదాశివపేట, జూలై 20: సింగూరు ప్రాజెక్టును తిలకించేందుకు బయలుదేరిన ఆరుగురు స్నేహితుల విహారయాత్ర విషాదంగా ముగిసింది. హైదరాబాద్ టోలిచౌకీ ప్రాంతానికి చెందిన బీటెక్ మొదటి సంవత్సరం చదువుతున్న ఆరుగురు స్నేహితులు జోహెద్ (19), ఫైజాన్ (19), ఖాసిం (19), జకీయోద్దిన్ (19), సిద్ధిఖ్‌ఖాన్ (19), షెహజాన్ (19) కారులో సింగూరు ప్రాజెక్టును చూసేందుకు బయలుదేరారు. సంగారెడ్డి జిల్లా సదాశివపేట మండలం ఆత్మకూరు శివారులోకి రాగానే వారు ప్రయాణిస్తున్న కారు అదుపుతప్పి పల్టీలు కొట్టి విద్యుత్ స్తంభాన్ని బలంగా ఢీకొన్నది. ఈ దుర్ఘటనలో సిద్ధిఖ్‌ఖాన్, జకియోద్దిన్ మృతిచెందారు. మరో నలుగురికి తీవ్రగాయాలు కావడంతో పోలీసులు వారిని సంగారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

రూ.78 కోట్లు..107 జంక్షన్లు

● ప్రమాదాల నివారణకు జంక్షన్ల అభివృద్ధి
● ఇప్పటికే పనులు చేపట్టిన జీహెచ్‌ఎంసీ

హైదరాబాద్ సిటీ, జూలై 20 (ఆంధ్రజ్యోతి): వాహనాలు విపరీతంగా పెరుగుతుండడంతో నగరంలో పలు జంక్షన్లు ప్రమాదకరంగా మారుతున్నాయి. దీంతో జీహెచ్‌ఎంసీ జంక్షన్ల అభివృద్ధే ప్రధాన లక్ష్యంగా చర్యలు చేపడుతోంది. గ్రేటర్ చుట్టూ పట్టణాలు వేగంగా అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో జంక్షన్ల వద్ద ప్రమాదాలు జరగకుండా ప్రధాన కూడళ్లను అభివృద్ధి చేస్తోంది. పెరుగుతున్న వాహనాల సంఖ్యకనుగుణంగా రూ.78.14 కోట్ల అంచనా వ్యయంతో 107 జంక్షన్ల అభివృద్ధికి చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా ప్రమాదాలు అరికట్టేందుకు సిగ్నళ్ల ఏర్పాటుతోపాటు పాదచారుల కోసం ఫుట్‌పాత్ నిర్మాణాలు చేపడుతున్నారు. ప్రత్యేకంగా వాహనదారులకు ఆహ్లాదకర వాతావరణం కల్పించేందుకు సుందరీకరణ పనులు చేపడుతున్నారు. గ్రేటర్‌వ్యాప్తంగా ఈ పనులు చేపట్టేందుకు ప్రతిపాదించినప్పటికీ కొన్నిచోట్ల స్థలాభావం వల్ల రద్దు చేశారు. ఇప్పటివరకు 31 జంక్షన్లు పూర్తిచేయగా, 13 జంక్షన్లు వివిధ అభివృద్ధి దశలో ఉన్నాయి. 17 జంక్షన్లకు పరిపాలన అనుమతులు మంజూరు కావాల్సి ఉండగా, మరో 16 జంక్షన్లలో పనులు మొదలు పెట్టాల్సి ఉంది.

త్వరగా చేరుకునేలా..

సర్కిల్ వారీగా ప్రాధాన్యత గల జంక్షన్లను గుర్తించి అధికారులు అభివృద్ధి చేస్తున్నారు. ఈ పనులు పూర్తయితే వాహనదారులు ఇబ్బంది లేకుండా తమ గమ్యస్థానానికి వేగంగా చేరుకుంటారని అధికారులు చెబుతున్నారు. పలు దేశాల్లో రోడ్డు ప్రమాదాలు 40 నుంచి 60 శాతం వరకు జంక్షన్లు ఇరుకుగా ఉండడం వల్లే జరుగుతున్నాయని ఓ అంచనాలో తేలిందని అధికారులు తెలిపారు.

సేవలకు సత్కారం



న్యూఢిల్లీ రాష్ట్రపతి భవన్‌లో జరిగిన కార్యక్రమంలో దేశ ప్రథమ పౌరురాలు ద్రౌపది ముర్ము చేతుల మీదుగా విశిష్ట సేవా మెడల్, పరమ విశిష్ట సేవా పతకాన్ని అందుకుంటున్న దుండిగల్ ఎయిర్‌ఫోర్స్ అకాడమీ కమాండెంట్ శ్రీనివాస్, మాజీ కమాండెంట్ చంద్రశేఖర్. వీరిద్దరూ తెలుగువారు కావడం విశేషం.

-అల్వాల్, జూలై 20 (ఆంధ్రజ్యోతి)

సనత్‌నగర్ సీఐ పురేందర్‌రెడ్డి పాడుబుద్ధి

● స్టేషన్‌కొచ్చిన మహిళకు లైంగిక వేధింపులు
● సీపీకి బాధితురాలి ఫిర్యాదు, సస్పెన్షన్


ఇన్‌స్పెక్టర్ పురేందర్‌రెడ్డి

బంజారాహిల్స్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): న్యాయం కోసం పోలీసుస్టేషన్ మెట్లు ఎక్కిన ఓ వివాహితకు చేదు అనుభవం ఎదురైంది. సాయం చేయాల్సిన పోలీసు అధికారే ఆమెను లైంగికంగా వేధించాడు. బాధితురాలు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడంతో విషయం బయటికి రాగా సదరు అధికారిపై వేటు పడింది. ఈ మేరకు సనత్‌నగర్ సీఐ పురేందర్‌రెడ్డిని సైబరాబాద్ కమిషనర్ సస్పెండ్ చేశారు. సనత్‌నగర్ పోలీసుస్టేషన్ పరిధిలో ఉండే ఓ గృహిణి కొద్దిరోజుల క్రితం ఠాణాకు వచ్చి తన అత్తింటివారిపై గృహహింస కేసు పెట్టింది. విచారణ నిమిత్తం సీఐ పురేందర్‌రెడ్డి ఆమెను పలుమార్లు స్టేషన్‌కు పిలిపించారు. అనంతరం 'నువ్వు చాలా అందంగా ఉన్నావు..నీకు న్యాయం చెయ్యాలంటే నాకు న్యాయం జరగాలి' అంటూ వాట్సప్‌లో అసభ్యకరమైన సందేశాలు పెట్టాడు. పురేందర్‌రెడ్డి వేధింపులు అధికమవ్వడంతో బాధితురాలు సైబరాబాద్ కమిషనర్‌కు ఫిర్యాదు చేయడంతో చర్యలు తీసుకున్నారు.

అందెశ్రీకి దాశరథి పురస్కారం



హైదరాబాద్ సిటీ, జూలై 20 (ఆంధ్రజ్యోతి): మహాకవి దాశరథి కృష్ణమాచార్య సాహితీ పురస్కారానికి తెలంగాణ రాష్ట్ర గీత రచయిత అందెశ్రీ ఎంపికయ్యారు. ఈ మేరకు సుల్తాన్‌బజార్‌లోని శ్రీకృష్ణదేవరాయ తెలుగు భాషా నిలయం గౌరవాధ్యక్షుడు కేవీ రమణాచారి తెలిపారు. దాశరథి శతజయంత్యుత్సవాల సందర్భంగా ఈనెల 23న పురస్కారాన్ని ప్రదానం చేయనున్నట్లు పేర్కొన్నారు.

గ్రేటర్‌లో భౌభౌల సర్వే

● కుక్కకాట్ల నియంత్రణకు బల్దియా చర్యలు
● నగరంలో అన్నీ వీధికుక్కల గణన
● వాటికి స్టెరిలైజేషన్, యాంటీ రేబిస్ టీకాలు

హైదరాబాద్ సిటీ, జూలై 20 (ఆంధ్రజ్యోతి): నగరంలో కుక్కకాట్ల నియంత్రణకు జీహెచ్‌ఎంసీ దిద్దుబాటు చర్యలు చేపట్టింది. గ్రేటర్‌వ్యాప్తంగా వీధికుక్కలను సర్వే చేయడంతోపాటు వాటికి స్టెరిలైజ్ చేసి సంతానం కలుగకుండా నియంత్రించనున్నారు. అలాగే యాంటీ రేబిస్ టీకాలు వేయనున్నారు. స్టెరిలైజ్ చేయని వీధికుక్కల సమాచారాన్ని తీసుకునేందుకు రెసిడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్లు, స్లమ్ లెవల్ ఫెడరేషన్లతో పాటు సాధారణ ప్రజలను సైతం భాగస్వాములను చేయనున్నారు. హోటళ్లు, రెస్టారెంట్లు, ఫంక్షన్‌హాళ్లు, మాంసాహార దుకాణాలు, హాస్టళ్ల ఆహార వ్యర్థాలను బహిరంగ ప్రదేశాల్లో పడేయకుండా చర్యలు తీసుకొని శాస్త్రీయ పద్ధతి చేపట్టేందుకు నోటీసులివ్వనున్నారు. నగరవాసుల నుంచి వచ్చే కుక్కల ఫిర్యాదులను టోల్‌ఫ్రీ నంబర్ 040-21111111 ద్వారా స్వీకరించడంతో పాటు కుక్కకాట్లను నియంత్రించడానికి ప్రతి సర్కిల్‌లో వెటర్నరీ అధికారి నేతృత్వంలో రాపిడ్ రెస్పాన్స్ టీమ్‌లను ఏర్పాటు చేశారు. ఔటర్ రింగ్‌రోడ్డు పరిధిలోని జీహెచ్‌ఎంసీతోపాటు 27 మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీల్లో ఇదే తరహాలో కుక్కకాట్ల నియంత్రణకు చర్యలు చేపట్టనున్నారు.

బ్రాహ్మణ సంక్షేమ పరిషత్‌కు తక్షణమే నిధులివ్వాలి

● బీజేపీ నేత మాధవీలత డిమాండ్


సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ నేత మాధవీలత

బర్కత్‌పుర, జూలై 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం బ్రాహ్మణుల సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించిందని బీజేపీ నాయకురాలు మాధవీలత ఆరోపించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టి ఎనిమిది నెలలు గడిచినా ఇప్పటికీ బ్రాహ్మణ సంక్షేమ పరిషత్‌ను పునరుద్ధరించలేదని విమర్శించారు. బ్రాహ్మణుల సంక్షేమంపై బీజేపీ ఎండోమెంట్ సెల్ ఆధ్వర్యంలో శనివారం జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. గత ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల వివేకానంద విదేశీ విద్యా పథకం కుంటుపడగా, ప్రస్తుత ప్రభుత్వం కూడా పట్టించుకోవడం లేదన్నారు. బ్రాహ్మణుల సంక్షేమం కోసం కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. బీజేపీ ఎండోమెంట్ సెల్ కన్వీనర్ సూర్యప్రకాష్ మాట్లాడుతూ బ్రాహ్మణ పరిషత్‌కు తగినన్ని నిధులు కేటాయించి ప్రస్తుతమున్న పథకాలన్నింటినీ అమలు చేయాలని కోరారు. కాగా, బ్రాహ్మణ సంఘం నేతలకు మాట్లాడే అవకాశమివ్వాలని అఖిల భారత బ్రాహ్మణ అర్చక సేవా సమాఖ్య అధ్యక్షుడు రాహుల్ దేశ్‌పాండే నిరసన తెలపడంతో సమావేశంలో కాసేపు గందరగోళం నెలకొంది.

ప్రత్యేక పూజలంటూ వదంతులు తగవు

● చిలుకూరు బాలాజీ ఆలయ ప్రధానార్చకుడు రంగరాజన్

మొయినాబాద్ రూరల్, జూలై 20: వివాహం ఆలస్యమయ్యే వారి కోసం నేడు (ఆదివారం) చిలుకూరు బాలాజీ ఆలయంలో ప్రత్యేక పూజలు ఉంటాయని సోషల్ మీడియా, యుట్యూబ్ చానల్లో ప్రసారమవుతున్న ప్రకటనలు అవాస్తవమని ఆలయ ప్రధానార్చకుడు రంగరాజన్ స్పష్టం చేశారు. భక్తులను అయోమయం చేసేలా సామాజిక మాధ్యమాల్లో వస్తున్న పోస్టులను నమ్మొద్దని విజ్ఞప్తి చేశారు. గత ఏప్రిల్ 21న శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా జరిగిన కల్యాణోత్సవంలో వివాహం ఆలస్యమవుతున్న వారు పాల్గొని స్వామివారి అనుగ్రహం పొందాలని అప్పట్లో ప్రకటించామని, దాన్ని కొందరు ప్రతినెల 21న ప్రత్యేక పూజలు ఉంటాయని వదంతులు వ్యాప్తి చేస్తున్నారని వాపోయారు.

ఘనంగా గీతం యూనివర్సిటీ స్నాతకోత్సవం


విద్యార్థినికి పట్టా అందిస్తున్న రామ్‌గోపాల్

పటాన్‌చెరు రూరల్, జూలై 20: సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు మండలం రుద్రారంలోని గీతం డీమ్డ్ యూనివర్సిటీ స్నాతకోత్సవం శనివారం ఘనంగా జరిగింది. వర్సిటీ ఇన్‌చార్జి వీసీ ప్రొ.గౌతమ్ రావు అధ్యక్షతన జరిగిన ఈ వేడుకకు బార్క్లేస్ బ్యాంక్ ఇండియా పూర్వ సీఈవో రామ్‌గోపాల్ ముఖ్యఅతిథిగా హాజరై 1,490 మంది విద్యార్థులకు పట్టాలను ప్రదానం చేశారు. ఈసీఈ విభాగంతోపాటు బీటెక్ టాపర్‌గా నిలిచిన కె.కీర్తి 'గీతం' అధ్యక్షుడి పేరిట నెలకొల్పిన రెండు బంగారు పతకాలు అందుకున్నారు. పీజీ బెస్ట్ ఆల్‌రౌండర్‌గా శివకుమార్ శివాంజలి, యూజీ బెస్ట్ ఆల్‌రౌండర్‌గా నిలిచిన వర్ష మైథిలీకి కూడా పతకాలు అందజేశారు.

కమ్మేసిన ముసురు..!

(5వ పేజీ తరువాయి)

ప్రవహించడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. గగన్‌పహాడ్ పాతకర్నూల్ రోడ్డులో వరదనీరు నిలిచిపోవడంతో స్థానికులు ఇబ్బందులు పడ్డారు. యూసుఫ్‌గూడలో 3 సెం.మీ, కుత్బుల్లాపూర్ మహదేవపురంలో 2.8 సెం.మీ. వర్షం కురిసింది. రోజంతా కురుసిన వర్షంతో గొడుగులు లేకుండా ప్రజలు బయటకు రాని పరిస్థితులు నగరంలో నెలకొన్నాయి.

ట్రాఫిక్‌జాంతో వాహనదారుల ఇబ్బందులు

ముసురుతో నగరవ్యాప్తంగా పలు ప్రాంతాలు జలమయమయ్యాయి. వరదనీరు రహదారులపై, రోడ్లపై ఉన్న గుంతల్లో నిలిచిపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పంజాగుట్ట, మాదాపూర్, గచ్చిబౌలి, బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, ఉప్పల్, కూకట్‌పల్లి, జేఎన్‌టీయూ, ఎల్‌బీనగర్, ఉప్పల్ ప్రాంతాల్లో విపరీతంగా ట్రాఫిక్‌జాం అయ్యింది. విద్యుత్ సరఫరాలో అంతరాయాలు తలెత్తకుండా, వర్షాలు తగ్గే వరకు 24 గంటలు అధికారులు, సిబ్బంది క్షేత్రస్థాయిలో అలర్ట్‌గా ఉండాలని టీజీఎస్పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ అధికారులను ఆదేశించారు.

అప్రమత్తమైన జీహెచ్‌ఎంసీ

వర్షాలతో జీహెచ్‌ఎంసీ అధికారులు అప్రమత్తమయ్యారు. వాటర్ లాగింగ్ పాయింట్లలో నిలిచిన వరదనీటిని మాన్‌సూన్ ఎమర్జెన్సీ బృందాలు తొలగించాయి. వరదనీరు నిలిచే ప్రాంతాల్లో ట్రాఫిక్ ఇబ్బందులు రాకుండా ట్రాఫిక్ అధికారుల సమన్వయంతో పనిచేస్తున్నారు. లాగింగ్ పాయింట్ల వద్ద నీటిని తొలగించేందుకు 238 స్టాటిక్, 154 మాన్‌సూన్ ఎమర్జెన్సీ బృందాలను జీహెచ్‌ఎంసీ రంగంలోకి దింపింది. హైడ్రా ద్వారా 30, సీఆర్‌ఎంపీ ద్వారా 29 మాన్‌సూన్ ఎమర్జెన్సీ బృందాలు నిరంతరం క్షేత్రస్థాయిలో ఎప్పటికప్పుడు వరదనీటిని తొలగించాయి. గ్రేటర్ పరిధిలో మరో రెండు రోజుల పాటు వర్షాలు కురిసే అవకాశాలున్నాయని బేగంపేట వాతావరణ శాఖ అధికారులు తెలిపారు.

జంట జలాశయాలకు రాని వరద

హైదరాబాద్ సిటీ, జూలై 20 (ఆంధ్రజ్యోతి): జంట జలాశయాలుగా పేరుగాంచిన ఉస్మాన్‌సాగర్ (గండిపేట), హిమాయత్‌సాగర్‌లకు ఎగువ ప్రాంతాల నుంచి వరద రావడం లేదు. రెండు రోజులుగా హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో వాన దంచి కొడుతున్నా కానీ, ఎలాంటి ఇన్‌ఫ్లో లేదు. ఎగువ ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిసి ఈసీ వాగు పొంగితేనే వరద వచ్చే అవకాశమున్నదని, ప్రస్తుతం పడుతున్న వర్షపు నీరంతా భూముల్లో ఇంకుతున్నదని, మున్ముందు వర్షపు నీరంతా వరదగా మారి జలాశయాలను చేరే అవకాశముందని అధికారులంటున్నారు. ఉస్మాన్‌సాగర్ (గండిపేట) నీటి మట్టం 1790 అడుగులు కాగా, ప్రస్తుతం 1779.20ల అడుగుల నీరున్నది. హిమాయత్‌సాగర్ నీటిమట్టం 1763.50 అడుగులు కాగా, ప్రస్తుతం 1755.55 అడుగుల నీరుంది.

విద్యుత్‌సంస్థల్లో ఉద్యోగులకు పదోన్నతులు కల్పించాలి


సీఎండీకి వినతిపత్రం అందజేస్తున్న ఉద్యోగ నేతలు

హైదరాబాద్ సిటీ, జూలై 20 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ సంస్థల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు పదోన్నతులు కల్పించాలని తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ జాయింట్ కమిటీ కన్వీనర్ శివాజీ, కో-కన్వీనర్ అంజయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ సీఎండీ ముషారఫ్ ఫరూకీతో చర్చలు జరిపి వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రమోషన్ల కోసం విద్యుత్ ఉద్యోగులు ఏడేళ్లుగా ఎదురుచూస్తున్నారన్నారు. ఉద్యోగి 30 ఏళ్ల సర్వీసు చేస్తే రిటైర్‌మెంట్ ముందు కూడా అవకాశం ఉన్నా పదోన్నతులు పొందకుండా రిటైర్ కావడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. వినతిపత్రమిచ్చిన వారిలో జేఏసీ నాయకులు రామేశ్వర్ శెట్టి, నాసర్ షరీఫ్, కరెంట్‌రావు, రాజు, రామకృష్ణారెడ్డి, కొరడా వెంకటేశ్వర్లు, రాజేష్, పూర్ణ, లక్ష్మయ్య, అక్బర్, రమేష్ ఉన్నారు.

వెండర్ పద్ధతితో వర్క్ ఆర్డర్లకు ఇబ్బంది

విద్యుత్ సంస్థల్లో టర్న్‌కీ పద్ధతిన పనిచేస్తున్న కాంట్రాక్టర్లకు వెండర్ రిజిస్ట్రేషన్ విధానం అమల్లోకి తేవడంతో వర్క్ ఆర్డర్ తీసుకునేందుకు ఇబ్బందులు తలెత్తుతాయని తెలంగాణ ఎలక్ట్రికల్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కందుకూరి శ్రీనివాస్ అన్నారు. ఈ మేరకు టీజీఎస్పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్‌కు వినతిపత్రం అందచేశారు. సీఎండీని కలిసిన వారిలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వెంకటేష్, కోశాధికారి నాగయ్య, మహారాజు, జాయింట్ సెక్రటరీ సత్యనారాయణ ఉన్నారు.

ప్రతి సంస్థలో హెచ్‌ఆర్ కీలకం

● అవార్డుల ప్రదానంలో జయేష్ రంజన్

హైదరాబాద్ సిటీ, జూలై 20 (ఆంధ్రజ్యోతి): ప్రతి కంపెనీకి ప్రధాన మూలం హెచ్‌ఆర్ వ్యవస్థ అని, వారికి అవార్డులు ఇవ్వడం మంచి విషయమని ఐటీ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ జయేష్ రంజన్ అన్నారు. శనివారం హైటెక్‌సిటీలోని ఇస్తా కన్వెన్షన్‌లో జరిగిన కార్యక్రమంలో హెచ్‌ఆర్ రంగంలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వ్యక్తులకు ఐకాన్ (ఇంటర్నేషనల్ నాలెడ్జ్‌అండ్ ఆపర్చునిటీస్ నెట్‌వర్క్) నిర్వహించిన 'ఐ లవ్ హెచ్‌ఆర్ అవార్డ్స్ కాన్క్లేవ్' అవార్డులు అందజేశారు. సంస్థ అభివృద్ధికి నిరంతరం సేవ చేస్తున్న హెచ్‌ఆర్‌లకు అవార్డులు ఇవ్వడం వల్ల వారిలో ఉత్సాహం పెరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ మాజీ సీఎస్ జె.ఎ.చౌదరి, బీజేపీ జాతీయ నాయకుడు కరుణ గోపాల్, నలంద విశ్వవిద్యాలయం మాజీ వీసీ ప్రొ.సునైనాసింగ్, అసోచామ్ కర్ణాటక చైర్మన్ డాక్టర్ మీరా వెంకట్, యుఈటీ సీఈవో ప్రసాద్, కంప్యూటర్ సొసైటీ ఆఫ్ ఇండియా సెక్రటరీ చంద్రశేఖర్, గ్లోబల్ హెడ్ పీపుల్ ఆపరేషన్స్ అరవింద్ మాథుర్, అన్నమాచార్య విశ్వవిద్యాలయం చాన్స్‌లర్ అభిషేక్‌రెడ్డి, పలు సంస్థల హెచ్‌ఆర్ ప్రతినిధులు హాజరయ్యారు.



హైటెక్స్‌లో 'ఫ్లో స్టైల్ తత్త్వ' ఎగ్జిబిషన్

హైదరాబాద్ సిటీ/మాదాపూర్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): 15 రాష్ట్రాల నుంచి వచ్చిన 200కు పైగా ఎంఎస్‌ఎంఈలతో భారీస్థాయిలో ఫిక్కీ లేడీస్ ఆర్గనైజేషన్ (ఫ్లో) హైదరాబాద్ చాప్టర్ ఏర్పాటు చేసిన 'స్టైల్ తత్త్వ' ఎగ్జిబిషన్ శనివారం మాదాపూర్ హైటెక్స్ ప్రాంగణంలో మొదలైంది. రెండురోజులపాటు జరిగే ఈ ప్రదర్శనను టీవీ షో వ్యాఖ్యాత సుమ కనకాల ప్రారంభించారు. తెలంగాణ ఎంఎస్‌ఎంఈ అండ్ రిటైల్ డైరెక్టర్ వత్సల మిశ్రా మాట్లాడుతూ ఎంఎస్‌ఎంఈల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉన్నదని, నెలరోజుల్లో కొత్త పాలసీ రాబోతుందని చెప్పారు. 'ఫ్లో' హైదరాబాద్ చైర్‌పర్సన్ ప్రియా, పలువురు ఫ్లో సభ్యులు హాజరయ్యారు. ఈ ప్రదర్శనలో ఫ్యాషన్, లైఫ్‌స్టైల్‌తోపాటు ఫ్లో అసిస్టెడ్ ఎంటర్‌ప్రెన్యూర్స్ పెవిలియన్, తెలంగాణ ఫుడ్ ఫెస్టివల్, హ్యాండ్లూమ్, హ్యాండిక్రాఫ్ట్ స్టాల్స్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.



జెర్సీలను ఆవిష్కరిస్తున్న జగన్‌మోహన్‌రావు, ఎమ్మెల్యే వివేక్

జేపీఎల్ జెర్సీల ఆవిష్కరణ

హైదరాబాద్, ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి: కేఎస్‌జీ జర్నలిస్టు ప్రీమియర్ లీగ్ (జేపీఎల్) జెర్సీల ఆవిష్కరణ శనివారం సికింద్రాబాద్ జింఖానా స్టేడియంలో జరిగింది. హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రావు, చెన్నూరు ఎమ్మెల్యే, హెచ్‌సీఏ మాజీ అధ్యక్షుడు జి.వివేక్ వెంకటస్వామి, త్రుక్ష ఫుడ్స్ ఎండీ భరత్‌రెడ్డి, లైఫ్ స్పాన్ సంస్థ స్పోర్ట్స్ హెడ్ భరణి, కేఎస్‌జీ సీఈవో సంజయ్, హెచ్‌సీఏ సీనియర్ సభ్యుడు ఆగంరావు, స్మయిల్‌గార్డ్ ఫౌండర్ శరత్, జూపర్ ఎల్‌ఈడీ ఫౌండర్ రమేష్ తదితరులు జెర్సీల ఆవిష్కరణకు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రజ్యోతి డీజీఎం, టీమ్ కెప్టెన్ సురేష్, పది మీడియా సంస్థల జట్లు పాల్గొన్నాయి.

ముగిసిన రెగెట్టా పోటీలు

హైదరాబాద్, ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి: తెలంగాణ మాన్‌సూన్ రెగెట్టా పోటీలు ముగిశాయి. వర్షం కురుస్తుండగానే శనివారం హుస్సేన్‌సాగర్‌లో జరిగిన ఈ పోటీల్లో నగరానికి చెందిన గోవర్ధన్ చివరి రేసులో విజేతగా నిలిచాడు. అండర్-16 ఆప్టిమిస్ట్ బాలుర విభాగంలో ఈయన మాన్‌సూన్ రెగెట్టా ట్రోఫీని సొంతం చేసుకున్నాడు.

మెట్రో రైళ్లపై ఎల్‌అండ్‌టీ దృష్టి

సాంకేతిక సమస్యల పరిష్కారానికి కార్యాచరణ

● వర్షాకాలం నేపథ్యంలో ఇబ్బందులు లేకుండా చర్యలు



హైదరాబాద్ సిటీ, జూలై 20 (ఆంధ్రజ్యోతి): నగరంలో ప్రతీ రోజు ఉదయం 6 గంటలకు మొదలవుతున్న మెట్రో రైళ్లు రాత్రి 11.15 గంటల వరకు నడుస్తున్నాయి. కాగా, ప్రతీ సోమ, శుక్రవారాల్లో ఉదయం 5.30 గంటలకు ప్రారంభమై రాత్రి 12.45 గంటల వరకు తిరుగుతున్నాయి. ఎల్‌బీనగర్-మియాపూర్, జేబీఎస్-ఎంజీబీఎస్, నాగోల్-రాయదుర్గం కారిడార్లలోని 57 స్టేషన్ల పరిధిలో రోజుకు 1028 మెట్రో ట్రిప్పులను నడిపిస్తున్నారు. ఎలివేటెడ్ కారిడార్‌లో నడుస్తున్న ఈ రైళ్లకు కావాల్సిన 132 కేవీ లైన్‌తో విద్యుత్ సరఫరాను ట్రాన్స్‌కో నుంచి తీసుకుంటున్నారు. ఈ మేరకు ఉప్పల్, మియాపూర్, యూసుఫ్‌గూడ, ఎంజీబీఎస్‌లో ఏర్పాటు చేసిన రిసీవింగ్ సబ్‌స్టేషన్లు (ఆర్‌ఎస్‌ఎస్) ద్వారా తీసుకుని రైళ్ల ఆపరేషన్స్, మెయింటెనెన్స్ పనులు చేపడుతున్నారు. కాగా, 132 కేవీ సామర్థ్యం కలిగిన లైన్ ద్వారా ఇస్తున్న కరెంట్‌లో 33 కేవీని లైటింగ్, సాధారణ నిర్వహణ పనులకు, సింగిల్ ఫేజ్ ద్వారా ఇస్తున్న 25 కేవీ లైన్ విద్యుత్‌ను ట్రాక్షన్ నిర్వహణకు వాడుకుంటున్నారు. అయితే, ఆయా రకాల విద్యుత్‌ను ఉప్పల్ డిపోలోని ఆపరేషన్ కంట్రోల్ సెంటర్ ద్వారా ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. ఇటీవల తలెత్తిన అంతరాయాన్ని కూడా ఇక్కడి నుంచే తెలుసుకుని సత్వర చర్యలు చేపట్టారు

ప్రత్యామ్నాయ చర్యలు..

మెట్రో రైళ్ల రాకపోకలకు అత్యంత ప్రధానమైనది విద్యుత్ వ్యవస్థ. సరఫరా విషయంలో హెచ్‌ఎంఆర్, ఎల్‌అండ్‌టీ సంస్థలు పకడ్బందీగా వ్యవహరిస్తున్నాయి. రైళ్ల రాకపోకలు జరుగుతున్న సమయంలో ఏదైనా కారిడార్‌లో కరెంట్ సమస్య ఏర్పడితే.. వెంటనే సమీపంలోని సబ్‌స్టేషన్ నుంచి తీసుకునేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ఇటీవల ఎంజీబీఎస్‌లో ఇన్‌కమింగ్ ట్రాన్స్‌కో ఫీడర్ పరిధిలోని ఎర్రమంజిల్ స్టేషన్‌లో ట్రిప్పింగ్ సమస్య ఏర్పడితే.. వెంటనే మియాపూర్ మార్గంలోని ప్రత్యామ్నాయ ఫీడర్‌ను అనుసంధానం చేసి ఈ రూట్‌లో 7 నిమిషాల్లో సమస్యను పరిష్కరించారు. విద్యుత్ సరఫరాను 24 గంటలపాటు పర్యవేక్షించాలని సిబ్బందిని ఆదేశిస్తున్నారు.

ఇకపై ప్రతీ వారం సమీక్ష

ప్రస్తుతం నగరంలో వర్షాలు కురుస్తుండడంతో సిగ్నలింగ్‌లో సమస్య ఏర్పడి రైళ్లు పట్టాలపై అకస్మాత్తుగా నిలిచిపోకుండా ఉండేందుకు చర్యలు తీసుకుంటున్నారు. రాత్రివేళలో ఎలివేటెడ్ కారిడార్‌లోని ట్రాక్షన్ వైర్లను పర్యవేక్షించడం, ట్రాక్‌కు సంబంధించిన నట్లు, బోల్టులు సరిచేయడం లాంటివి చేస్తున్నారు. అలాగే, పిల్లర్లు, స్టేషన్ల సమీపంలో పెరిగిన చెట్లకొమ్మలను ఎప్పటికప్పుడు తొలగించాలని ఆదేశిస్తున్నారు. అయితే, ఆయా విభాగాల పనితీరుపై ప్రతీ వారం సమీక్ష నిర్వహించేందుకు సిద్ధమయ్యారు. ఏ విభాగానికి సంబంధించిన సమస్య తలెత్తినా దానికి వారిని బాధ్యులను చేస్తూ చర్యలు తీసుకోవాలని భావిస్తున్నట్లు తెలిసింది.


తక్కువ ఫీజుతో అమెరికాలో ఉన్నతవిద్య

● వెబ్‌స్టర్ యూనివర్సిటీ వైస్ ప్రెసిడెంట్ శ్యామ్



హైదరాబాద్ సిటీ, జూలై 20 (ఆంధ్రజ్యోతి): సాధారణ కుటుంబాలకు చెందిన వారు కూడా తక్కువ ఫీజుతో అమెరికాలో ఉన్నత విద్య అభ్యసించవచ్చునని వెబ్‌స్టర్ యూనివర్సిటీ వైస్ ప్రెసిడెంట్ శ్యామ్ అన్నారు. అమెరికాలో మాస్టర్స్(ఎంఎస్) చేసేందుకు సన్నద్ధమైన విద్యార్థులకు హైదరాబాద్‌లో శనివారం ప్రి-డిపార్చర్ కార్యక్రమం నిర్వహించారు. శ్యామ్ మాట్లాడుతూ రెండేళ్ల ఎంఎస్ కోర్సును వెబ్‌స్టర్ యూనివర్సిటీలో రూ.23 లక్షల ఫీజుతో పూర్తి చేయవచ్చని తెలిపారు. యూనివర్సిటీకి అమెరికాలో మూడు ప్రాంతాల్లో క్యాంపస్‌లున్నాయని, 142 దేశాలకు చెందిన సుమారు 3,500 మంది విద్యనభ్యసిస్తున్నారని చెప్పారు. వీసా పొందిన విద్యార్థులు అమెరికా ఎలా చేరుకోవాలి ? చదువు తర్వాత ఉద్యోగావకాశాలు ఎలా ? తదితరాంశాలపై అవగాహన కల్పించారు. యూనివర్సిటీ అడ్మిషన్స్ డైరెక్టర్ జేమ్స్, ఇండియా కోఆర్డినేటర్ దాట్ల రాజు తదితరులు పాల్గొన్నారు.

ఆదివారం



అసలే అంబానీల ఇంటపెళ్లి అది... ఐదు రోజుల పెళ్లి, రూ. 5 వేల కోట్ల పెళ్లి... సెలబ్రిటీల సందడి ప్రత్యేకార్షణగా నిలిచిన అనంత్ అంబానీ-రాధికా మర్చంట్ పెళ్లిలో బాలీవుడ్ అందాలు మొత్తం కనువిందు చేశాయి. దక్షిణాది తారలన్నీ కల్యాణానికి తరలివచ్చాయి. పెళ్లయినా, పేరంటం అయినా తారాలోకం ఊరకనే రాదు కదా ఈసారీ మరెన్నో విశేషాలను వెంటపెట్టుకు వచ్చింది.

ఒక పెళ్లి... అనేక ముచ్చట్లు

అనంత్ అంబానీ పెళ్లి జరిగిన ఆ ఐదు రోజులూ బాలీవుడ్‌కు అనధికారిక సెలవు ప్రకటించినట్లైంది. బాలీవుడ్ స్టార్స్, టెక్నీషియన్స్ అంతా అక్కడే ఉన్నారు. హీరో, హీరోయిన్లు షూటింగ్‌కు హాజరవ్వలేదు. నటీనటులు అందరూ ఒక చోట చేరి సెలబ్రేషన్ మోడ్‌లో గడిపారు. అయితే ఈ పెళ్లిపై చిత్ర పరిశ్రమ నుంచి కొన్ని పెదవి విరుపులు వినిపించకపోలేదు. మొదటి దూస్రా దూసుకొచ్చింది మాత్రం బాలీవుడ్ దర్శక నిర్మాత అనురాగ్ కశ్యప్ కూతురు, సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయన్సర్ అలియా కశ్యప్ నుంచే. ఆమె అంబానీల పెళ్లిపై వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. 'అనంత్ అంబానీ పెళ్లి అసలు పెళ్లే' కాదు అన్నారు.

అంతా ఓ సర్కస్‌ను తలపిస్తోందన్నారు. పీఆర్ స్ట్రాటజీగా కొట్టిపారేశారు. పెళ్లికి హాజరవ్వాలని తనకూ ఆహ్వానం అందిందని, పీఆర్ రీల్స్ చేయడం ఇష్టం లేకనే వెళ్లలేదన్నారు. 'వేరే వాళ్ల పెళ్లి కోసం నా ఆత్మాభిమానాన్ని అమ్ముకోలేను. నా వ్యక్తిత్వం మీద నాకు గౌరవం ఉంది' అని పరోక్షంగా సినీ స్టార్స్‌ను దెప్పిపొడిచారు అలియా కశ్యప్.

> మహేశ్‌బాబు, రాజమౌళి దర్శకత్వంలో ఓ చిత్రం తెరకెక్కుతోన్న విషయం తెలిసిందే. ఈ సినిమాలో మహేశ్ సరికొత్త లుక్‌లో కనిపించనున్నారు. దానికోసం కొన్నాళ్లుగా ఆయన సరికొత్త హెయిర్‌స్టైల్ మెయింటైన్ చేస్తున్నారు. మహేశ్ లుక్ ఇప్పుడప్పుడే బయటకు కనిపించకుండా ఉండాలనే రూల్ పెట్టారట రాజమౌళి. కానీ అంబానీ పెళ్లికి మహేశ్‌బాబు కుటుంబంతో కలసి హాజరయ్యారు. మహేశ్ లుక్‌ను రహస్యంగా ఉంచాలన్న జక్కన్న ప్లాన్ దీంతో ఫెయిల్ అయిందనేది టాలీవుడ్ టాక్.



బాంద్రాలో బంగ్లా?

అతిథి మర్యాదలకు లోటు లేకుండా చూసుకోవడంలో అంబానీల నైపుణ్యం గురించి చాలా సార్లు విన్నదే, కన్నదే. ఇప్పుడు ఈ పెళ్లికి గెస్టులుగా వచ్చిన సినిమా యాక్టర్స్‌కే రూ. కోట్ల విలువైన వాచీలను బహుమతిగా పంచడం చూసిందే. అలాంటిది మరి ఏకంగా అంబానీల ఇంటికి మహాలక్ష్మి లాంటి కోడలిని వెతికిపెట్టిన వ్యక్తికి ఇంకెంత ఘనమైన బహుమతి అందుతుందో అనే ఆసక్తి సహజమే. జావీద్ జాఫ్రీ తనయుడు మీజాన్ జాఫ్రీ అనంత్ అంబానీకి రాధికా మర్చంట్‌ను పరిచయం చేశారట. వారిద్దరి మనసులు కలిసి, మనువుకు బాటలు వేసినందుకు బాంద్రాలోని సంధు ప్యాలెస్‌ను అంబానీ ఫ్యామిలీ మీజాన్ జాఫ్రీకి బహుమతిగా ఇచ్చారు, దాని విలువ రూ. 30 కోట్లు అని బాలీవుడ్ సినీ విమర్శకుడు కేఆర్‌కే పరోక్షంగా చేసిన ట్వీట్ వైరల్ అయింది. అయితే అందులో నిజం లేదని జావీద్ జాఫ్రీ వివరణ ఇచ్చుకున్నారు.

భోజనానికైనా వెళ్లుండాల్సింది

అనంత్, రాధిక వివాహానికి హాజరుకాకపోవడంపై తాప్సీ ఓ ఇంటర్వ్యూలో ఆసక్తికరంగా స్పందించారు. 'వాళ్లతో నాకు పరిచయం లేదు. ఆతిథ్యం ఇచ్చే కుటుంబానికి మనకు మధ్య ఏదో ఒక అనుబంధం ఉండాలి. అలాంటి పెళ్లిళ్లకు మాత్రమే నేను హాజరవుతాను. తెలియని వారి పెళ్లికి వెళ్లి కృతకమైన ఆనందం పొందడం నాకు తెలియదు. నేను కాగితం పువ్వును కాదు, సువాసన వెదజల్లే నిజమైన పుష్పాన్ని' అని కవితాత్మకంగా స్పందించారు. కానీ నెటిజన్లు ఊరకుంటారా...పెళ్లికి వెళ్లకపోతే పాయే, కనీసం భోజనానికైనా వెళ్లి ఉండాల్సిందని తాప్సీని ఉడికించే ప్రయత్నం చేశారు.

టెక్కులాడి వంటూ...

బాలీవుడ్ నటుడు సంజయ్ కపూర్ కూతురు షనయా కపూర్ ఈ పెళ్లిలో సెక్యూరిటీ గార్డ్‌తో గొడవ పడిన వీడియో వైరల్ అయింది. సెక్యూరిటీ సిబ్బంది ఆమె బ్యాగ్‌ను చెక్ చేసేందుకు ప్రయత్నించగా అసహనం వ్యక్తం చేసింది. వాళ్ల మీద అరుస్తూ వాదన పెట్టుకుంది. అయితే చేతిలో ఒక్క సినిమా కూడా షనయాకు ఇంత టెక్కెందుకో అని నెటిజన్లు అంటున్నారు.

నిక్‌ను తోసిరాజని

- ఈ పెళ్లికి కథానాయిక ప్రియాంక చోప్రా తన భర్త నిక్ జోనాస్‌తో కలసి హాజరయ్యారు. సంగీత్ కార్యక్రమంలో ప్రియాంక చోప్రా డాన్స్ చేస్తుండగా నిక్ పక్కన ఉండి ఆమెను ఉత్సాహపరుస్తున్నాడు. అయితే బాలీవుడ్ కథానాయిక అనన్యాపాండే ప్రియాంకతో కలసి స్టెప్పులు వేసేందుకు ముందుకు వచ్చే క్రమంలో నిక్‌ను వెనక్కు నెట్టడంతో అతను అవాక్కయ్యాడు. అయితే ఇదంతా గమనించిన రణ్‌వీర్‌సింగ్ నిక్ చేతిని పట్టుకొని మధ్యలోకి లాగి కూల్ చేశారు.



రజనీ సార్ కూడా ఇంతేనా!

సింప్లిసిటీగా మారుపేరుగా మసలే రజనీకాంత్ అంబానీ పెళ్లిలో మాత్రం దాన్ని పక్కనపెట్టారు. బరాత్‌లో తనదైన శైలిలో స్టెప్పులతో దుమ్మురేపారు. సూపర్‌స్టార్‌ను అలా చూసి చాలా మంది ఆశ్చర్యపోయారు కూడా. ఆ వీడియో కూడా బాగా వైరల్ అయింది. రజనీ ఓ వివాదంలో చిక్కుకున్నారు. పెళ్లికి వచ్చేముందు ఫొటోగ్రాఫర్లకు పోజులిచ్చే క్రమంలో తన బ్యాగ్ మోస్తున్న పనిమనిషిని పక్కకు వెళ్లాలని రజనీకాంత్ చేయి చూపించారు. ఆమె అది గమనించక పోవడంతో పక్కకు వెళ్లమని పదే పదే చేయి ఊపుతూ సంజ్ఞలు చేశాడు. ఇప్పుడు ఆ వీడియో కాస్తా వైరల్ అయి రజనీని కొందరు తప్పుపడుతున్నారు. పనిమనిషి అయినంత మాత్రాన జనంలో ఉన్నప్పుడు గౌరవం లేకుండా ప్రవర్తిస్తారా అని ప్రశ్నిస్తున్నారు. మరికొందరు అయితే 'వీళ్లింతే పైకి ఒకలా నటిస్తారు... లోపల మరోలా జీవిస్తారు' అని నిర్వేదం వ్యక్తం చేశారు.

పాకిస్థాన్ నటులకు అంబానీ పెళ్లికి ఆహ్వానం అందినట్టు లేదు. శుభాకాంక్షలు చెప్పాల్సింది పోయి ఈ పెళ్లి వేడుకలపై సోషల్ మీడియాలో సెటైర్లు వేశాడు పాకిస్థాన్ నటుడు అర్సలన్ నజీర్. 'ఈ రోజుల్లో పెళ్లి వేడుకలు జరిగినంత కాలం కూడా బంధాలు నిలవడం లేదం'టూ వేదాంత ధోరణిలో మాట్లాడాడు. 'శుభమా అని పెళ్లి జరుగుతుంటే నీ సన్నాయి నొక్కులేమిటి' అంటూ నెటిజన్లు అతనిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కొత్త దంపతులు ఇద్దరూ సంతోషంగా ఉంటే మధ్యలో నీకొచ్చిన ఇబ్బంది ఏమిటని తిట్టి పోస్తున్నారు.

పెళ్లికి హాజరవని తారలు

అంబానీ పెళ్లికి వచ్చిన తారలే కాదు రానివాళ్లు కూడా వార్తల్లో వ్యక్తులు అయ్యారు. ఈ పెళ్లికి రాని నటీనటులు, వారెందుకు రాలేదో అనే చర్చ కూడా డిజిటల్ మీడియాలో జోరుగా జరిగింది.

కరీనాకపూర్, సైఫ్ అలీఖాన్ దంపతులు తమ ఫ్యామిలీ ట్రిప్‌ను వాయిదా వేసుకోలేకపోయారని ఓ సమాచారం. ఆమిర్‌ఖాన్ రాకపోయినా తన కుటుంబం మొత్తాన్ని పెళ్లికి తోలాడట. అంబానీ ఐనా ఐ డేంట్ కేర్ అనే టైపు కంగనా రనౌత్. అయితే తన తమ్ముడు వరుణ్ రనౌత్ పెళ్లి పనుల్లో కంగనా రనౌత్ బిజీగా ఉండి హాజరవలేకపోయారట. పెళ్లి వేడుకలు మొదలయ్యే ముందే అనుష్క శర్మ భర్త విరాట్ కోహ్లీ, పిల్లలతో కలసి లండన్ చెక్కేశారు. కార్తీక్ ఆర్యన్ కూడా ఈ పెళ్లిలో కనిపించలేదు. కారణాలేవైనా పాన్ ఇండియా స్టార్స్ అల్లు అర్జున్, ప్రభాస్, ఎన్టీఆర్ సైతం ఈ పెళ్లిలో కనిపించలేదు. •



విడివిడిగా... విడాకులు నిజమేనా?

శుభకార్యంలోనూ ఈ విడాకుల గొడవలేవిటో అని అమితాబ్ ఫ్యామిలీ నిట్టూర్చేలా చేసింది డిజిటల్ మీడియా. అమితాబ్ బచ్చన్, అభిషేక్ బచ్చన్... ఐశ్వర్యారాయ్ బచ్చన్, మనవరాలు ఆరాధ్య విడివిడిగా పెళ్లికి వచ్చారు. నూతన దంపతులతో అమితాబ్‌బచ్చన్, జయాబచ్చన్, అభిషేక్ బచ్చన్‌లు కలసి ఫొటోలు దిగారు. ఐశ్వర్యారాయ్ మాత్రం తన కూతురు ఆరాధ్యతో కలసి విడిగా ఫొటోలు దిగారు. అభిషేక్, ఐశ్వర్య గ్రూప్ ఫొటోలో కలసి లేకపోవడంతో వారిద్దరూ విడిపోతున్నారంటూ కొన్నాళ్లుగా వస్తున్న వార్తలకు మరోసారి రెక్కలొచ్చాయి. సందట్లో సడేమియాలా ఈ పెళ్లిలో మాజీ ప్రియుడు సల్మాన్‌తో కలసి ఐశ్వర్యారాయ్ ఫొటోలు దిగిందంటూ కొన్ని ఫేక్ ఫొటోలు నెట్‌లో వైరల్ కావడం వారికి మరో తలనొప్పిగా మారింది. ఇదిలా ఉండగా కోలీవుడ్ కపుల్ సూర్య జ్యోతిక విడిపోతున్నారంటూ కొన్నాళ్లుగా వార్తలు వస్తున్న నేపథ్యంలో వారిద్దరూ కలసి అనంత్ పెళ్లికి హాజరయ్యారు. చిలుకా గోరింకల్లా పెళ్లి వేడుకల్లో ప్రత్యేకాకర్షణగా నిలిచారు.

'దిక్సూచి' వెబ్ పేజీలో...
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/s1w4WFAతో చదవండి.

సండే సెలబ్రిటీ



సాధారణంగా ఏ తండ్రయినా తన కొడుకుని నటుడిగా పరిచయం చేస్తుంటాడు. కానీ కొడుకు హీరోగా నటించే సినిమాతో తండ్రి దర్శకుడిగా పరిచయం కావడమనేది నిజంగా అరుదే. 'ఆపరేషన్ రావణ్' చిత్రం విషయంలో అలా జరిగింది. రక్షిత్ అట్లూరి హీరోగా నటించగా, ఆయన తండ్రి వెంకట సత్య దర్శకుడిగా పరిచయమవుతున్నారు. ఈ నేపథ్యంలో తండ్రీ కొడుకులిద్దరూ 'నవ్య'కు చెప్పిన విశేషాలు.

నేను డైరక్టర్స్ నటుడిని

నిర్మాతైన మీకు దర్శకుడు అవ్వాలనే కోరిక ఎందుకు కలిగింది?

వెంకట సత్య: ఒక సినిమా చూసిన తర్వాత దానిని గురించి విశ్లేషించడం నాకు మొదటి నుంచి అలవాటు. కథలు చెప్పడానికి వచ్చే వాళ్లతో, దర్శకులు కావాలనుకునేవారితో తరచూ మాట్లాడుతుంటాను. స్క్రిప్ట్ పరంగా సలహాలు ఇస్తుంటాను. సినిమాలు తీయడానికి ఇన్ని రోజులు ఎందుకు పడుతుంది, ఇంత బడ్జెట్ ఎందుకు అవుతుంది. కథ ఇలా ఉంటే బాగుంటుంది కదా అని. ఇలా నేను అనుకుంటుంది కరెక్టా కాదా అని చెక్ చేసుకోవడం కోసం దర్శకుడిగా మారా. సొంతంగా కథ తయారు చేసుకున్నాను. సినిమాలు బాగా చూస్తుంటాను. అన్ని రకాల బుక్స్ చదువుతుంటాను. కథ ఎలా రాయాలి, స్క్రీన్‌ప్లే అంటే ఏమిటి, లైటింగ్ ప్యాటర్న్ ఎలా ఉంటుంది అనే అవగాహన పుస్తకాలు చదవడంవల్లే ఏర్పడింది. ఆ ధైర్యంతోనే 'ఆపరేషన్ రావణ'కు దర్శకత్వం వహించా.

రక్షిత్: ఒక కొత్త దర్శకుడితో పని చేస్తున్న భావన నాకు ఎప్పుడూ కలగలేదు. మేం ప్రీప్రొడక్షన్ వర్క్ బాగా చేయడంతో సెట్‌కు వెళ్లిన తర్వాత ఎలాంటి ఇబ్బందీ ఎదురు కాలేదు. మిగతా సినిమాలకు, ఈ సినిమాకు ముఖ్యంగా నాకు కనిపించిన తేడా ఏవిటంటే.. అనుకున్న సమయానికి షూటింగ్ ప్రారంభించేవాళ్లం. నాన్నగారు పొద్దునే నాలుగు గంటలకు షూటింగ్ స్పాట్‌లో ఉండేవారు. ఏడు గంటలకు ఫస్ట్ షాట్ తీసేవాళ్లం. ప్రాపర్ ప్లానింగ్‌తో, డిసిప్లీన్‌తో వర్క్ చేశాం. నాన్నగారు 'పలాస' నిర్మాణ సమయంలో బాగా ఇన్‌వాల్వ్ అయ్యారు. స్క్రిప్ట్ మీద కమాండ్ ఉండడంవల్ల ఎలాంటి కన్‌ఫ్యూజన్ లేకుండా చకచకా వర్క్ చేసేవారు. సాధారణంగా ఒక సినిమాకు దర్శకత్వం చేయాలనిపించినప్పుడు పక్కన మరొకరిని కూర్చోపెట్టుకుని వాళ్లతో పని చేయించుకుని, తన పేరు వేసుకుంటుంటారు. కానీ 'ఆపరేషన్ రావణ్' చిత్రం అలా తీసింది కాదు. పెద్ద పెద్ద ఆరిస్టులను డీల్ చేయడం టఫ్ జాబ్. ఒక కొత్త దర్శకుడు అలా అద్భుతంగా డీల్ చేసి 40 రోజుల్లో సినిమాను పూర్తి చేయడం అంటే మాటలు కాదు. కొత్త దర్శకుడు కూడా చక్కని ప్లానింగ్‌తో అలా చేయవచ్చని నాన్నగారు నిరూపించారు.

రక్షిత్ ఎలా చేశాడు?

వెంకట సత్య: 'పలాస' చిత్రంతో రక్షిత్ మంచి పేరు, గుర్తింపు సంపాదించుకున్నాడు. నాకు రామాయణం, భాగవతం మీద చాలా ఆసక్తి. ఓ సినిమా కథ అయినా వాటి నుంచి పుట్టిందే. ప్రతి పనికి ఒక ఆలోచన ఉంటుంది. ఆ ఆలోచన దృశ్య రూపంలో వచ్చి మాట్లాడితే ఎలా ఉంటుంది అనే పాయింట్ కొత్తగా అనిపించి ఈ సినిమా తీశాం. 'మీ ఆలోచనలే మీకు శత్రువులు' అని ట్యాగ్ లైన్ ఇచ్చాం. ఒక మామూలు మనిషి సైకోగా మారడానికి ఆలోచనలు ఎలా ప్రభావితం చేశాయన్నదే ఈ సినిమా. రక్షిత్ పాత్రతో పాటు రాధిక పాత్ర కూడా చాలా బాగుంటుంది. ఆవిడ చేసిన సీన్లు అన్నీ అద్భుతంగా ఉంటాయి.

రక్షిత్: న్యూ ఏజ్ సస్పెన్స్ థ్రిల్లర్ ఇది. కొత్త పాయింట్‌తో రూపుదిద్దుకుంది. తెలుగుతో పాటు తమిళంలోనూ విడుదల చేస్తున్నాం.

సెట్‌లో మీరు రక్షిత్‌ను మందలించిన సందర్భాలు ఉన్నాయా?

వెంకట సత్య: ఏమీ లేవండి. ముందుగానే ప్రిపేర్ అయి రావడం వల్ల సెట్‌లో ఎలాంటి ఇబ్బంది లేకుండా వర్క్ జరిగిపోయింది.

రక్షిత్: మా నాన్నగారనే కాదు వేరే ఇతర దర్శకుడైనా నేను చాలా అప్రమత్తంగా ఉంటా. వాళ్లు చెప్పింది చేయడమే పని. నేను డైరక్టర్స్ యాక్టర్‌ని. నాకు ఏమన్నా సందేహాలు ఉంటే స్క్రిప్ట్ వర్క్ స్టేజ్‌లోనే క్లారిఫై చేసుకుంటా.

ఓ దర్శకుడిగా కాకుండా తండ్రిగా సినిమాలో రిస్కీ షాట్స్ చేస్తున్నప్పుడు టెన్షన్ ఫీలయ్యారా?

వెంకట సత్య: ఈ సినిమాలో ఆరంతస్తుల భవనం నుంచి రక్షిత్ కిందకు దూకే షాట్ ఉంది. ఫైట్ మాస్టర్ రోప్ సాయంతో ఆ షాట్ తీయడానికి సిద్ధమయ్యాడు. మా వాడికి ఆ రోప్ కడుతుంటే టెన్షన్ ఫీలయ్యా. తాడు బలంగా ఉందా, వాడికి ఏమీ కాదు కదా అని పదే పదే ఫైట్ మాస్టర్‌ని అడిగేవాణ్ణి. 'ఇలాంటి షాట్స్ తీయడం మాకు అలవాటే. మీరు వర్రీ కావద్దు సార్. మీరు కాసేపు పక్కన కూర్చోండి' అని ఫైట్ మాస్టర్ జాషువా చెబుతున్నా, ఆ షాట్ పూర్తయ్యే వరకూ టెన్షన్ పడుతూనే ఉన్నా. అప్పుడు మాత్రం దర్శకుడిగా కంటే తండ్రిగా వర్రీ అయ్యా.

> ఈ సినిమా కోసం నేను నిర్మాతగా, దర్శకుడిగా ద్విపాత్రాభినయం చేసినా ఒకటి రెండు సందర్భాలలో తప్ప ఇద్దరూ ఒకరిని ఒకరు గౌరవించుకుంటూ వర్క్ చేశాం. స్క్రిప్ట్ రాసుకున్నప్పుడే ఒక బడ్జెట్ అనుకున్నాం. ఈ సీన్ ఎన్ని నిముషాలు తీస్తాం, ఏ ఏ ఎక్విప్‌మెంట్ కావాలి, ఎక్కడ తీయాలి.. అని ఫర్ఫెక్ట్‌గా ప్లాన్ చేశాం. రాధికగారి వర్క్ 15 రోజులు అనుకున్నాం. కానీ ఆవిడ సహకారంవల్లే రెండు రోజులు ముందే వర్క్ పూర్తయింది. అలాగే మిగిలిన నటీనటులంతా సహకరించారు. అయితే కొన్ని సందర్భాల్లో మాత్రం ఈ సీన్ ఇలా తీయాల్సిందే అని మా నిర్మాత మాట వినకుండా డైరెక్టర్‌గా ముందుకెళ్లాను. అలాగే 'ఇంకో గంట ఎక్కువ సరిపోతుంది.. మళ్లీ ఇంకో రోజు ఎందుకు?' అని మా నిర్మాత చెప్పిన మాటను దర్శకుడిగా గౌరవించాను. ఇలా నిర్మాతగా, దర్శకుడిగా నన్ను నేను గౌరవించుకుంటూ సినిమా పూర్తి చేశా.

మీ అబ్బాయి చేసిన సీన్లలో మీకు బాగా నచ్చింది ఏమిటి?

ఇందులో రక్షిత్ ఓ పద్యం పాడతాడు. విదేశాలలో ఉండి వచ్చావు కదా తెలుగు గురించి నీకేం తెలుసు.. అని ఓ ఛానల్ ఓనర్ అడిగితే ఆ పద్యం పాడతాడు. దానికి తగ్గట్టు ఎక్స్‌ప్రెషన్స్ ఇచ్చాడు. నాకు చాలా సంతృప్తిగా అనిపించింది.

రక్షిత్: ఇంతవరకూ నేను గ్రామీణ నేపథ్యం కలిగిన పాత్రలే చేశాను. కానీ ఆపరేషన్ రావణలో తొలిసారిగా సిటీ నేపథ్యం కలిగిన పాత్ర పోషించాను. నాన్నగారికి పద్యాలు, పురాణాలు అంటే ఇష్టం. తెలుగు భాష అంటే ఎంతో గౌరవం. ఆ మక్కువతోనే ఆయన ఈ సినిమాలో నాతో ఓ పద్యం పాడించారు.


• వినాయకరావు
ఫొటో: రాజ్‌కుమార్

ఈ వారమే విడుదల

ఈ ఆదివారం నుంచి వచ్చే శనివారంలోగా విడుదలవుతున్న సినిమాలు, వెబ్‌సిరీస్‌ల వివరాలు

ఓటీటీ వేదిక	సినిమా/సిరీస్	విడుదల తేదీ
నెట్‌ఫ్లిక్స్		
ది డెకామెరాన్	వెబ్‌సిరీస్	జూలై 25
డ్రాగన్ ప్రిన్స్ 6	వెబ్‌సిరీస్	జూలై 26
అమెజాన్ ప్రైమ్		
ది మినిస్ట్రీ ఆఫ్ అన్ జెంటిల్‌మాన్లీ వార్‌ఫేర్	హాలీవుడ్ మూవీ	జూలై 25
జీ 5		
భయ్యాజీ	హిందీ చిత్రం	జూలై 25
డిస్నీ ప్లస్ హాట్‌స్టార్		
బ్లడీ ఇష్క్	హిందీ చిత్రం	జూలై 26
చట్నీ సాంబార్	తమిళ చిత్రం	జూలై 26
ఆహా...		
రాజూ యాదవ్	తెలుగు చిత్రం	జూలై 24
బుక్ మై షో		
ఒన్ లైఫ్	హాలీవుడ్ మూవీ	జూలై 25
జియో సినిమా		
విచ్ బ్రింగ్స్ మీ టూ యూ	హాలీవుడ్ మూవీ	జూలై 26





హారర్ లవ్ స్టోరీ

బాలీవుడ్‌లో హారర్ చిత్రాలతో తనదైన ముద్ర వేసిన దర్శక నిర్మాత విక్రమ్‌భట్ తెరకెక్కించిన తాజా చిత్రం 'బ్లడీ ఇష్క్'. అవికాగోర్ ప్రధాన పాత్ర పోషించారు. మహేశ్‌భట్ నిర్మించిన ఈ చిత్రం నేరుగా ఓటీటీలో విడుదలవుతోంది. జూలై 26 నుంచి డిస్నీ హాట్‌స్టార్‌లో స్ట్రీమింగ్ అవనుంది. ఇటీవలే యూనిట్ ట్రైలర్‌ను విడుదల చేసింది. ఓ ద్వీపంలోని పెద్ద బంగ్లాలో హీరోయిన్ ఒంటరిగా ఉండాల్సిరావడం, ఆ క్రమంలో బంగ్లాలో కొన్ని ఆత్మలతో ఎదురైన భయానక అనుభవాల నేపథ్యంలో సాగిన ట్రైలర్ ఆద్యంతం ఆసక్తికరంగా అనిపించింది. •




అలనాటి కథ

ఆ నాటి రాజరికపు వివాహాలు

అనంత్ అంబానీ, రాధికా మర్చంట్ పెళ్లి వేడుకలు చూసి ప్రపంచమంతా విస్తుపోయింది. అంగరంగ వైభవంగా పెళ్లి చేయటమంటే ఏమిటో వారు ప్రపంచానికి రుచి చూపించారు. టీవీలలోను.. పేపర్లలోను.. సోషల్ మీడియాలోను ఎక్కడ చూసినా ఆ పెళ్లి కబుర్లే! ఒకప్పుడు రాజ కుటుంబాలలో కూడా ఈ తరహా పెళ్లిళ్లు జరుగుతూ ఉండేవి. కానీ అవి కేవలం కొన్ని కుటుంబాలకు మాత్రమే పరిమితమయ్యేవి.

రాజుకైనా.. పేదకైన పెళ్లి పెళ్లే! నా ఉద్దేశంలో మన భారతీయ సంస్కృతిలో ఉన్న గొప్పదనం అదే! ఆర్థికహోదా బట్టి పెట్టే ఖర్చు మారచ్చు.. చేసే వేడుకల తీరు మారచ్చు.. విందుల్లో పెట్టే పదార్థాలు మారచ్చు.. కానీ వివాహం అనేది వ్యక్తికి మాత్రమే పరిమితం కాదు.. రెండు కుటుంబాల కలయిక అనే విషయం ఇప్పటికీ మనకు తెలిసేలా వివాహ వేడుకలు ఉంటాయి.

నేను ఎక్కువ కాలం జీవించింది హైదరాబాద్‌లోనే కాబట్టి ఇక్కడ రాజకుటుంబాల వివాహాలను నేరుగా చూసే అవకాశం నాకు దక్కింది. సాధారణంగా రాజకుటుంబీకులు- తమ హోదాలో ఉన్నవారిని మాత్రమే వివాహ వేడుకలకు పిలిచేవారు. కొందరు వివాహ సమయంలో భండారా (ఆహార వితరణ) చేసేవారు. హైదరాబాద్ నిజాం కుటుంబీకులు మాత్రం పెళ్లిని తమ కుటుంబానికి సంబంధించిన వ్యవహారంగా మాత్రమే చూసేవారు. నాకు తెలిసి ఏ నిజాం తన ఇంట్లో జరిగే ఏ పెళ్లికి 'సామాన్య ప్రజలను' కానీ వారి ప్రతినిధులను కానీ వివాహాలను పిలిచేవారు కారు. నిజాం ఆస్థానంలో ఉన్న కొందరు రాజకుటుంబీకులనే వివాహానికి పిలిచేవారు. నిజాం కుటుంబీకులు ఎవరైనా ఇతరుల వివాహానికి హాజరయితే సమాజంలో వారి గౌరవం రెట్టింపు అయ్యేది. చాలా అరుదుగా వారు పెళ్లిళ్లకు వచ్చేవారు. నాన్న రాజా ధన్‌రాజ్‌గిరికి నిజాం కుటుంబంతో సన్నిహిత సంబంధాలు ఉండేవి కాబట్టి చెల్లి రేణుక పెళ్లికి ప్రిన్స్ ముఖరం ఝా బహదూర్ వచ్చారు. రావటమే కాదు.. రేణుక చేతికి ముత్యాలు, బంగారపు దారం తయారుచేసిన సెహ్రా (తల మీద ముత్యాలతో కట్టే ఒక ఆభరణం) కట్టారు. సాధారణంగా నిజాం పాలనలో యువరాజులు వచ్చినప్పుడు వారికి నజర్ (కానుక)ను ఇవ్వటం ఒక ఆచారంగా ఉండేది. ముఖరం ఝా ఆ నజర్‌ను స్వీకరించలేదు. అంటే మమల్ని కూడా ఆయన ఒక కుటుంబ సభ్యులుగా భావించారని అర్థం. ఈ వార్త ఆ రోజుల్లో పెద్ద సంచలనం సృష్టించింది. ఇక్కడ సెహ్రా గురించి కూడా కొద్దిగా చెప్పాలి. ఒకప్పుడు పెళ్లికూతురుకు కట్టే సెహ్రాను చాలా పవిత్రమైనదిగా.. వివాహవేడుకల్లో ముఖ్యమైనదిగా భావించేవారు. అందుకే గాలిబ్ ఒక చోట- "నా చెలి సెహ్రాకు అవసరమైన ముత్యాల కోసం సముద్రమంతా గాలిస్తున్నాను" అంటాడు. ఆ రోజుల్లో సామాన్యంగా ఎప్పుడూ పాటలు పాడని వారు కూడా పెళ్లిళ్లలో "దుల్హా ఆయా.. హర్యాలా బనా ఆయా" అంటూ ఉత్సాహంగా పాటలు పాడేవారు. అంతే కాదు. వివాహాలలో షెహనాయి తప్పనిసరి. షెహనాయి మోగితే ఏవైనా దుష్టశక్తులు ఉంటే పారిపోతాయని భావించేవారు. ఇక ఆడంబరాల విషయానికి వస్తే- పెద్ద కుటుంబాల వారికి పెళ్లిళ్లు తమ సంపదను ప్రదర్శించుకోవటానికి ఒక సందర్భంగా మారేది. ఏదైనా పెళ్లిలో రాజకుటుంబాలకు సంబంధించిన సైన్యం బారాత్‌లో పాల్గొంటే అది గొప్పింటి పెళ్లిగా భావించేవారు. నాకు గుర్తున్నంత వరకు ఒక రాజకుటుంబానికి చెందిన పెళ్లి బారత్- హైదరాబాద్ నుంచి సికింద్రాబాద్ వరకు నడిచింది. మా ఇంట్లో జరిగిన ఒక వివాహంలో బారాత్‌లో సాలార్‌జంగ్ సైన్యం ముందు నడిచింది. ఆ రోజుల్లో అదొక పెద్ద సంచలనం.



నేను గత 80 ఏళ్లలో అనేక పెళ్లిళ్లు చూశాను. పెళ్లిళ్ల విషయంలో అప్పటికి.. ఇప్పటికి వచ్చిన ప్రధాన మార్పు- బాధ్యతలు, అప్యాయతలు తగ్గిపోవటం. ఒకప్పుడు పెళ్లంటే ఒక బాధ్యత. దూరపు చుట్టాలు కూడా ముందుగానే వచ్చి పెళ్లి పనుల్లో పాల్గొనేవారు. అందువల్లే ఐదు రోజుల పెళ్లిళ్లు కూడా సునాయాసంగా జరిగిపోయేవి. ఇప్పుడు పరిస్థితులు మారిపోయాయి. ఈ మధ్యకాలంలో- కేవలం ఫొటోల కోసమో.. సోషల్ మీడియాలో పోస్ట్‌ల కోసమో పెళ్లిళ్లను ఘనంగా జరిపించాలనుకొనే వారి సంఖ్య కూడా పెరిగిపోయింది. నేను గమనించినదేమిటంటే- ఎంతో ఆతృతగా ఎక్కువ ఖర్చు పెట్టి ఫొటోలు తీయించుకున్నవారికి కూడా ఆ ఫొటోలు చూసేందుకు సమయం లేకపోవటం! ఒకప్పుడు ఆల్బమ్స్ ఉండేవి. వాటిని చూడటానికి అందరూ సమయం కేటాయించేవారు. కానీ ఈ డిజిటల్ యుగంలో ఎవ్వరికి అంత సమయం లేదు. చివరగా- వివాహం చేయటం ఒక కుటుంబ బాధ్యత. దానికి వెళ్లటం ఒక సామాజిక బాధ్యత. ఇతరులతో ఆనందకరమైన క్షణాలను పంచుకోవటం వల్ల సామాజికంగా ఉండే అనేక రకాల సమస్యలు తొలగిపోతాయి. అందుకే ఎవరు పిలిచినా- పెళ్లికి వెళ్లండి.. వారితో ఆనంద క్షణాలు పంచుకోండి.

• రాజకుమారి ఇందిరాదేవి ధన్‌రాజ్‌గిర్



నరకాసుర వధకై సమరం

నాని కథానాయకుడిగా వివేక్ ఆత్రేయ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'సరిపోదా శనివారం'. డి.వి.వి దానయ్య, కల్యాణ్ దాసరి నిర్మిస్తున్నారు. ప్రియాంక అరుళ్ మోహన్ కథానాయిక. సాయికుమార్, ఎస్‌జే సూర్య ముఖ్యపాత్రల్లో నటిస్తున్నారు. శనివారం సూర్య పుట్టిన రోజు. ఈ సందర్భంగా చిత్రబృందం ఆయన పాత్రను పరిచయం చేస్తూ ప్రత్యేక వీడియోను విడుదల చేసింది. పోలీసాఫీసర్‌గా ఆయన క్రౌర్యాన్ని పలికించిన తీరు ఆకట్టుకుంది. సూర్య పాత్రను నరకాసురుడితో పోల్చుతూ, అతన్ని ఎదుర్కోవడానికి వస్తున్న హీరో హీరోయిన్ల పాత్రలను శ్రీకృష్ణుడు, సత్యభామతో పోల్చిచూపడం ఆసక్తిని పెంచింది. ఆగస్టు 29న ఈ చిత్రం థియేటర్లలోకి రానుంది. సంగీతం: జేక్స్ బిజోయ్, సినిమాటోగ్రఫీ: మురళీ జీ, ఎడిటర్: కార్తీక్ శ్రీనివాస్

మాస్టర్స్ పట్టా అందుకున్న అనా కొణిదెల

స్నాతకోత్సవానికి హాజరైన డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్

ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కల్యాణ్ సతీమణి అనా కొణిదెల సింగపూర్ యూనివర్సిటీ నుంచి మాస్టర్స్ డిగ్రీ పొందారు. ఆమెకు ఇది రెండో మాస్టర్స్ డిగ్రీ. నేషనల్ యూనివర్సిటీ ఆఫ్ సింగపూర్‌లో శనివారం వైభవంగా జరిగిన స్నాతకోత్సవంలో ఆమె పట్టా స్వీకరించారు. ఆగ్నేయాసియా దేశాల కళలు, సామాజిక విజ్ఞానంలో ఆమె ఈ మాస్టర్స్ చేశారు. స్నాతకోత్సవంలో పాల్గొనేందుకు భార్యతో కలిసి వెళ్లిన పవన్.. మాస్టర్స్ పట్టా పొందిన సందర్భంగా ఆమెను ప్రత్యేకంగా అభినందించారు. అనా కొణిదెల రష్యాలోని సెయింట్ పీటర్స్‌బర్గ్ స్టేట్ యూనివర్సిటీలో చదివారు. అక్కడ ఓరియంటల్ స్టడీస్‌లో హానర్స్ పట్టా పొందారు. ఆసియా దేశాల చరిత్ర, భాషలు, జీవన విధానంపై అధ్యయనానికి తొలుత డిగ్రీ పొందారు. ఆ అధ్యయనంలో థాయిలాండ్ చరిత్ర ఒక ప్రత్యేక సబ్జెక్ట్‌గా ఉంది. సెయింట్ పీటర్స్‌బర్గ్ స్టేట్ యూనివర్సిటీలో ఉండగానే ఆమె మూడు భాషలు కూడా నేర్చుకున్నారు. ఆ తర్వాత బ్యాంకాక్‌లోని చులాలాంగ్‌కార్న్ యూనివర్సిటీ నుంచి థాయ్ స్టడీస్‌లో అనా మొదటి



మాస్టర్స్ డిగ్రీ సాధించారు. కాగా, పవన్ దంపతులు సింగపూర్ నుంచి నేడు విజయవాడ రానున్నారు.

- అమరావతి, (ఆంధ్రజ్యోతి)

కమిటీ కుర్రోళ్లు వస్తున్నారు



గ్రామీణ నేపథ్యంలో స్నేహం, ప్రేమ, భావోద్వేగాల కలబోతగా రూపొందిన చిత్రం 'కమిటీ కుర్రోళ్లు'. సందీప్ సరోజ్, యశ్వంత్ పెండ్యాల, శ్రావ్య, విషిక తదితరులు ముఖ్యపాత్రలు పోషించారు. యదు వంశీ దర్శకుడు. నిహారిక కొణిదెల సమర్పణలో పద్మజ కొణిదెల, జయలక్ష్మీ అడపాక నిర్మించారు. ఇప్పటికే విడుదలైన ప్రచార చిత్రాలు ఆకట్టుకున్నాయి. తాజాగా చిత్రబృందం విడుదల తేదీని ఖరారు చేసింది. స్నేహితుల దినోత్సవం సందర్భంగా ఆగస్టు 9న 'కమిటీ కుర్రోళ్లు' చిత్రాన్ని విడుదల చేస్తున్నట్లు యూనిట్ శనివారం తెలిపింది. ఈ సందర్భంగా నిహారికా కొణిదెల మాట్లాడుతూ 'మా పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్ బేనర్‌పై వస్తున్న తొలి చిత్రమిది. కొత్త ప్రతిభను ప్రోత్సహించాలనే ఆలోచనతో కొత్త నటీనటులతో ఈ సినిమా తీశాం. యువతకు, కుటుంబ ప్రేక్షకులకు ఈ చిత్రం నచ్చుతుంద'న్నారు. దర్శకుడు మాట్లాడుతూ "కమిటీ కుర్రోళ్లు' చిత్రంతో 11 మంది హీరోలు, నలుగురు హీరోయిన్లను పరిచయం చేస్తున్నాం. స్నేహితులతో సెలబ్రేట్ చేసుకునేలా మా సినిమా ఉంటుంద'ని చెప్పారు.

ఆగస్టు నుంచి ఆరంభం



'టిల్లు స్క్వేర్' చిత్రంతో సూపర్ హిట్ అందుకున్నారు సిద్ధు జొన్నలగడ్డ. ఆయన నటిస్తున్న లేటెస్ట్ చిత్రం 'తెలుసు కదా'. రాశీ ఖన్నా, శ్రీనిధి శెట్టి హీరోయిన్లుగా నటిస్తున్నారు. డిజైనర్ నీరజ్ కోన ఈ సినిమాతో దర్శకురాలిగా పరిచయం కాబోతున్నారు. టీజీ విశ్వ ప్రసాద్ నిర్మిస్తున్నారు. ప్రీ ప్రొడక్షన్ పనులన్నీ పూర్తయ్యాయి. ఆగస్టు 5 నుంచి రెగ్యులర్ షూటింగ్ జరగనుంది. హైదరాబాద్‌లో 30 రోజుల పాటు సాగే ఈ షెడ్యూల్‌లో టాకీ పార్ట్‌తో పాటు పాటలను చిత్రీకరించనున్నారు. ఈ చిత్రానికి ఎడిటర్: నవీన్ నూలి, డీఓపీ: జ్ఞానశేఖర్ వీ.ఎస్, సంగీతం: థమన్ ఎస్.ఎస్.

కల్కి బృందానికి నోటీసులు



'కల్కి 2898 ఏ.డీ' మేకర్స్‌కు ఊహించని షాక్ తగిలింది. ఈ సినిమాలో నటించిన ప్రభాస్, అమితాబ్ బచ్చన్, ఇతర నటులతో పాటు మేకర్స్‌కు మాజీ కాంగ్రెస్ నాయకుడు, కల్కి ధామ్ పీఠాధిపతి ఆచార్య ప్రసాద్ లీగల్ నోటీసులు పంపారు. "ఈ సినిమా భారతీయ ఇతిహాసాల్లోని విశ్వాసాలను దెబ్బతీసేలా ఉంది. ఇందులో హిందూ పురాణాల్లో ఉన్న విధంగా కాకుండా.. వాటిని వక్రీకరించారు. విష్ణుమూర్తి చివరి అవతారం 'కల్కి'ని పవిత్ర గ్రంథాలను కించపరిచేలా చిత్రీకరించారు. ఇది దేశంలో కోట్లాది సంఖ్యలో ఉన్న భక్తులను అయోమయానికి, గందరగోళానికి గురిచేసేలా ఉంది" అని ఆచార్య ప్రసాద్ ఈ నోటీసులో ఆరోపించారు.



ఆకట్టుకునే చిన్న కథ



నివేదా థామస్, ప్రియదర్శి, విశ్వదేవ్ హీరో హీరోయిన్లుగా నటిస్తున్న చిత్రం '35-చిన్న కథ కాదు'. గౌతమి, భాగ్యరాజ్ కీలకపాత్రలు పోషిస్తున్నారు. నందకిషోర్ ఈమాని దర్శకత్వం వహిస్తున్నాడు. హీరో రానా దగ్గుబాటి, సృజన్ యరబోలు, సిద్ధార్థ్ రాళ్లపల్లి సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఆగస్టు 15న ఈ చిత్రం తెలుగుతో పాటు తమిళ, మలయాళ భాషల్లో విడుదలవుతోంది. ఈ చిత్రంలో విశ్వదేవ్ పాత్రను పరిచయం చేస్తూ చిత్రబృందం ప్రత్యేక వీడియోను విడుదల చేసింది. ప్రసాద్ అనే మధ్యతరగతి తండ్రి పాత్రలో విశ్వదేవ్ నటన ఆకట్టుకుంది. ఇది చిన్న కథ కాదు ప్రేక్షకులను ఆకట్టుకునే కథ అని మేకర్స్ తెలిపారు. వివేక్ సాగర్ ఈ చిత్రానికి సంగీతం అందించారు. సినిమాటోగ్రఫీ: నికేత్ బొమ్మి, ఎడిటర్: టి.సి ప్రసన్న

మహిళలు మెచ్చిన పేకమేడలు




వినోద్ కిషన్, అనూషకృష్ణ జంటగా నటించిన చిత్రం 'పేకమేడలు'. నీలగిరి మామిళ్ల దర్శకత్వంలో రాకేశ్ వర్రే నిర్మించారు. ఇటీవలే విడుదలైన ఈ సినిమా అన్ని చోట్లా హిట్ టాక్‌తో దూసుకుపోతోంది. ఈ సందర్భంగా చిత్ర బృందం శనివారం సక్సెస్ మీట్‌ను ఏర్పాటు చేసింది. ఈ కార్యక్రమంలో దర్శకుడు నీలగిరి మామిళ్ల మాట్లాడుతూ "భావోద్వేగంతో నిండిన మంచి సినిమాను తీశారని చూసిన ప్రతీ ఒక్కరూ ప్రశంసిస్తున్నారు. ముఖ్యంగా మహిళలు ఈ సినిమాను విశేషంగా ఆదరిస్తున్నారు" అని అన్నారు. "మంచి కంటెంట్ ఉన్న సినిమా తీస్తే ప్రేక్షకులు తప్పక ఆదరిస్తారని మరోసారి రుజువు చేసిన చిత్రమిది. ఈ సినిమా సక్సెస్ ఇలాంటి మరిన్ని సినిమాలు నిర్మించడానికి ఉత్సాహం ఇచ్చింది" అని నిర్మాత రాకేశ్ వర్రే చెప్పారు. ఈ చిత్రానికి ఎడిటర్: సృజన అడుసుమిల్లి, హంజా అలీ, డీఓపీ: హరిచరణ్.కె, సంగీతం: స్మరణ్‌సాయి.



ఫీల్‌గుడ్ ఎంటర్‌టైనర్

సదన్ హీరోగా పరిచయమౌతున్న చిత్రం 'ప్రణయ గోదారి'. ప్రియాంక ప్రసాద్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. సాయి కుమార్ కీలక పాత్ర పోషిస్తున్నారు. పి.ఎల్.విఘ్నేశ్ దర్శకత్వంలో పారమళ్ళ లింగయ్య నిర్మిస్తున్నారు. తాజాగా ఈ సినిమా గ్లింప్స్‌ను నిర్మాత రాజ్ కందుకూరి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ "గ్లింప్స్ చక్కగా ఉంది. చిత్రాన్ని ప్రేక్షకులు ఆదరిస్తారని ఆశిస్తున్నాను" అని చెప్పారు. "ఫీల్‌గుడ్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కుతోన్న ఈ సినిమా అన్ని వర్గాల వారిని ఆకట్టుకుంటుంది" అని నిర్మాత పారమళ్ల లింగయ్య అన్నారు. ఈ చిత్రానికి ఎడిటర్: కొడగంటి వీక్షితవేణు, కెమెరా: ఈదర ప్రసాద్, సంగీతం: మార్కండేయ.








బ్యాంకులు భళా

క్యూ1లో మెరుగైన ఆర్థిక ఫలితాలు ప్రకటించిన ఐదు దేశీయ బ్యాంకులు

ముంబై: దేశీయ ప్రైవేట్ బ్యాంకింగ్ దిగ్గజం హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ సహా 5 బ్యాంకులు శనివారం ప్రస్తుత ఆర్థిక సంవత్సరం జూన్ త్రైమాసిక ఆర్థిక ఫలితాలను ప్రకటించాయి. అందులో ఓ ప్రభుత్వ రంగ బ్యాంకూ ఉంది. అన్ని బ్యాంకుల లాభం, ఆదాయాల్లో మెరుగైన వృద్ధి నమోదైంది. ఆ వివరాలు.



హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ లాభం రూ.16,474 కోట్లు

ఈ ఆర్థిక సంవత్సరం (2024-25)లో జూన్‌తో ముగిసిన మొదటి త్రైమాసికానికి (క్యూ1) హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ ఏకీకృత నికర లాభం వార్షిక ప్రతిపాదికన 33.17 శాతం వృద్ధితో రూ.16,474.85 కోట్లకు చేరుకుంది. గత ఆర్థిక సంవత్సరంలో ఇదే కాలానికి బ్యాంక్ లాభం రూ.12,370 కోట్లుగా నమోదైంది. కాగా, ఈ క్యూ1లో బ్యాంక్ మొత్తం ఆదాయం రూ.83,701 కోట్లకు ఎగబాకింది. క్రితం ఏడాదిలో ఇదే సమయానికి రాబడి రూ.57,816 కోట్లుగా ఉంది. నికర వడ్డీ మార్జిన్ (ఎన్ఐఎం) 3.47 శాతానికి మెరుగుపడటంతో ఈ జూన్ త్రైమాసికంలో నికర వడ్డీ ఆదాయం (ఎన్ఐఐ) 2.6 శాతం వృద్ధితో రూ.29,840 కోట్లకు పెరిగింది. వడ్డీయేతర ఆదాయం మాత్రం 41.3 శాతం తగ్గి రూ.10,670 కోట్లకు పరిమితమైంది. వార్షిక ప్రాతిపదికన పోలిస్తే, మొండిబకాయిల నష్టాలను పూడ్చుకోవడంతోపాటు ఇతర అవసరాల కోసం బ్యాంక్ కేటాయింపులు రూ.2,860 కోట్ల నుంచి రూ.2,602 కోట్లకు తగ్గాయి. ఈ మార్చి చివరినాటికి, మొత్తం ఆస్తుల్లో 1.24 శాతంగా నమోదైన మొండిబాకీలు లేదా స్థూల నిరర్థక ఆస్తుల (గ్రాస్ ఎన్‌పీఏ) వాటా.. ఈ జూన్ 30 నాటికి 1.33 శాతానికి పెరిగింది. గత నెలాఖరు నాటికి బ్యాంక్ మూలధన సమృద్ధి నిష్పత్తి 19.33 శాతంగా నమోదైంది.

కోటక్ బ్యాంక్ లాభంలో స్వల్ప వృద్ధి

ఈ జూన్‌తో ముగిసిన త్రైమాసికానికి గాను కోటక్ మహీంద్రా బ్యాంక్ రూ.3,520 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. క్రితం సంవత్సరంలో ఇదే కాలానికి ఆర్జించిన రూ.3,452 కోట్ల లాభంతో పోలిస్తే 2 శాతం వృద్ధి నమోదైంది. ఏకీకృత నికర లాభం మాత్రం 79 శాతం వృద్ధితో రూ.7,448 కోట్లుగా నమోదైంది. బీమా విభాగంలో విక్రయం ద్వారా ఆదాయం సమకూరడం ఇందుకు కలిసివచ్చింది. కాగా, గడిచిన మూడు నెలల్లో బ్యాంక్ మొత్తం ఆదాయం రూ.15,675 కోట్లకు పెరిగింది. గత ఏడాదిలో ఇదే సమయానికి రాబడి రూ.13,183 కోట్లుగా ఉంది. బ్యాంక్‌కు వడ్డీ ఆదాయం రూ.10,500 కోట్ల నుంచి రూ.12,746 కోట్లకు ఎగబాకింది. ఈ మార్చి 31తో పోలిస్తే, జూన్ చివరినాటికి బ్యాంక్ మొండి బాకీలు లేదా గ్రాస్ ఎన్‌పీఏలు ఎలాంటి మార్పు లేకుండా 1.39 శాతంగా నమోదయ్యాయి. నికర ఎన్‌పీఏలు మాత్రం 0.40 శాతం నుంచి 0.35 శాతానికి తగ్గాయి. ఈ జూన్ 30 నాటికి బ్యాంక్ మూలధన సమృద్ధి నిష్పత్తి 22.41 శాతంగా ఉంది.

ఆకట్టుకున్న ఆర్‌బీఎల్ బ్యాంక్

జూన్‌తో ముగిసిన మొదటి త్రైమాసికంలోలో ఆర్‌బీఎల్ బ్యాంక్ లాభం 29 శాతం పెరిగి రూ.372 కోట్లకు చేరుకుంది. నికర వడ్డీ ఆదాయం 20 శాతం వృద్ధితో రూ.1,700 కోట్లకు పెరిగింది. రుణాల్లో 19 శాతం పెరుగుదల వడ్డీ ఆదాయ వృద్ధికి తోడ్పడింది. కాగా, నికర వడ్డీ మార్జిన్ 5.67 శాతంగా నమోదైంది. ఈ జూన్ చివరినాటికి బ్యాంక్ గ్రాస్ ఎన్‌పీఏలు 2.69 శాతానికి తగ్గాయి.

యెస్ బ్యాంక్ లాభంలో 47 శాతం వృద్ధి

ఈ ఏప్రిల్-జూన్ త్రైమాసికానికి గాను యెస్ బ్యాంక్ లాభం వార్షిక ప్రాతిపదికన 46. శాతం వృద్ధితో రూ.502 కోట్లకు చేరుకుంది. మొండి బాకీల కోసం కేటాయింపులు తగ్గుముఖం పట్టడం ఇందుకు దోహదపడింది. గత మూడు నెలల్లో బ్యాంక్ నికర వడ్డీ ఆదాయం (ఎన్ఐఐ) 12.2 శాతం పెరిగి రూ.2,000 కోట్లుగా నమోదైంది. నికర వడ్డీ మార్జిన్ (ఎన్ఐఎం) మాత్రం 2.4 శాతంగానే కొనసాగింది. అయితే, ప్రస్తుతం బ్యాంకింగ్ రంగంలో సవాలుగా మారిన డిపాజిట్ల సమీకరణలో విషయంలో మాత్రం యెస్ బ్యాంక్ మంచి ప్రగతి సాధించింది. గత మూడు నెలల్లో బ్యాంక్ డిపాజిట్లలో 20 శాతం వృద్ధి నమోదైంది. ఎన్‌పీఏలు సహా ఇతర అవసరాల కోసం బ్యాంక్ కేటాయింపులు 41.2 శాతం తగ్గి రూ.212 కోట్లకు పరిమితమయ్యాయి. సమీక్షా కాలానికి బ్యాంక్ గ్రాస్ ఎన్‌పీఏలు 1.7 శాతంగా నమోదయ్యాయి. ఈ ఆర్థిక సంవత్సరంలో 16-17 శాతం రుణ వృద్ధిని లక్ష్యంగా పెట్టుకున్నట్లు యెస్ బ్యాంక్ ఎండీ, సీఈఓ ప్రశాంత్ కుమార్ తెలిపారు.

యూబీఐ లాభం రూ.3,679 కోట్లు

ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25)లో జూన్‌తో ముగిసిన తొలి త్రైమాసికానికి (క్యూ1) యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (యూబీఐ) నికర లాభం వార్షిక ప్రాతిపదికన 13.7 శాతం వృద్ధితో రూ.3,679 కోట్లకు పెరిగింది. బ్యాంక్ నికర వడ్డీ ఆదాయం (ఎన్ఐఐ) 6.5 శాతం పెరిగి రూ.9,412 కోట్లకు చేరుకుంది. నికర వడ్డీ మార్జిన్ (ఎన్ఐఎం) మాత్రం 0.13 శాతం తగ్గి 3.05 శాతానికి పరిమితమైంది. డిపాజిట్ల సమీకరణ వ్యయం పెరగడంతో వడ్డీ మార్జిన్లను 3 శాతం ఎగువన కొనసాగించడం సవాలుగా మారిందని యూబీఐ ఎండీ, సీఈఓ ఏ మణిమేఖలై అన్నారు. కాగా, సమీక్షా కాలానికి బ్యాంక్ ఇతర ఆదాయం 15.53 శాతం పెరిగి రూ.4,509 కోట్లుగా నమోదైంది. గడిచిన మూడు నెలల్లో రూ.2,318 కోట్ల రుణాలు మొండి పద్దుల్లోకి మళ్లాయి. అయినప్పటికీ, జూన్ చివరినాటికి బ్యాంక్ మొండిబాకీలు లేదా గ్రాస్ ఎన్‌పీఏలు 4.54 శాతానికి తగ్గాయి. కానీ, మొండిబాకీలతో పాటు ఇతర అవసరాల కోసం కేటాయింపులు మాత్రం రూ.4,106 కోట్లకు పెరిగాయి. బ్యాంక్ మూలధన సమృద్ధి నిష్పత్తి 17.92 శాతానికి మెరుగుపడింది. నిధులపరంగా బ్యాంక్ పరిస్థితి సౌఖ్యంగానే ఉందని మణిమేఖలై అన్నారు. గతంలో ప్రకటించిన 11-13 శాతం రుణ వృద్ధి, 8-10 శాతం డిపాజిట్ల వృద్ధి లక్ష్యాలను చేరుకుంటామని ధీమా వ్యక్తం చేశారు.

అజర్‌బైజాన్ చమురు క్షేత్రంలో ఓఎన్‌జీసీ విదేశ్ చేతికి ఈక్విటీ వాటా

న్యూఢిల్లీ: అజర్‌బైజాన్ చమురు క్షేత్రంలో నార్వే సంస్థ ఈక్విటీ వాటాను కొనుగోలు చేసినట్లు ఓఎన్‌జీసీ అనుబంధ సంస్థ ఓఎన్‌జీసీ విదేశ్ లిమిటెడ్ (ఓవీఎల్) వెల్లడించింది. 6 కోట్ల డాలర్ల (దాదాపు రూ.500 కోట్లు)కు ఈ వాటాను కొనుగోలు చేసినట్లు తెలిపింది. ఈ మేరకు ఈక్వినార్‌తో ఒప్పందం కుదుర్చుకున్నట్లు పేర్కొంది. ఒప్పందంలో భాగంగా అజర్‌బైజాన్‌లోని అజేరీ చిరాగ్ గునాషి (ఏసీజీ) చమురు క్షేత్రంలో 0.615 శాతం వాటాతో పాటు బాకు తబిలిసీ సేహన్ (బీటీసీ) పైప్‌లైన్ కంపెనీలో 0.737 శాతం వాటాకు సమానమైన షేర్లను మరో అనుబంధ సంస్థ ఓఎన్‌జీసీ బీటీసీ ద్వారా కొనుగోలు చేసినట్లు ఓవీఎల్ తెలిపింది. రానున్న కొద్ది నెలల్లో ఈ డీల్ పూర్తవుతుందని పేర్కొంది.

కెనరా రొబెకో బ్యాలెన్స్‌డ్ అడ్వాంటేజ్ ఫండ్

కెనరా రొబెకో మ్యూచువల్ ఫండ్.. బ్యాలెన్స్‌డ్ అడ్వాంటేజ్ ఫండ్‌ను తీసుకువచ్చింది. ఇది ఓపెన్ ఎండెడ్ డైనమిక్ అసెట్ అలోకేషన్ ఫండ్. ఈ ఫండ్ 65 శాతం పెట్టుబడులు ఈక్విటీల్లో పెట్టనుండగా మిగిలిన మొత్తాలను డెట్, మనీ మార్కెట్ ఇన్‌స్ట్రుమెంట్స్‌లో పెట్టనుంది. ఈ ఫండ్ కనీస పెట్టుబడి రూ.1,000. ఫండ్ ముగింపు తేదీ ఈ నెల 26. ఈ ఫండ్‌కు క్రిసిల్ హైబ్రిడ్ 50+50 మోడరేట్ ఇండెక్స్ బెంచ్‌మార్క్ ఇండెక్స్‌గా ఉండనుంది.

పన్ను పోటు తగ్గించరూ..!



బడ్జెట్‌పై వేతన జీవుల ఆశలు

ప్రధాని నరేంద్ర మోదీ సారథ్యంలో కొత్తగా ఏర్పాటైన ప్రభుత్వం ప్రవేశపెట్టబోయే బడ్జెట్ ఎలా ఉండబోతోందన్న ఆసక్తి అంతటా నెలకొని ఉంది. ముఖ్యంగా వేతన జీవులు ఈ నెల 23న ప్రవేశ పెట్టబోయే బడ్జెట్‌పై ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. పన్ను శ్లాబుల్లో మార్పులతో పాటు మరికొన్ని విషయాల్లో ప్రభుత్వం తమపై కనికరం చూపిస్తుందని వారు అంచనా వేస్తున్నారు. పాత ట్యాక్స్ విధానం కింద వేతన జీవులు వచ్చే కేంద్ర బడ్జెట్ నుంచి ఏం ఆశిస్తున్నారంటే..

ట్యాక్స్ శ్లాబుల్లో మార్పు

గత ఏడాది బడ్జెట్‌లో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ వేతన జీవులపై కొద్దిగా దయ చూపారనే చెప్పాలి. పన్ను మినహాయింపు వార్షిక ఆదాయ పరిమితిని రూ.2.5 లక్షల నుంచి రూ.3 లక్షలకు పెంచారు. అలాగే వార్షిక ఆదాయం రూ.5 కోట్లకు మించి ఉన్న వారిపై విధించే సర్‌చార్జీని 37 శాతం నుంచి 25 శాతానికి కుదించారు. కొత్త ట్యాక్స్ విధానాన్ని ఎంచుకునే వారికి ఇవి ఆకర్షించే అంశాలే. అయితే పాత పన్ను విధానాన్ని ఎంచుకునే వారికి మాత్రం పెద్దగా ఊరట లభించలేదనే చెప్పాలి. ప్రస్తుతం జీవన వ్యయం పెరిగిపోయింది. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని ఆర్థిక మంత్రి వచ్చే బడ్జెట్‌లో అందరికీ పన్ను మినహాయింపు వార్షిక ఆదాయ పరిమితిని ప్రస్తుత రూ.3 లక్షల నుంచి రూ.5 లక్షలకు పెంచాలని కోరుతున్నారు. అలాగే ప్రామాణిక మినహాయింపునీ ప్రస్తుత రూ.50,000 నుంచి రూ.లక్షకు పెంచితే బాగుంటుందని అభిప్రాయపడుతున్నారు.

హెచ్ఆర్ఏ రేట్లు

కొవిడ్ తర్వాత దేశంలోని ప్రధాన నగరాల్లో ఇళ్ల అద్దెలు పెరిగిపోయాయి. గత ఏడాదైతే 30 శాతం పెరిగాయి. ఆర్థికాభివృద్ధి కారణంగా ప్రస్తుతం హైదరాబాద్, బెంగళూరు, పుణె, నోయిడా వంటి చోట్లా ఇళ్ల అద్దెలు చుక్కలంటుతున్నాయి. ప్రస్తుతం ఉద్యోగుల మొత్తం జీతంలో 20 నుంచి 30 శాతాన్నే హౌస్ రెంట్ అలవెన్స్ (హెచ్ఆర్ఏ)గా అనుమతిస్తున్నారు. ప్రధాన మెట్రో నగరాల్లో అయితే బేసిక్ జీతంలో 50 శాతం, ఇతర ప్రధాన నగరాల్లో 40 శాతాన్ని అనుమతిస్తున్నారు. హైదరాబాద్, బెంగళూరు, పుణె వంటి నగరాల్లోని ఉద్యోగులకీ తమ బేసిక్ జీతంలో 50 శాతాన్ని హెచ్ఆర్ఏగా అనుమతించాలని ఉద్యోగులు కోరుతున్నారు.

ఈవీలకు ప్రోత్సాహం

ప్రస్తుతం మన దేశంలోనూ విద్యుత్ వాహనాల (ఈవీ) హవా నడుస్తోంది. 2019 బడ్జెట్‌లో ఈవీ కార్లు కొని వినియోగించే ఉద్యోగులను ప్రోత్సహించేందుకు ఏటా రూ.1.5 లక్షల వరకు ఆదాయ మినహాయింపుని అనుమతించేవారు. ఏ కారణంతోనో గత ఏడాది నుంచి ఈ మినహాయింపును నిలిపివేశారు. కనీసం వచ్చే బడ్జెట్‌లో అయినా దీన్ని పునరుద్ధరించి, మినహాయింపు పరిమితినీ రూ.2 లక్షలకు పెంచాలని వేతన జీవులు కోరుతున్నారు.

గృహ రుణాలు

అందరికీ సొంతిల్లు ప్రభుత్వ లక్ష్యం. ఈ లక్ష్య సాధనలో భాగంగా 2019లో ఆదాయ పన్ను చట్టంలో 80ఈఈఏ తీసుకొచ్చారు. ఈ సెక్షన్ కింద తొలిసారిగా గృహ రుణంతో అందుబాటు ధరల కేటగిరీలో ఇల్లు కొనుక్కున్న వ్యక్తులకు, ఆ రుణంపై ఏటా చెల్లించే వడ్డీలో రూ.1.5 లక్షల వరకు ఆదాయ పన్ను నుంచి మినహాయింపు ఇచ్చారు. గత ఏడాది నుంచి దీన్ని తీసివేశారు. కనీసం వచ్చే బడ్జెట్‌లో అయినా ఆర్థిక మంత్రి దీన్ని పునరుద్ధరించి.. మినహాయింపు పరిమితిని రెట్టింపు చేయాలని వేతన జీవుల కాంక్ష.

ఎంఎస్ఎంఈలకు ఎం1ఎక్స్ఛేంజీ ఫైనాన్సింగ్ సేవలు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ట్రేడ్ రిసీవబుల్స్ డిస్కౌంటింగ్ సిస్టమ్ (ట్రేడ్స్) ప్లాట్‌ఫామ్ ఎం1ఎక్స్ఛేంజీ.. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లోని సూక్ష్మ,చిన్న, మధ్య తరహా పరిశ్రమల (ఎంఎస్ఎంఈ)కు ఫైనాన్సింగ్ సేవలను మరింతగా విస్తరించేందుకు రెడీ అవుతోంది. ఎంఎస్ఎంఈలు తమ కార్యకలాపాలను సజావుగా నిర్వహించేందుకు గాను వారి కొనుగోలుదారులు జారీ చేసే ఇన్వాయిస్‌ల ఆధారంగా ఎం1ఎక్స్ఛేంజీ ఫైనాన్సింగ్ సదుపాయాలను కల్పిస్తోందని సంస్థ చీఫ్ బిజినెస్ ఆఫీసర్ రాయ్ మాథ్యూ కురియన్ వెల్లడించారు. ప్రస్తుతం ఎంఎస్ఎంఈలకు బకాయిలు చెల్లించేందుకు 45 రోజుల గడువు ఉందని, ఈ సమయంలో వారు నిధుల కొరతను ఎదుర్కొనకుండా, కార్యకలాపాలను నిరాటంకంగా కొనసాగించేందుకు గాను తాము ఫైనాన్సింగ్ సేవలను అందిస్తున్నట్లు చెప్పారు. ఇందుకోసం తాము 60 బ్యాంకులు, ఎన్‌బీఎఫ్‌సీలతో ఒప్పందం కుదుర్చుకున్నట్లు తెలిపారు. ప్రస్తుతం తెలంగాణలో 2,000కు పైగా ఎంఎస్ఎంఈలు తమ ప్లాట్‌ఫామ్ ద్వారా సేవలందుకుంటున్నారని కురియన్ పేర్కొన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఈ సంఖ్యను 5,000కు చేర్చాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు ఆయన వివరించారు.

ఏపీ ప్రభుత్వంతో ఒప్పందం: కాగా ఆంధ్రప్రదేశ్‌లోని ఎంఎస్ఎంఈలకు సేవలందించేందుకు గాను ఈ మధ్యనే ఆ రాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగానే త్వరలోనే విజయవాడ, విశాఖపట్నంల్లో సేల్స్ ఆఫీస్‌లను ప్రారంభించాలని చూస్తున్నట్లు చెప్పారు. గత ఆర్థిక సంవత్సరంలో ఎం1ఎక్స్ఛేంజీ రూ.43,300 కోట్ల విలువైన ఇన్వాయిస్‌లను ఫెసిలిటేట్ చేయగా ఈ ఆర్థిక సంవత్సరంలో ఈ విలువను రూ.72,000 కోట్లకు చేర్చాలని చూస్తున్నట్లు చెప్పారు.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



21వ తేదీ			
హైదరాబాద్	520	విజయవాడ	530
వరంగల్	522	గోదావరి	520
చిత్తూరు	573	విశాఖపట్నం	550
		దజను గుడ్లు రూ. 72	


ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. **వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్**



హైదరాబాద్	112	విజయవాడ	117
వరంగల్	112	గుంటూరు	118
కరీంనగర్	112	ఒంగోలు	118
మహబూబ్‌నగర్	112	చిత్తూరు	129
కర్నూలు	112	నెల్లూరు	129
విశాఖపట్నం	106	అనంతపురం	117
గోదావరి	117		

పతకాలు పట్టుకొచ్చేదెవరు?

- కుస్తీలో ఆరుగురు
- వినేష్‌పైనే దృష్టి


వినేష్ ఫొగట్

ఒలింపిక్స్‌లో భారత పతకాలు ఆశిస్తున్న విభాగాల్లో రెజ్లింగ్ ఒకటి. గత నాలుగు ఎడిషన్లుగా మన రెజ్లర్లు మెడల్స్ కొల్లగొడుతూనే ఉండడంతో.. దేశంలో కుస్తీ క్రీడకు క్రేజ్ పెరిగింది. 2008లో కాంస్యంతో యావత్ దేశాన్ని ఉర్రూతలూగించిన సుశీల్ కుమార్ ఆ తర్వాత లండన్ క్రీడల్లో రజతం సొంతం చేసుకొన్నాడు. 2012లో యోగేశ్వర్ దత్ కాంస్యంతో మెరిశాడు. 2016లో సాక్షి మాలిక్ కంచు మోత మోగించగా.. 2020 టోక్యోలో రవి దహియా, బజ్‌రంగ్ పూనియాలు రజత, కాంస్యాలతో అదరగొట్టారు. అయితే, ఈ క్రీడకు బలమైన పునాదులు పడుతున్న క్రమంలో అంతర్గత రాజకీయాలు, లైంగిక వేధింపుల ఆరోపణలు, తిరుగుబాట్లతో ఒక్కసారిగా అథఃపాతాళానికి పడిపోయింది. పారిస్ క్రీడలకు ఆరుగురు మాత్రమే అర్హత సాధించారు. వీరిలో పతకాలు గెలిచే సత్తా ఉన్న వారు ఎవరు? అంటే కచ్చితంగా చెప్పలేని పరిస్థితి.

బరిలో ఉన్న భారత అత్యుత్తమ మహిళా రెజ్లర్ ఫొగాట్ అనడంలో సందేహం లేదు. ఈసారి 50 కిలోల విభాగంలో వినేష్ బరిలోకి దిగుతోంది. అదను చూసి దాడి చేస్తూనే.. చాకచక్యంగా తనను తాను రక్షించుకోగలదు. అయితే, తక్కువ వెయిట్ విభాగానికి మారడం కోసం శరీరాన్ని ఎంతో ఒత్తిడికి గురి చేసింది. పైగా ఏడాదికి పైగా నిరసన కార్యక్రమాల్లో పాల్గొనడం వల్ల తగినంత ప్రాక్టీస్ చేయలేదనే చెప్పుకోవాలి.



అంతిమ్ పంగల్..: దేశానికి తొలి పారిస్ కోటా బెర్త్‌ను ఖరారు చేసింది. 53 కిలోల విభాగం బరిలోకి దిగనున్న పంగల్ పతకం సాధించాలనే పట్టుదలతో ఉంది. ప్రత్యర్థుల పట్టుకు చిక్కకుండా తప్పించుకోవడం అంతిమ్ స్పెషల్. వెన్ను గాయం కారణంగా పోటీలకు దూరమవడంతో తగినంత సాధన చేయలేకపోయింది. అంతర్జాతీయ అనుభవం కూడా తక్కువే.



అన్షు మాలిక్..: దూకుడుగా ఆడే అన్షు 57 కిలోల విభాగంలో ఆడనుంది. జూనియర్ స్థాయిలో ప్రకంపనలు సృష్టించినా.. సీనియర్ విభాగంలో ఆశించినంత ప్రదర్శన చేయలేకపోయింది. ఫిట్‌నెస్‌పై కూడా అనుమానాలున్నాయి.



నిషా దహియా..: బెదురు లేకుండా ప్రత్యర్థిపై అటాక్ చేయడం నిషా స్టైల్. 68 కిలోల విభాగంలో సైలెంట్‌గా బెర్త్ పట్టేసింది. ఎక్కువ సేపు బౌట్ సాగితే అలసిపోతుంది. తొలిసారి ఒలింపిక్స్ బరిలోకి దిగుతున్న నేపథ్యంలో ఒత్తిడిని ఎలా ఎదుర్కొంటుందనే దానిపై పతక ఆశలు ఆధారపడి ఉన్నాయి.



రీతిక హుడా..: ఊహించని రీతిలో ప్రత్యర్థిపై దాడి చేయగల నేర్పు రీతిక సొంతం. 76 కిలోల్లో గట్టిపోటీ ఇవ్వగల రెజ్లర్లలో హుడా కూడా ఉంది. బౌట్ చివర్లలో ప్రత్యర్థికి పాయింట్లు ఇచ్చుకోవడం రీతికకు మైనస్‌గా మారుతోంది.

అమన్ షెహ్రావత్



జట్టులో ఒకే ఒక్క పురుష రెజ్లర్. 57 కిలోల ట్రయల్స్‌లో ఒలింపిక్ పతక విజేత రవి దహియాకు షాకిచ్చి పారిస్ బెర్త్ పట్టేశాడు. ఎక్కువ సమయం పోరాడగలగడం అమన్ బలమైనా.. సాంకేతికంగా ఎంతో బలహీనం. వ్యూహాత్మకంగా ఆడలేదు. ప్లాన్-బి అనేది ఉండదు.

స్పోర్ట్స్

గురి కుదిరేనా!





షూటింగ్ బరిలో 21 మంది

పారిస్ ఒలింపిక్స్ షూటింగ్‌లో ఎన్నో ఆశలతో భారత్ బరిలో దిగుతోంది. గతంలో ఎన్నడూ లేనివిధంగా రైఫిల్, పిస్టల్, షాట్‌గన్ విభాగాల్లో కలిపి మొత్తం 21 కోటా స్థానాలను భారత్ దక్కించుకుంది. అన్ని స్థానాలు లభించడం మన షూటర్ల ప్రతిభకు నిదర్శనం. దాంతో సహజంగానే పారిస్‌లో పతకాలపై భారీగా అంచనాలు ఏర్పడ్డాయి. ఈ ఒలింపిక్స్ షూటింగ్ విభాగంలో తలపడేందుకు మొత్తం 81 దేశాలు క్వాలిఫై అయ్యాయి. ఇందులో భారత్, చైనాల నుంచే అత్యధిక మంది షూటర్లు పోటీపడుతుండడం విశేషం.



టోక్యో విశ్వక్రీడల్లో అత్యధికంగా 15 మంది భారత షూటర్లు బరిలో దిగారు. ఒలింపిక్స్ షూటింగ్ కేటగిరీలో మన దేశానికి సంబంధించి అది రికార్డు. 2016 రియో క్రీడల్లో 12 మందే తలపడ్డారు. టోక్యోలో పురుషుల 10 మీ. ఎయిర్ పిస్టల్‌లో టీనేజ్ షూటర్ సౌరభ్ చౌధరి ఫైనల్‌కు చేరడమే ఆ క్రీడల్లో మన అత్యుత్తమ ప్రదర్శన. ఈసారి మనూభాకర్, ఇషా సింగ్, అంజుమ్ మౌద్గిల్, శరబ్ జోత్ సింగ్, రిథమ్ సంగ్వాన్, అనీశ్ భన్వాలా, విజయ్‌వీర్ సిద్ధూ, ఎలవేనిల్ వలరివన్, పృథ్వీరాజ్ తదితరులు బరిలో ఉన్నారు. ఇక 21 మందిలో.. 15 మంది రైఫిల్, పిస్టల్ విభాగాల్లో, ఆరుగురు షాట్‌గన్‌లో అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు.

సిఫ్ట్‌కౌర్.. సై

22 ఏళ్ల సిఫ్ట్ కౌర్ శర్మ.. మహిళల 50 మీ. రైఫిల్ త్రీ పొజిషన్ విభాగంలో వరల్డ్ రికార్డ్ హోల్డర్. హాంగ్‌ఝౌ ఆసియాడ్‌లో స్వర్ణ పతకం సొంతం చేసుకున్న కౌర్ పారిస్‌తో ఒలింపిక్స్ అరంగేట్రం చేస్తోంది. ఎంతో ఒత్తిడిలోనూ ప్రశాంతంగా ఉంటూ లక్ష్యాన్ని 'గురి' చూసి కొట్టడం ఆమె ప్రత్యేకత. ఒలింపిక్స్ షూటింగ్ మహిళల విభాగంలో భారత్‌కు తొలి పతకం అందించాలని ధ్యేయంగా కౌర్ పారిస్‌లో అడుగుపెడుతోంది. మూడు విభాగాల్లో తలపడుతున్న 22 ఏళ్ల మనూ భాకర్ (10 మీ. పిస్టల్, 25 మీ. పిస్టల్, 15మీ. పిస్టల్ టీమ్), రెండో ఒలింపిక్స్‌లో తలపడుతున్న 30 ఏళ్ల అంజుమ్ మౌద్గిల్, ఐశ్వరీ ప్రతాప్ సింగ్ టోమర్, సందీప్ సింగ్, శరబ్‌జోత్ సింగ్ పైనా అంచనాలున్నాయి. అనుభవజ్ఞులు, యువకులతో కూడిన షూటింగ్ బృందం పారిస్‌లో మెరుగైన ప్రదర్శన చేయడం ద్వారా మరిన్ని పతకాలు తేవాలని పట్టుదలగా ఉంది. కనీసం మూడు లేదా నాలుగు పతకాలు ఈసారి మనకు లభిస్తాయనే నమ్మకంతో షూటర్లున్నారు. ఈ క్రమంలో వారంతా జర్మనీలో కఠినమైన శిక్షణ పొందారు.

ఇప్పటికి నాలుగే..

ఒలింపిక్స్ షూటింగ్‌లో భారత్ ఇప్పటి వరకు నాలుగు పతకాలే (ఒక స్వర్ణం, రెండు రజత, ఒక కాంస్యం) గెలుపొందింది. 2004 ఏథెన్స్ క్రీడల్లో రాజ్యవర్ధన్ సింగ్ రాథోడ్ రజత పతకంతో విశ్వ క్రీడల షూటింగ్‌లో భారత్ ఖాతా తెరిచాడు. 2008 బీజింగ్ ఒలింపిక్స్‌లో అభినవ్ భింద్రా స్వర్ణ పతకంతో చరిత్ర సృష్టిస్తే ఆ తర్వాత 2012లో గగన్ నారంగ్ (కాంస్యం), విజయ్ కుమార్ (రజత) పతకాలతో సత్తా చాటారు.


ఇషా సింగ్ మనూ భాకర్

ఇషాపై ఆశలు

అంతర్జాతీయ స్థాయిలో అద్భుత విజయాలు సాధిస్తున్న హైదరాబాద్ యువ షూటర్ ఇషా సింగ్‌పై అందరి దృష్టి నిలిచింది. మహిళల 25 మీ. పిస్టల్ విభాగంలో బరిలో దిగుతున్న 19 ఏళ్ల ఇషా సింగ్ తొలి ఒలింపిక్స్‌లో సత్తా చాటాలని ఉవ్విళూరుతోంది. ఆసియా క్రీడలు, వరల్డ్ చాంపియన్‌షిప్‌లో స్వర్ణాలు కొల్లగొట్టిన ఇషా..పారిస్‌కు ఆత్మవిశ్వాసంతో సిద్ధమైంది.

(ఆంధ్రజ్యోతి క్రీడా విభాగం)

పంత్‌నూ వదిలేసుకుంటారా?

న్యూఢిల్లీ: ఐపీఎల్ ఫ్రాంచైజీ ఢిల్లీ క్యాపిటల్స్ వచ్చే సీజన్ కోసం భారీ మార్పులే చేయనుంది. ఇప్పటికే తమ ప్రధాన కోచ్ పాంటింగ్‌ను తప్పించిన ఈ జట్టు తాజాగా కెప్టెన్ రిషబ్ పంత్‌ను కూడా వదులుకోనుందట. అతడి కెప్టెన్సీపై ఫ్రాంచైజీ అసంతృప్తితో ఉందని సమాచారం. ఒకవేళ పంత్‌ను వేలానికి ముందు వదులుకుంటే అతడితో ఒప్పందం కుదుర్చుకునేందుకు చెన్నై అమితాసక్తిని చూపుతున్నట్టు తెలిసింది.

సెమీస్ లక్ష్యంగా..

- నేడు యూఏఈతో భారత్ పోరు
- మహిళల ఆసియాకప్



మ. 2 నుంచి స్టార్‌స్పోర్ట్స్‌లో..

దంబుల్లా: పాకిస్థాన్‌తో జరిగిన తమ ఆరంభ మ్యాచ్‌లో ఘనవిజయం సాధించిన భారత మహిళల జట్టు ఇప్పుడు సెమీఫైనల్‌పై దృష్టి సారించింది. మహిళల టీ20 ఆసియాకప్‌లో హర్మన్‌ప్రీత్ సేన ఆదివారం యూఏఈతో తలపడనుంది. ఇటీవల అన్ని విభాగాల్లోనూ అదరగొడుతున్న భారత్ ఈ మెగా టోర్నీలోనూ అదే జోరును కనబరుస్తోంది. దీంతో ఇప్పటికే 2 పాయింట్లు, సూపర్ రన్‌రేట్‌తో ఉన్న భారత్ మరో గెలుపుతో సెమీస్ చాన్స్‌ను మరింత మెరుగుపర్చుకోవాలనుకుంటోంది. అటు తొలిమ్యాచ్‌లో నేపాల్‌పై ఓడిన యూఏఈ తమకన్నా ఎన్నోరెట్లు మెరుగైన భారత్‌కు కనీసపోటీనైనా ఇవ్వాలనే పట్టుదలతో ఉంది.

లంక బోణీ: ఆసియాకప్‌లో ఆతిథ్య శ్రీలంక బోణీ చేసింది. శనివారం గ్రూప్ 'బి'లో బంగ్లాదేశ్‌తో జరిగిన మ్యాచ్‌లో 7 వికెట్లతో విజయం సాధించింది.

అభిమానికి ఊహించని బహుమతి



దంబుల్లా: టీమిండియా వైస్-కెప్టెన్ స్మృతీ మంధాన తన అభిమానికి ఊహించని బహుమతి అందజేసింది. శ్రీలంకకు చెందిన దివ్యాంగురాలైన అదీషా హెరాత్‌కు మంధాన అంటే ఎనలేని అభిమానం. దాంతో ఆసియా కప్‌లో భాగంగా శుక్రవారం పాకిస్థాన్‌తో జరిగిన మ్యాచ్‌కు తల్లి సాయంతో వీల్‌చైర్‌లో హాజరైంది అదీషా. విషయం తెలుసుకున్న మంధాన మ్యాచ్ అనంతరం హెరాత్‌ను కలిసింది. తన ఫేవరెట్ క్రికెటర్‌ను కలిసిన ఆనందంలో ఉన్న అదీషాను.. మరింత ఆశ్చర్యపరుస్తూ ఆమెకు మొబైల్ ఫోన్ బహుమతిగా అందజేసింది.

టీమిండియా సహాయ కోచ్‌లుగా అభిషేక్, డస్కటే!

న్యూఢిల్లీ: మాజీ ఆల్‌రౌండర్ అభిషేక్ నాయర్, నెదర్లాండ్స్ మాజీ ఆటగాడు టెన్ డస్కటే భారత క్రికెట్ జట్టు అసిస్టెంట్ కోచ్‌లుగా వ్యవహరించే చాన్సుంది. వీరి నియామకంపై బీసీసీఐ అధికారికంగా స్పందించకపోయినా.. వీరిద్దరు కూడా శ్రీలంక పర్యటనకు జట్టుతో పాటు వెళ్లనున్నట్టు సమాచారం. ఇప్పటికే ద్రవిడ్ స్థానంలో గంభీర్‌ను కోచ్‌గా నియమించిన విషయం తెలిసిందే. అతడికి సహాయకులుగా వీరు వ్యవహరిస్తారు. అభిషేక్, డస్కటే ఐపీఎల్‌లోనూ గౌతీతో కేకేఆర్ తరఫున బాధ్యతలు నిర్వర్తించారు. అయితే ఫీల్డింగ్ కోచ్‌గా దిలీప్ కొనసాగబోతున్నాడు. బౌలింగ్ కోచ్‌గా మోర్నీ మోర్కెల్‌పై బోర్డు ఆసక్తి చూపుతోంది.

భారత ఫుట్‌బాల్ కొత్త కోచ్.. మార్క్వెజ్



న్యూఢిల్లీ: భారత ఫుట్‌బాల్ జట్టు చీఫ్ కోచ్‌గా ఉద్వాసనకు గురైన ఇగోర్ స్టిమాక్ స్థానంలో స్పెయిన్‌కు చెందిన మనోలో మార్క్వెజ్ నియమితుడయ్యాడు. 55 ఏళ్ల మార్క్వెజ్ ప్రస్తుతం ఇండియన్ సూపర్ లీగ్ (ఐఎస్ఎల్)లో ఎఫ్‌సీ గోవా జట్టు హెడ్ కోచ్‌గా ఉన్నాడు. అయితే, అతని పదవీకాలం ఎంతవరకు అన్నది అఖిల భారత ఫుట్‌బాల్ సమాఖ్య వెల్లడించలేదు.

భారీ ఆధిక్యంలో ఇంగ్లండ్

రెండో ఇన్నింగ్స్ 248/3

విండీస్ తొలి ఇన్నింగ్స్ 457

నాటింగ్‌హామ్: వెస్టిండీస్‌తో జరుగుతున్న రెండో టెస్టులో ఇంగ్లండ్ 207 పరుగుల ఆధిక్యంలో కొనసాగుతోంది. ఓపెనర్ డకెట్ (76), బ్రూక్ (71 బ్యాటింగ్), పోప్ (51) అర్ధసెంచరీలతో రాణించడంతో ఆతిథ్య జట్టు శనివారం ఆట ముగిసేసరికి రెండో ఇన్నింగ్స్‌లో 248/3 స్కోరు చేసింది. క్రీజులో బ్రూక్‌కు జతగా రూట్ (37) ఉన్నాడు. అంతకుముందు ఓవర్‌నైట్ స్కోరు 351/5తో మూడోరోజు తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన విండీస్ 457 రన్స్‌కు ఆలౌటైంది. జోషువా (82 నాటౌట్), షమార్ (33) పదో వికెట్‌కు 71 రన్స్ జత చేయడంతో విండీస్‌కు 41 రన్స్‌తో స్వల్ప ఆధిక్యం లభించింది. వోక్స్‌కు నాలుగు.. అట్కిన్సన్, బషీర్‌లకు రెండేసి వికెట్లు దక్కాయి. ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్‌లో 416 రన్స్ చేసింది.

జన జీవనానికి ఆటంకాలు లేకుండా చర్యలు

» అధికారులు అప్రమత్తంగా ఉండాలి: పొంగులేటి

హైదరాబాద్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షాల వల్ల జనజీవనానికి ఆటంకాలు లేకుండా తక్షణ చర్యలు చేపట్టాలని రెవెన్యూ, విపత్తుల నిర్వహణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి.. రెవెన్యూ అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలు మరో రెండు రోజుల పాటు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో రెవెన్యూ యంత్రాంగం పూర్తి స్థాయిలో అప్రమత్తంగా ఉండాలని ఆయన ఆదేశించారు. శనివారం గోదావరి నది ఉధృతి క్రమక్రమంగా పెరుగుతున్నందున గోదావరి పరివాహక ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేయాలని ఆయా జిల్లా కలెక్టర్లకు సూచించారు. ముఖ్యంగా ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో గోదావరి ఉధృతి, వరద పరిస్థితులపై ఆయా జిల్లా కలెక్టర్లతో మంత్రి ఫోన్‌లో మాట్లాడి అక్కడి పరిస్థితులను సమీక్షించారు. వరద ముప్పు ప్రాంతాలలో సహాయక చర్యలు మరింత ముమ్మరం చేయాలన్నారు. అధిక వర్షాలు కురుస్తున్న ఖమ్మం, కొత్తగూడెం, ములుగు, భూపాలపల్లి తదితర జిల్లాలపై ఎక్కువ దృష్టి సారించాలని అధికారులకు సూచించారు. లోతట్టు ప్రాంతాలు, వరద ముప్పు ప్రాంతాలలో చేపట్టవలసిన రక్షణ సంబంధిత చర్యల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. రెవెన్యూ విభాగంలో అధికారులు, సిబ్బంది సెలవులను ప్రస్తుతం రద్దు చేయాలని మంత్రి ఆదేశాలు జారీ చేశారు.

రామప్ప ఆలయంలోకి నీరు

వెంకటాపూర్(రామప్ప), జూలై 20: యునెస్కో గుర్తింపు పొందిన ప్రఖ్యాత రామప్ప ఆలయం కురుస్తోంది. తూర్పు, దక్షిణం వైపున కప్పుపై సజ్జల్ స్టోన్‌గా పిలిచే రాళ్ల మధ్య ఏర్పడ్డ సందుల నుంచి వర్షపు నీరు చుక్కలుగా పడుతోంది. ఆలయ సందర్శనకు వస్తున్న పర్యాటకులు ఈ దృశ్యాలను చూసి ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. 2022 జూలైలో భారీ వర్షాలకు ఇదే రీతిన ఆలయం కురవగా 'ఆంధ్రజ్యోతి' బయటపెట్టింది. స్పందించిన పురావస్తు శాఖ అధికారులు హుటాహుటిన రామప్పకు వచ్చి పరిశీలించారు. నక్షత్రాకార పీఠంపై విచ్చుకున్నట్లుగా నిర్మితమైన ఆలయం పైకప్పు శిథిలం కాలేదని, రాళ్ల మధ్య ఏర్పడ్డ సందుల నుంచి చుక్కలుగా నీరు కారుతోందని పురావస్తు శాఖ అసిస్టెంట్ కమిషనర్ స్మితా ఎస్.కుమార్ అప్పట్లో వివరణ ఇచ్చారు. సందులు వచ్చిన రాళ్లను కలుపుతూ వాటిని పోలిన రాళ్లను ఏర్పాటు చేయాలని రూ.16 లక్షలతో ప్రతిపాదనలు సిద్ధం చేశారు. అయితే, మరమ్మతుల్లో జాప్యం కారణంగా వర్షం కురిసినప్పుడల్లా కప్పు నుంచి నీరు కారుతోంది.

అంగన్‌వాడీల్లో 'ప్రాథమిక' విద్య సరి కాదు

» 'సెమీ రెసిడెన్షియల్' స్కూళ్ల ప్రతిపాదన భేష్: యూటీఎఫ్

హైదరాబాద్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని అంగన్‌వాడీలను ప్లే స్కూళ్లుగా మార్చి వాటిలో మూడో తరగతి వరకు బోధన నిర్వహించాలనే ప్రభుత్వ ప్రతిపాదన సరైందికాదని, ఆ విధానాన్ని విరమించుకోవాలని టీఎస్ యుటీఎఫ్ డిమాండ్ చేసింది. ఈ మేరకు శనివారం యుటీఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.జంగయ్య, చావ రవి మీడియాకు ప్రకటన విడుదల చేశారు. అంగన్‌వాడీలను ప్లే స్కూళ్లుగా మార్చే విధానం వల్ల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల మూసివేతకు దోహదపడుతుందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. కాగా, రాష్ట్రంలో ఫౌండేషన్ విద్య పేరుతో అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రైమరీ తరగతులను నిర్వహిస్తే పేద, బలహీనవర్గాల విద్యార్థులకు నష్టం జరుగుతుందని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఆర్.ఎల్.మూర్తి, టి.నాగరాజు అన్నారు. ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలను బలోపేతం చేయాలని డిమాండ్ చేశారు.

సీడీపీవో పరీక్ష రద్దుపై అభ్యర్థుల ఆందోళన

హైదరాబాద్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): మహిళా స్త్రీశిశు సంక్షేమ శాఖలో సీడీపీవో ఉద్యోగాల భర్తీ కోసం నిర్వహించిన పరీక్షను టీజీపీఎస్సీ రద్దు చేయడంపై అభ్యర్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎంపికైన అభ్యర్థులకు నియామక పత్రాలు ఇవ్వాలని హైకోర్టు ఆదేశించినా టీజీపీఎస్సీ స్పందించడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. సీడీపీవో పరీక్ష రాసి ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులకు మూడు వారాల్లో నియామక పత్రాలు ఇవ్వాలని కోర్టు ఆదేశిస్తే టీజీపీఎస్సీ అమలు చేయలేదని, దీనిపై కోర్టు ధిక్కరణ కేసు వేసినట్లు అభ్యర్థులు తెలిపారు. ఈ కేసు విచారణ దశలో ఉండగానే సీడీపీవో పరీక్షను రద్దు చేస్తూ టీజీపీఎస్సీ నిర్ణయం తీసుకోవడం పట్ల అభ్యర్థులు ఆందోళన వ్యక్తం చేశారు. పరీక్ష లీకేజీకి కారణమైన వారెవరో వెల్లడించకుండా పరీక్ష రద్దు చేయడం సరైనది కాదని, కోర్టు ఆదేశాల మేరకే టీజీపీఎస్సీ తుది నిర్ణయం తీసుకోవాలని వారు కోరారు.

కళ్లు మూసుకొని కౌన్సెలింగ్!


» బదిలీలపై వైద్య ఉద్యోగుల ఆగ్రహం

» సీనియారిటీ జాబితాపై స్టాఫ్ నర్సుల ఆందోళన..

» కౌన్సెలింగ్‌లో అక్రమాలు జరిగాయంటున్న ఉద్యోగులు

హైదరాబాద్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): వైద్య ఆరోగ్యశాఖలో సాధారణ బదిలీల వ్యవహారం వివాదాస్పదంగా మారింది. సీనియారిటీ జాబితాలో లోపాలపై స్టాఫ్‌నర్సులు ఆందోళనకు దిగడంతో వారి కౌన్సెలింగ్ ప్రక్రియ శనివారం కూడా నిర్వహించలేదు. తాజాగా డిప్యూటీ డైరెక్టర్ (అడ్మిన్), ఫార్మసీ, ల్యాబ్, ఏఎన్ఎం, ఎంపీహెచ్‌డబ్ల్యూ (మేల్, ఫీమేల్)వంటి విభాగాల్లోనూ బదిలీల కౌన్సెలింగ్ ప్రక్రియలో అక్రమాలు చోటు చేసుకున్నాయని ఉద్యోగులు ఆరోపిస్తున్నారు. సీనియారిటీ జాబితాలో పేర్లు లేకపోవడం, సర్వీస్ వివరాల్లో తప్పులు దొర్లడం, స్పౌజ్‌లలో తప్పిదాలు, ఆ అర్హత లేనివారికి బదిలీల్లో ప్రాధాన్యం కల్పించారని ఉద్యోగులు ఆరోపించారు. గుడ్డిగా, కళ్లు మూసుకొని కౌన్సెలింగ్ చేపట్టారని వైద్య ఉద్యోగులు ఆగ్రహం వ్యక్తం చేశారు. వైద్య శాఖలోని కొన్ని యూనియన్లు, అధికారులు కుమ్మక్కవడంతోనే ఈ దుస్థితి వచ్చిందంటున్నారు. ఓ అనుబంధ సంఘం సహకారంతో ఆరోగ్యశాఖలోని ఓ హెచ్‌వోడీకి భారీ స్థాయిలో ముడుపులందాయని, అందుకే సీనియారిటీ జాబితా తారుమారైందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇలాంటి అక్రమాలపై ప్రభుత్వం పూర్తిస్థాయిలో విచారణ జరపాలని బాధిత ఉద్యోగులు సీఎం రేవంత్ రెడ్డికి విజ్ఞప్తి చేస్తున్నారు. కాగా ప్రజారోగ్య సంచాలకుల విభాగంలో డిప్యూటీ డైరెక్టర్ (అడ్మిన్) క్యాడర్‌కు శుక్రవారం సాధారణ బదిలీల్లో భాగంగా కౌన్సెలింగ్ జరిగింది. రాష్ట్ర వ్యాప్తంగా 13 మంది అధికారులుండగా.. రాజధాని పరిధిలో 11 మంది, వరంగల్, కరీంనగర్‌లో ఒక్కొక్కరి చొప్పున విధులు నిర్వహిస్తున్నారు. జీవో నంబరు 80 ప్రకారం 40శాతం చొప్పున ఐదుగురు లాంగ్ స్టాండింగ్ అధికారులను సెలెక్ట్ చేయగా.. వీరిలో ఒకరు హైదరాబాద్ పరిధిలో 12 ఏళ్లు, ముగ్గురు ఏడేళ్లు, ఒకరు ఐదేళ్ల చొప్పున పనిచేస్తున్నారు. ఇందులో ఇద్దరికే స్పౌజ్ కేసు వర్తించగా... మిగిలిన నలుగురికి ఆ అర్హత లేదు. అయితే వారికీ స్పౌజ్ వర్తింపజేశారు. ఇక సర్కారు జీవోకు పూర్తి విరుద్ధంగా బదిలీలు జరిగాయి. ఉదాహరణకు కోఠిలోని జాతీయ ఆరోగ్య మిషన్‌లో చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ సుస్మితను అదే క్యాంపస్‌లోని ప్రజారోగ్య సంచాలకుల విభాగంలో డిప్యూటీ డైరెక్టర్‌గా బదిలీ చేశారు. హైదరాబాద్‌లోని ఆరోగ్యశ్రీ కార్యాలయంలో పనిచేసే నరేందర్‌కు డీహెచ్‌లోనే మరో డిప్యూటీ డైరెక్టర్‌గా బదిలీ చేశారు. ఇలా ప్రభుత్వ ఉత్తర్వులకు విరుద్ధంగా కోఠి హెడ్ ఆఫీస్‌లోనే పోస్టింగ్‌లు ఇచ్చినట్లు తెలుస్తోంది. ఇదిలా ఉండగా.. మరికొన్ని విభాగాల్లో కౌన్సెలింగ్ ప్రక్రియ పూర్తి కాలేదు. అయితే బదిలీల గడువును ప్రభుత్వం మరో పది రోజులు పొడిగించడంతో కౌన్సెలింగ్ ఆపేసి మిగిలిన విభాగాలకు మంగళవారం నుంచి కౌన్సెలింగ్ చేపడతామని అధికారులు శనివారం రాత్రి 10.30 గంటల ప్రాంతంలో చెప్పారు. దీంతో దూర ప్రాంతాల నుంచి వచ్చిన ఉద్యోగులు వైద్యాధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

ప్రభుత్వ సలహాదారుగా కేకే బాధ్యతల స్వీకరణ



రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడి (ప్రజా వ్యవహారాలు)గా మాజీ ఎంపీ కె.కేశవరావు శనివారం సచివాలయంలో బాధ్యతలు స్వీకరించారు. మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్, ఎంపీలు మల్లు రవి, బలరాంనాయక్, ఎమ్మెల్యేలు కాలె యాదయ్య, దానం నాగేందర్, జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల విజయలక్ష్మి, జాతీయ కిసాన్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు కోదండరెడ్డి తదితరులు కార్యక్రమానికి హాజరై కేకేకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.





ఆసిఫాబాద్ జిల్లాలో దహెగాంలో నీట మునిగిన పంటలు; జూరాలలో 17 గేట్లు ఎత్తి నీటిని విడుదల చేస్తున్న దృశ్యం

రోజంతా వాన

(మొదటిపేజీ తరువాయి)

అన్ని మండలాల్లోనూ 3 సెంటీమీటర్లపైన వర్షం కురవడం విశేషం. హైదరాబాద్ మహా నగరంలో శనివారమంతా ఒకటే వాన. గొడుగులు లేకుండా ప్రజలు బయటకు రాలేని పరిస్థితి నెలకొంది. షేక్ పేట, యూసుఫ్‌గూడలో 3 సెం.మీ. వర్షం కురిసింది. హుస్సేన్ సాగర్ పూర్తి నీటి మట్టం 513.41 అడుగులు కాగా, 513.23 అడుగులకు చేరింది. వరంగల్ జిల్లాలో చాలా మండలాల్లో 2 సెం.మీ.పైనే వర్షం పడింది. ఉమ్మడి మెదక్, రంగారెడ్డి జిల్లాల్లో శనివారం ఉదయం నుంచి రాత్రి వరకు చినుకులు పడ్డాయి. చాలాచోట్ల రెండు సెం.మీ.కు పైన వర్షం కురిసింది. పాలమూరు జిల్లాలో శుక్రవారం మధ్యాహ్నం మొదలైన వాన శనివారం కూడా ఆగలేదు. కోస్గిలో 5.86, వనపర్తిలో 49.5 సెంటీమీటర్ల వర్షం కురిసింది. ఉమ్మడి నల్లగొండ నిజామాబాద్, ఆదిలాబాద్‌లో విరామం లేకుండా వానపడింది.

గోదావరి, వాగుల ఉధృతి..

ములుగు జిల్లాలో భారీ వరదతో గోదావరి నీటి మట్టం పెరుగుతోంది. మంగపేట, కన్నాయిగూడెం, ఏటూరునాగారం, తాడ్వాయి మండలాల్లోని పదికి పైగా ఆటవీ గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. 33.6 మీటర్ల నిల్వ సామర్థ్యం కలిగిన లక్నవరం సరస్సులోకి 19 అడుగుల నీరు చేరింది. ఆసిఫాబాద్ జిల్లాలో పెన్‌గంగా, ప్రాణహిత, పెద్దవాగు నదులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. భూపాలపల్లి జిల్లాలో చెరువులు, కుంటలు మత్తడి పోస్తుండగా వాగులు ఉప్పొంగాయి. మహదేవపూర్, పలిమెల ప్రాంతంలోని గోదావరి 5 మీటర్ల ఎత్తులో ప్రవహిస్తోంది. మల్హర్, కాటారం మీదుగా వెళ్లే మానేరు ఉప్పొంగింది. మహబూబాబాద్ జిల్లాలో గార్ల పాకాల వాగు రాంపురం బ్రిడ్జిపై నుంచి వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. మంచిర్యాల జిల్లాలో గోదావరి, ప్రాణహిత నదులు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. నెన్నెల మండలం ఎర్రవాగు ఉధృతితో ఆరు గ్రామాల వారి రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. భీమారం మండలం కాజిపల్లి- కొత్తూరు గ్రామాల మధ్య కాజిపల్లి వాగు కల్వర్టు తెగిపోయింది. నిర్మల్ జిల్లా ఖానాపూర్ మండలంలోని రెంకోని వాగు ధాటికి దిలావర్‌పూర్, ఖానాపూర్ మండలాల మధ్యలో తాత్కాలిక రోడ్డు తెగిపోయింది. పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. ఆదిలాబాద్‌లోని కుంటాల, పొచ్చర జలపాతాలు పరవళ్లు తొక్కుతున్నాయి. నేరడిగొండ మండలం సేవ్‌దాస్‌నగర్ గ్రామానికి వెళ్లే దారిలో వాగు శనివారం ఉప్పొంగింది. దీంతో నేరడిగొండకు వారసంతకు వెళ్లిన యువకులు తిరుగు ప్రయాణంలో ఇబ్బంది ఎదుర్కొన్నారు. ప్రాణాలకు తెగించి వాగు దాటారు.

రాష్ట్రంలో నేడూ భారీ వర్షాలు

రాష్ట్రంలో ఆదివారం కూడా భారీ వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. మహబూబ్‌నగర్, నారాయణపేట, వికారాబాద్, సంగారెడ్డి, నిర్మల్, ఆదిలాబాద్, ఆసిఫాబాద్ జిల్లాలో భారీ వర్షాలకు అవకాశం ఉందని పేర్కొంది. రాష్ట్రవ్యాప్తంగా సగటున 1.7 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు తెలిపింది. ఇంకా 50 మండలాల్లో 20-59 శాతం లోటు వర్షపాతం నెలకొందని పేర్కొంది.

సింగరేణి బొగ్గు ఉత్పత్తికి దెబ్బ

ఖమ్మంలో వర్షాలతో సింగరేణి ఓసీల్లో లక్ష టన్నుల బొగ్గు ఉత్పత్తి నిలిచిపోయింది. జయశంకర్ జిల్లా భూపాలపల్లి ఓసీ 2, 3లలో నీరు చేరి 6,385 టన్నుల ఉత్పత్తి ఆగిపోయింది. మల్హర్ మండలం తాడిచర్ల బ్లాక్‌లోకి నీరుచేరి 6 వేల టన్నుల ఉత్పత్తికి విఘాతం కలిగింది. మొత్తం బొగ్గు గనులకు రూ.4.50కోట్ల నష్టం జరిగి ఉంటుందని అధికారులు తెలిపారు. మంచిర్యాల జిల్లాలో రూ.20 కోట్ల విలువైన బొగ్గు ఉత్పత్తి, రూ.6 కోట్ల విలువైన ఓబీ మట్టి వెలికితీతకు తీవ్ర ఆటంకం కలుగుతోంది.



ఆదిలాబాద్ జిల్లాలో వాగును దాటుతున్న యువకులు



నల్లగొండ జిల్లా ఉదయసముద్రం సమీపంలో వరి నాట్లు వేసేందుకు వచ్చి వర్షం కురుస్తుండటంతో హర్షం వ్యక్తం చేస్తున్న మహిళా కూలీలు

జూరాల 17గేట్లు ఎత్తివేత

» ఈ ఏడాది ఇదే తొలి.. శ్రీశైలానికి 48 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

» నారాయణపూర్, తుంగభద్ర జలాశయాలకు లక్ష క్యూసెక్కులు

» మేడిగడ్డకు కొనసాగుతున్న వరద.. 3.73 లక్షల క్యూసెక్కులు

హైదరాబాద్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): తెలుగు రాష్ట్రాల్లో కృష్ణా నదిపై తొలి ప్రాజెక్టు అయిన జూరాల గేట్లు తెరుచుకున్నాయి. ఈ సీజన్‌లో తొలిసారిగా శనివారం 17 గేట్లను ఎత్తారు. 1,04,416 క్యూసెక్కులను దిగువకు వదిలారు. శనివారం సాయంత్రం 6 గంటల సమయంలో శ్రీశైలం ప్రాజెక్టుకు 48,026 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరింది. నారాయణపూర్ జలాశయానికి 1,11,236 క్యూసెక్కుల వరద వస్తుండగా 1,08,860 క్యూసెక్కులను కిందకు వదిలారు. ఆల్మట్టికి 1,05,939 క్యూసెక్కుల వరద వచ్చి చేరుతోంది. మరోవైపు తుంగభద్రకు 1,03,956 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదవుతోంది. రోజూ 10 టీఎంసీల వరద వచ్చి చేరుతోంది. ఇది కొనసాగితే నాలుగు రోజులలో తుంగభద్ర జలాశయం నిండనుంది. నిర్మల్ జిల్లా కడెం ప్రాజెక్టు మూడు గేట్లను ఎత్తారు. భద్రాచలం వద్ద గోదావరి 40 అడుగులకు సమీపించింది. మూడు రోజులుగా గోదావరి నీటిమట్టం క్రమేపీ పెరుగుతోంది. ఇప్పటికే స్నానఘట్టాలు నీట మునిగాయి. ఛత్తీస్‌గఢ్‌తో పాటు, చర్ల మండలంలో భారీ వర్షాలతో తాలిపేరు 25 గేట్లను పూర్తిగా ఎత్తి లక్ష 45వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. నల్లగొండ జిల్లా మూసీకి ఇన్‌ఫ్లో శనివారం రెట్టింపైంది. నాగార్జునసాగర్ పూర్తి నీటిమట్టం 590 అడుగులు (312.5050టీఎంసీలు) కాగా, ప్రస్తుతం 504.60 అడుగులు (122.6854టీఎంసీలు)గా ఉంది. మేడిగడ్డ బ్యారేజీ 85 గేట్లను ఎత్తారు.

ప్రాజెక్టు	పూర్తిస్థాయి సామర్థ్యం	ప్రస్తుత సామర్థ్యం	ఇన్‌ఫ్లో	ఔట్‌ఫ్లో
ఆల్మట్టి	129.72	101.48	79,000	69,000
నారాయణపూర్	37.64	34.04	1,00,000	1,08,860
తుంగభద్ర	100.86	68.77	1,03,787	2,923
జూరాల	9.66	7.80	83,000	86,679
శ్రీశైలం	215.81	36.56	48,026	3,158
నాగార్జునసాగర్	215	122.68	0	9,874
సింగూరు	29.91	13.60	391	391
శ్రీరాంసాగర్	80.5	18.29	15,100	489
కడెం	7.6	5.33	8,606	77
ఎల్లంపల్లి	20.18	5.79	5,710	331
అన్నారం	10.87	0.08	16,500	16,500
మేడిగడ్డ	16.17	2.15	3,73,500	3,7,3500
సమ్మక్క	6.94	3.81	5,24,680	5,24,680
సీతమ్మ	36.57	0.2	6,02,200	602200

(టీఎంసీలు) (క్యూసెక్కులు)

వానాకాలానికి ముందు తనిఖీలు చేశారా?

'పెద వాగు' వైఫల్యంపై నివేదిక అందించండి.. రాష్ట్రానికి జాతీయ డ్యామ్ సేఫ్టీ అథారిటీ ఆదేశం

» నలుగురు అధికారులకు మెమోలు

అశ్వారావుపేట/హైదరాబాద్, జూలై 20(ఆంధ్రజ్యోతి): భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని పెదవాగు ప్రాజెక్టుకు గండ్లు పడి... నీరంతా దిగువ ప్రాంతాలను ముంచెత్తడంపై జాతీయ ఆనకట్టల భద్రత సంస్థ(ఎన్‌డీఎస్ఏ) స్పందించింది. ప్రాజెక్టుపై సమగ్ర నివేదిక అందించాలని తెలంగాణ ప్రభుత్వాన్ని (స్టేట్ డ్యామ్ సేఫ్టీ ఆర్గనైజేషన్‌ను) ఆదేశించింది. ఈ మేరకు శనివారం ఎన్‌డీఎస్ఏ డైరెక్టర్(గేట్స్ డిజైన్) రాహుల్‌కుమార్ సింగ్ తెలంగాణకు లేఖ రాశారు. ఈ నెల 18వ తేదీన భారీ వరద రావడంతో పెదవాగు ప్రాజెక్టు కట్టకు 25చోట్ల గండ్లు పడి, గేట్ల పక్కనే కొన్ని మీటర్ల మేర కట్ట కొట్టుకుపోయింది. ఆనకట్టల భద్రత చట్టం-2021 ప్రకారం ప్రాజెక్టును వానాకాలానికి ముందు, తర్వాత తనిఖీలు చేసి నివేదిక ఇవ్వాలి. ఈ నేపథ్యంలో వానాకాలానికి ముందు ప్రాజెక్టు స్థితిగతులపై తనిఖీలు చేశారా? అంటూ ఎన్‌డీఎస్ఏ ఆరా తీసింది. ప్రాజెక్టుకు సంబంధించిన సమగ్ర వివరాలతో పాటు వైఫల్యానికి గల కారణాలేంటి? ప్రాజెక్టు వద్ద వరద ప్రమాద హెచ్చరికల వ్యవస్థ ఏమైనా ఉందా? అత్యవసర చర్యల ప్రణాళిక ఏమైనా తీసుకున్నారా? వంటి వివరాలు అందించాలని నిర్దేశించింది. వరదను విడుదల చేసే ముందు లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేసే చర్యలు ఎందుకు చేపట్టలేదని ప్రశ్నించింది. ఈ నివేదిక అందగానే.. ఎన్‌డీఎస్ఏ నిపుణుల కమిటీ పెదవాగు ప్రాజెక్టును పరిశీలించనుంది.

మరమ్మతులు లేకనే వైఫల్యం

గోదావరి బేసిన్‌లో పెదవాగు ఒక్కటే తెలుగు రాష్ట్రాల ఉమ్మడి ప్రాజెక్టు. 16వేల ఎకరాలకు నీరందించేలా 1981లో ఈ ప్రాజెక్టును నిర్మించారు. 40,500 క్యూసెక్కుల వరద విడుదలయ్యేలా ప్రాజెక్టు స్పిల్‌వేను నిర్మించారు. 1989లో ఏకంగా 70వేల క్యూసెక్కుల వరద రావడంతో స్పిల్‌వే ఎడమవైపు 200మీటర్ల మేర కట్ట దెబ్బతిన్నది. 2007లోనే ప్రాజెక్టు సామర్థ్యంపై పలు అనుమానాలు వ్యక్తం కాగా, మరమ్మతుల కోసం రూ.100కోట్లు అవసరమని గుర్తించారు. ఈ మేరకు నిధులు కావాలని ప్రపంచ బ్యాంకుకు ప్రతిపాదనలు పంపినా.. విడుదల కాలేదు. ఇక, రాష్ట్ర విభజన తర్వాత ప్రాజెక్టు పరిధిలోని 14వేల ఎకరాల ఆయకట్టు (కుకునూరు, వేలేరుపాడు మండలాలు)ఏపీలోకి వెళ్లగా... అశ్వారావుపేట మండలంలోని 2వేల ఎకరాల ఆయకట్టు మాత్రమే తెలంగాణకు మిగిలింది. ప్రాజెక్టు తెలంగాణలో ఉండడం, ఎక్కువ ఆయకట్టు ఏపీలో ఉండడంతో.. ప్రాజెక్టు నిర్వహణ గాలిలో దీపంలా మారింది. ప్రాజెక్టు ఆధునికీకరణకు రూ.78.82 కోట్లు అవసరమని, వెంటనే విడుదల చేయాలని 2021లో నిర్వహించిన రెండు రాష్ట్రాల సంయుక్త భేటీలో నిర్ణయించారు. కానీ.. నిధులు విడుదల కాకపోవడంతో పనులు ముందుకు సాగలేదు. ఆ తర్వాత 2022 చివరిలో రూ.1.48కోట్లను విడుదల చేస్తూ తెలంగాణ ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. ఈ నిధులతో గేట్ల మెయింటెనెన్స్ పనులు చేపట్టినట్టు అధికారులు చెబుతున్నా.. క్షేత్ర స్థాయిలో పరిస్థితి భిన్నంగా ఉంది. ఈనెల 18న 75వేల క్యూసెక్కుల వరద వచ్చిన సమయంలో అధికారులు రెండు గేట్లను మాత్రమే ఎత్తగలిగారు. మోటారు కాలిపోవడంతో మరో గేటును ఎత్తలేకపోయారు. ఇదే ప్రమాదానికి కారణమైందన్న వాదన వినిపిస్తోంది.

అధికారుల తప్పిదమేనా?

ప్రాజెక్టు పరిధిలో 30మంది విధులు నిర్వర్తించాల్సి ఉండగా.. 10 మందిలోపే పని చేస్తున్నారు. వారిలోనూ స్థానికంగా ఎవ్వరూ ఉండకపోవడం, అధికారుల పర్యవేక్షణ లేకపోవడం ప్రాజెక్టుకు శాపంగా పరిణమించింది. మరోవైపు ప్రాజెక్టుకు ఎగువ భాగాన వందలాది ఎకరాలను కొందరు ఆక్రమించి.. పంటలను సాగు చేస్తున్నారు. దీని వల్ల ప్రాజెక్టులో పూడిక చేరి, నీటి నిల్వ సామర్థ్యం బాగా తగ్గిపోయింది. ప్రాజెక్టు వైఫల్యానికి ఇదీ ఓ కారణమని భావిస్తున్నారు. ఆధునికీకరణకు నిధులు ఇవ్వకుండా తెలుగు రాష్ట్రాల్లోని గత ప్రభుత్వాలు చేసిన తప్పిదానికి.. ఇప్పుడు భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వచ్చింది.

నలుగురు అధికారులకు మెమోలు

పెదవాగు ప్రాజెక్టు విషయంలో విధుల పట్ల నిర్లక్ష్యం వహించారనే కారణంతో ఈఈ సురేష్‌కుమార్, అశ్వారావుపేట డీఈఈ కృష్ణ, ఏఈఈ కృష్ణపై చర్యలు తీసుకోవాలని రాష్ట్ర నీటి పారుదలశాఖ కార్యదర్శికి భద్రాద్రి జిల్లా ఇరిగేషన్ చీఫ్‌ఇంజనీర్ శ్రీనివాస్‌రెడ్డి నివేదిక పంపారు. అంతకుముందు సదరు అధికారులకు ఆయన మెమోలు జారీ చేసి.. వివరణ తీసుకున్నారు. ఈ నివేదికపై ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. కాగా, పెదవాగు ఘటనకు ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణమని బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు ఆరోపించారు. ఇరిగేషన్ అధికారులు అప్రమత్తమై గేట్లు తెరిచి ఉంటే ఇంత నష్టం జరిగేది కాదన్నారు. ఇసుకమేట వేసిన ప్రతి ఎకరాకు రూ.25వేలు, పంట నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.10వేలు అందించాలని డిమాండ్ చేశారు.

నిరుద్యోగులపై రేవంత్ సర్కార్ కక్ష

» రాష్ట్రంలో హక్కులను కాలరాస్తున్నారు

» దాడులు అప్రజాస్వామికం: కేటీఆర్


హైదరాబాద్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): నిరుద్యోగులపై రేవంత్ రెడ్డి ప్రభుత్వం కక్ష గట్టిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. తెలంగాణ ఉద్యమ సమయంలో కాలేజీలు, యూనివర్సిటీల్లో ఉన్న భయానక వాతావరణం ఇప్పుడు తిరిగి పునరావృతం అవుతోందని చెప్పారు. పార్టీ ఫిరాయింపులు, నిరుద్యోగుల అంశాలపై శనివారం రాజ్‌భవన్‌లో గవర్నర్ సీపీ రాధాకృష్ణన్‌ను కేటీఆర్ నేతృత్వంలో బీఆర్ఎస్ నాయకులు కలిసి వినతిపత్రం సమర్పించారు. గవర్నర్‌తో సమావేశం అనంతరం కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో హక్కులను కాలరాస్తున్నారని, ఈ విషయాన్ని గవర్నర్ దృష్టికి తీసుకెళ్లామని చెప్పారు. ఉస్మానియా వర్సిటీ విద్యార్థులపై జరిగిన దాడుల గురించి గవర్నర్‌కు వివరించామని తెలిపారు. పార్టీ ఫిరాయింపుల చట్టాన్ని తుంగలో తొక్కుతూ తమ ఎమ్మెల్యేలను కాంగ్రెస్‌లో చేర్చుకున్న విషయాన్నీ వివరించామన్నారు. కాగా, మేడిగడ్డ బ్యారేజీ కుంగిపోయిందంటూ చిల్లర ప్రచారం చేసిన కాంగ్రెస్ ఇప్పుడు సిగ్గుతో తలదించుకోక తప్పదని కేటీఆర్ అన్నారు. అక్కడ జరిగింది చిన్న విషయమే తప్ప.. పెద్ద తప్పిదం కాదన్నారు. భారీ వరదను సైతం మేడిగడ్డ తట్టుకుని నిలబడడమే దీనికి నిదర్శనమన్నారు. త్వరలోనే తాము మేడిగడ్డ బ్యారేజీని సందర్శించి, ప్రజలకు వాస్తవాలు వెల్లడిస్తామన్నారు.

నిరుద్యోగులకు కాంగ్రెస్ దగా

» 2 లక్షల ప్రభుత్వ కొలువులు.. జాబ్ క్యాలెండర్ ఏమయ్యాయి..?

» గ్యారెంటీలు ప్రజలకు గుదిబండలు

» రాష్ట్రంలో మంత్రుల దోపిడీ: కిషన్‌రెడ్డి



ఇందిరాపార్కు వద్ద ధర్నాలో మాట్లాడుతున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

కవాడిగూడ/హైదరాబాద్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): అధికారంలోకి రాగానే రెండు లక్షల ఉద్యోగాల భర్తీ, జాబ్ క్యాలెండర్ ప్రకటిస్తామని గొప్పలు చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం.. ఆ హామీలను పూర్తిగా విస్మరించిందని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి మండిపడ్డారు. నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను అమలు చేసే దాకా బీజేపీ పోరాటం చేస్తుందని తెలిపారు. శనివారం ఇందిరా పార్కు ధర్నా చౌక్ వద్ద బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు మహేందర్ ఆధ్వర్యంలో నిరుద్యోగుల మహాధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడారు. విద్యార్థులకు ఐదు లక్షల విద్యా భరోసా కార్డులు ఏమైయ్యాయని ప్రశ్నించారు. నిరుద్యోగ భృతి, 18 ఏళ్లు నిండిన ప్రతి యువతికి ఎలక్ట్రిక్ స్కూటీ ఇస్తామని చెప్పిన రేవంత్‌రెడ్డి మాట తప్పారని అన్నారు. కాంగ్రెస్ గ్యారెంటీలు ప్రజలకు గుదిబండలుగా మారాయని అన్నారు. వంద రోజుల్లో హామీలను నెరవేరుస్తామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం ఏ ఒక్కటీ అమలు చేయడం లేదని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో మంత్రులు ఇష్టారాజ్యంగా దోచుకుంటున్నారని విమర్శించారు. ఎన్నికల ముందు నిరుద్యోగులకు అండగా ఉంటామని సమావేశాలు నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ నేతలు ఇప్పుడు వారిని దగ్గరకు కూడా రానివ్వడం లేదని ఎంపీ ఈటల రాజేందర్ మండిపడ్డారు. నిరసన తెలిపితే అరెస్టులు చేస్తున్నారని అన్నారు. హామీల అమలులో కాంగ్రెస్ సర్కారు విఫలమైందని బీజేపీఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి విమర్శించారు. కాగా, కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికీ జాబ్ క్యాలెండర్ విడుదల చేయలేదని.. గ్రూప్-1, 2 పోస్టులను పెంచలేదని బీజేవైఎం గవర్నర్‌కు ఫిర్యాదు చేసింది. నిరుద్యోగులకు రూ.4వేల చొప్పున భృతి ఇవ్వాలని, 9వేలకు పైగా పోస్టులతో కొత్తగా డీఎస్సీ నిర్వహించాలని డిమాండ్ చేసింది.

ఏఐతో ఖనిజాల అన్వేషణ

భారత్‌లో కృత్రిమ మేధ(ఏఐ), మెషీన్ లర్నింగ్ వంటి సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుని ఖనిజాల అన్వేషణ, మైనింగ్ రంగంలో పురోగతి సాధిస్తామని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. దేశం 2047 నాటికి వికసిత్ భారత్‌గా రూపొందడంలో ఖనిజాల పాత్ర కీలకం అవుతుందన్నారు. హైదరాబాద్ బేగంపేటలోని ఓ హోటల్‌లో శనివారం ఖనిజాన్వేషణ హ్యాకథాన్, నేషనల్ డిస్ట్రిక్ట్ మినరల్ ఫౌండేషన్ పోర్టల్‌ను ఆయన ప్రారంభించారు. క్రిటికల్ అండ్ స్ట్రాటజిక్ మినరల్ బ్లాక్స్ 2, 3 వేలం పాటల్లో ఎంపికైన 8మంది బిడ్డర్లకు ధ్రువీకరణ పత్రాలు అందించారు. అనంతరం 4వ విడత వేలాన్ని ప్రారంభించారు.

పెద వాగు బాధితులకు సంజయ్ ఫోన్

పెదవాగు వరదలో చిక్కుకుపోయి ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది సహకారంతో బయటపడిన నారాయణపురం గ్రామస్తులతో కేంద్ర మంత్రి బండి సంజయ్ ఢిల్లీ నుంచి ఫోన్‌లో మాట్లాడారు. ప్రాజెక్టు నిర్వహణ లోపం, సిబ్బంది కొరత వల్లే ఈ నష్టం వాటిల్లిందని గ్రామస్తులు సంజయ్ దృష్టికి తీసుకెళ్లారు. సమస్యను ఇరు రాష్ట్రాల ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని సంజయ్ వారికి హామీ ఇచ్చారు. రుణమాఫీ విషయంలో మ్యానిఫెస్టోలో లేని షరతులు అధికారం చేపట్టాక ఎలా వచ్చాయని బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి నిలదీశారు. రైతు భరోసాలోనూ మోసం చేసే ప్రయత్నం జరుగుతోందన్నారు.

కాళేశ్వరంతో ఏటా
25 వేల కోట్ల భారం

- అప్పులకు వడ్డీలే ఏటా 15 వేల కోట్లు చెల్లించాలి
- ఎక్కువ ఖర్చు చేస్తే ఎక్కువ కమీషన్లు వస్తాయనే.. ప్రాణహిత- చేవెళ్లను రద్దు చేసి రీడిజైన్ చేపట్టారు
- లక్ష కోట్ల ప్రజాధనం వృథా చేసిన బీఆర్ఎస్ సర్కారు
- లక్ష ఎకరాలు కూడా సాగులోకి రాలేదు: ఉత్తమ్
- కాళేశ్వరంపై ఎన్డీఎస్ఏ సమీక్షకు హాజరు



న్యూఢిల్లీ, జూలై 20 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం కోసం చేసిన అప్పులకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం ఏడాదికి రూ.9-10 వేల కోట్ల వడ్డీ కట్టాల్సి ఉంటుందని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి తెలిపారు. ప్రాజెక్టు పూర్తయి పంపులన్నీ పనిచేస్తే విద్యుత్తు ఖర్చు ఏడాదికి రూ.10 వేల కోట్ల దాకా అవుతుందన్నారు. ప్రాజెక్టు పూర్తి కావడానికి కాగ్ అంచనాల మేరకు వ్యయం చేస్తే.. వడ్డీకి ఏటా రూ.15 వేల కోట్లు, విద్యుత్తు ఖర్చు రూ.10 వేల కోట్లు కలిపి ఏటా రూ.25 వేల కోట్ల భారం రాష్ట్రంపై పడుతుందని చెప్పారు. శనివారం ఎన్డీఎస్ఏ ప్రధాన కార్యాలయంలో చైర్మన్ అనిల్ జైన్, సంస్థ అధికారులతో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, శాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జా, ప్రత్యేక కార్యదర్శి ప్రశాంత్ పాటిల్, సలహాదారులు ఆదిత్యనాథ్ దాస్, కాళేశ్వరం సీఈ సుధాకర్‌రెడ్డి, ఎన్డీఎస్ఏ నియమించిన నిపుణుల కమిటీ చైర్మన్ చంద్రశేఖర్ అయ్యర్ సమావేశమయ్యారు. అనంతరం తెలంగాణ భవన్‌లో మీడియా సమావేశంలో మంత్రి మాట్లాడారు. కేసీఆర్ నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టుతో ఇప్పటివరకు కొత్త ఆయకట్టు లక్ష ఎకరాలు కూడా రాలేదన్నారు. ఐదేళ్ల పాటు మొత్తం లెక్కలు తీస్తే.. కాళేశ్వరంలో మొత్తం పంప్ చేసిన నీళ్లు 65 టీఎంసీలు అని, ఏడాదికి సగటున 13 టీఎంసీలను గత ప్రభుత్వం ఎత్తిపోసిందని చెప్పారు. రీడిజైన్ పేరుతో ఎక్కువ పైసలు ఖర్చు పెడితే ఎక్కువ కమీషన్లు వస్తాయనే కక్కుర్తితోనే ప్రాణహిత- చేవెళ్ల ప్రాజెక్టును రద్దుచేసి మేడిగడ్డ నిర్మాణాన్ని చేపట్టారని ఆరోపించారు. తుమ్మిడిహట్టి వద్ద నీళ్లు లేవనే తప్పుడు వాదనను బీఆర్ఎస్ ఎత్తుకుందని మండిపడ్డారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై నాటి బీఆర్ఎస్ సర్కారు రూ.లక్ష కోట్ల ప్రజాధనం ఖర్చు చేసిందని మంత్రి ఉత్తమ్ ఆరోపించారు. తుమ్మిడిహట్టి వద్ద గత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ప్రారంభించిన ప్రాజెక్టును కట్టి ఉంటే విద్యుత్తు ఖర్చు ఏడాదికి రూ.వెయ్యి కోట్లు మాత్రమే అయ్యేదన్నారు. తాము ఈ ఐదేళ్లలోనే తుమ్మిడిహట్టి వద్ద ప్రాజెక్టును కట్టి తీరుతామని ప్రకటించారు. కాళేశ్వరం ప్రాజెక్టు తెలంగాణ ప్రజల కష్టార్జితంతో నిర్మితమైనదని, ఎంత వీలైతే అంత మరమ్మతు చేసి వినియోగంలోకి తీసుకొచ్చే ప్రయత్నం చేస్తామని అన్నారు. శనివారం భేటీలో ఎన్డీఎస్ఏ ఇచ్చిన సలహాలపై కేబినెట్‌లో చర్చిస్తామని తెలిపారు. ప్రపంచంలో ఏ బ్యారేజీలోనూ 3-4 టీఎంసీల కంటే ఎక్కువ నీళ్లు నిల్వ ఉండవని, కానీ.. కేసీఆర్ తానే ఆర్కిటెక్ట్ అయి.. 16 టీఎంసీల నీటిని నిల్వ ఉంచేలా కట్టారని విమర్శించారు. కాగా, ఎన్డీఎస్ఏ సమావేశంలో కాళేశ్వరం ప్రాజెక్టుపై రెండున్నర గంటలపాటు సుదీర్ఘంగా సమీక్షించారు. సోమవారం అధికారుల స్థాయిలో మరోసారి ప్రాజెక్టుపై చర్చలు జరిపి ముందుకెళ్లాలని నిర్ణయించినట్లు చెప్పారు.

ఉన్నత పాఠశాల బడి వేళల్లో మార్పు

హైదరాబాద్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలల పనివేళలు మారాయి. ప్రాథమిక పాఠశాల పనివేళల మాదిరిగానే హైస్కూల్ పనివేళలూ ఉంటాయి. శనివారం దాకా ఉన్నత పాఠశాలలు ఉదయం 9:30కు మొదలై సాయంత్రం 4:45 దాకా నడిచాయి! అయితే తాజా షెడ్యూల్ ప్రకారం సోమవారం నుంచి ఉన్నత పాఠశాలలు కూడా ఉదయం 9 గంటలకే ప్రారంభమవుతాయి. సాయంత్రం 4:15 గంటలకు పనివేళలు ముగుస్తాయి. ఈ మేరకు శనివారం విద్యాశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. దీనికి హైదరాబాద్- సికింద్రాబాద్ జంటనగరాల పరిధిలోని స్కూళ్లు మాత్రం మినహాయింపు! అంటే ఇక్కడ ఉదయం 8.45 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకే పాఠశాలలు కొనసాగుతున్నాయి.

అడవులు, జలపాతాల వద్ద పర్యాటకం పెంచండి

- పర్యాటకశాఖ సమీక్షలో ఉప ముఖ్యమంత్రి భట్టి

రాష్ట్రంలోని సుందరమైన అడవులు, జలపాతాల వద్ద పర్యాటకరంగ అభివృద్ధికి తగిన చర్యలు చేపట్టాలని ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్క సంబంధిత శాఖాధికారులను ఆదేశించారు. పర్యాటక, సాంస్కృతిక, క్రీడల శాఖ, ఎన్‌సీసీ బడ్జెట్ ప్రతిపాదనలపై ఆ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావుతో కలిసి ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ.. అదిలాబాద్, ఖమ్మం, మహబూబ్‌నగర్, వరంగల్ వంటి జిల్లాల్లో పచ్చని, దట్టమైన అడవులు, జలపాతాలు ఉన్నాయని, అలాంటి చోట్ల పర్యాటక ప్రదేశాలను అభివృద్ధి చేయాలన్నారు. పర్యాటకశాఖ సొంత ఆస్తులు, లీజులో ఉన్న ఆస్తుల వివరాలపై ఒక సమగ్ర నివేదికను ప్రభుత్వానికి సమర్పించాలని ఆదేశించారు. కళాకారులు ప్రజల జీవన విధానంలో మార్పులు తెచ్చే కార్యక్రమాలు చేపట్టాలని జూపల్లి కృష్ణారావు అన్నారు.

అచ్చమైన ప్రజాపాలనే లక్ష్యం:దుద్దిళ్ల

సరూర్‌నగర్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అచ్చమైన ప్రజాపాలన తీసుకురావాలన్నదే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని, ఆ దిశలో తమ ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకుంటున్నదని ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. ప్రతిపక్షాలు ఎన్ని అడ్డంకులు సృష్టించినా రాష్ట్రంలో తాము అమలు చేయబోయే ఆరు గ్యారంటీలు ఆగబోవని స్పష్టం చేశారు. రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గంలోని బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లో దాదాపు రూ.38 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులకు శనివారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ.. గత పాలకుల నిర్లక్ష్యంగా కారణంగా రాష్ట్రం అప్పుల్లో కూరుకుపోయినప్పటికీ తాము అభివృద్ధి, సంక్షేమం దిశగా అడుగులు వేస్తున్నామని పేర్కొన్నారు.

స్పెషాలిటీ ఆస్పత్రుల్లో యథాతథంగా ఆరోగ్యశ్రీ

- పెండింగ్ బకాయిలు విడుదల చేస్తామన్న సర్కారు
- నెలవారీగా చెల్లింపులు ఉంటాయని హామీ

హైదరాబాద్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా స్పెషాలిటీ ఆస్పత్రులలో ఆరోగ్యశ్రీ హెల్త్‌కేర్ ట్రస్ట్ ద్వారా ఆరోగ్యశ్రీ, ఈహెచ్ఎస్, ఆరోగ్య భద్రత కార్డులపై నగదు రహిత వైద్య సేవలను కొనసాగిస్తామని తెలంగాణ స్పెషాలిటీ ఆస్పత్రుల అసోసియేషన్ (తాషా) వెల్లడించింది. ఈ మేరకు ఓ ప్రకటన విడుదల చేసింది. రాష్ట్ర ప్రభుత్వం ఆరోగ్యశ్రీ ద్వారా ప్రైవేటు స్పెషాలిటీ ఆస్పత్రుల్లో అందిస్తున్న నగదు రహితసేవలకు చెల్లించాల్సిన బకాయిలు ఆలస్యం అవుతున్నాయి. జూలై 20 లోగా బకాయిలు చెల్లించకపోతే ఆరోగ్యశ్రీ సేవలను నిలిపివేస్తామని ఆస్పత్రుల యాజమాన్యాలు స్పష్టం చేశాయి. దీనిపై వైద్య ఆరోగ్యశాఖ మంత్రి రాజనర్సింహ స్పందించి ఆస్పత్రుల అసోసియేషన్ ప్రతినిధులతో చర్చించారు. ఆరోగ్యశ్రీ ద్వారా చెల్లించాల్సిన గత బకాయిలను సీఎం రేవంత్ రెడ్డితో చర్చించి త్వరలోనే అందజేస్తామన్నారు. అలాగే, ఆరోగ్యశ్రీ ద్వారా స్పెషాలిటీ ఆస్పత్రులు అందిస్తున్న నగదురహిత సేవలకు క్రమం తప్పకుండా నెలవారీగా చెల్లింపులు జరిగేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. దీంతో తాషా 20 నుంచి నగదు రహిత వైద్య సేవల నిలిపివేత నిర్ణయాన్ని ఉపసంహరించుకుంది.

నీటి పారుదల శాఖ బదిలీలపై వానల ఎఫెక్ట్

- కొంతకాలం నిలిపేస్తూ సర్కారు ఉత్తర్వులు

రాష్ట్రవ్యాప్తంగా భారీ వర్షాలు, వరదల ప్రభావం నీటి పారుదల శాఖలోని అధికారుల బదిలీలపై పడింది. వర్షాలతో పాటు నిర్మాణ, ప్రాధాన్యతా జాబితాలో చేర్చిన ప్రాజెక్టులు పూర్తయ్యేదాకా నీటి పారుదల శాఖలో బదిలీలను చేపట్టరాదని సర్కారు నిర్ణయించింది. ఈ మేరకు అన్ని క్యాడర్లలోని ఇంజనీర్లకు బదిలీల నుంచి మినహాయింపునిస్తూ నీటి పారుదల శాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జా శనివారం ఉత్తర్వులు జారీ చేశారు.

తహసీల్దార్లు, డీటీలు, సీనియర్ అసిస్టెంట్ల బదిలీలు

రాష్ట్ర వ్యాప్తంగా తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లు, సీనియర్ అసిస్టెంట్లను ప్రభుత్వం బదిలీ చేస్తూ సీసీఎల్ఏ నవీన్ మిత్తల్ ఉత్తర్వులు జారీ చేశారు. రెండేళ్లుగా ఒకే చోట విధులు నిర్వహిస్తున్నవారు ఈ బదిలీ జాబితాలో ఉన్నారు. అంతేకాక కొందర్ని స్పౌజ్ కేసుల నేపథ్యంలో బదిలీ చేశారు.

నేడు ఢిల్లీకి సీఎం రేవంత్

రాహుల్‌గాంధీతో భేటీ.. వరంగల్ సభకు ఆహ్వానం

హైదరాబాద్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి ఆదివారం ఢిల్లీకి వెళ్లనున్నారు. ఉదయం మహంకాళి అమ్మవారి దర్శనం చేసుకున్న అనంతరం మధ్యాహ్నం ఢిల్లీకి బయలుదేరి వెళతారు. ఆదివారం రాత్రి గానీ, సోమవారం గానీ ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీతో భేటీ కానున్నారు. ఎన్నికల సందర్భంగా రాష్ట్రంలోని రైతులకు రాహుల్‌గాంధీ ఇచ్చిన హామీ మేరకు రూ.2 లక్షల రుణమాఫీ అమలును సీఎం రేవంత్ ప్రారంభించిన విషయం తెలిసిందే. దీనిని పురస్కరించుకుని వరంగల్‌లో భారీ బహిరంగ సభను నిర్వహించాలని రేవంత్ నిర్ణయించారు. రాహుల్‌గాంధీతో భేటీ సందర్భంగా.. ఆ సభకు రావాలని ఆయనను ఆహ్వానించనున్నారు. అయితే అటు పార్లమెంటు, ఇటు అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ఏకకాలంలో జరగనున్న నేపథ్యంలో రాహుల్‌గాంధీ వెసులబాటును బట్టి బహిరంగ సభ తేదీని నిర్ణయించనున్నారు. ఇక ఢిల్లీ పర్యటనలో భాగంగా రేవంత్.. ఇతర కాంగ్రెస్ అధిష్ఠానం పెద్దలను కూడా కలిసి మంత్రివర్గ విస్తరణ, నామినేటెడ్ పదవుల నియామకాలపైనా సంప్రదింపులు జరిపే అవకాశం ఉన్నట్లు చెబుతున్నారు. దీంతో పాటు సీఎం పలువురు కేంద్ర మంత్రులనూ కలిసి.. రాష్ట్రంలో అభివృద్ధి పనులకు నిధులు కోరనున్నట్లు ప్రభుత్వ వర్గాలు తెలిపాయి.

విద్యా కమిషన్ చైర్మన్‌గా ఆకునూరి మురళి?



హైదరాబాద్, జూలై 20(ఆంధ్రజ్యోతి): విద్యా కమిషన్ చైర్మన్‌గా మాజీ ఐఏఎస్ ఆకునూరి మురళి పేరును ప్రభుత్వం పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. పాఠశాల విద్యపై గతంలో పని చేసిన అనుభవం ఉండటం, గతంలో ఐఏఎస్ అధికారిగా ప్రభుత్వ యంత్రాంగంపై అవగాహన ఉన్న నేపథ్యంలో ఆయన పేరును పరిశీలిస్తున్నట్లు సమాచారం. కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ శాశ్వత సభ్యుడు, రాహుల్‌గాంధీకి సన్నిహితుడైన కొప్పుల రాజుతో ఆకునూరి మురళికి మంచి సంబంధాలు ఉండడమూ ఆయనకు కలిసి వస్తుందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. విద్యా కమిషన్ ఏర్పాటు ప్రాథమిక దశలోనే ఉన్న సంగతి తెలిసిందే. ఈ కమిషన్ ఏర్పాటుకు అసెంబ్లీ, గవర్నర్ ఆమోదం తీసుకోవాల్సి ఉందని, ఇవి పూర్తయి ఏర్పాటు చేయడానికి ఇంకా సమయం పడుతుందని చెబుతున్నారు. ఈ కమిషన్ చైర్మన్‌కు క్యాబినెట్ హోదా కూడా ఉండటంతో మున్ముందు ఈ పోస్టుకు పోటీ పెరిగే అవకాశం కూడా ఉందంటున్నారు. కాగా ఉన్నత విద్యామండలి, రైతు కమిషన్ సహా మరికొన్ని కమిషన్లు, కార్పొరేషన్ల నియామకాలూ పెండింగ్‌లో ఉన్నాయి. వివిధ కార్పొరేషన్లు, కమిషన్లలో ఇటీవలే 36 మంది నియామకం పూర్తయిన సంగతి తెలిసిందే. మిగిలిన నామినేటెడ్ నియామకాలపైనా కసరత్తు జరుగుతోంది. ఈ నియామకాలపైనా త్వరలోనే అధిష్ఠానంతో సీఎం రేవంత్ రెడ్డి చర్చించి అనుమతులు తీసుకోనున్నట్లు పార్టీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది.

జూన్‌లో జాబ్‌మేళా

(మొదటిపేజీ తరువాయి)

అండగా నిలుస్తుందనే సంకేతాలివ్వడానికి, నిరుద్యోగుల్లో నమ్మకం, విశ్వాసం కల్పించడానికే 'రాజీవ్‌గాంధీ సివిల్స్ అభయహస్తం' పథకాన్ని ప్రారంభించామని తెలిపారు. 'కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్)' కింద సింగరేణి సంస్థ సమకూర్చిన నిధులతో చేపట్టిన ఈ పథకాన్ని ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్క, పలువురు మంత్రులతో కలిసి సీఎం రేవంత్‌రెడ్డి శనివారం ప్రారంభించారు. ఈ పథకం కింద.. యూపీఎస్సీ సివిల్స్ ప్రిలిమినరీ పరీక్షలో ఉత్తీర్ణులై.. మెయిన్స్ రాసే అభ్యర్థులకు ఈ పథకం కింద రూ.లక్ష సహాయాన్ని అందించనున్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ మాట్లాడుతూ.. సహాయం అందుకునే అభ్యర్థులంతా కచ్చితంగా సివిల్స్‌కు ఎంపికై తెలంగాణ ప్రజలకు సేవ చేసే అవకాశం పొందాలని ఆకాంక్షిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రం నుంచి ఎక్కువ మంది అఖిల భారత సర్వీసులకు ఎంపిక కావాలన్నారు. వెనుకబడిన రాష్ట్రాలుగా పేరున్న బిహార్, రాజస్థాన్ నుంచి అత్యధిక మంది ఐఏఎస్‌లు ఎంపికవుతారని, ఆ రాష్ట్రాలను ఆదర్శంగా తీసుకొని రాణించాలని పిలుపునిచ్చారు. రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డు, బ్యాంకింగ్ నియామకాల్లో బిహార్ రాష్ట్ర అభ్యర్థుల ప్రాతినిధ్యం ఎక్కువగా ఉందన్నారు. 'కేంద్ర సర్వీసుల్లో ఉంటే రాష్ట్రానికి మేలు చేసే అవకాశం ఉంటుంది. మీ గెలుపులో మీ భవిష్యత్తే కాకుండా.. రాష్ట్ర భవిష్యత్తు కూడా ముడిపడి ఉంది" అని సీఎం అన్నారు.



'రాజీవ్‌గాంధీ సివిల్స్ అభయహస్తం' పథకాన్ని ప్రారంభిస్తున్న సీఎం రేవంత్, డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు పొంగులేటి, జూపల్లి, సీఎస్ శాంతికుమారి

ఉద్యోగాల కోసమే తెలంగాణ ఉద్యమం..

నీళ్లు, నిధులు, నియామకాల కోసమే తెలంగాణ రాష్ట్ర ఉద్యమం జరిగిందని, తెలంగాణ పోరాటానికి పర్యాయపదం నిరుద్యోగ సమస్య అని సీఎం రేవంత్ పేర్కొన్నారు. ఉస్మానియా, కాకతీయ యూనివర్సిటీలకి చెందిన వేలాది మంది విద్యార్థుల పోరాటంతో తెలంగాణ ఉద్యమం ఉవ్వెత్తున లేచిందన్నారు. అందుకే తమ ప్రభుత్వం నిరుద్యోగ సమస్య పరిష్కారానికే తొలి ప్రాధాన్యం ఇచ్చిందని తెలిపారు. అధికారంలోకి రాగానే.. ప్రమాణం చేసిన చోటునుంచే 90 రోజుల్లో 30 వేల ఉద్యోగ ఖాళీలను భర్తీ చేశామన్నారు. గత పదేళ్లలో.. ఇచ్చిన నోటిఫికేషన్ల ప్రకారం నియామకాలు జరగలేదని, యుక్త వయసులో నిరుద్యోగులకు తీరని నష్టం జరిగిందని, పరీక్షలు రాసి, ఫలితాలు వచ్చేలోపే ప్రశ్నాపత్రాలు జిరాక్స్ సెంటర్లకు చేరాయని అన్నారు. కొత్త ప్రభుత్వం ఏర్పడగానే టీజీపీఎస్సీని రద్దుచేసి, యూపీఎస్సీ చైర్మన్‌ను కలిసి, నిర్వహణలో లోపాల్లేకుండా పరీక్షలు పెట్టామని వివరించారు. టీజీపీఎస్సీని పునర్వ్యవస్థీకరించి, యూపీఎస్సీ తరహాలో మార్పులు చేసి, వెనువెంటనే నోటిఫికేషన్‌లు ఇచ్చామని గుర్తు చేశారు. గ్రూప్-1 ప్రిలిమ్స్ పూర్తిచేశామని, 11 వేల ఉపాధ్యాయ పోస్టులకు డీఎస్సీ పరీక్షలు నిర్వహిస్తున్నామని వెల్లడించారు. అంతేకాకుండా విద్యార్థుల విన్నపం మేరకు గ్రూప్-2, గ్రూప్-3 పరీక్షలు వాయిదా వేశామని, వచ్చే నవంబరులో వీటిని నిర్వహిస్తామని తెలిపారు.

పథకం కింద సహాయం పొందేందుకు ఇవీ అర్హతలు..

- జనరల్(ఈడబ్ల్యూఎస్), బీసీ, ఎస్సీ, ఎస్టీ సామాజిక వర్గానికి చెందిన అభ్యర్థులు అర్హులు.
- అభ్యర్థులు తెలంగాణ వాసులై ఉండాలి.
- యూపీఎస్సీ ప్రిలిమినరీ పరీక్షలో ఉత్తీర్ణులు కావాలి.
- కుటుంబ వార్షిక ఆదాయం రూ.8 లక్షల లోపు ఉండాలి.
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల శాశ్వత ఉద్యోగులు పథకానికి అనర్హులు.
- అభ్యర్థులు ఒక్కసారి మాత్రమే పథకం కింద సహాయం పొందడానికి అర్హులు.
- సహాయం కోరేవారు సింగరేణి సంస్థ వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్‌లో దరఖాస్తులు సమర్పించాలి.

మెయిన్స్ రాసేవారంతా ఉత్తీర్ణులు కావాలి..

తెలంగాణ బిడ్డలు బాగా మేధస్సు కలిగిన వారని ఉపముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క అన్నారు. వీరికి ప్రభుత్వం తరఫున ప్రోత్సాహం, ఆర్థిక వెసులుబాటు ఇస్తామన్నారు. మెయిన్స్‌కు ప్రిపేర్ కావడానికి వీలుగా ఒక్కొక్కరికి రూ.లక్ష సహాయం అందిస్తున్నామని, మెయిన్స్ రాసేవారంతా తప్పనిసరిగా ఉత్తీర్ణులు కావాలని ఆకాంక్షించారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి మాట్లాడుతూ సివిల్స్ విజేతలు తమ నడవడికతో పేద వర్గాలకు మేలు చేయాలని, వారి ఆకాంక్షల్ని నెరవేర్చాలని సూచించారు. కాగా, తాను సివిల్స్‌కు ప్రిపేర్ అయ్యే సమయంలో కోచింగ్ కోసం రూ.2 వేలు లభించక ఇబ్బంది పడ్డానని సింగరేణి సీఎండీ ఎన్.బలరాం అన్నారు. 50 రూపాయల విలువ చేసే పుస్తకం కొనుక్కునేందుకు వారం రోజులు ఎదురుచూడాల్సిన పరిస్థితి ఉండేదన్నారు. ఈ సందర్భంగా 2023లో సివిల్స్‌కు ఎంపికైన 41 మంది అభ్యర్థులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు తుమ్మల నాగేశ్వర్‌రావు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, సీతక్క, జూపల్లి కృష్ణారావు, ఎంపీలు రఘురామిరెడ్డి, చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.

గృహ నిర్మాణం, రవాణా ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా వికాస్‌రాజ్

- జీఏడీ ద్వారా కేంద్ర ప్రభుత్వంతో సమన్వయానికి అదనపు బాధ్యతలు

హైదరాబాద్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి(సీఈవో) బాధ్యతల నుంచి ఇటీవలే రాష్ట్ర ప్రభుత్వ సేవల్లోకి వచ్చిన సీనియర్ ఐఏఎస్ (1992 బ్యాచ్) అధికారి వికాస్‌రాజ్‌కు అత్యంత ప్రాధాన్యమైన గృహ నిర్మాణ, రవాణా శాఖల బాధ్యతలను ప్రభుత్వం అప్పగించింది. ప్రస్తుతం వెయిటింగ్‌లో ఉన్న ఆయనను గృహ నిర్మాణ, రవాణా శాఖల ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా నియమించింది. ఈమేరకు రాష్ట్రంలోని వెయిటింగ్‌లో ఉన్న ఐఏఎస్ అధికారులకు పోస్టింగులు ఇస్తూ, కొంత మందిని బదిలీ చేస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఉత్తర్వులను జారీ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని చేపట్టబోతోంది. ఇది ప్రభుత్వానికి అత్యంత కీలకమైన, ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టు. పైగా.. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం విషయంలో సమన్వయం చేసుకోవాల్సి ఉంటుంది. అందుకే ప్రభుత్వం వికాస్‌రాజ్‌ను గృహ నిర్మాణ, రవాణా శాఖల ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా నియమించింది. కేంద్రంతో సమన్వయానికి, స్మార్ట్ గవర్నెన్స్ వ్యవహారాల నిర్వహణ కోసం ఆయనకు సాధారణ పరిపాలనా శాఖ(జీఏడీ) అదనపు బాధ్యతలను కూడా అప్పగించింది. ప్రస్తుతం వెయిటింగ్‌లో ఉన్న సీనియర్ ఐఏఎస్ బెన్హర్ మహేశ్ దత్ ఎక్కాను సాధారణ పరిపాలనా శాఖ(జీఏడీ) ముఖ్యకార్యదర్శి(సర్వీసెస్)గా ప్రభుత్వం నియమించింది. గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి ఎ.శరత్‌కు గిరిజన సంక్షేమ శాఖ కమిషనర్‌గా, క్రీడల శాఖ డైరెక్టర్ కొర్రా లక్ష్మికి రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఎండీగా అదనపు బాధ్యతలు అప్పగించింది. రవాణా, రోడ్లు-భవనాల శాఖ జాయింట్ సెక్రటరీ ఎస్.హరీశ్‌కు రెవెన్యూ శాఖలోని విపత్తుల నిర్వహణ విభాగం ప్రత్యేక కార్యదర్శిగా అదనపు బాధ్యతలు అప్పగించింది. హనుమకొండ అదనపు కలెక్టర్(స్థానిక సంస్థలు) రాధికా గుప్తాను మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్(స్థానిక సంస్థలు)గా బదిలీ చేసింది.

లక్షన్నర కోట్లతో మూసీ అభివృద్ధి

- ప్రపంచ స్థాయి పర్యాటక ప్రాంతంగా చేస్తాం
- హైదరాబాద్‌ను విశ్వనగరంగా తీర్చిదిద్దుతాం
- ఎక్కడి నుంచి ఎవరొచ్చినా అక్కున చేర్చుకుంటాం : సీఎం రేవంత్
- గోపనపల్లి ఫ్లైఓవర్‌ను ప్రారంభించిన సీఎం

హైదరాబాద్ సిటీ, జూలై 20 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో గండిపేట, హిమాయత్‌సాగర్ నుంచి గేట్లు ఎత్తితే నల్లగొండ వరకు మూసీ నీళ్లు స్వచ్ఛంగా ఉండేలా చర్యలు తీసుకుంటామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారు. మూసీ పరివాహక అభివృద్ధికి ఐదేళ్లలో రూ.లక్షన్నర కోట్లతో ప్రణాళికలు సిద్ధం చేసి త్వరలో పనులు ప్రారంభిస్తామని తెలిపారు. హైదరాబాద్ అభివృద్ధి చెందినప్పుడే, శాంతిభద్రతలు కాపాడినప్పుడే ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన వారికి విద్య, ఉపాధి అవకాశాలు కల్పించినప్పుడే విశ్వనగరంగా మారుతుందన్నారు. హైదరాబాద్‌ను విశ్వనగరంగా తీర్చిదిద్ది తెలంగాణ రాష్ట్రాన్ని అభివృద్ధి చేసుకోవడమే తమ బాధ్యత అని స్పష్టం చేశారు. శనివారం మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డితో కలిసి శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని గోపనపల్లిలో ఫ్లైఓవర్‌ను సీఎం రేవంత్‌రెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. ప్రస్తుతం మూసీ అంటే ముక్కు మూసుకునే పరిస్థితి ఉందని, రాబోయే ఐదేళ్లలోపు మూసీని చూసేందుకు ప్రపంచం నలుమూలల నుంచి పర్యాటకులు వచ్చేలా మారుస్తామని అన్నారు. హైటెక్ సిటీని చూస్తే ఓ సీఎం గుర్తుకు వస్తారని, ఐటీ, అంతర్జాతీయ ఎయిర్‌పోర్టు, ఔటర్ రింగ్ రోడ్డు చూస్తే ఇంకొక ప్రభుత్వం గుర్తుకు వస్తుందని, మూసీ అభివృద్ధిని చూస్తే తమ ప్రజా ప్రభుత్వం గుర్తుకు వచ్చేలా చేస్తామని ప్రకటించారు.

65 శాతం ఆదాయం హైదరాబాద్ నుంచే..

తెలంగాణ రాష్ట్రానికి 65 శాతం ఆదాయం హైదరాబాద్ నుంచే వస్తోందని సీఎం రేవంత్ తెలిపారు. ఇతర జిల్లాలు, రాష్ట్రాలు, దేశాల నుంచి ఉపాధి అవకాశాల కోసం ఎంతోమంది ఇక్కడికి వచ్చి స్థిర నివాసం ఏర్పాటు చేసుకుంటున్నారని అన్నారు. ఎక్కడి నుంచి ఎవరు వచ్చినా.. అక్కున చేర్చుకొని ఉపాధి పొందే అవకాశం కల్పిస్తున్నామని, ఇక్కడి ప్రజలూ సహకరిస్తున్నారని పేర్కొన్నారు. దీంతో నగరం వేగంగా అభివృద్ధి చెందుతోందన్నారు. వైఎస్ ఉన్నప్పుడే హైదరాబాద్‌కు కృష్ణా, గోదావరి నదీ జలాలు తీసుకొచ్చారని, పీవీఎన్ఆర్ ఫ్లై ఓవర్ నిర్మించారని, చంద్రబాబు ప్రణాళికలను కొనసాగిస్తూ ఔటర్ రింగ్ రోడ్డు నిర్మించారని గుర్తు చేశారు. గోపనపల్లి ప్రాంతంలో ప్రస్తుతం ఎకరం భూమి రూ.వంద కోట్ల దాకా పలుకుతోందన్నారు. ఔటర్ రింగ్ రోడ్డు లోపలి ప్రాంతాన్ని కోర్ అర్బన్ ఏరియా కింద అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. హైదరాబాద్‌లో శాంతిభద్రతలు కాపాడేందుకు, ట్రాఫిక్ సమస్యలు పరిష్కరించేందుకు, వర్షాలు వచ్చినప్పుడు ఇబ్బందులు రాకుండా చూసేందుకు హైడ్రా పేరిట నూతన వ్యవస్థను ఏర్పాటు చేశామని తెలిపారు.

మీ కష్టానికి గుర్తింపు ఉంటుంది

హైదరాబాద్ అభివృద్ధిలో భాగస్వాములవ్వండి.. కమ్మవారికి అవకాశాలిచ్చి, నైపుణ్యాలను ప్రోత్సహిస్తాం

- మన కులాన్ని ప్రేమిద్దాం... ఇతరులను గౌరవిద్దాం
- ప్రాంతాలకతీతంగా పనిచేసే నేతలను ప్రోత్సహిద్దాం
- వెంకయ్య, జైపాల్ జంట కవుల్లా పని చేసేవారు
- కమ్మ గ్లోబల్ ఫెడరేషన్ సదస్సులో సీఎం రేవంత్



కమ్మ గ్లోబల్ ఫెడరేషన్ సదస్సులో సీఎం రేవంత్‌కు జ్ఞాపికను అందజేస్తున్న కేజీఎఫ్ వ్యవస్థాపక అధ్యక్షుడు జెట్టి కుసుమకుమార్

హైదరాబాద్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): కమ్మవారంటే అమ్మ లాంటి వారని, వ్యవసాయం చేసి, మట్టి నుంచి బంగారం పండించి, పది మందికి సాయం చేసే గుణం ఉన్నవారని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. సారవంతమైన నేల, సమృద్ధిగా నీరు లభించే చోట కచ్చితంగా కమ్మవాళ్లు ఉన్నట్టేనని వ్యాఖ్యానించారు. కష్టపడడం, పది మందిని ఆదుకోవడం ఆ సామాజిక వర్గం నేపథ్యమని కొనియాడారు. శనివారం హైదరాబాద్ హెచ్ఐసీసీలో ప్రారంభమైన రెండు రోజుల కమ్మ గ్లోబల్ ఫెడరేషన్(కేజీఎఫ్) సమావేశంలో తొలిరోజు కార్యక్రమానికి సీఎం రేవంత్ హాజరై, జ్యోతి ప్రజ్వలన చేసి, సమావేశాన్ని ప్రారంభించారు. ముఖ్యమంత్రితో పాటు ఈ కార్యక్రమానికి మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, పొంగులేటి శ్రీనివాసరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ, కమ్మ గ్లోబల్ ఫెడరేషన్‌ను ఏర్పాటు చేయాలనే ఆలోచన రెండు సంవత్సరాల క్రితమే పురుడు పోసుకుందని చెప్పారు. ఇలాంటి ఒక వేదికను ఏర్పాటు చేయాలని కుసుమ కుమార్‌కు ఎప్పుడో చెప్పానని, ఇప్పటికి రూపు దాల్చిందని అన్నారు. కమ్మ గ్లోబల్ ఫెడరేషన్‌ను మంచి సంప్రదాయాలతో, సమాజానికి ఉపయోగపడే విధంగా ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. హైదరాబాద్ మహానగరాన్ని విశ్వనగరంగా మార్చడానికి అవసరమైన ప్రణాళికలో కేజీఎఫ్ భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. కమ్మ సామాజిక వర్గంలోని నిపుణుల నైపుణ్యాలను అన్ని రకాలుగా ప్రోత్సహించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని ప్రకటించారు. హైదరాబాద్ ప్రపంచంతో పోటీ పడాలంటే.. ప్రపంచంలో అన్ని రంగాల్లో రాణించిన కమ్మ వారికి ఇక్కడ అవకాశాలు కల్పించాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. తమ ప్రభుత్వానికి ఎలాంటి భేషజాలు లేవని, ఎవరి కులాలను వారు అభిమానించుకుంటూనే, ఇతర కులాలను గౌరవించుకుంటూ వెళ్తున్నామని స్పష్టం చేశారు. రాష్ట్రంలో కమ్మ వారి కష్టానికి గుర్తింపు, అవకాశాలు ఉంటాయని చెప్పారు. కార్యక్రమానికి వివిధ రాష్ట్రాలు, దేశాల నుంచి కమ్మ సంఘ ప్రతినిధులు, రాజకీయ నాయకులు, పారిశ్రామికవేత్తలు ఈ సమావేశానికి హాజరయ్యారు.

ఎన్టీఆర్ ఒక బ్రాండ్

రాజకీయాల్లో ఎన్టీఆర్ ఒక బ్రాండ్‌ను క్రియేట్ చేశారని, ఎంతో మంది నాయకులను తయారు చేశారని రేవంత్ అన్నారు. ఆయన రాజకీయాలకు, లీడర్‌షిప్‌కు బ్రాండ్‌గా మారారని తెలిపారు. ఆయనను అవమానించేలా మాట్లాడుతున్న వారికి అవకాశం ఇచ్చిందీ ఎన్టీఆరేనని చెప్పారు. ఎన్టీఆర్ సంకీర్ణ రాజకీయాల వలనే ప్రస్తుతం దేశాన్ని ఏలుతున్న వారికి అవకాశాలు వచ్చాయని ప్రస్తావించారు. టీడీపీ మద్దతుతోనే హనుమకొండలో బీజేపీ అభ్యర్థి గెలిచారని, తర్వాత కాలంలో వచ్చిన ఫ్రంట్‌లకు ఊపిరులూదింది ఎన్టీఆర్, చంద్రబాబులేనని చెప్పారు. తాను ఏ వేదిక మీద ఉన్నా కమ్మవారు తనను అభిమానిస్తారని తెలిపారు.

5 ఎకరాల్లో కమ్మ భవనం

కమ్మ సంఘానికి గతంలో 5 ఎకరాలను కేటాయించినా ఆ భూమికి అన్నీ లిటిగేషన్స్ ఉన్నాయని ముఖ్యమంత్రి చెప్పారు. వాటన్నింటినీ పరిష్కరించి, భవనం నిర్మించుకోవడానికి అన్ని రకాల అనుమతులు ఇస్తామని తెలిపారు. కమ్మ పేదలతో పాటు ఇతర బడుగు, బలహీన వర్గాల కులాలకు చెందిన వారిని ఆదుకోవడానికి కూడా కమ్మ సంఘం ముందుకు రావాలని సీఎం విజ్ఞప్తి చేశారు.

ఢిల్లీలో నాయకత్వ లోపాన్ని భర్తీ చేద్దాం

వెంకయ్య నాయుడు, జైపాల్‌రెడ్డి ఇద్దరూ జంట కవుల్లాంటి వారని రేవంత్ వ్యాఖ్యానించారు. వెంకయ్య నాయుడు రాష్ట్రపతి కావాలని పార్టీలకు అతీతీతంగా అందరం ఆకాంక్షించామన్నారు. వెంకయ్య నాయుడు, జైపాల్‌రెడ్డి, పీవీ నర్సింహారావు, ఎన్టీఆర్‌లు గతంలో ఢిల్లీలో కీలకపాత్ర పోషించారని గుర్తు చేశారు. ప్రస్తుతం ఢిల్లీలో తెలుగువారి నాయకత్వ లోపం కనిపిస్తోందని చెప్పారు. కులానికి, ప్రాంతానికి అతీతంగా తెలుగువారి అభివృద్ధి కోసం పనిచేసే బలమైన నాయకత్వాన్ని మళ్లీ ఢిల్లీలో తీసుకురావాల్సిన సందర్భం వచ్చిందని రేవంత్ వ్యాఖ్యానించారు. అలాంటి నాయకులను అందరం ప్రోత్సహించాలని పిలుపునిచ్చారు.

నిరసనను నియంత్రిస్తే డిసెంబరు 3 ఫలితాలు

నిరసన తెలపడం ఒక హక్కు అని, అందుకు అవకాశమివ్వడం ప్రభుత్వాల బాధ్యత అని రేవంత్ పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమ సమయంలో అమెరికాలోనివైట్‌హౌస్ ముందు నిరసన తెలిపారని, అందుకు అక్కడి ప్రభుత్వం అనుమతి ఇచ్చిందని గుర్తు చేశారు. తెలంగాణలో గత ప్రభుత్వం నిరసన తెలిపేవారిని నిర్బంధించే ప్రయత్నం చేసిందని చెప్పారు.నిరసన హక్కును నిర్బంధిస్తానంటే సమాజం ఒప్పుకోదని, వాటి ఫలితాలు ఎలా ఉంటాయన్న దానికి గత డిసెంబర్ 3న వచ్చిన ఫలితాలే నిదర్శనమని చెప్పారు.

రేవంత్ కాలేజీ ఫ్రెండ్: కుసుమకుమార్

స్వాతంత్ర్యానికి పూర్వమే కమ్మ వారు సంఘంగా ఏర్పడి, బడుగు బలహీన వర్గాల వారిని ఆదుకున్నారని కేజీఎఫ్ వ్యవస్థాపక అధ్యక్షుడు జెట్టి కుసుమకుమార్ అన్నారు. వివిధ రాష్ట్రాలు, దేశాల్లోని కమ్మ వారందరినీ ఒక వేదిక పైకి తీసుకువస్తామని ప్రకటించారు. రేవంత్‌రెడ్డి, తాను కాలేజీలో మిత్రులమని, ఆ తరువాత రాజకీయ సహచరులుగా ఉన్నామని తెలిపారు.

రేవంత్‌ను సీఎంగా చూడడం నా అదృష్టం: సత్యవాణి

రేవంత్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా చూడడం తన అదృష్టంగా భావిస్తున్నట్టు భారతీయం సత్యవాణి తెలిపారు. 13వ శతాబ్దానికి చెందిన ప్రముఖ వ్యక్తి ప్రోలయ్య కాపయ్య అనే వ్యక్తి పేరు మీదుగానే పోలవరం పేరు వచ్చిందని, అక్కడే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పోలవరం ప్రాజెక్టును నిర్మిస్తున్నదని తెలిపారు. పోలవరం ప్రాజెక్టు దగ్గర ఆయన విగ్రహం పెట్టాలని ఏపీ సర్కారును సభాముఖంగా కోరారు.

జూకంటి జగన్నాథంకు దాశరథి పురస్కారం

» రేపు కృష్ణమాచార్య జయంతి సందర్భంగా సత్కారం



హైదరాబాద్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): అభ్యుదయ కవి దాశరథి కృష్ణమాచార్య జయంతి సందర్భంగా ఏటా ఇచ్చే పురస్కారాన్ని ఈ ఏడాది ప్రముఖ కవి, రచయిత జూకంటి జగన్నాథంకు అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. దాశరథి జయంతిని పురస్కరించుకుని సోమవారం ఏర్పాటు చేసే కార్యక్రమంలో జూకంటిని సర్కారు సత్కరించనుంది. ఈ సందర్భంగా ఆయనకు రూ.1,01,116 నగదు బహుమతితో పాటు జ్ఞాపికను అందజేస్తుంది. పురస్కారానికి ఎంపికైన జూకంటి జగన్నాథంకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి జూకంటి స్వగ్రామం. 2020 సంవత్సరానికి గాను జ్ఞానపీఠ పురస్కార గ్రహీత డాక్టర్ సి.నారాయణరెడ్డి జాతీయ కవిత పురస్కారాన్ని అందుకున్నారు. తెలంగాణ మలి దశ ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్నారు.

మేడారం ప్రధాన పూజారి మృతి



ముత్తయ్య (ఫైల్)

మేడారం, జూలై 20: ములుగు జిల్లా తాడ్వాయి మండలంలోని మేడారం వనదేవతల ప్రధాన పూజారి మల్లెల ముత్తయ్య(50) శనివారం మృతి చెందారు. కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయనను కుటుంబ సభ్యులు హనుమకొండలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించి చికిత్స చేయించారు. డిశ్చార్జ్ అయ్యాక తీవ్ర అస్వస్థతకు గురైన ఆయన శనివారం ఉదయం మృతి చెందారు. ముత్తయ్యకు భార్య నాగమణి, కూతురు సాయిప్రసన్న, కొడుకు సాయిచరణ్ ఉన్నారు. ముత్తయ్య మృతి పట్ల రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధిశాఖ మంత్రి సీతక్క సంతాపం తెలిపారు. ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతి ప్రకటించారు. మేడారం మహాజాతరలో వనదేవతలను గద్దెలకు తీసుకొచ్చే క్రమంలో సమ్మక్క పూజా కార్యక్రమాల్లో ముత్తయ్య కీలకపాత్ర పోషించేవారు. జాతర సమయంలో మహాఘట్టం ప్రారంభం నుంచి చిలకలగుట్ట పైకి వెళ్లి కుంకుమ భరణి తీసుకురావడం, దేవతను వనప్రవేశం తదితర కార్యక్రమాల్లో పాల్గొనేవారు.

కవి, గాయకుడు జయరాజ్‌కు బ్రెయిన్ స్ట్రోక్

» నిమ్స్‌కు తరలింపు

» మెరుగైన చికిత్స అందించాలన్న మంత్రి దామోదర

హైదరాబాద్ సిటీ, జూలై 20 (ఆంధ్రజ్యోతి): కవి, గాయకుడు జయరాజ్.. తీవ్ర అస్వస్థతతో నిమ్స్‌లో చేరారు. శుక్రవారం ఆయనకు బ్రెయిన్ స్ట్రోక్ రావడంతో ఆస్పత్రిలో చేర్పించారు. నిమ్స్‌లోని మెట్టు రంగారెడ్డి బ్లాక్‌లో ఆయన చికిత్స పొందుతున్నారు. జయరాజ్ ఆరోగ్యం నిలకడగా ఉందని ఆస్పత్రి వర్గాలు తెలిపాయి. శనివారం జయరాజ్ ఆరోగ్య పరిస్థితిపై మంత్రి దామోదర రాజనర్సింహ ఆరా తీశారు. నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ బీరప్పను వివరాలు అడిగి తెలుసుకున్నారు. జయరాజ్‌కు మెరుగైన చికిత్స అందించాలని మంత్రి ఆదేశించారు.

బడ్జెట్ రూ.2.90 లక్షల కోట్లు?

(మొదటిపేజీ తరువాయి)

కోసం ప్రవేశపెట్టిన 'ఓట్-ఆన్-అకౌంట్' బడ్జెట్ గడువు ఈ నెల 31తో ముగియనుండడంతో పూర్తి స్థాయి బడ్జెట్‌ను ప్రవేశపెట్టాల్సిన అనివార్యత ఏర్పడింది. ఈ మేరకు శాఖలవారీగా బడ్జెట్ ప్రతిపాదనలను డిప్యూటీ సీఎం, ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్క ఇప్పటికే సమీక్షించారు. ఆయా శాఖలు తమ ప్రాధమ్యాలను వివరించగా.. ప్రభుత్వం కూడా బడ్జెట్‌పై ఒక అంచనాకు వచ్చింది. ఈ నెల 22న ఆర్థిక శాఖ అధికారులతో భేటీ కానున్న సీఎం రేవంత్‌రెడ్డి.. శాఖలు, పథకాల వారీగా కేటాయించిన పద్దులను పరిశీలించి ఓకే చెప్పనున్నారు. ఈ నెల 25న ఉదయం క్యాబినెట్ సమావేశంలో 2024-25 పూర్తి స్థాయి బడ్జెట్‌కు ఆమోదం తెలపనున్నారు. ఆ రోజు ఉదయం 9 గంటలకు అసెంబ్లీలోని కమిటీ హాల్-1లో మంత్రి మండలి సమావేశమవుతుందని సీఎస్ శాంతికుమారి శనివారం ఉత్తర్వులను జారీ చేశారు. అదే రోజు(25న) అసెంబ్లీల్లో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఆర్థిక మంత్రి హోదాలో బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నారు. శాసన మండలిలో మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ప్రవేశపెట్టే అవకాశం ఉంది. కాగా, కేంద్ర ప్రభుత్వం ఈ నెల 23న పార్లమెంటులో పూర్తి స్థాయి బడ్జెట్‌ను ప్రవేశపెట్టనుంది. అందులో రాష్ట్రానికి వచ్చే కేంద్ర గ్రాంట్లు, కేంద్ర సౌజన్య పథకాలు(సీఎస్ఎస్), పన్నుల్లో వాటాలకు సంబంధించిన నిధులను పరిశీలించిన తర్వాత.. స్వల్ప మార్పులతో రాష్ట్ర బడ్జెట్‌కు తుదిరూపు ఇవ్వనున్నారు. 2023-24 ఆర్థిక సంవత్సరానికి అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.2,90,396కోట్లతో బడ్జెట్‌ను ప్రవేశపెట్టింది. కానీ... కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత గత ప్రభుత్వ బడ్జెట్‌పై తీవ్ర విమర్శలు చేసింది. వాస్తవ రాబడులను పరిగణనలోకి తీసుకోకుండా భారీ బడ్జెట్లను ప్రవేశపెట్టిందని ఆరోపించింది. ఆ నేపథ్యంలోనే కాంగ్రెస్ ప్రభుత్వం.. వాస్తవ రాబడులను పరిగణలోకి తీసుకుని రూ.2,75,891 కోట్లతో 'ఓట్-ఆన్-అకౌంట్' బడ్జెట్ ప్రవేశపెట్టింది. ప్రస్తుతం అమలు చేస్తున్న గ్యారెంటీలు, రుణ మాఫీ నేపథ్యంలో పూర్తి స్థాయి బడ్జెట్‌ను మళ్లీ రూ.2.90 లక్షల కోట్ల వరకు పెంచనుందని తెలిసింది.

వ్యవసాయ శాఖదే భారీ పద్దు

ఈ సారి బడ్జెట్‌లోనూ వ్యవసాయ శాఖకే భారీ కేటాయింపులు చేయనున్నారు. ముఖ్యంగా రుణమాఫీకి రూ.31వేల కోట్లు, రైతు భరోసాకు రూ.15వేల కోట్లు, రైతు బీమాకు మరో రూ.7వేల కోట్ల వరకు అవసరమవుతాయన్న అంచనాలున్నాయి. మరోవైపు.. పాత బకాయిల చెల్లింపు, పాలమూరు-రంగారెడ్డి వంటి కీలక ప్రాజెక్టులకు నిధుల ఆవశ్యకత దృష్ట్యా సాగునీటి పారుదల శాఖ ఈసారి రూ.19వేల కోట్ల వరకు ప్రతిపాదనలను సమర్పించింది. ఇందులో రూ.11వేల కోట్ల వరకు కేటాయించే అవకాశాలున్నాయి. ఆరు గ్యారెంటీల్లోని రూ.500కే గ్యాస్ సిలిండర్, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్ల లోపు ఉచిత విద్యుత్తు వంటి పథకాలను ఇప్పటికే ప్రభుత్వం పూర్తి స్థాయిలో అమల్లోకి తెచ్చింది. వీటికి ఈ బడ్జెట్‌లో నిధుల కేటాయింపులు చేయనుంది. కేంద్ర బడ్జెట్‌లో పీఎంఆవాస్ యోజన కింద రాష్ట్రానికి వచ్చే నిధులను పరిగణనలోకి తీసుకుని ఇందిరమ్మ ఇళ్ల పథకానికి నిధులను ఖరారు చేయనుంది. అయితే.. మహిళలకు నెలకు రూ.2,500 భృతి, నిరుద్యోగ భృతి వంటి పథకాలకు ఈ బడ్జెట్‌లో చోటు కల్పిస్తుందా? లేదా? అన్నది చూడాల్సి ఉంది.

ప్రశ్నలకు వెంటనే జవాబులు పంపాలి

శాసనసభ్యులు లేవనెత్తే ప్రశ్నలకు త్వరితగతిన పూర్తి సమాచారంతో సమాధానాలు పంపాలని అధికారులను సీఎస్ శాంతికుమారి ఆదేశించారు. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల నేపథ్యంలో శనివారం సచివాలయంలో అధికారులతో ఆమె సమీక్ష నిర్వహించారు. బడ్జెట్ సమావేశాల్లో సమన్వయ లోపం తలెత్తకుండా ఉండడానికి సీనియర్ అధికారులందరూ తప్పనిసరిగా హాజరు కావాలన్నారు. వివిధ శాఖల డిమాండ్లపై జరిగే చర్చ సమయంలో పూర్తి వివరాలను అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు.

మాజీ ఎమ్మెల్యే రాజయ్య కారు ఢీకొని మహిళ మృతి

» కాజీపేట మండలం మడికొండ వద్ద రోడ్డు ప్రమాదం

మడికొండ, జూలై 20: స్టేషన్ ఘన్‌పూర్ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య మరో వివాదంలో ఇరుక్కున్నారు. ఆయన ప్రయాణిస్తున్న కారు ఢీకొని ఓ మహిళ మరణించింది. కాజీపేట మండలం మడికొండలో శనివారం రాత్రి ఈ రోడ్డు ప్రమాదం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. మడికొండ ఎస్సీ కాలనీకి చెందిన కలకోట స్వప్న(40) అదే ప్రాంతంలో శనివారం రాత్రి డివైడర్ మధ్య నుంచి రోడ్డు దాటుతుండగా హైదరాబాద్ వైపు నుంచి వస్తున్న మాజీ ఎమ్మెల్యే రాజయ్య కారు ఆమెను ఢీకొట్టింది. దీంతో ఎగిరిపడిన స్వప్న అక్కడికక్కడే మరణించింది. ప్రమాద సమయంలో రాజయ్య కారులోనే ఉన్నారు. ప్రమాదం జరిగిన వెంటనే కారు దిగిన రాజయ్య.. బాధిత మహిళను చూశారని, 'పోలీసుస్టేషన్‌కు వచ్చి మాట్లాడతా.. దయచేసి నన్ను ఇబ్బంది పెట్టవద్దు' అని పోలీసులతో అన్నారని సమాచారం. ప్రమాదానికి కారణమైన కారును కాజీపేట బాపూజీనగర్‌లో వదిలిసే రాజయ్య వెళ్లిపోయారు. కాగా, మృతురాలు స్వప్నకు భర్త, కుమారుడు ఉన్నారు. ప్రమాదంపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

ఉద్యోగుల బదిలీలకు మరో 10 రోజుల గడువు

» ఈ నెల 31 వరకు అవకాశం ఇచ్చిన సర్కారు

» బదిలీల ప్రక్రియ పూర్తి కాకపోవడమే కారణం

హైదరాబాద్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): కొన్ని శాఖలు ఉద్యోగుల బదిలీల ప్రక్రియను పూర్తి చేయకపోవడం, వైద్య ఆరోగ్య శాఖ బదిలీల్లో తీవ్ర గందరగోళం చోటుచేసుకోవడం వంటి పరిణామాల నేపథ్యంలో ప్రభుత్వం సాధారణ బదిలీలకు మరో 10 రోజుల గడువు ఇచ్చింది. ఈమేరకు ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నెల 5 నుంచి 20 వరకు వివిధ శాఖల్లో ఉద్యోగుల బదిలీలు చేపట్టాలంటూ ప్రభుత్వం ఈ నెల 3న ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. ఈ మేరకు ఈ నెల 19 నుంచి 20లోపు అన్ని శాఖల్లోని ఉద్యోగులకు బదిలీ ఉత్తర్వులను జారీ చేయాల్సి ఉంది. ఈ ఉత్తర్వులు అందుకున్న నాటి నుంచి మూడు రోజుల్లోగా కొత్త పోస్టుల్లో చేరాలి. అయితే కొన్ని శాఖలు, విభాగాల్లో బదిలీల ప్రక్రియ పూర్తి కాలేదు. ఒక ప్రదేశంలో నాలుగేళ్ల సర్వీసు పూర్తయిన ఉద్యోగిని బదిలీ చేయాలన్న నిబంధన మేరకు కొన్ని శాఖల్లో జాబితాలను సరిగా తయారు చేయలేదన్న ఆరోపణలు వచ్చాయి. కొన్ని చోట్ల ఉద్యోగుల సీనియారిటీని సక్రమంగా లెక్కించలేదని ఉద్యోగ సంఘాలు ఆరోపించాయి. వైద్య ఆరోగ్య శాఖ, ప్రణాళిక శాఖ వంటి వాటిలో ఉద్యోగ సంఘాల ఆఫీస్ బేరర్ల పేరిట బదిలీల నుంచి తప్పించుకున్నారన్న ఆరోపణలు వచ్చాయి. ఈ నేపథ్యంలో బదిలీల ప్రక్రియ పూర్తి కాలేదు. దీంతో ఉద్యోగుల బదిలీల గడువును ఈ నెల 31 వరకు ప్రభుత్వం పెంచింది. ఈలోపు బదిలీల ప్రక్రియను పూర్తి చేయాలని అన్ని శాఖలను ఆదేశించింది. ఆ తర్వాత సాధారణ బదిలీలపై ఆగస్టు 1 నుంచి నిషేధాన్ని అమలు చేస్తున్నట్టు స్పష్టం చేసింది.

పదవీ విరమణే.. పెదవి విరమణ కాదు!

» ఆత్మీయ సత్కార సభలో వెంకయ్యనాయుడు



చెన్నై, జూలై 20 (ఆంధ్రజ్యోతి): తాను పదవీ విరమణ చేశానే తప్ప, పెదవి విరమణ చేయలేదని మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు పేర్కొన్నారు. వెంకయ్యనాయుడు 75వ జన్మదిన వేడుకలు, 50 ఏళ్లుగా రాజకీయాల్లో రాణించినందుకుగాను చెన్నైలో శనివారం సాయంత్రం ఆయన్ని నగరానికి చెందిన ప్రముఖులు సత్కరించారు. ఈ సందర్భంగా వెంకయ్యనాయుడు మాట్లాడుతూ.. మాజీ ప్రధాని వాజ్‌పేయి నెల్లూరులో పర్యటించినప్పుడు విద్యార్థిగా ఆయన్ని తొలిసారిగా చూశానని, తన 14వ ఏట ఆర్‌ఎస్‌ఎస్‌లో చేరి క్రమశిక్షణ నేర్చుకున్నానని గుర్తు చేసుకున్నారు. కేంద్ర మంత్రివర్గాల్లో, రాజ్యసభలో వచ్చిన అవకాశాలను అందరూ మెచ్చుకొనేలా సద్వినియోగం చేసుకున్నానని, భావితరాలు శ్రమతో ఉన్నతస్థాయికి చేరుకోవాలని ఆయన సూచించారు. ప్రధాని నరంద్ర మోదీ భారత్‌ను అగ్రరాజ్యాల సరసన నిలబెట్టి, భారతీయులకు మరింత ఘనత చేకూర్చారని, ఆర్థికంగా భారత్ త్వరలోనే అగ్రస్థానానికి చేరుకుంటుందని వెంకయ్యనాయుడు ఆకాంక్షించారు.

రూ. 7 కోట్ల హెరాయిన్ పట్టివేత

» అంతర్రాష్ట్ర ముఠా ఆటకట్టు..

» మరో కేసులో.. ఇద్దరి అరెస్టు

» మల్కాజిగిరిలో గంజాయి చాక్లెట్ల సీజ్

హైదరాబాద్ సిటీ, జూలై 20 (ఆంధ్రజ్యోతి): నగరంలో హెరాయిన్ విక్రయించే ముఠా ఆటను తెలంగాణ యాంటీ నార్కోటిక్స్ బ్యూరో(టీజీ న్యాబ్), శంషాబాద్ ఎస్‌వోటీ, మాదాపూర్ పోలీసులు కట్టించారు. ఈ ముఠా నుంచి రూ.7 కోట్ల విలువైన కిలో హెరాయిన్‌ను సీజ్ చేశారు. శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సైబరాబాద్ పోలీసు కమిషనర్ అవినాశ్ మొహంతి వివరాలను వెల్లడించారు. రాజస్థాన్‌లోని నాగోర్ జిల్లా రాథోడ్‌కెవా ప్రాంతానికి చెందిన సంతోష్ ఆచార్య దేశవ్యాప్తంగా డ్రగ్స్ నెట్‌వర్క్‌ను నడుతుపుతున్నాడు. డ్రగ్స్ కేసుల్లో ఇతను జోధ్‌పూర్ జైలులో ఉన్నా.. లోపలి నుంచే తన నెట్‌వర్క్‌ను నడుపుతున్నాడు. నాగోర్ జిల్లాకు చెందిన నేమీచంద్ భాటీ, నర్పత్‌సింగ్ ద్వారా ఇతను హైదరాబాద్‌కు హెరాయిన్ సరఫరా చేస్తున్నాడు. వీరిద్దరూ బస్సుల్లో ప్రయాణిస్తూ.. హెరాయిన్‌ను తరలిస్తారు. నేమీచంద్‌కు నగరంలోని అబ్దుల్లాపూర్‌మెట్‌లో ఉండే అతని సోదరుడు అజయ్ భాటీ, చౌటుప్పల్‌కు చెందిన హరీశ్ సాల్వీ సహకరిస్తున్నారు. వీరంతా శనివారం శిల్పారామం వద్ద కస్టమర్లకు హెరాయిన్ విక్రయించేందుకు సిద్ధమయ్యారు. ఈ గ్యాంగ్ కదలికలపై ఉప్పందుకున్న టీజీ న్యాబ్, శంషాబాద్ ఎస్‌వోటీ, మాదాపూర్ పోలీసులు నలుగురిని అరెస్టు చేసి, వారి వద్ద 250 గ్రాముల చొప్పున నాలుగు ప్యాకెట్లలో ఉన్న కిలో హెరాయిన్(విలువ 7 కోట్లు)ను స్వాధీనం చేసుకున్నారు.

ర్యాపిడో డ్రైవర్లతో సరఫరా

మరో కేసులో.. హెరాయిన్ సరఫరా చేస్తున్న ముగ్గురు ర్యాపిడో డ్రైవర్లను మహేశ్వరం ఎస్‌వోటీ, ఎల్‌బీనగర్, సరూర్‌నగర్, మేడిపల్లి పోలీసులు అరెస్టు చేశారు. రాజస్థాన్‌లోని బార్మేర్ జిల్లా గూడ్మలానీ గ్రామానికి చెందిన అన్నదమ్ములు రమేశ్ కమార్, మాహదేవ్ రామ్ నగరంలోని ఎర్రగడ్డలో ఉంటూ.. ర్యాపిడో డ్రైవర్లుగా పనిచేస్తున్నారు. వీరిద్దరూ కలిసి.. రాజస్థాన్‌కు చెందిన వీరంగోయల్‌తో ముఠాగా ఏర్పడ్డారు. వీరంతా హెరాయిన్‌కు అలవాటు పడి.. ఏడాది కాలంగా విక్రయాలను ప్రారంభించారు. రాజస్థాన్‌కు చెందిన దినేశ్‌కల్యాణ్ అనే వ్యక్తి నుంచి హెరాయిన్ కొనుగోలు చేసి, నగరంలో విక్రయిస్తున్నారు. ఈ దందాపై సమాచారం అందుకున్న పోలీసులు రమేశ్, మహదేవ్‌లను అరెస్టు చేసి 34 గ్రాముల హెరాయిన్‌ను స్వాధీనం చేసుకున్నారు.

గంజాయి, చాక్లెట్ల పట్టివేత

మేడ్చల్-మల్కాజిగిరి ఎక్సైజ్ పోలీసులు నిర్వహించిన దాడుల్లో 1.7 కిలోల గంజాయి, 390 గ్రాముల గంజాయి చాక్లెట్లను సీజ్ చేశారు. ఘట్‌కేసర్‌లోని లారిసార్ట్‌లో అనుమతుల్లేకుండా మద్యం పార్టీ జరుగుతోందని కీసర ఎక్సైజ్ పోలీసులకు సమాచారం అందింది. వారు రిసార్టుపై దాడిచేయగా గంజాయి, గంజాయి చాక్లెట్లతో పాటు 2.6 లీటర్ల లిక్కర్‌ను స్వాధీనం చేసుకుని, రిసార్ట్ యజమానిపై కేసు నమోదు చేశారు.

రూ.42.50లక్షల గంజాయి సీజ్

మునిపల్లి: ఆంధ్రా-ఒడిసా సరిహద్దుల నుంచి మహారాష్ట్రలోని బీడ్ ప్రాంతానికి తరలిస్తున్న 115 కిలోల గంజాయిని ఎక్సైజ్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. దీని విలువ42.5 లక్షలుగా ఉంటుందని ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ మెదక్ డివిజన్ అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి వెల్లడించారు.

అఖిల భారత గ్రామీణ తపాల ఉద్యోగుల సంఘం జాతీయ అధ్యక్షుడిగా బి. వెంకటేశ్వర్లు నియామకం

కాజీపేట, జూలై 20: హనుమకొండ డివిజన్ గర్మిళ్లపల్లిలో బ్రాంచి పోస్ట్ మాస్టర్‌గా విధులు నిర్వహిస్తున్న కాజీపేటకు చెందిన బొద్దున వెంకటేశ్వర్లు అఖిల భారత గ్రామీణ తపాల ఉద్యోగుల సంఘం జాతీయ అధ్యక్షుడిగా నియమితులయ్యారు. ఈ మేరకు కేంద్ర తపాళశాఖ శనివారం అధికారికంగా ఉత్తర్వులు జారీ చేసింది. తనపై ఎంతో నమ్మకంతో ఈ పదవి అప్పగించారని, తపాల ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని బొద్దున వెంకటేశ్వర్లు పేర్కొన్నారు.

ఎన్ఎస్ఐఎల్‌తో టీ-శాట్ ఒప్పందం

హైదరాబాద్, జూలై 20 (ఆంధ్రజ్యోతి): ఇస్రో అనుబంధ సంస్థ న్యూస్పేస్ ఇండియా లిమిటెడ్ (ఎన్ఎస్ఐఎల్)తో టీ-శాట్ ఒప్పందం కుదుర్చుకుంది. శాటిలైట్ ప్రసారాలకు సంబంధించి జీశాట్-8 నుంచి జీశాట్-16కు మారుతున్నట్లు టీ-శాట్ ప్రతినిధులు తెలిపారు.

Printed and Published by **Koganti Venkata Seshagiri Rao** on behalf of Aamoda Publications Pvt. Ltd., printed at Aamoda Press, H.No.5-9-287/10 & 11, Plot No. 53 & 54, Prasanth Towers, Rajeev Gandhi Nagar, Moosapet, Kukatpally (Mandal), Kukatpally Municipality, Ranga Reddy District and Published at Plot No.76, Ashwini Layout, Huda Heights, Road No.70, Jubilee Hills, Hyderabad-500033. Editor: **K. Srinivas**. Fax No. 23558288, Phone No: 23558233 / 44 / 55, Regd. No.H/HD 674, RNI No.44903 / 86. **Managing Director: Vemuri Radha Krishna,** Founder: K.L.N.Prasad.

ఆంధ్రజ్యోతి దిక్సూచి
diksuchi@andhrajyothy.com
హైదరాబాద్ ● ఆదివారం 21 జూలై 2024

హైదరాబాద్-రాజేంద్రనగర్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ స్టేట్ అగ్రికల్చరల్ యూనివర్సిటీ(పీజేటీఎస్ఏయూ)- వ్యవసాయ డిగ్రీ కోర్సుల్లో ప్రవేశానికి ఉద్దేశించిన అగ్రిసెట్ అండ్ అగ్రి ఇంజనీరింగ్ సెట్ 2024 నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. అగ్రిసెట్-2024 ద్వారా బీఎస్సీ ఆనర్స్(అగ్రికల్చర్); అగ్రి ఇంజనీరింగ్ సెట్-2024 ద్వారా బీటెక్(అగ్రికల్చరల్ ఇంజనీరింగ్) ప్రోగ్రామ్‌లలో ప్రవేశాలు కల్పిస్తారు. వ్యవసాయ సంబంధిత విభాగాల్లో డిప్లొమా పూర్తి చేసిన తెలుగు రాష్ట్రాల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.

తెలంగాణ అగ్రిసెట్ అండ్ అగ్రి ఇంజనీరింగ్ సెట్



అగ్రిసెట్

- **అర్హత:** ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ స్టేట్ అగ్రికల్చరల్ యూనివర్సిటీ(పీజేటీఎస్ఏయూ)/ఆచార్య ఎన్‌జీ రంగా అగ్రికల్చరల్ యూనివర్సిటీ (ఏఎన్‌జీఆర్ఏయూ) నుంచి డిప్లొమా(అగ్రికల్చర్/సీడ్ టెక్నాలజీ) పూర్తిచేసిన అభ్యర్థులు అర్హులు. జయశంకర్ వర్సిటీ నుంచి ఆర్గానిక్ అగ్రికల్చర్ డిప్లొమా, ఎన్‌జీ రంగా వర్సిటీ నుంచి ఆర్గానిక్ ఫార్మింగ్ డిప్లొమా ఉత్తీర్ణులైన అభ్యర్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.
- **వయసు:** 2024 డిసెంబరు 31 నాటికి జనరల్, ఓబీసీ కేటగిరీల అభ్యర్థులకు 17 నుంచి 22 ఏళ్ల మధ్య, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 17 నుంచి 25 ఏళ్ల మధ్య, దివ్యాంగులకు 17 నుంచి 27 ఏళ్ల మధ్య వయసు ఉండాలి.
- **సీట్లు:** బీఎస్సీ ఆనర్స్(అగ్రికల్చర్) ప్రోగ్రామ్‌లో మొత్తం 92 సీట్లు ఉన్నాయి. వీటిలో అగ్రికల్చరల్ డిప్లొమా అభ్యర్థులకు 76, సీడ్ టెక్నాలజీ అభ్యర్థులకు 7, ఆర్గానిక్ అగ్రికల్చర్ అభ్యర్థులకు 9 సీట్లు ప్రత్యేకించారు. ఈడబ్ల్యూఎస్ కోటా కింద అగ్రికల్చరల్ డిప్లొమా అభ్యర్థులకు 7, సీడ్ టెక్నాలజీ అభ్యర్థులకు 1, ఆర్గానిక్ ఫార్మింగ్ అభ్యర్థులకు 1 చొప్పున మొత్తం 9 సీట్లు; సెల్ఫ్ ఫైనాన్స్ కోటా కింద అగ్రికల్చరల్ డిప్లొమా అభ్యర్థులకు 29, సీడ్ టెక్నాలజీ అభ్యర్థులకు 2, ఆర్గానిక్ అగ్రికల్చర్ డిప్లొమా అభ్యర్థులకు 3 చొప్పున మొత్తం 34 సీట్లు కేటాయించారు.

అగ్రి ఇంజనీరింగ్ సెట్

- **అర్హత:** ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ స్టేట్ అగ్రికల్చరల్ యూనివర్సిటీ(పీజేటీఎస్ఏయూ)/ఆచార్య ఎన్‌జీ రంగా అగ్రికల్చరల్ యూనివర్సిటీ (ఏఎన్‌జీఆర్ఏయూ) నుంచి డిప్లొమా(అగ్రికల్చరల్ ఇంజనీరింగ్) ఉత్తీర్ణులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.
- **వయసు:** 2024 డిసెంబరు 31 నాటికి జనరల్, ఓబీసీ కేటగిరీల అభ్యర్థులకు 17 నుంచి 23 ఏళ్ల మధ్య, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 17 నుంచి 25 ఏళ్ల మధ్య, దివ్యాంగులకు 17 నుంచి 27 ఏళ్ల మధ్య వయసు ఉండాలి.
- **సీట్లు:** బీటెక్(అగ్రికల్చరల్ ఇంజనీరింగ్) ప్రోగ్రామ్‌లో 8 సీట్లు ఉన్నాయి. ఈడబ్ల్యూఎస్ కోటా కింద ఒక సీటు, సెల్ఫ్ ఫైనాన్స్ కోటా కింద ఒక సీటు కేటాయించారు.

ఎంట్రెన్స్ టెస్ట్‌ల వివరాలు: ఇవి కంప్యూటర్ ఆధారిత పరీక్షలు. ఒక్కో టెస్ట్‌లో మొత్తం 100 'మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు' ఇస్తారు. అభ్యర్థులు డిప్లొమాలో ఎంచుకొన్న విభాగంలోనే సంబంధిత ఎంట్రెన్స్ టెస్ట్ రాయాలి. అగ్రిసెట్ అభ్యర్థులకు అగ్రికల్చర్/సీడ్ టెక్నాలజీ/ఆర్గానిక్ అగ్రికల్చర్ డిప్లొమా సిలబస్ నుంచి, అగ్రి ఇంజనీరింగ్ సెట్ అభ్యర్థులకు అగ్రికల్చరల్ ఇంజనీరింగ్ డిప్లొమా సిలబస్ నుంచి ప్రశ్నలు అడుగుతారు. వీటితోపాటు జయశంకర్ వర్సిటీ అభివృద్ధి చేసిన టెక్నాలజీ, నూతన ఉత్పత్తులు; జనరల్ అగ్రికల్చర్; వ్యవసాయానికి సంబంధించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన పథకాలు, జనరల్ ఇంగ్లీష్, బేసిక్స్ ఇన్ కంప్యూటర్స్ అంశాలనుంచి ప్రశ్నలు ఇస్తారు. అగ్రిసెట్‌ను తెలుగు, ఆంగ్ల మాధ్యమాల్లో, అగ్రి ఇంజనీరింగ్ సెట్‌ను ఆంగ్ల మాధ్యమంలో నిర్వహిస్తారు.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.1400; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.700
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఆగస్టు 9
- **హాల్ టికెట్స్ డౌన్‌లోడింగ్:** ఆగస్టు 17 నుంచి
- **పరీక్ష కేంద్రాలు:** హైదరాబాద్, ఖమ్మం, వరంగల్, కరీంనగర్, నిజామాబాద్.
- **అగ్రిసెట్ 2024, అగ్రి ఇంజనీరింగ్ సెట్ 2024 తేదీ:** ఆగస్టు 24
- **వెబ్‌సైట్‌లో ప్రశ్న పత్రాలు, సంబంధిత కీ అందుబాటులో ఉండే తేదీలు:** ఆగస్టు 28 నుంచి 29 వరకు
- **వెబ్‌సైట్:** www.pjtsau.edu.in

ఈఎస్‌సీఐలో పీజీ డిప్లొమా ఇన్ మేనేజ్‌మెంట్

హైదరాబాద్-గచ్చిబౌలీలోని ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా(ఈఎస్‌సీఐ)కి చెందిన స్కూల్ ఆఫ్ పోస్ట్ గ్రాడ్యుయేట్ స్టడీస్- పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ మేనేజ్‌మెంట్(పీజీడీఎం) ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ మేనేజ్‌మెంట్, జనరల్ మేనేజ్‌మెంట్, ఇండస్ట్రియల్ సేఫ్టీ అండ్ ఎన్విరాన్‌మెంట్ మేనేజ్‌మెంట్ విభాగాలు అందుబాటులో ఉన్నాయి. ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. నాలుగు సెమిస్టర్లు ఉంటాయి. గ్రూప్ డిస్కషన్, ఇంటర్వ్యూల ద్వారా ప్రవేశాలు కల్పిస్తారు. ఈ ప్రోగ్రామ్‌కు ఏఐసీటీఈ గుర్తింపు ఉంది. ప్రోగ్రామ్ పూర్తిచేసినవారికి ఎల్ అండ్ టీ, కార్వే, డెలాయిట్, టెక్ మహీంద్ర తదితర ప్రముఖ సంస్థల్లో ప్లేస్‌మెంట్స్ కల్పించేందుకు సహకారం అందిస్తారు.

ప్రోగ్రామ్ వివరాలు

- ప్రోగ్రామ్‌లో భాగంగా విభాగానికి నిర్దేశించిన ప్రకారం మేజర్, మైనర్ ఎలక్టివ్ సబ్జెక్టులు చదవాల్సి ఉంటుంది. ప్రతి విభాగంలో ఫైనాన్స్, మార్కెటింగ్, హ్యూమన్ రిసోర్సెస్, బిజినెస్ అనలిటిక్స్, టెలికాం అండ్ ఐటీ మేనేజ్‌మెంట్, ఆపరేషన్స్ అనే మైనర్ ఎలక్టివ్ సబ్జెక్టులు ఉంటాయి.
- జనరల్ మేనేజ్‌మెంట్ ప్రోగ్రామ్‌లో హెచ్ఆర్ఎం, మార్కెటింగ్, ఫైనాన్స్; ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ మేనేజ్‌మెంట్ ప్రోగ్రామ్‌లో సివిల్, పవర్, టెలికాం, ట్రాన్స్‌పోర్టేషన్, ఐటీ; ఇండస్ట్రియల్ సేఫ్టీ అండ్ ఎన్విరాన్‌మెంట్ మేనేజ్‌మెంట్ ప్రోగ్రామ్‌లో మాన్యుఫాక్చరింగ్ ఇండస్ట్రీ సేఫ్టీ, సర్వీస్ అండ్ మెయింటెనెన్స్ సెక్టర్ సేఫ్టీ, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ సేఫ్టీ మేనేజ్‌మెంట్, ఆక్యుపేషనల్ హెల్త్ అండ్ సేఫ్టీ మేనేజ్‌మెంట్ సిస్టమ్స్ అనే మేజర్ ఎలక్టివ్ సబ్జెక్టులు ఉంటాయి.

అర్హత: స్పెషలైజేషన్‌కు నిర్దేశించిన మేరకు ఆర్ట్స్/కామర్స్/సైన్స్/మేనేజ్‌మెంట్/ఇంజనీరింగ్/టెక్నాలజీ విభాగాల్లో కనీసం 50 శాతం మార్కులతో డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. క్యాట్/మ్యాట్/ఎక్స్ఏటీ/సీమ్యాట్/ఐసెట్ అర్హత పొంది ఉండాలి.

- **ప్రోగ్రామ్ ఫీజు:** రూ.5,30,000
- **దరఖాస్తు ఫీజు:** రూ.1,000
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జూలై 31
- **వెబ్‌సైట్:** esci.edu.in



సంస్కృత విశ్వవిద్యాలయంలో పీజీ స్పాట్ అడ్మిషన్స్



తిరుపతిలోని జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం(ఎన్ఎస్‌కేటీయూ-సెంట్రల్ యూనివర్సిటీ)- పీజీ ఫుల్ టైమ్/రెగ్యులర్ ప్రోగ్రామ్‌లలో మిగిలిన సీట్ల భర్తీకి స్పాట్ అడ్మిషన్ నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. ఆచార్య, ఎంఏ(శబ్దబోధ/హిందీ), ఎమ్మెస్సీ(కంప్యూటర్స్/యోగ థెరపీ), ఎంఏఐఎంటీ ప్రోగ్రామ్‌లలో సీట్లు ఉన్నాయి. సీయూఈటీ అర్హత పొందినవారు, నాన్ సీయూఈటీ అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.

ప్రోగ్రామ్‌లు-విభాగాలు-సీట్లు

- ఆచార్య ప్రోగ్రామ్‌లో సాహిత్య(కావ్య వర్గ) 9, సాహిత్య(అలంకార వర్గ) 33, ఐకేఎస్ 19, పురాణేతిహాస 24, సామవేద భాష్యం 26, కృష్ణ యజుర్వేద భాష్యం 21, అథర్వ వేద భాష్యం 28, వ్యాకరణం 28, ఫలిత జ్యోతిషం 30, సిద్ధాంత జ్యోతిషం 28, వాస్తు 29, ధర్మ శాస్త్రం 28, న్యాయం 27, సంఖ్యా యోగ 28, మీమాంస 27, అద్వైత వేదాంతం 30, విశిష్టాద్వైత వేదాంతం 26, ద్వైత వేదాంతం 6, ఆగమం 11 సీట్లు ఉన్నాయి
- ఎమ్మెస్సీ ప్రోగ్రామ్‌లో యోగ థెరపీ 11, కంప్యూటర్ సైన్స్ 20 సీట్లు ఉన్నాయి.
- ఎంఏ ప్రోగ్రామ్‌లో శబ్దబోధ 20, హిందీ 9 సీట్లు ఉన్నాయి.
- ఎంఏఐఎంటీ ప్రోగ్రామ్‌లో 33 సీట్లు ఉన్నాయి.

అర్హత

- ఆచార్య ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి మూడేళ్ల డిగ్రీ/శాస్త్రి కోర్సు పూర్తి చేసి ఉండాలి. డిగ్రీ స్థాయిలో సెకండ్ లాంగ్వేజ్‌గా సంస్కృతం చదివి ఉండాలి
- ఎంఏ హిందీకి ఏదేని డిగ్రీ పూర్తిచేసి ఉండాలి. సెకండ్ లాంగ్వేజ్‌గా/ఒక సబ్జెక్ట్‌గా హిందీ చదివి ఉండాలి. లేదంటే హైదరాబాద్‌లోని హిందీ ప్రచారసభ నుంచి విద్వాన్ కోర్సు పూర్తిచేసి ఉండాలి.
- ఎంఏ శబ్దబోధ ప్రోగ్రామ్‌నకు సమ్మానిత శాస్త్రి కోర్సు ఉత్తీర్ణులు; కంప్యూటర్ సైన్స్/కంప్యూటర్ అప్లికేషన్స్ ఒక సబ్జెక్ట్‌గా డిగ్రీ(న్యాయం/వ్యాకరణం/మీమాంస/దర్శన) పూర్తిచేసినవారు అర్హులు. సంస్కృతం, కంప్యూటర్ సైన్స్/మేథమెటిక్స్ ప్రధాన సబ్జెక్టులుగా బీఏ/బీఎస్సీ/బీసీఏ ఉత్తీర్ణులు కూడా అప్లయ్ చేసుకోవచ్చు.
- ఎమ్మెస్సీ కంప్యూటర్ సైన్స్ ప్రోగ్రామ్‌నకు కంప్యూటర్ సైన్స్/కంప్యూటర్ అప్లికేషన్స్ ఒక సబ్జెక్ట్‌గా ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. ఇంటర్/డిగ్రీ స్థాయిలో సంస్కృతం ఒక సబ్జెక్ట్‌గా చదివి ఉండాలి.
- ఎమ్మెస్సీ యోగ థెరపీకి ఏదేని డిగ్రీ/సమ్మానిత శాస్త్రి కోర్సు ఉత్తీర్ణులై ఉండాలి.
- ఎంఏఐఎంటీ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి గుర్తింపు పొందిన కళాశాల నుంచి ద్వితీయ శ్రేణి మార్కులతో ఏదేని డిగ్రీ పూర్తిచేసి ఉండాలి.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** రూ.300
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జూలై 31
- **సీయూఈటీ అభ్యర్థులకు దరఖాస్తు లింక్:** https://nsktucuet.samarth.edu.in/pg
- **నాన్ సీయూఈటీ అభ్యర్థులకు దరఖాస్తు లింక్:** https://nsktuadmission.samarth.edu.in
- **వెబ్‌సైట్:** www.nsktu.ac.in

జాబ్ కార్నర్

పుణె ఐఐటీఎంలో రీసెర్చ్ ఫెలో

ఖాళీలు: 30

పుణెలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ట్రాపికల్ మెటీయొరాలజీ(ఐఐటీఎం)... కింద పేర్కొన్న ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

అర్హతలు: పోస్టును బట్టి సంబంధిత స్పెషలైజేషన్‌లో మాస్టర్స్ డిగ్రీ, లేదా తత్సమాన కోర్సులో కనీసం 55 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించి ఉండాలి. నెట్/గేట్/ఎల్ఎస్ స్కోరుతో పాటు పని అనుభవం ఉండాలి.
వయోపరిమితి: 2024 ఆగస్టు 10 నాటికి 28 ఏళ్లు మించకూడదు. ఎస్సీ, ఎస్టీ, పీడబ్ల్యూబీడీ, మహిళ అభ్యర్థులకు ఐదేళ్లు, ఓబీసీ, ఎక్స్ సర్వీస్‌మెన్‌లకు మూడేళ్లు సడలింపు ఉంటుంది.
వేతనం: నెలకు రూ.37,000
ఎంపిక ప్రక్రియ: రాత పరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: ఆగస్టు 10
వెబ్‌సైట్: www.tropmet.res.in/

సీఆర్‌పీఎఫ్‌లో జనరల్ డ్యూటీ మెడికల్ ఆఫీసర్లు

ఖాళీలు: 22

సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్... కాంట్రాక్ట్ ప్రాతిపదికన సీఆర్‌పీఎఫ్ హాస్పిటల్స్‌లో జనరల్ డ్యూటీ మెడికల్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహిస్తోంది.
అర్హత: ఎంబీబీఎస్ ఉత్తీర్ణులై ఉండాలి
గరిష్ఠ వయోపరిమితి: 70 సంవత్సరాలు మించకూడదు
రెమ్యునరేషన్: నెలకు రూ.75,000
ఇంటర్వ్యూ తేదీ: జూలై 31
వేదిక: హైదరాబాద్, పుణె, శ్రీనగర్, ఇంఫాల్, గువాహటి, గాంధీనగర్‌లోని సీఆర్‌పీఎఫ్ కాంపోజిట్ హాస్పిటళ్లలో
వెబ్‌సైట్: rect.crpf.gov.in/

ఎండీఎస్ఎల్‌లో అప్రెంటిస్‌లు

ఖాళీలు: 518

ముంబయిలోని మజగావ్ డాక్ షిప్‌బిల్డర్స్ లిమిటెడ్... కింద పేర్కొన్న అప్రెంటిస్ ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.



ట్రేడులు: డ్రాఫ్ట్స్‌మన్(మెకానికల్), ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, పైప్ ఫిట్టర్, స్ట్రక్చరల్ ఫిట్టర్, ఎలక్ట్రానిక్ మెకానిక్, వెల్డర్, కార్పెంటర్, రిగ్గర్, వెల్డర్ ఎలక్ట్రికల్ తదితరాలు
అర్హత: ఖాళీని అనుసరించి ఎనిమిదో తరగతి, పదో తరగతి, ఐటీఐ ఉత్తీర్ణులై ఉండాలి.
వయోపరిమితి: 2024 అక్టోబరు 1 నాటికి గ్రూప్-ఎ 15 నుంచి 19 ఏళ్లు; గ్రూప్-బి 16-21 ఏళ్లు, గ్రూప్ సి 14-18 ఏళ్ల మధ్య ఉండాలి.
స్టయిపెండ్: నెలకు గ్రూప్ ఎ -రూ.6600, గ్రూప్ బి-రూ.8050 - రూ.7700, గ్రూప్ సి-రూ.2500 - రూ.5500 వరకు చెల్లిస్తారు.
దరఖాస్తు రుసుము: జనరల్, ఓబీసీ, ఈబ్ల్యూఎస్ కేటగిరీకి రూ.100. ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగ అభ్యర్థులకు ఫీజు చెల్లింపు నుంచి మినహాయింపు ఉంటుంది.
ఎంపిక ప్రక్రియ: కంప్యూటర్ ఆధారిత పరీక్ష, స్కిల్/ట్రేడ్ టెస్ట్, సర్టిఫికెట్ వెరిఫికేషన్, మెడికల్ ఎగ్జామినేషన్ ఆధారంగా
దరఖాస్తుకు చివరి తేదీ: జూలై 26
వెబ్‌సైట్: https://www.mazagondock.in/


లిటిల్స్

వంటవాడి సమయ స్ఫూర్తి




వందన గిరి రాజ్యాన్ని ప్రవీణుడు అనే రాజు పాలించే వాడు అతనికి చాలా ముక్కోపి అని పేరుండేది. అతని దగ్గర ధర్మయ్య అనే వంటవాడు ఉండేవాడు. అతను చేసే వంటకాలంటే మహారాజుకు చాలా ఇష్టం ఉండేది. ఒక రోజు ధర్మయ్య త్వరత్వరగా వంట పూర్తి చేసి, తన కొడుక్కి అనారోగ్యంగా ఉండటంతో మహారాజుకు వడ్డించే పనిని మరొక పనివాడికి అప్పగించి తాను ఇంటికి వెళ్లిపోయాడు. ఆ రోజు కూరల్లో కారం ఎక్కువ అయింది. మహారాజు రుచి చూడగానే కారం ఎక్కువయిందని తెలిసి, కోపంతో ఆ మర్నాడు ధర్మయ్యకి మరణ దండన విధించాలని నిర్ణయం చేశాడు. ఇది తెలిసిన ధర్మయ్య రాజు కొలువుకు వచ్చి 'మహారాజా చనిపోయే ముందు ఎవరిదైనా చివరి కోరిక తీరుస్తారు కదా. అలాగే నా చివరి కోరిక కూడా తీర్చండి. నాకు ఓ ధనుస్సు, బాణం కావాలి తెప్పించండి. ఆ బాణంనేను మీ మీద వేయాలి అనుకుంటు న్నాను' అన్నాడు అదేమిటి? అని అడిగినరాజుతో ధర్మయ్య 'కేవలం కూరలో కారం ఎక్కువ అయినందుకే నా ప్రాణం తీశారనే అపకీర్తి మీకు వద్దు మహారాజా.. ఇపుడు ఇంత హాని మీకు తలపెట్టాను అని చెప్పి నన్ను ఉరి తీయించండి' అన్నాడు శిక్ష తప్పించుకోవడానికి వంటవాడు చూపిన సమయస్ఫూర్తికి నవ్వుకున్న రాజు అతనికి విధించిన మరణదండన రద్దు చేసి, క్షమించి పంపేశాడు అలా ధర్మయ్య ఉపాయంతో తనను కాపాడుకున్నాడు.

6 తేడాలను గుర్తించండి?



జోకర్ బొమ్మలు ఎన్ని



ఏ వాహనం ముందుగా చేరుతుంది



సరైన నీడ ఏది?



డైలీ సుడోకు - 364

	2	1			
3	6		1		
				2	
	3				
		5		1	3
			4	6	

సుడోకు - 363 సమాధానం

5	6	9	7	1	3	4	8	2
2	1	8	5	9	4	3	7	6
4	7	3	8	2	6	5	9	1
7	3	1	2	5	8	6	4	9
6	9	4	1	3	7	8	2	5
8	2	5	6	4	9	1	3	7
3	4	2	9	6	5	7	1	8
9	8	6	3	7	1	2	5	4
1	5	7	4	8	2	9	6	3

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.